వ్యాసములు - ప్రసంగములు
వ-46

31573 12-63
8.4.71

సందేశ తరంగిణి

(శ్రీ వివేకానందస్వామి కొలంబో - ఆల్మోరా ఉపన్యాసములు)

రెండవ భాగము

31573
8.4.71

కీ॥ శే॥ శ్రీ తత్త్వానందస్వాములవారిచే
అనువాదితము

శ్రీ రామకృష్ణ మఠము

మైలాపూరు : : మద్రాసు - 4

1956

విషయసూచిక

చెన్ననగరము

భారతదేశ భావి భాగ్యోదయము	...	...	1
దానము	...	...	40

కలకత్తా

స్వాగతపత్రము	...	...	43
శ్రీ స్వాములవారి ప్రత్యుత్తరము	...	...	48
సర్వతోముఖ వేదాంతము	...	...	72

ఆల్మోరా

స్వాగతపత్రము, శ్రీవారి ప్రత్యుత్తరము...	...	124
వైదికధర్మముయొక్క సిద్ధాంత సాధనలు	...	133

పంజాబు

భక్తి	...	...	136

లాహోరు

హిందూమతమునందలి సామాన్య సూత్రములు		...	152
భక్తి	...	...	189
వేదాంతము	...	...	203

ఖేత్రీనగరము

వేదాంతమతము	...	...	281

కలకత్తా

ఇంగ్లండులో భారతీయాధ్యాత్మికభావనాప్రాబల్యము	...	292
సన్న్యాసము - దానిలక్ష్యము, సాధనము	...	301

ఢాకా

నే నేమి నేర్చితిని?	...	...	305
మనము పుట్టి పెరిగిన మతము	...	...	312

స్వామి వివేకానంద

సందేశ తరంగిణి

ద్వితీయభాగము

భారతదేశ భావి భాగ్యోదయము

1

విజ్ఞానము మఱి ఏ ఇతరదేశమునకుగాని పోవుటకు పూర్వము, తన స్వగృహముగా చేసికొనినది ఈ ప్రాచీన భూమినే! అధ్యాత్మజ్ఞానాగమనమునకు స్థూలదృష్టికి చూపట్టు చిహ్నములో యన, మహాసముద్రముల బోలు గొప్ప నదులు ప్రవహించుచున్నది ఈ భారతదేశముననే! స్వర్గరహస్యములను తొంగి చూడబోవుచున్నవో యనునటుల, ఆహా, మన అఖండ హిమాలయ పర్వతపంక్తులు సోపాన పరంపరలుగా స్వచ్ఛమగు మంచుకిరీటములను ధరించి, ఆకాశములోనికి అత్యున్నతముగ వ్యాపించుచున్నది ఇక్కడనే! లోకమున ఎన్నడేని యవతరించిన అత్యంత పూజ్యులగు ఋషిసత్తముల పాదస్పర్శచే పవిత్రీభూతమైన క్షేత్రములు ఈ భారతదేశమునందే కలవు! నరుని ఆభ్యంతర ప్రకృతిని గుఱించియు, అంతరప్రపంచమును గుఱించియు, పరిశోధనలు మొట్టమొదట ప్రారంభమైనది ఇక్కడనే! జీవాత్మయొక్క అమృతత్వమును గుఱించియు, ఈశ్వరుని యొక్క పరిపాలనాకర్తృత్వమును గుఱించియు, ప్రకృతి

పశువునను నరునందును అంతర్యామియై పఱగు భగవంతుని [illegible] సిద్ధాంతములు ప్రప్రథమమున బయలుదేరినది ఇక్కడనుండియే! మతధర్మముయొక్కయు, తత్త్వశాస్త్రము యొక్కయు అత్యుత్తమాదర్శములు తమ పరమప్రాప్య స్థానమును పొందగలిగినది ఇక్కడనే! ప్రపంచమును పెక్కు తడవలు పూర్తిగ ముంచి లేవనెత్తిన ఆధ్యాత్మికజ్ఞానము, తత్త్వవిద్య, అనెడు మహోత్తుంగతరంగములు బయలుదేరినది ఈ దేశమునుండియే! మానవకోటిలో శుష్కించి నిర్జీవములై పోవుచున్న జాతులను మరల నొకసారి ఉజ్జీవింపజేసి, జవ సత్త్వములు కూర్చుటకు అట్టి తరంగజాలము ఇక బయలుదేర వలసియున్నది ఈ భారతక్షేత్రమునుండియే! వందలకొలది విదేశీయుల దాడులను, భిన్నభిన్నములగు ఆచారమర్యాదల సమ్మేళనవలన గల్గిన వందల కొలంది విప్లవములను భరించి నిలిచినట్టి భారతభూమి ఇదియే! చెక్కుచెదరని శౌర్యము తోడను, వినాశమెఱుంగని చైతన్యప్రభలతోడను, లోకము లోని ఏ శైలరాజమునైనను మించగలిగిన సుస్థిరత్వముతో నిలిచినది ఈ పవిత్రదేశమే! ఆద్యంతములులేక, అమృతమై పఱగు నిత్యాత్మ ఎట్టిదో ఈ పవిత్రక్షేత్రము యొక్క జీవితముకూడ అట్టిదే! మనము అట్టి దేశమాత కన్న సంతానము!

భారతపుత్రులారా! నేనిప్పుడు కొన్ని అనుష్ఠానాంశములగూర్చి మీకు తెలుపుటకై ఇచ్చట నిలిచియున్నాను. గతించిపోయిన వైభవోన్నతిని మీదృష్టికి తెచ్చుటలో నా ఉద్దేశ్యము తెల్పెదనుగాక. గతమును గుఱించి చింతించుట

పతనమునకే హేతువనియు, ఎంతమాత్రమును లాభకారి కాదనియు, కావున మనము సదా భావిని గుఱించియే అనగా ముందు రానున్న దశను గుఱించియే విచారింపవలసి యుండుననియు పెక్కురు బోధించుట నేను అనేకపర్యాయములు వినియున్నాను. ఆమాట సత్యము. అయినప్పటికిని గతము పై ఆధారపడియే భావి నిర్మాణము కాగలదు. కాబట్టి మీకు శక్తి గలంతవఱకు వెనుదిరిగి దృష్టిసారింపుడు; మీ వెనుకనున్న ఆ యఖండనిధులనుండి కడుపునిండుగ జ్ఞాన జలములను గ్రోలుడు; అటుపిమ్మట ముందునకు చూడుడు; ముందునకే పరుగులిడుచు పొండు. భారత దేశమును పూర్వ కాలమునాటికంటెను తేజోమయముగను, మాననీయము గను, మహిమాఢ్యముగను వెలయింపుడు. మన పూర్వులు చాలగొప్పవారు. మున్ముందుగా మనమావిషయమును జ్ఞప్తికి తెచ్చుకొనవలయును. మన స్వరూపసత్వములను, మననాళములందు ప్రవహించు రక్తముయొక్క స్వభావమును మనము తెలిసికొనవలయును. ఆ రక్తపటుత్వమునందును, భూతకాలమున ఆ రక్తపటిమ సాధింపగలిగిన ఘనకార్యములయందును మనము విశ్వాసము ఉంచవలయును. అట్టివిశ్వాసమును, మన ప్రాచీన ఔన్నత్యమును గుఱించిన పరిజ్ఞానమును, ఆధారము చేసికొని పూర్వమునకంటె మహిమాఢ్యమై తేజరిల్లు తెఱగున భారతభూమిని పునరుద్ధరింపవలయును. మన దేశము క్షీణతను, హీనతను, అనుభవించిన కాలములును కలవు; తథ్యమే. అవి అంత ప్రధానములుగా నే నెంచను; మనకందఱకును

ఆవిషయము తెలియును. అట్టి సమయములు తటస్థించుటయు అవసరమే! ఒక మహావృక్షమునందు మనోహరమగు పక్వఫలము కలుగుచున్నది. ఆ పండు నేలరాలి చితికి క్రుళ్ళి నాశమగును. దాని వినాశమునుండియే, వేరు పాతుకొని, శాఖాశాలపు వృక్షము అంకురించుచున్నది. ఈ వృక్షము బహుశః మొదటిదానికంటె మహోన్నతమైనది కావచ్చును! పతనము గడచిన క్షీణదశ ఎంతయు అవసరమైనదే! ఆ క్షీణత నుండియే ఈ భారతదేశముయొక్క భావిభాగ్యోదయము రానున్నది. అదిగో అంకురము వెలువడినది! ఇప్పుడే దాని బీజదశములు కానవచ్చుచున్నవి! బ్రహ్మాండమగు మహావృక్షము రానున్నది! *"ఊర్ధ్వమూలం" అనివర్ణింపబడిన దివ్యవృక్షము అదిగో, అప్పుడే దృగ్గోచరమగుటకు ప్రారంభించినది! దీనిని గుఱించియే నేనిప్పుడు ప్రసంగింపబూనియున్నాను.

భారతదేశముయొక్క సమస్యలు ఇతరదేశముల సమస్యలకన్న మిగుల చిక్కైనవి. అంతేకాదు, ప్రముఖమైనవికూడ. సంఘము, మతము, భాష, పరిపాలనము ఇవి అన్నియు కలిసి జాతియనుపేర పరగును. మనజాతితో పోల్చి చూచిన యెడల ప్రపంచములోని ఇతరజాతుల నిర్మాణ వైచిత్ర్యములు నిజముగా అత్యల్పము లనవచ్చును. ఇచ్చట ఆర్యులు, ద్రావిడులు, తార్తారులు, తురుష్కులు, మొగలులు, యూరపీయనులు, ఇంతేల ప్రపంచములోని సమస్త జాతులవారును చేరి తమరక్తములను ఈదేశములోనికి

* ఈ శ్లోకము భగవద్గీతలోనిది.

ప్రవహింపజేసిరనవచ్చును. ఇక్కడి భాషాజాలమన్ననో అతి విచిత్రమగు కలగూరగంప. ఆచారవ్యవహారముల విచారించిన యెడల పాశ్చాత్యజాతులకును ప్రాచ్యజాతులకును నడుమ ఎంతభేదముగలదో అంతకు మించిన విభేదము ఈదేశమందలి ఏరెండు జాతులమధ్యనైనను కానవచ్చును.

మనకుగల ఏకైక సమానలక్షణము మనమతము నందును, మన పరంపరాగతసంప్రదాయరాశియందును కాననగును. దానిమీదనే మనము భవననిర్మాణము చేసికొనవలసియున్నది. యూరపునందు రాజనీతి జాతీయైక్యమును కూర్చుచున్నది. ఆసియాఖండమున మతాదర్శములు జాతీయైక్యమునకు ఆధారములుగా నున్నవి. కాబట్టి మతమునందు ఏకీభావము కుదురుట భారతదేశ భావి భాగ్యోదయమునకు ప్రప్రథమనియమముగ అత్యవసరమగుచున్నది. ఈ దేశమందంతటను పూర్ణముగా అంగీకారము పడసిన మతమొక్కటి యుండవలయును. ఒక్కమతమనగా నా అభిప్రాయమేమియో తెలియునా? క్రైస్తవులు, మహమ్మదీయులు, బౌద్ధులు భావన చేయునటుల ఒక ప్రత్యేక మతముకాదు. మన శాఖాసంప్రదాయములన్నియు వాని వాని సిద్ధాంతములందు ఎంత భిన్నములుగనున్నను, ఎట్టి అధికారములకొఱకై వివాదములు సాగించుచున్నను, మన మతమునకు సమష్టిని కొన్ని సామాన్యాధారములు కలవు. ఈ సామాన్యాధారములను అనుసరించి వాని హద్దుల లోపల, ఈ మనమతము అనంతమగు భావనాస్వాతంత్ర్యమును, జీవనస్వాతంత్ర్యమును అంగీకరించుచు

అత్యద్భుత విచిత్రవైఖరితో వెలయుచున్నది! ఈ విషయము మనకందఱకును తెలియును; కనీసపక్షము మనలో జిజ్ఞాసువులైనవారికైనను తెలియును. ఇప్పుడు మనకు కావలసినది మనజాతిమునకు ఆయువుపట్టులగు ఈ సామాన్యధర్మములను వెదకి కనుగొని, దేశమందంతటను ఒక కొననుండి మఱొక కొనవఱకు ప్రతిపురుషుడును, ప్రతిస్త్రీయు, ప్రతిశిశువును వీనిని తెలిసికొని, చక్కగా అర్థముచేసికొని, తమజీవితములలో అనుసరింప యత్నించునటుల చేయుట మాత్రమే. ఇదియే మొట్టమొదటి సోపానము. కాబట్టి దానిని గుఱించియే మనమిప్పుడు శ్రద్ధ పూనవలసి యున్నది. మతముయొక్క సమ్మోహనాశక్తిని ఎదిరించి నిలువలేక, ఆసియాఖండములో అందు ముఖ్యముగా భారతదేశములో జాతిసంబంధములగు చిక్కులు, భాషాసంబంధమగు కష్టములు, సంఘసంబంధమగు ఇక్కట్టులు, ఉపజాతులకు సంబంధించిన బాధలు అన్నియు నీరై పోగలవు. ఆధ్యాత్మికాదర్శములకు మించినదేదియు భారతీయుని మనస్సునకు గోచరింపదనియు, భారతీయజీవనమునకు మతమే కీలకమనియు మనకు తెలియును. మఱియు అవరోధములు అత్యల్పముగనుండు మార్గమునమాత్రమే మనము పనిచేయగలుగుదుము. ఆధ్యాత్మికాదర్శము అత్యుత్తమాదర్శమనుట సత్యమగుటయే కాదు; ముఖ్యముగ భారతదేశ విషయమున కార్యనిర్వహణమునకు అది ఒకటియే మార్గము! దీనిని మొట్టమొదట బలపఱచకుండ మఱి ఏ ఇతరమార్గముననైన పనిసాగించినయెడల అది మహానర్థకమగును. కాబట్టి

భవిష్యత్కాలపు భారతజాతిని నిర్మించుటకై మొట్టమొదట చేయవలసిన శంఖుస్థాపన ఈ మతసమ్మేళనమే. యుగయుగములుగ పెరిగియున్న ఆ మహాశైలమునందు చెక్కవలసిన ప్రథమసోపానము ఈమతసమ్మేళనమే. ద్వైతులమనియో, విశిష్టాద్వైతులమనియో, అద్వైతులమనియో, శైవులమనియో, వైష్ణవులమనియో, లేక పాశుపత సంప్రదాయులమనియో మన మేపేరు పెట్టుకొనినను, హిందువులమగు మన కందఱకును ఆధారములగు కొన్ని సామాన్యాదర్శములు కలవనియు, మన శ్రేయస్సుకొఱకును, మన జాతియొక్క క్షేమముకొఱకును, అల్పములగు మన విభేదములను మన వివాదములను విడిచి పెట్టవలసిన కాలము ఏతెంచినదనియు నచ్చజెప్పుటయే మనకు కావలసినది. ఈ వివాదములన్నియు సంపూర్ణముగ దోషములేయని నమ్ముడు. మన శాస్త్రములు అట్టి వానిని ఖండించి యున్నవి. మన పూర్వులు అట్టివి కూడవని మందలించియున్నారు. మనము ఎవరి సంతతివారమని చెప్పుకొనుచున్నామో అట్టి మహాఋషులు, ఎవరి రక్తము మన నాళములందున్నదనుచున్నామో ఆ గోత్రపురుషులు, ఈ స్వల్పభేదముల గుఱించి వాదులాడుకొనుచున్న తమ సంతానమును చూచి ఏవగించుకొనుచున్నారు!

వివాదములను వదలివేయుటతో ఇతరములగు అభివృద్ధికార్యములన్నియు తమంతటతామే చేకూరును. జీవరక్తము నిర్మలముగను పుష్టిగను నున్నయెడల ఏరోగబీజములును శరీరములో ప్రవేశింపజాలవు. మన జీవరక్తము

ఆధ్యాత్మ స్వర్గమే. అది స్వేచ్ఛగా ప్రవహించు నంతకాలము, అది బలముగను శుద్ధముగను పుష్టిగను ఉన్నంతకాలము, సమస్తమును సక్రమముగనే నడచును. ఆ రక్తము నిర్మలము గా ఉన్నయెడల, రాజకీయబాధలు, సాంఘికదోషములు, ఇంక నితరములగు కొఱంతలు, దేశదారిద్ర్యము సైతము నివారణ కాగలదు! రోగబీజమును ఒక్కసారి తొలగించి వేసినయెడల ఏ దోషముకూడ మన రక్తములోనికి చొరబడ జాలదు. ఆధునిక వైద్యశాస్త్రమునుండి ఒక ఉదాహరణను తీసికొందము. రోగము అంకురించుటకు రెండు కారణములుండవలయునని తెలియ వచ్చుచున్నది. వెలుపల నుండి వచ్చి ప్రవేశించు విషబీజము ఒకటి; రెండవది శరీరము యొక్క దుర్బలస్థితి. శరీరము విషబీజములకు ప్రవేశమిచ్చు స్థితికి వచ్చు వఱకును, ఆబీజములు లోపల ప్రవేశించి బలపడి వృద్ధిగాంచుటకు వీలగునంతగా శరీరపటుత్వము తగ్గి జవము ఉడుగు నంతవఱకు, ప్రపంచములోని ఏరోగబీజమునకుకూడ మనశరీరమున రోగము కల్పించుటకు సామర్థ్యములేదు. సత్యమునకు సూక్ష్మజీవుల రూపమున లక్షలకొలది బీజములు ప్రతివాని శరీరమునందును నిరంతరము వచ్చుచు పోవుచు నుండును. కాని శరీరము పుష్టిగా నున్నంతకాలము వాని బాధ దానికి తెలియదు. శరీరము నిస్సారమైనప్పుడుమాత్రమే ఈ సూక్ష్మజీవులు దానిని ఆవహించి రోగకల్పన చేయును. జాతీయజీవనసందర్భమునను ఇటులే జరుగును. జాతీయ శరీరము దుర్బలమైనప్పుడే, నానావిధములగు రోగబీజములు జాతియొక్క రాజకీయపరిస్థితులందో, సాంఘికావస్థయందో,

విద్యావిధానమునందో, చిత్తవైఖరియందో, గుంపులు గుంపులుగ శరీరమందు జొచ్చి రోగకల్పనచేయును. దీనిని నివారించుటకు ఆ రోగమునకు మూల మెక్కడనో మనము కనుగొని, రక్తములోని మాలిన్యములనన్నింటిని తొలగింపవలయును. వెలుపలినుండి వచ్చు విషములనన్నింటిని ఎదుర్కొని నెట్టివేయగల సమర్థత కలుగునటుల రక్తమును నిర్మలముగను, శరీరమును బలిష్ఠముగను చేసి, నరుని పుష్టిమంతునిగ చేయుటకొఱకే మన ప్రయత్నమంతయు సాగింపవలయును. మనజవము, సత్వము, ఇంతేల మనజాతీయ జీవనమే మనమతమునందు కలదని తెలిసికొనియుంటిమి గదా! అటుల మనచైతన్యము మతమునందు నెలకొనుట సరియైనదో కాదో, నిర్దుష్టమైనదో కాదో, తుదకు లాభకరమైనదో కాదో అను విషయమును నేను తర్కింపబోవుట లేదు. మేలునకో కీడునకో అది అటులున్నది. దానిని మీరు తప్పించుకొనలేరు. ఇప్పుడును ఇకముందును అది అట్లుండవలసినదే. మతమునందు నాకున్నంత విశ్వాసము మీకున్నను లేకున్నను దానిని మీరు పోషింపవలసియున్నది. దానిచే మీరు బంధింపబడి యున్నారు. దానిని వదలివేసికొంటిరా, మీరు భిన్నభిన్నమైపోదురు. మనజాతి యొక్క జీవనరహస్యము అటులున్నది. మీరు దానిని బలపఱుపవలసియున్నది. పూర్వము మీరు దానిని గుఱించి చాల శ్రద్ధ తీసికొంటిరి గనుకనే, దానిని గుఱించి తక్కిన వానినెల్ల త్యాగముచేసితిరి గనుకనే, శతాబ్దముల తరబడిగా మీకు ఎన్ని అపాంతరములు వచ్చినను ఎదిరించి

లిగిరి. మీపూర్వులు సమస్తమును భరించిరి. ......నకు సైతము తలయొగ్గిరి. కాని వారు తమ మతమునుమాత్రము సంరక్షించికొనిరి. విదేశ దండయాత్రికులు దేవాలయములను ఒకటితర్వాత ఒకటిగా పగుల గొట్టివేసిరి. ఆ ఆఘాతము గడచిపోవగనే దేవాలయశిఖరములు మరల పైకి లేచుచునే వచ్చినవి. దక్షిణ భారత దేశమునందలి ఈ ప్రాచీన దేవాలయములును, గుజరాతునందలి సోమనాథము వంటి దేవాలయములును, విజ్ఞానసంపుటములను మీకొసగగలవు. అనేక పుస్తకరాసులకంటె ఇవి మీ జాతీయచరిత్రయొక్క రహస్యములను ఎక్కువ స్పష్టముగ మీకు తెలుపగలవు. నిరంతరము వందలకొలది దాడులకులోనై నేల కూలియు, ఆ శిథిలములనుండియే ఎప్పటివలె వందలకొలది సార్లు జవసత్వములతో పునర్జీవితములై పైకి లేచుచు వచ్చిన గుళులు ఆ దేవళములమీద ఎటుల శోభించుచున్నవో చూడుడు. మన జాతీయహృదయము ఆరీతిగానున్నది. మనజాతీయ జీవనస్రవంతి ఆతీరున ప్రవహించుచున్నది. దానిని అనుసరించి పొండు. అది మిమ్మును మహాతేజోవంతులనుగ చేయగలదు. దానిని వదలుకొంటిరా, మీరు మరణింతురు. ఆ జీవనస్రవంతిని వదలి ఒక అడుగునడచిన తత్క్షణమే తత్ఫలితముగా మరణము చేకూరును! సర్వనాశనమే దాని ఫలితార్థమగును. ఇతర విషయములు అవసరములుకావని చెప్పుట నా అభిప్రాయముగాదు. రాజకీయాభివృద్ధిగాని, సాంఘికాభివృద్ధిగాని, అవసరముకాదని నేను చెప్ప పూనుకొనలేదు. కాని మన

దేశమున మతము ప్రధానమనియు, తక్కినవన్నియు ఆను షంగికములనియు, అనగా అప్రధానములనియు నా అభిప్రాయము. ఈ విషయమును మనస్సులో పెట్టుకొనుడని నేను మిమ్ము కోరుచున్నాను. భారతీయునిహృదయము మొట్ట మొదట పారమార్థికమై ఆపిమ్మట ఏదియైననుకాగలదు. కాబట్టి మనము మతమును బలపఱుప వలయును. ఆపనిని ఎట్లుల చేయుటయో నాఉద్దేశ్యములను మీకు చెప్పబోవుచున్నాను. నేను అమెరికాపోవుటకై చెన్నపురి సముద్ర తీరమును విడుచుటకు అనేకసంవత్సరములకు మునుపే అవి నా మనస్సులోనున్నవి. అసలు నేను అమెరికా ఇంగ్లాండులకు పోవుట కేవలము ఈ భావములను ప్రచారము చేయుటకొఱకే! మహామతసభను, ఇతరవిషయములను నేను సరకుగొనలేదు. అందువలన నాకొక అవకాశము మాత్రము దొఱకినది. నిజముగా నాకు గల ఈభావములే నన్ను లోకమంతటను ద్రిమ్మరునటుల చేసినవి.

ఏ కొలది మందికో వశమై, ఏమఠములందో ఏఅడవులయందో రహస్యముగ దాచబడి మూలబడి యున్నట్టియు, మనగ్రంథములందలి అమూల్యనిధులనదగినట్టియు ఆధ్యాత్మిక జ్ఞానరత్నములను వెలికి తీసికొనివచ్చుటయే నా యుద్దేశ్యములలో మొట్టమొదటిది. ఆ జ్ఞానమును దాచిపట్టుకొని యున్నవారి చేతులనుండియే గాక, యింకను దుర్గమమగు సంస్కృతభాషనుండి కూడ దానిని పెకలించి లాగికొని రావలయును. శతాబ్దముల నుండి కరుడుకట్టుకొనిపోయిన

సంస్కృత శబ్దజాలమునందు అది భద్రపఱుపబడియే యున్నది. అయినను నేను ఒక్కమాటలో చెప్పెదను. దాని నంతను ప్రజాసామాన్యమునకు అందుబాటులోనికి తీసికొని రావలయును; ఈ యుత్కృష్టభావరాశిని బయటికి తీసికొని వచ్చి సంస్కృత భాష తెలిసినను తెలియకున్నను భారతదేశములోని ప్రతివానికిని అది కొంగుబంగారమై యొప్పునటుల చేసివేయవలయునని నాకోరిక. అటుల చేయుటలో మన సంస్కృతభాష, మన యీ దివ్యభాషయే గొప్ప అవరోధముగ నున్నది. అవకాశమున్నంతలో మన జాతి యంతయు మంచి సంస్కృత పండితులయిననే తప్ప ఈ కష్టము తొలగునటుల లేదు. నా జీవితకాలమంతయు ఈ భాషను పరిశోధించుచునే యుంటిని. అయినను ప్రతి నూతనగ్రంథమును నాకు తెలియనిదిగనే చూపట్టుచునిన ఈ కష్టమెటువంటిదో మీరు గ్రహింపగలరు. ఈ భాషను పూర్తిగ ఆకలించుటకు అవకాశము లేని సామాన్యప్రజలకు ఇంకను ఎంత కష్టముగ నుండునో యూహింపుడు. కాబట్టి భావములను ప్రజల భాషలోనే నేర్పుచుండవలయును. అయినను దానితో పాటు సంస్కృతవిద్యనుకూడ నేర్ప వలయును. ఏలయన సంస్కృత శబ్దములయొక్క స్వర మునకే గొప్పగౌరవమును మహిమయు కలవు. అది జాతికి బలమునొసగును. భారతదేశపు నిమ్నజాతులను ఉద్ధరించుటకై రామానుజులు, చైతన్యులు, కబీరువంటి మహా పురుషులు చేసిన ప్రయత్నములు ఆ ప్రవర్తకుల జీవితకాలము లోనే యెటువంటి సత్ఫలమును కల్పింపగలిగెనో తెలిసి

సంస్కృత శబ్దజాలమునందు అది భద్రపఱుపబడియే యున్నది. అయినను నేను ఒక్కమాటలో చెప్పెదను. దాని నంతను ప్రజాసామాన్యమునకు అందుబాటులోనికి తీసి కొని రావలయును; ఈ యుత్కృష్టభావరాశిని బయటికి లాగికొని వచ్చి సంస్కృత భాష తెలిసినను తెలియకున్నను భారతదేశములోని ప్రతివానికిని అది కొంగుబంగారమై యొప్పునటుల చేసివేయవలయునని నాకోరిక. అటుల చేయుటలో మన సంస్కృతభాష, మన యీ దివ్యభాషయే గొప్ప అవరోధముగ నున్నది. అవకాశమున్నంతలో మన జాతి యంతయు మంచి సంస్కృత పండితులయిననే తప్ప ఈ కష్టము తొలగునటుల లేదు. నా జీవితకాలమంతయు ఈ భాషను పరిశోధించుచునే యుంటిని. అయినను ప్రతి నూతనగ్రంథమును నాకు తెలియనిదిగనే చూపట్టుననిన ఈ కష్టమెటువంటిదో మీరు గ్రహింపగలరు. ఈ భాషను పూర్తిగ ఆకలించుటకు అవకాశము లేని సామాన్యప్రజలకు ఇంకను ఎంత కష్టముగ నుండునో యూహింపుడు. కాబట్టి భావములను ప్రజల భాషలోనే నేర్పుచుండవలయును. అయినను దానితో పాటు సంస్కృతవిద్యనుకూడ నేర్ప వలయును. ఏలయన సంస్కృత శబ్దములయొక్క స్వర మునకే గొప్పగౌరవమును మహిమయు కలవు. అది జాతికి బలమునొసగును. భారతదేశపు నిమ్నజాతులను ఉద్ధ రించుటకై రామానుజులు, చైతన్యులు, కబీరువంటి మహా పురుషులు చేసిన ప్రయత్నములు ఆ ప్రవక్తల జీవితకాలము లోనే యెటువంటి సత్ఫలమును కల్పింపగలిగెనో తెలిసి

కొనుడు. అయినను వారి తరువాతివారు ఏల విఫలులయిరో విశదపఱుప వలసి యున్నది. ఈ మహాగురువులు గతించి పోయిన తరువాత దాదాపు ఒకశతాబ్దము లోపలనే వారి బోధల సత్ఫలములు అడుగంటిపోవుటకు గలకారణము తెలిసి కొనవలసి యున్నది. దానిగుట్టు ఇది; వారు నిమ్న జాతులను పైకి తీసికొని రావలయునని మాత్రమే తలంచిరి. అట్లే తెచ్చిరి. కాని ప్రజాసామాన్యమునందు సంస్కృత భాషను వ్యాపింపజేయుటకు ఈ మహాపురుషులు తమ శక్తి సామర్థ్యములను వినియోగించియుండలేదు. సామాన్య జనులు సంస్కృతభాషను చదువకుండ ఆపివేయుటలో బుద్ధ మహాశయుడు సయితము పొరపాటు చేసియున్నాడు. ఆయన సత్వరము లభించు తాత్కాలిక ఫలితములను కోరి ఆనాటి ప్రజాసామాన్యభాషయగు పాలీభాషలో తన బోధలను సాగించినాడు. అది మహాఘనకార్యమే. ఆయన ప్రజల భాషలో మాటాడినాడు. ప్రజలు ఆయన భావములను గ్రహించినారు. అది గొప్పవిషయమే. అటుల చేయుటచేత వాని భావములు త్వరితముగ వ్యాపించి చాలదూరమున నున్నవారికి సైతము చేరగలిగినవి. అయినను వానితో పాటు సంస్కృతభాషకూడ వ్యాపించి యుండవలసినది. జ్ఞానము లభించినది; కాని దానికి గణ్యత కొఱవడినది, సభ్యతయు కొఱవడినది. సభ్యతయే, అనగా నాగరకతయే ఒడుదుడుకులకు నిలిచి ఆగగలదు. కేవల విజ్ఞానరాశికి ఆ శక్తిలేదు. ప్రపంచములో జ్ఞానరాశిని మీరు వ్యాపింప చేయ వచ్చును. కాని అందువలన ప్రపంచమునకు ఎక్కువ మేలు

కలుగదు. రక్తములోనికి సభ్యతను ప్రవేశ పెట్ట వలసి యున్నది. మహోత్తరమైన జ్ఞానరాసులు కల జాతుల నెన్నిటినో యీకాలమున మన మెఱుగుదుము. వాని గతి యేమైయున్నది? సభ్యత వారి యందు కొఱ వడుటచేత వారు పులులవలెను క్రూరమూర్ఖజాతులవలెను ఉన్నారు. జ్ఞాన మనసది పైపైని మెఱుగువంటిదే! ఈనాటి నాగరకతయును అటులే యున్నది. కొంచెము లోతుగ చూచిన యెడల వారి క్రూరబుద్ధి బయలు పడును. అట్టి విషయములు ఇప్పుడును తటస్థించు చున్నవి. ఇప్పుడు వచ్చిన అపాయ మదియే. సామాన్యప్రజలకు వారి మాతృభాషలో బోధలు చేయుడు. వారికి ఉన్నత భావముల నేర్పుడు. వారికి విషయము గోచరమగును. కాని యింకొకటికూడ అత్యావశ్యకమగుచున్నది. వారికి సభ్యత నొసగవలయును. అది వారి యందు కొఱవడియున్నంతవఱకు ప్రజాసామాన్యమును పైకి తీసికొనివచ్చిన లాభము సుస్థిరముగ నుండజాలదు. సంస్కృతభాషాప్రభావముతో నొప్పు వేఱొక వర్ణమేర్పడి, త్వరలో తక్కిన వారందఱి కంటె ఆధిక్యమును సంపాదించి, వారిపైని రాజ్యము చేయసాగును. నిమ్నజాతుల వారికి రక్షణము చేకూరు మార్గము, వారికి ఉన్నత దశ లభించు నుపాయము, సంస్కృతభాషను అభ్యసించుటలో నున్నది ; పోరాటములవలనను, ఖండనరచనల వలనను, ఉత్తమ జాతులవారిని నిందించుట వలనను లాభము లేదు. అందువలన మేలు చేకూరదు. పైగా వాగ్వాదములు పోరాటములు హెచ్చుపెరుగును. అయ్యో, ఇదివఱకే భిన్న

భిన్నముగ చీలిపోయిన జాతి యింకను ముక్కలు ముక్కలై పోవును. కులములను సమస్థితిలోనికి తీసికొనివచ్చుటకు సభ్యతను అలవఱచు కొనుట ఒకటే ఉపాయము. ఉన్నత కులములవారిని బలవంతులనుగా చేసిన ఆవిద్యను వీరును సంపాదింపవలయును. అది చేసితిరా మీ కోరిక సిద్ధింపగలదు.

ప్రత్యేకముగా ఈ చెన్నపట్టణమునకు సంబంధించిన ఒక విషయమునుగుఱించి ఈ సందర్భమున వివరింప గోరెదను. ఉత్తరభారతదేశమున గల ఆర్యులనెడు జాతికాక వారికి భిన్నమగు ద్రావిడులను వేఱొకజాతి దక్షిణభారత దేశమున గలదనియు, ఈదక్షిణభారతదేశమున బ్రాహ్మణులు మాత్రమే ఉత్తరము నుండి వచ్చిన ఆర్యులనియు, ఈ ఇతర జనులందఱును ఈ బ్రాహ్మణులకంటె భిన్నమగు కులముల కును జాతికిని చెందిన వారనియు ఒక సిద్ధాంతము కలదు. ఈ సిద్ధాంతము పూర్తిగా నిరాధారమని నేను పలుకు నెడల భాషాతత్త్వవేత్తలు నన్ను క్షమింతురుగాక!

ఉత్తరమునకును దక్షిణమునకును భాషాభేదముండుట మాత్రమే ఈ సిద్ధాంతమునకు ఆధారము! మఱి ఏ భేదమును నాకు కాన్పించుట లేదు. ఉత్తరదేశపు జనులము ఇక్కడ చాలమందిమి ఉన్నాముగదా! ఈ సభలోని ఉత్తరదేశము వారిని దక్షిణదేశమువారిని వేఱుచేసి చూపుడని నా యూరపి యను మిత్రులను కోరుచున్నాను. ఆ భేదమెక్కడనున్నది? కొంచెము భాషాభేదమేగదా! కాని ఈ బ్రాహ్మణులు ఉత్తరమునుండి ఇక్కడకు వచ్చి చేరిరట. వీరు సంస్కృత

వారికి ఋజువు చేయుటకు తగిన మాట ఒక్కటియైనను లేదు. ఆర్యుల మూలస్థానముకూడ ప్రాచీన భారతదేశములోనిదే. అంతటితో ఆ విషయము పోనిండు! ఇక శూద్రకులము వారందఱు అనార్యులనియు, వారు అధికసంఖ్యాకులుగ నుండిరనియు చెప్పెడు సిద్ధాంతము సైతము తర్కమునకు నిలువజాలదు; అసంగతమైన వాదన అది. కొలదిమంది ఆర్యులు ఇక్కడ నివాసముల నేర్పఱచుకొని, లక్షలకొలది బానిసలను తమ స్వాధీనమందు పెట్టుకొనియుండుట ఆదినములలో సాధ్యమగు విషయము కాదు. ఈబానిసలు వారిని మ్రింగివేసి యుందురు. ఐదునిమిషములలో ఈ పదిమంది ఆర్యులను పచ్చడిక్రింద నంజుకొనియుండరా? సత్యయుగములో మొట్టమొదట ఒక బ్రాహ్మణ కులమే కలదనియు, కాలక్రమమున వృత్తిభేదమునుబట్టి వేఱు వేఱు వర్ణములుగా వారు చీలిపోయిరనియు చెప్పెడు సిద్ధాంతము మాత్రము మహాభారతమునందు కానవచ్చుచున్నది. ఇంతవఱకు లభించిన సిద్ధాంతములలో అది యొకటియే సత్యమును సమంజసమునై చూపట్టుచున్నది. మరల రానున్న సత్యయుగములో తక్కిన కులములన్నియు ఆ మొదటి స్థితికే మరలి పోగలవు. కాబట్టి భారతదేశమందలి కులసమస్యాపరిష్కారము ఈ తీరున జరుగ వలసినదియే. ఉన్నతకులముల వారిని క్రిందికి లాగి భ్రష్టుల చేయుటయు, బ్రాహ్మణులను నలిపి నాశము చేయుటయు పొసగదు.

శ్రీ శంకరాచార్యులవారు తన గీతావ్యాఖ్యాన ప్రారంభమునందు బ్రాహ్మణత్వమును గుఱించియు బ్రాహ్మ-

ణత్వరక్షణమును గుఱించియు బోధించుటకై శ్రీకృష్ణుడు అవతరించినటుల కారణములను విశదము చేయు పట్టున భారతదేశమున బ్రాహ్మణత్వమే ఆదర్శమని తెలిపి యున్నారు. అదియే గొప్ప పరమావధి. ఈ బ్రాహ్మణుడు, ఈ భగవద్భక్తుడు, ఈ బ్రహ్మవిదుడు, ఈ ఆదర్శమూర్తి, ఈ సిద్ధపురుషుడు స్థిరముగ నిలిచి యుండవలసినవాడే! అతడు రూపుమాసి పోగూడదు. ఆ కులము వారియందు ఇప్పుడు ఎన్నిలోపములు కాన్పించుచున్నను, తక్కిన అన్నికులముల వారి నుండి బయలుదేఱిన బ్రహ్మవేత్తలకంటె ఈ బ్రాహ్మణ కులమునుండి ఎక్కువమందియే సత్యముగ వెలువడియుండిరి. ఈ ప్రఖ్యాతిని ఆబ్రాహ్మణకులము వారికి ఒసగుటకు మన మందఱము సిద్ధముగ నుండి తీరవలయును. ఆ మాట సత్యము. వారియం దీఘనత కలదని తక్కిన కులముల వారందఱు అంగీకరింప వలయును. మనము వారి లోపములను గుఱించి మాటాడుటకును ధైర్యము వహింప వలయును. పూర్తిగ ధైర్యము పూనవలసినదే. అట్లయ్యును వారికి అర్హమగునట్టి గౌరవమును వారి కొసంగియే తీర వలయును. "ఎవరి కొసంగదగిన దానిని వారి కొసంగుడు" అనునట్టి ప్రాచీనపు ఇంగ్లీషు సామెతను జ్ఞప్తికి తెచ్చుకొనుడు. కాబట్టి మిత్రులారా! వివిధకులములవారు పోట్లాడు కొనుట వలన ప్రయోజనము లేదు. దాని వలన మేలేమియు చేకూరదు. అది మనయందు ఇంకను విభేదముల కల్పించును; మనల నింకను దుర్బలుల చేయును; మనల నింకను అధోగతిపాలు చేయును. ప్రత్యేకార్హతలుగల దిన

ములు. ప్రత్యేక మర్యాదలుగల దినములు గడచి పోయినవి. మన భారతదేశమున ఇంకెన్నడును ఆ దినములు మరలి రావు. భారతదేశమునకు బ్రిటిషు పరిపాలన వలన కలిగిన మేళ్లలో అది ఒకటి. ప్రత్యేకార్హతలను రూపుమాపుట అనెడు మహా ప్రసాదమును మహమ్మదీయ పరిపాలనముగూడ మన కొసంగియున్నది. ఆ పరిపాలన అంతగా నష్టమైనది గాదు. ఏదియు పూర్తిగా అనర్థమని చెప్పుటకు వీలులేదు; ఏదియు పూర్తిగా శుభప్రదమును కాజాలదు. మహమ్మదీయ విజయము భారతదేశమున అణగద్రొక్కబడి యున్న వారికిని, బీదవారికిని, మోక్షప్రదాయిగా పరిణమించెను. అందువలననే మన ప్రజలలో ఐదవవంతు జనము మహమ్మదీయులైరి. అది అంతయు కత్తి వలన సాధించిన కార్యము కాజాలదు. కత్తియు, అగ్నియు ఇంతకార్యము సాధించెనని తలంచుట మిక్కిలి వెఱ్ఱితనము. అయిదవ వంతు అననేల? మీ చెన్నపురి వాసులలో సగముమంది, మీరు జాగ్రత్త పడరేని, క్రైస్తవులు కాగలరు. మలబారు దేశమున నాకు గోచరించిన దానికంటె పిచ్చివిషయము పూర్వము ఎన్నడైన ప్రపంచమున ఉండి యుండెనా? పాపము మాలవాండ్రు ఉన్నతకులముల వారు పోవు వీధులగుండ నడువనే కూడదట. కాని వారు ఏవేవో ఇంగ్లీషుపేరులను దడబిడగ చెప్పుకొను నెడల అంతయు కుదుటబడుచున్నది; మహమ్మదీయ నామముల పెట్టుకొనినను సరిపోవుచున్నది. ఈ మలబారు ప్రజలందఱును వెఱ్ఱివాండ్రనియు, వారి గృహములు వెఱ్ఱివాండ్ర

శరణాలయములనియు నిర్ణయించుట కంటె మీరేమి చేయ గలరు? వీరు తమ చేష్టలను మరల్చుకొని, తిన్నని త్రోవకు వచ్చిననే తప్ప భారతదేశమునందలి ప్రతి జాతివారును వీరిని చూచి అసహ్యాపడవలసినదే. ఇటువంటి దౌర్జన్యమును, రాక్షసాచారమును అంగీకరించుట ఎంతసిగ్గుచేటు! ఈ మాలవారి బిడ్డలు తిండిలేక చచ్చుచున్నారు. కాని వారు వేఱొక మతమును స్వీకరించినంతనే వారికి చక్కగా భోజనముదొరకుచున్నది. కాన వివిధకులముల వారిమధ్య పోరాటములుండుట ఎంత మాత్రమును తగదు.

పైవారిని క్రిందికి పడలాగుట వలన కాక క్రింది వారినిపైకి లేవదీయుట వలననే ఈ సమస్య పరిష్కారము కాగలదు. ఎవరికి శాస్త్రజ్ఞానము సున్నయో, ప్రాచీనుల యభిప్రాయము తెలిసికొను శక్తి ఎవరియందు 'పూజ్యమో' అట్టివారు మీ కేమి చెప్పినను వారి వలన మీ రేమి గ్రహించినను వ్యర్థమే. కాని మన గ్రంథములం దెల్లెడల కాన్పించు సాధనోపాయము నేను చెప్పినదే. ఇది వారు గ్రహించుట లేదు. బుద్ధిమంతులకు ఈ విషయము చక్కగనే గ్రాహ్యాము కాగలదు; ఎంతయో పని చేయవచ్చును. సర్వమును ఆలోచన గలవారికి తేటతెల్లమే. అట్టివారు ప్రక్కకు తొలగి నిలుచుండి, యుగయుగాంతరములనుండి మన జాతీయజీవనము ఎటుల అద్భుతముగా నడచుచున్నదో కనుపెట్టి చూచిన యెడల, ప్రాచీనములు, నూతనములు అగు గ్రంథములన్నిటియందును ఈ సంగతిని వారు గుర్తింప గలుగుదురు. కార్యోపాయము ఏది? ఒకవైపు బ్రాహ్మణా

దర్శమున్నది: రెండవవైపు చండాల స్వరూపమున్నది. మనము చేయవలసినపనియంతయు ఈ చండాలుడు బ్రాహ్మణాదర్శమును జేరునటుల చేయుటయే. మెట్టు మెట్టుగా, మెల్ల మెల్లగా, వానికి యోగ్యతలను కల్పించుచుండవలయును. "శూద్రుడు వేదములను వినుట తటస్థించిన యెడల వాని చెవులలో సీసము కరగించి పోయవలయును. ఒక్క వేదవాక్యమును వాడు మదిని నిలిపిన యెడల, అనగా జ్ఞప్తి నుంచుకొనిన యెడల వానితలను చితుకకొట్టుడు. 'ఓ బ్రాహ్మణుడా?' అని వాడొక బ్రాహ్మణుని పిలువ సాహసించిన మాత్రాన, వాని నాలుకను తెగకోయుడు." అను నిట్టి భయంకర వాక్యములు గల పుస్తకములును కలవు. ఇది ఎంతయు రాక్షసము! ప్రాచీన మూర్ఖత! సందేహము లేదు. ఆమాట చెప్పకయే వెల్లడియగుచున్నది. అయినను స్మృతికర్తలను నిందింప బోకుడు. వారు కొన్ని శాఖాసంప్రదాయములందు చూపట్టినయాచారములను ఉదాహరణ మాత్రముగ తెలిపియున్నారు. ప్రాచీనులందు అప్పుడప్పుడు అటువంటి ఘోరరాక్షసులు తలజూపుచు వచ్చిరి. అన్నియుగములందును కొంచెము హెచ్చు తగ్గుగా, అటువంటి ఘోరపాతకులు అన్నిచోట్లను కాన్పించుట కలదు. కాలక్రమమున ఈ కాఠిన్యము కొంచెము తగ్గుచు వచ్చును. ఉదాహరణకు 'శూద్రులను బాధింపకుడు. అయినను వారికి ఉత్తమ ధర్మములను బోధింపకుడు' అనునిట్టి వాక్యములును కలవు. కాలక్రమమున ఇతర స్మృతులయందు, ముఖ్యముగా ఇప్పుడు ప్రామాణికములుగ నున్న స్మృతులయందు

'శూద్రులు బ్రాహ్మణులను అనుకరించిన యెడల, వారి యాచార మర్యాదలను చేపట్టిన యెడల మంచిదియే. వారిని ప్రోత్సహింపుడు' అని యున్నది. ఆ పనియే ఇప్పుడు జరుగు చున్నది. ఆ ఉదంతముల వివరములను మీకు తెలుపుటకు నాకు వ్యవధి లేదు. వాని వివరమును మీరెట్లు గుర్తింప గలరో తెలుపుటకు గూడ అవకాశము చాలదు. యథార్థ ముగ జరుగు విషయములను బట్టి, అన్ని కులముల వారును మెల్ల మెల్లగా ఉత్తీర్ణులు కావలసి యున్నది. ఎన్ని వేల కులములు ఉన్నను కొందఱు బ్రాహ్మణులలోనికి చేరి పోవుచునే యున్నారు. వారటుల బ్రాహ్మణులమని చెప్పు కొనకుండ ఏది అడ్డగలదు? ఈ కారణమున కఠినమగు కుల పద్ధతి నిర్మితమైయున్నది. ఐన నేమి? ఇక్కడ పదేసివేల జనులు గల కులములు కొన్ని కలవని అనుకొందము. వారి తలలు కూడి, అందఱును కలసి మేము బ్రాహ్మణులము అని ప్రకటించుకొనినచో వారిని ఎవరును అడ్డు పెట్ట జాలరు. నా జీవితకాలములో, నేను స్వయముగా ఇట్టి సంఘటన ములను చూచి యున్నాను. ఏ కులమువారైనను బలవంతులై ఏకాభిప్రాయులు అయిన వెంటనే, 'వద్దు' అని అడ్డుచెప్ప గల వా డుండడు. ఏమైన కానిండు, ప్రతికులమును ఇతరుల నుండి వేఱుపడుచు వచ్చినది. అది ఇతరుల వ్యవహార ములతో జోక్యము పెట్టుకొనుట లేదు. ఒక్క కులములోని అంతశ్శాఖలవారే మఱియొక శాఖవారితో జోక్యము కల్పించు కొనుట లేదు. శ్రీశంకరాచార్యులు మొదలగు మహా యుగపురుషులు గొప్ప కులనిర్మాత లైరి. వారు

కల్పన చేసిన విచిత్ర విషయముల నన్నిటిని నేనిప్పుడు మీకు చెప్పజాలను. నేను చెప్పుదానిని విని మీలో కొందఱు ఆగ్రహావేశులు కావచ్చును. నా సంచారములయందు నా అనుభవములను బట్టి ఆ చిత్రములను పరిశీలించితిని. విస్మయము గొలుపు నిర్ణయములును తేలినవి. ఒకొ్క-కప్పుడు మనవారు *బెలూచీలను గుంపులు గుంపులుగ తెచ్చి అందఱిని ఒక్కుమ్మడిగా క్షత్రియులను చేసివేసెడి వారు. క్రైస్తవాంధ్రను సమూహములు సమూహములుగ తెచ్చి బ్రాహ్మణులనుగా చేసివేసెడి వారు. అట్టి వారంద ఱును ఋషులును మహాఋషులును అయిరి. వారిని సంస్మరించి నేడు మనము సాష్టాంగ నమస్కారములు చేయుచున్నాము. అదే విధముగా మీరందఱును ఋషులు మహాఋషులు కావలయును. అదే రహస్యము.' కొంచెము హెచ్చు తగ్గుగా మనమెల్లరము ఋషులము కానున్నాము! 'ఋషి' అనగా నేమి? 'పవిత్రుడు' అన్నమాట. ముందు మీరు పవిత్రులు కండు. అధికారము అప్పుడే వచ్చును. ఊరక 'నేను ఋషిని, నేను ఋషిని' అని చెప్పుకొనుట వలన ప్రయోజనము లేదు. నీవు నిజముగా ఒక ఋషివి అయినప్పుడు ఇతరులు సహజముగా వచ్చి నీవు చెప్పినట్లు నడతురు. ఏదో ఒక విచిత్రశక్తి నీలోనుండి బయలుదేఱి వారు నీవెంటబడునటుల చేయును. వారు నీమాట వినునటుల చేయును. తమకు ఇష్టములేక పోయినను తమకు

* బెలూచిస్థాన్ ప్రజలు.

తెలియకుండనే వారు నీ సంకల్పములను నెఱవేర్చుచుందురు. 'ఋషిత్వము' అనగా అటువంటిది !

సరే, అల్పాంశములు చక్కబడుటకును కొన్ని తరములు గడవవలసి యుండును. అయినను ఈ వివాదములు ఎటుల తీరునో మీకు తెలుపుటకు సూచనగా చెప్పితిని. ముఖ్యముగా ఈదినములలో ఆ యా కులముల మధ్య వివాదములు జరుగుట నాకు విచారముగ నున్నది. ఇట్టివి అంతరింప వలయును. ఉభయ పక్షములకును ఇందు వలన కలుగు లాభము లేదు; ముఖ్యముగా ఉన్నతకులజులగు బ్రాహ్మణులకేమాత్రమును లాభములేదు. ప్రత్యేకార్హతలకును, ప్రత్యేకాధికారములకును, దినములు గడచిపోయినవి. అధికులై యున్న వారు ప్రతివారును విధిగా తమ సమాధిని తామే త్రవ్వుకొన వలసి యున్నది. ఎంత త్వరితముగా వారు అటుల త్రవ్వుకొనిన అంత మంచిది. వారు ఆలస్యము చేసిన కొలది రోగము పెరిగి దేహము క్రుళ్ళిపోవును. దుర్భరమగు మరణముపాలు కావలసి వచ్చును. కాబట్టి తక్కిన మానవ కోటి యొక్క మోక్షము కొఱకై పాటుపడుట భారతదేశ బ్రాహ్మణునివిధి. దానిని నిర్వహించు నెడలను, దానిని నిర్వహించు నంతకాలమును అతడు బ్రాహ్మణుడే. కాని ధనార్జనమునకై తిరుగులాడుచో అతడు బ్రాహ్మణుడు కాడు. మఱియు దానమునకును అర్హుడయిన నిజమైన బ్రాహ్మణునకే మీరు దానము లీయవలయును. అదిస్వర్గమునకు దారిజూపును. కాని అనర్హుడగువానికి ఒసగబడినదానము ఒక్కొకప్పుడు నరకమునకే త్రోవ చూపునని మన శాస్త్రములు పలుకుచున్నవి.

దానిని గుఱించి వీరు జాగరూకతతో నుండవలయును. ఎవనికి లౌకిక వ్యాపారముండదో అతడు మాత్రమే బ్రాహ్మణుడు. లౌకికవ్యాపారము బ్రాహ్మణుని కొఱకేర్పడినది కాదు. అది ఇతరకులములవారి పని. తాము తెలిసికొనిన దానిని ఇతరులకు బోధించుచు అనేక శతాబ్దములనుండి తాముకూర్చి పెట్టుకొనిన సభ్యతను పంచి యిచ్చుచు, భారత ప్రజను ఉద్ధరించుటకు పూర్తిగ శ్రమపడి పని చేయుడని నేను బ్రాహ్మణులను ప్రార్థించు చున్నాను. సత్యముగ బ్రాహ్మణత్వము ఎయ్యదియో జ్ఞప్తియందు ఉంచుకొనుట భారతదేశపు బ్రాహ్మణుని ధర్మము. మనువుచెప్పినటుల, ధర్మకోశాగారము తన స్వాధీన మందుంచుటవలననే, బ్రాహ్మణునికి ఈ అర్హతలు ఈ గౌరవములు అన్నియు ఒసగబడు చున్నవి. అతడు ఆ కోశాగారమును తెఱచి అందలి ధనరాసులను ప్రపంచమునకు పంచి ఇయ్యవలయును. భారతీయ జాతులకు బోధలు సలిపిన ప్రథమ గురుడు బ్రాహ్మణుడనుట సత్యము. జీవితముయొక్క పరమ గమ్యార్థమును సాధించుటకొఱకు సమస్తము త్యాగముచేయవలయు నను భావము ఇతరులకు స్ఫురించుటకు పూర్వమే బ్రాహ్మణుడు సర్వపరిత్యాగము చేయుటలో ప్రప్రథముడయ్యెననుట తథ్యము. అతడు ఇతరకులముల వారికంటె ముందునడచి యుండుట అతని దోషముకాదు. ఇతరకులముల వారును అటులే తెలివిగలవారై బ్రాహ్మణులు చేసినటుల తామును ఏల చేసి యుండలేదు? తాము తీరి కూర్చుండి సోమరులై బ్రాహ్మణులను ఏల పరువిడనిచ్చిరి? కాని ముందుగ లాభ

ములు సంపాదించుట ఒక విషయము; దుర్వినియోగము చేయుటకొఱకు వానిని పేర్చి పెట్టుకొనుట మఱొక విషయము. దుర్వినియోగము చేయబడెడు అధికారము రాక్షస లక్షణము. అధికారమనునది సద్వినియోగము కొఱకే ఏర్పడినది. యుగాంతరములనుండి సంపాదితమై, ధర్మకర్తగా బ్రాహ్మణుడు తనయొద్ద నుంచుకొనిన ఈ విజ్ఞానమును ఆతడు మన సామాన్య జనమునకు నేడు దానము చేయవలసియున్నది. ఆతడటుల ఇదివఱకే దానిని ప్రజలకు దానము చేసి యుండని కారణముననే మహమ్మదీయుల దండయాత్ర సంభవించుటకు అవకాశము కల్గినది. ఈ మహానిధిని ప్రజలకై అతడు మొదటి నుండియు తెఱవక యుండిన కారణముననే, వేయిసంవత్సరముల నుండి భారతదేశము మీదికి రా దలపెట్టిన ప్రతివాని పాదము క్రిందను పడి మనము నలుగుచున్నాము. ఆకారణము వలననే మనము భ్రష్టులమై పోయినాము. కాబట్టి మన అందఱి పెద్దలగు మహాఋషులు ప్రోగుచేసి యుంచిన ఈ అద్భుత ధనరాసులు దాచబడి యున్న కోశములను బాగుగ తెఱచివేయుట మన ప్రప్రథమ విధివిహిత కృత్యముగ నున్నది. ఆ ధనరాసులను వెలికి తీసికొని రండు. వానిని ప్రతి వానికిని ప్రసాదింపుడు. అటుల చేయువారిలో బ్రాహ్మణుడు ప్రథముడుగానుండ వలయును. త్రాచుపాము తాను కఱచిన మనుజుని గాయమునుండి విషమును తాను తిరిగి పీల్చుకొనిన యెడల ఆరోగి మరణింపడని ఒక మూఢ విశ్వాసము వంగదేశమున గలదు. మంచిది, అట్లే బ్రాహ్మణుడు తనవిషమును తానే పీల్చి వేయ వలసి

యున్నది. బ్రాహ్మణేతర కులములవారికి నేను చెప్పున దేమనగా 'ఓపిక పట్టుడు; తొందఱ పడకుడు; అవకాశము దొరికినప్పుడెల్ల బ్రాహ్మణునితో పోరునకు దిగకుడు. ఏల యందురా? నేను తెలిపియున్నటుల మీలోపమువలననే మీరు బాధల ననుభవించుచున్నారు. ఆదిని అధ్యాత్మ జీవనమును, సంస్కృత పాండిత్యమును అశ్రద్ధ చేయుడని మీకెవరు చెప్పిరి? ఇంతకాలమును మీరేమి చేయు చుంటిరి? మీరు శ్రద్ధావిహీనులై యుండనేల? మీకంటె ఎక్కువ మెదడును, బలమును, సత్త్వమును, జవమును ఇంకొకరికి ఉండుట చూచి ఇప్పుడు కినిసి చిందులు త్రొక్క నేల? వార్తాపత్రికలలో వ్యర్థమగు వివాదములను విమర్శన ములను సాగించి మీ శక్తులను వ్యర్థము చేసికొనుటకు మాఱుగా, పాపమునకు పాల్పడి స్వగృహములో పోరును తెచ్చిపెట్టి కొట్లాటలు సాగించుటకుమాఱుగా, బ్రాహ్మణుడు సంపాదించిన సభ్యతను మీరు సాధించుటలో మీ సామ ర్థ్యము నంతను వినియోగింపుడు. మీకు కార్యసిద్ధి యగును. మీరేల సంస్కృతపండితులు కాగూడదు? సంస్కృత విద్యను భారతదేశములోని సకల వర్ణముల వారికిని చెప్పిం చుటకై, లక్షలకొలది ధనమును మీరేల ఖర్చు పెట్టరు? ఇదియే సమస్య. ఈ పని చేసిన తత్క్షణమే మీరు బ్రాహ్మణులతో సమానులు కాగలరు. భారతదేశము లోని అధికార రహస్య మిందే యున్నది.

సంస్కృతవిద్యయు, ఉత్తమార్హతయు భారతదేశ మున పెనవేసికొని నడచుచున్నవి. మీరు వానిని సంపా

దించిన తోడనే మిమ్ము ఎదిరించి మాటాడుటకు ఎవ్వరును సాహసింపరు. అది యొకటియే కీలకము. దానిని చేజిక్కించుకొనుడు. ప్రాచీనాద్వైతులు వర్ణించి నటుల, ఈ విశ్వమంతయు స్వకల్పిత భ్రాంతిలో పడి యున్నది. ఇచ్ఛ శక్తి స్వరూపము. సమర్థమగు ఇచ్ఛాశక్తి గల పురుషుడు తన చుట్టును ఒక జ్యోతిర్మండలమును సృష్టిచేసికొనుచున్నాడన వచ్చును. అట్టివాడు ఇతరజనులను తన మనస్సునందు గల స్పందనదశకు తెచ్చి, ఊగులాడింపగలుగును. అట్టి మహనీయ పురుషులు పుట్టుకొని వత్తురు. ఆహా! ఈ భావము ఎట్టి మహత్త్వము గలది! ఒక్కొక మహాత్ముడు పుట్టునప్పుడు వాని మహత్త్వమును వాని సంకల్పములను మనలోనికి చొప్పించును. మన అందఱిలోను ఆ సంకల్పములే ప్రసరించును. అప్పుడు మనము శక్తిమంతుల మగుదుము. సంఘములు బలవంతము లగుటకు సాధన మేమి? సంఘీకరణము! కేవల సంఘీకరణము జడమయ మని అనెదరేమో. ఉదాహరణగ చూచు నెడల నాలుగు కోట్ల ఆంగ్లేయులు ఈ దేశమందలి ముప్పదికోట్ల జనమును పరిపాలింప గలుగుట సాధ్యమయ్యెగదా! ఎందువలన? మన తత్త్వశాస్త్రము తెలుప గల వివరణము ఏమి? ఈ నాలుగుకోట్లమందియు తమ ఇచ్ఛలను సమీకరింతురు. అనగా ఏకము చేయుదురు. ఆశక్తి అనంత మగును. ముప్పదికోట్లమందిగ నున్న మీలో ప్రతి వానికిని గల ఒక్కొక్క యిచ్ఛ వేఱు వేఱై ఉండును. కాబట్టి భవిష్యత్కాలమున మహత్తర భారత దేశమును నిర్మించుట యందుగల రహస్యమంతయు సంఘీ

భావమునందు కలదు; శక్తి సమీకరణము నందు కలదు; ఇచ్ఛలయొక్క అనగా మన సంకల్పములయొక్క పరస్పర సహకారమునందు కలదు; ఇదిగో అథర్వవేదసంహిత యందలి శ్లోకములలో నొకటి నాస్ఫురణకు వచ్చుచున్నది. దాని భావ మిది: 'మీరందఱును ఒక్క మనస్సుతో నుండుడు; మీరందఱును ఒక్క సంకల్పముతో నుండుడు. ఏల యన, ప్రాచీనకాలమున దేవతలు ఏకమనస్కులై హవిస్సులను పొందగలిగిరి. దేవతలు ఏక మనస్కులు అగుటచేతనే మానవులచే పూజింపబడు చున్నారు.' ఏక మనస్కతయే సంఘమునకు కీలకము. ద్రావిడులని, ఆర్యులని అల్పభేదములను పాటించి వివాదములు, పోరాటములుసాగించిన కాలదిని, బ్రాహ్మణులని బ్రాహ్మణేతరులని ఇట్టిభేదములతో కీచులాడుకాలదిని, భావిభారత భాగ్యమును నిర్మింపగల శక్తిసామర్థ్యముల సమీకరణము మీకు దూరమై పోవును. నామాట గుర్తు పెట్టుకొనుడు. భావి భారత భాగ్యోదయము పూర్తిగ ఈ సమీకరణము పైని ఆధారపడియున్నది. ఇచ్ఛాశక్తియొక్క సమీకరణమే అనగా సమ్మేళనమే—సంకల్పముల నన్నిటిని ఒక్క కేంద్రమునకు తెచ్చుటయే—ఆ కీలక మనవచ్చును. ప్రతి చీనావాడును తన త్రోవను తాను సంకల్పము చేయును. కొద్ది మంది యగు జపాను వారందఱును ఒకేమార్గమున సంకల్పింతురు. ఫలితార్థము మీకు తెలిసినదే. ప్రపంచ చరిత్రయందు ఎల్లెడల జరుగుచున్న దిదియే. సంక్షుభవించి జీవించు స్వల్పజాతులు ప్రతివిషయమునను, అధిక సంఖ్యాకములై, విడియుండు జాతులను

సదా జయించి పాలించు చుండుట మనము చూచుచున్నాము. అది స్వభావ సిద్ధమగు విషయమే. ఏలయన సంఘీభావ ముతో మెలగు అల్పజాతులవారు తమ భావములను కేంద్రీక రించుట, అనగా సమీకరణము చేయుట, లేక ఒకటిగా చేయుట, చాల తేలిక మైనపని. అందువలన వారు త్వరలో వికాసమును పొందు చున్నారు. ఒకజాతి పెద్దదైన కొలదిని ఈ సమీకరణము దుస్సాధమగు చుండును. చెల్లాచెదరయిన, గుంపువోలె వీరు సులభముగా సంఘీభవింపజాలరు. ఎట్లో ఇట్టి వైషమ్యము లన్నియు తుదముట్టి తీరవలయును.

మనలో ఇంకొక లోపమును కలదు. నారీరత్నము లారా! నన్ను క్షమింతురుగాక. శతాబ్దముల కొలది బానిస తనములో పడియుండుటచేత అందఱమును స్త్రీలవలె మారిపోతిమి. ఈ దేశములో గాని, మఱి ఏ దేశములోగాని, ముగ్గురు స్త్రీలను ఒకచోటచేర్చి వారు పోట్లాడకుండ నుంచ గలుగుట చాల అరుదు. యూరపు దేశములో స్త్రీలు పెద్ద పెద్ద సంఘములను స్థాపించి స్త్రీల సామర్థ్యమును గుఱించి గొప్ప ఆడంబర ప్రకటనములను కావింతురు! కాని వారు త్వరలోనే తమలో తాము కీచులాడుకొందురు. ఇంతలో ఎవడో పురుషుడు వచ్చి వారి అందఱిమీదను అధికారము చేయ సాగును. ప్రపంచమంతటను ఇట్లొక పురుషుడు తమ్ము పాలింపవలసినటుల స్త్రీలే కోరుచుందురు. మనము వారివలె నున్నాము. మనము స్త్రీలమైపోయినాము. ఒక స్త్రీవచ్చి స్త్రీలమీద నాయకత్వమువహించు నెడల తత్క్షణమే వారం దఱును ఆమెను విమర్శింప పూనుదురు. ఆమెను ముక్కలు

ముక్కలుగ చీల్చి చెండాడ చూతురు. తుదకు ఆమె నొక మూల కూలబడ జేతురు. ఒక మగవాడు వచ్చి కొంచెము కాఠిన్యమునాపి అప్పుడప్పుడు నాలుగు తిట్లు తిట్టుచున్న యెడల, అంతయు చక్కబడును. వారిట్టి ఇంద్రజాలమునకు అలవాటు పడి యున్నారు. ఈ ప్రపంచమంతయు అటువంటి ఇంద్రజాలికులతోడను, మంత్రగాండ్రతోడను నిండియున్నది. మన దేశీయులలో నొకడు నిలువబడి ఏదో విధముగ ప్రముఖుడగుటకు ప్రయత్నించు నెడల, మన మందఱముకూడి వానిని అణగ ద్రొక్క ప్రయత్నింతుము. కాని ఒక్క విదేశీయుడు వచ్చి మనలను తన్ను జూచిన అంతయు చక్కబడును. మనము అట్టి దానికి అలవాటుపడియున్నాము. మన కటువంటిది అభ్యాసమై పోయెనా లేదా? మఱి బానిసలు గొప్ప నాయకులు కాగలరా? కాబట్టి బానిస లగుట మానుకొనుడు. రానున్న ఏబది సంవత్సరముల వఱకు, ఈ మన దివ్యభారత మాతయే మన అధిష్ఠాన దైవతముగ నుండుగాక! అంతవఱకును ఇతర వ్యర్థదేవతలు మన మనస్సుల నుండి అదృశ్యమై పోవుదురు గాక. ఈమె ఒక్కతెయే జాగ్రద వస్థలో మంకవలసిన ప్రధాన దేవత! మూర్తీభవించిన మన జాతియొక్క స్వరూపము! సర్వత్ర ఆమె చేతులే, సర్వత్ర ఆమె పాదములే, సర్వత్ర ఆమె కర్ణములే, ఆమెయే సర్వమును ఆవేశించి యుండుగాక. తక్కిన దేవతల నందఱిని నిద్ర పోనిండు. వ్యర్థపు దేవతల వెంటబడి, మన చుట్టును ఆవరించి వెలుంగు దైవతమును, ఈ విరాణ్మూర్తిని పూజింప జాలకున్నామే! ఈ దేవతను మనము అర్చించిన యెడల

తక్కిన దేవతల నందఱను పూజించుటకు అర్హుల మగుదుము. ఒక అరమైలు ప్రాకులాడుచు పోవ శక్తిని సంపాదించుటకు పూర్వమే, హనుమానుని లీల మహాసముద్రమును లంఘింప జూచుటయా! అది పొసగునది కాదు. ప్రతివాడును యోగి కావలయునట! ప్రతివాడును తపస్సునకు పూనుటయా! అది పొసగదు. దినమంతయు కర్మకాండతో సంసారమున మునిగి యుండి, సాయంకాలము కాగానే ఒక చోట కూర్చుండి రేచక పూరకముల చేయ బూనుటయా! అది అంతటి సులభ కార్యమా! నీవు ముక్కుతో మూడుసార్లు బుఱ్ఱుమని గాలిని పీల్చి వదలిన మాత్రాన ఋషులు ఆకాశము నుండి దిగి వత్తు రను కొందువా? ఇదేమి వేళాకోళమా? ఇది అంతయు వెఱ్ఱిపని! మనకు కావలసినది చిత్తశుద్ధి! హృదయపవిత్రత! అది యెట్లు లభించును? పూజలలోని కెల్ల ప్రప్రథమపూజ విరాట్పూజయే. అనగా మన చుట్టు నున్న సర్వభూతముల అర్చనమే. ఆ పూజను చేయుడు. పూజ అను సంస్కృత పదమునకు సరియైన ఆంగ్లపదము 'వర్షిప్' అనవచ్చును. మఱే ఆంగ్ల పదమును సరి పోజాలదు. వీరందఱును, నరులు పశువులు సహా, మనకు దేవతలు! మనము పూజింపవలసిన ప్రధాన దేవతలు మనదేశప్రజలే! మనము పరస్పరము అసూయా గ్రస్తులమై ఒకరితో నొకరము పోరాడు కొనుటకు మాఱుగా వీరిని పూజింప వలసి యున్నది. మహా ఘోరకర్మము పాలై మనము ఇడుములు గుడువ వలసి వచ్చినది. అట్లయ్యును కటా, మనము కన్నులు తెఱచుట లేదే!

సరే ఈ విషయము చాల పెద్దదిగా నున్నది. ఎక్కడ ఆగుటయో నాకు తెలియుట లేదు. కాని చెన్నపట్టణములో నిర్వహింప వలచిన కార్యముల గురించి కొలది వాక్యములు మీకు తెలిపి నా ఉపన్యాసమును ముగింతును. ఈ జాతి యొక్క పారమార్థిక వ్యావహారిక విద్యలను మన వశములో నుంచుకొన వలయును. అనగా మీకు అర్థమైనదా? స్వప్నములలో మీరు దానిని గురించియే చింతించుచుండ వలయును; దానిని గురించియే ముచ్చట లాడుకొనుచుండ వలయును; దానిని గురించియే జిజ్ఞాస చేయవలయును; దానిని గురించియే పాటుపడ వలయును. అంత వఱకును ఈ జాతికి మోక్షము లేదు. ఇప్పుడు మీరు నేర్చుచున్న విద్యయందు కొలది మంచి లక్షణము లున్నవి. కాని మహానర్థములు పెక్కు కలవు. అవి దాని వలన వచ్చు మేల్లను త్రొక్కి వేయగలంత గొప్పవిగా నున్నవి. మొట్ట మొదట —— ఇది పురుషత్వమును నిర్మించు విద్యయే కాదు. ఇది పూర్తిగా నిషేధరూపమగు విద్యగా మాత్రమే యున్నది. నిషేధరూపవిద్య, లేక దోషనిరూపణము చేయు శిక్షణ, మరణముకంటె నికృష్టమైనది! బిడ్డ బడికి పోవును. అక్కడ అతడు నేర్చుకొను మొదటి విషయము తన తండ్రి బుద్ధిహీనుడని! రెండవ విషయము తన తాత వెఱ్ఱివాడని! మూడవ విషయము తన గురువులందఱు మోసగాండ్రని! నాల్గవ విషయము తన పవిత్ర గ్రంథములన్నియు అబద్ధము లని! [illegible]యే. ఆ బిడ్డలకు పదునారేండ్ల ఈడు వచ్చు నప్పటికి అతడు [illegible], త్రాణలేని, పెద్ద నిషేధముల

మూర్తిగా తయారగు చున్నాడు. తత్ఫలితార్థము ఏమన, ఇట్టి విద్య ఏబది సంవత్సరముల నుండి నేర్పబడు చున్నను ఈ మూడు రాజధానుల యందును స్వకల్పనాశక్తిగల పురుషు నొక్కనినైనను అది సృజింప జాలక పోవుటయే! స్వకల్పనా శక్తిగల పురుషుడు ఎక్కడనైన చూపట్టెనేని, అట్టివాడు ఇతర దేశములయందు విద్య నేర్చి వచ్చిన వాడే గాని ఈ దేశమందు తయారైనవాడు కాదు. లేదా వారు ప్రాచీన విశ్వవిద్యాలయముల కడ కేగి మఱొకసారి తమ మూఢ విశ్వాసములను కడిగి వేసికొనిన వారై యుందురు. విద్య యనగా, మీ మెదడులోనికి చొప్పింప బడిన వార్తా రాశి కాదు. అది అక్కడ పడి ముఱిగి పోవును. కాని జీవిత కాలమంతయు వేచి యున్నను జీర్ణము కాదు. మనకు కావలసినది చైతన్యప్రదములును, పురుషనిర్మాణకుశలము లును, శీలనిర్మాణసమర్థములును అగు భావములను జీర్ణము చేసి కొనగల ప్రబోధమే. నీవు ఐదు భావములను జీర్ణము చేసి కొని వానిని నీ జీవనమునందును నీ శీలమునందును సారూ ప్యముపొందించు కొంటివేని, ఒక గ్రంథకోశము నంతను కంఠపాఠముగా వల్లె వేసినవానికంటె హెచ్చు విద్య వచ్చి నట్లే సుమీ! "యథా ఖరశ్చన్దనభారవాహీ భారస్య వేత్తా నతు చందనస్య — మంచి గంధపుచెక్కలను మోయు గాడిదకు, ఆ మంచిగంధపు చెక్కలయొక్క బరువే తెలియును గాని విలువ తెలియదు". అట్లే విద్య అనగా వార్తారాశిగా భావించిన యెడల గ్రంథకోశములే ప్రపంచము లోని కెల్ల ఉత్తమసిద్ధమూర్తులును, విషయసర్వస్వగ్రంథ

ములే మహాఋషులును అయి యుండును గదా! కావున మన దేశముయొక్క పారమార్థిక వ్యావహారిక విద్యయాధిపత్యమును మన చేతులలో పెట్టుకొని, జాతీయ పద్ధతుల ననుసరించి జాతీయములగు సదుపాయములతో సాధ్యమైనంత వరకు నడుప వలసి యున్నది. ఇది చాల పెద్ద ప్రణాళికయే; చాల పెద్ద ఉద్యమమే: సందియము లేదు. ఇది ఎన్నడైనను ఆచరణలోనికి వచ్చునో రాదో నాకు తెలియదు. కాని మనము పనిని ప్రారంభించి తీరవలయును. సరే, ఎట్లు? ఉదాహరణకు చెన్నపట్టణమును తీసికొనుడు. హిందువులకు మతము ప్రత్యేక విషయము గాన, మన కొక దేవాలయము కావలసి యుండును. అప్పుడు అన్ని సంప్రదాయముల వారును దానిని గురించి తగవు లాడుదురు గదా అని మీరు అడుగ వచ్చును. కాని మన మా దేవాలయమును సంప్రదాయపక్షపాతము లేని దానినిగా చేయుదము. 'ఓం' అనెడు విగ్రహమును మాత్రము అందుంచుదము. ఇది ఏ సంప్రదాయము వారైనను ఉత్కృష్ట విగ్రహముగా అంగీకరించునదే గదా. ఓంకారము అనెడువిగ్రహము పనికి రాదనెడు సంప్రదాయ మేదైన ఇక్కడ ఉండు నెడల దానికి హిందూసంప్రదాయమని చెప్పుకొను అర్హతయే లేదు. తమ సంప్రదాయమునకు అనుకూలించు తీరున హిందూమతమునకు వ్యాఖ్యానము చేయు అధికారము అందరికి కలదు. కాని మన కందరకును సామాన్యాలయము ఒకటి ఉండి తీరవలయును. నీ ఇష్టము వచ్చిన విగ్రహములను, ప్రతీకములను, నీవు ఇతరస్థలములయందు పెట్టుకొన

వచ్చును. కాని ఇక్కడ మాత్రము నీ అభిప్రాయమును అంగీకరింపని వారితో నీవు వాదులాడ తగదు. ఇక్కడ మనయందు గల వేర్వేఱు సాంప్రదాయిక శాఖలన్నిటికి సమానముగా ప్రామాణిక విషయములను బోధింప వలయును. మఱియు ఆ యా సంప్రదాయముల వారికి, ఇతర సంప్రదాయముల వారితో తగవులకు దిగరాదనెడు నియమమునకు లోబడి తమ తమ సిద్ధాంతములను బోధించుటకు స్వేచ్ఛ యుండవలయును. నీవు చెప్పగోరునది చెప్పుము. ప్రపంచము దానిని వినగోరుచున్నది. కాని ఇతరులను గుఱించి నీ అభిప్రాయ మేమియో వినుటకు ప్రపంచమునకు వ్యవధి లేదు. దానిని నీ లోపలనే యుంచు కొన వచ్చును. రెండవ విషయ మేమన, ఈ దేవాలయమునకు అనుబంధముగా బోధకులను సిద్ధము చేసెడు విద్యాలయము ఒకటి ఉండ వలయును. ఆ బోధకులు పోయి మన ప్రజలకు పారమార్థిక ధర్మమును లౌకిక ధర్మమును కూడ బోధించుచుండ వలయును. వారు ఈ రెండుపనులను చేయవలయును. మనము ఇదివఱకే ఇంటింటికి పోయి మత ధర్మవ్యాపనము చేయుచున్నాము. దానితోపాటు లౌకికధర్మప్రచారము కూడ చేయుదుము గాక. ఈపని తేలికగా జరుగును. ఆపిమ్మట ఈ బోధకులవలనను, ఈ గురువులవలనను, మన పని వ్యాప్తి కాంచగలదు. భారత దేశమందంతటను వ్యాపించునటుల ఇటువంటి దేవాలయములను నిర్మింప గలుగుదుము. ఇదియే నా కార్యవిధానము. ఇది బ్రహ్మాండ మంతటిదిగా కనుపింప వచ్చును. కాని ఇది మిక్కిలి అవసరము. డబ్బు ఎక్కడ

నుండి వచ్చును అని మీరు అడుగుదురు. డబ్బు అవసరమే లేదు. డబ్బు లెక్క లోనిది కాదు. నాజీవితములో కడచిన పంద్రెండు సంవత్సరముల నుండి ఎప్పటి కప్పుడు నాకు తిండి ఎక్కడ నుండి రాగలదో నాకు తెలియనే తెలియదు. అయి నను నాకవసరమగు డబ్బును సమస్తమును వచ్చియేతీరును. ఏలయన, అవి నాబానిసలు! నేను వానికి బానిసనుకాను. డబ్బుగాని మఱేదికాని రావలసినదే. వచ్చియే తీరును. అదియే నా ప్రతిజ్ఞ. తగిన పురుషులేరి? అది నాసమస్య. చెన్నపురి యువకులారా, నాఆశలు మీయందున్నవి! మీరు మీజాతియొక్క పిలుపును ఆలకింతురా? మీరు నామాటలను, నమ్మ సాహసింతురేని మీలో ప్రతివానికిని భావి కాలమున మహాదశ ప్రాప్తించి తీరును. నాకు చిన్నప్పు డెట్టి విశ్వాస ముండెడినో అట్టి విశ్వాసము, నేనిప్పుడు ఎటువంటి విశ్వాసమును అనుష్ఠించు చున్నానో అటువంటి విశ్వాసము, మహత్తర విశ్వాసము, మీలో కలదా? మీలో ప్రతివానియందును అటువంటి ఆత్మవిశ్వాసము ప్రకాశింపవలెను. ఆ సనాతన మహాశక్తి ప్రతిజీవి యందును నెలకొనియే యున్నది. మీరు ఈ భారతదేశము నంతను సంపూర్ణముగా ఉద్ధరింప గలరు. ఓహో! ప్రపంచమున గల ప్రతి దేశమునకును మనము పోనున్నాము! ప్రపంచము లోని ప్రతిజాతిని ఉద్ధరించుటకు ఉపకరించు అనేకశక్తులతో కలిసి మన బోధలు అచిరకాలములో పనిచేయనున్నవి. భారతదేశమునందును పరదేశమందును గూడ, ప్రతిజాతి యొక్క జీవనము నందును మన ప్రభావము ప్రవేశింప వలసి

యున్నది. ఈ కార్యసిద్ధిని సాధించుట కొఱకై మనము పని చేయవలయును. సరే, అందుకొఱకు యువకులు నాకు కావలయును. "తరుణ వయస్కులును, బలయుతులును, ఆరోగ్యవంతులును, సూక్ష్మబుద్ధిశాలులును మాత్రమే బ్రహ్మమును ప్రాపింప గల్గుదు"రని వేదములు ఘోషించు చున్నవి. మీ భావిభాగ్యోదయమును నిశ్చయించుకొనుటకు ఇదియే తరుణము. యౌవనముయొక్క జవసత్వములు మీకుండగనే మీరు నిశ్చయించు కొనవలయును. మీరు వృద్ధులై విసిగి వేసారి పోయినప్పుడు అటుల చేయజాలరు. యౌవనపు జవమును నవోజ్జ్వల తేజమును ఉండగనే మీ నిర్ణయమును తేల్చుకొనవలయును! కార్యధురీణులు కండు! ఇదియే తరుణము. ఎవరును తాకని, ఎవరును వాసన చూడని, నవ కోమల పుష్పములనే పరమేశ్వరుని పాదముల చెంత అర్పణము చేయ వలయును. అట్టి వానినే ఆ పరమే శ్వరుడు స్వీకరించును. కాబట్టి ఇప్పుడే మేల్కొనుడు. జీవితము అత్యల్పము. న్యాయవాదులగుట కంటెను, తగవు లాడుకొనుట కంటెను, అట్టి వాని కొఱకై ఆరాటపడుట కంటెను, సాధింపగల ఘనతర కార్యములు గలవు. మీజాతి శ్రేయస్సు కొఱకును, మానవకోటి నుద్ధరించుట కొఱకును, చేయు ఈత్యాగము మహోత్తమమైనది! ఈ జీవితములో ఏమున్నది? మీరు హిందువులు గదా! జీవుడు సనాతనుడు అనెడు సహజ విశ్వాసము మీలో కలదు. ఒక్కొక్క ప్పుడు తరుణవయస్కులు నాకడకు వచ్చి నాస్తిక వాద మును గుఱించి మాటాడ మొదలిడుదురు. హైందవుడు

ఎన్నడేని నాస్తికుడు కాగలడని నేను నమ్మజాలను. అతడు యూరోపియనులు వ్రాసిన పుస్తకములను ఎన్నిటినేని చదువును గాక; తాను జడవాదినని అనుకొను గాక; అది తాత్కాలిక వికారమే! అట్టి నైజము మీ రక్తమునందు లేదు. మీ తత్త్వమునందు లేనిదానిని మీరు నమ్మజాలరు. అట్టి మీ ప్రయత్నము వ్యర్థప్రయాసయే! అట్టి విషయమును గురించి ప్రయత్నము చేయకుడు. నా చిన్నతనములో ఒకప్పుడు అట్టి యత్నము చేసి యుంటిని. కాని అది పొసగునది కాదు. ఆయువు స్వల్పము. కాని ఆత్మ అవినాశి, నిత్యమైనది. మరణమో ధ్రువము. కాబట్టి పరమోత్తమాదర్శమునకు పూనుకొని మన యావజ్జీవమును అర్పణము చేయుదుము గాక. ఇదియే మన నిశ్చితమై వెలయుగాక. "పరిత్రాణాయ సాధూనాం...సంభవామి యుగే యుగే—నా భక్తులను సాధువులను, రక్షించుట కొఱకు ప్రతియుగమునందును అవతరించు చుందును" అని పలికి నటుల మన శాస్త్రము లెవనిని చెప్పుచున్నవో అట్టి శ్రీకృష్ణభగవానుడు మనల నాశీర్వదించి మనకు గమ్యార్థసిద్ధి కలుగు నటుల నడపు గాక!

దానము

శ్రీ స్వాములవారు చెన్నపురిలో నున్న కాలమున, ఒకానొక ధార్మికసంస్థ యగు చెన్నపురి అన్నదాన సమాజముయొక్క వార్షిక సభయందు అధ్యక్షత వహించిరి. ఒక

ఉపన్యాసకుడు శ్రీవారికంటె ముందుగ మాటాడుచు బ్రాహ్మణులకు ఇతర కులములవారి కంటె ప్రత్యేకముగా దానము లిచ్చుట తగదని చెప్పెను. ఆ పలుకులను శ్రీ స్వామివారు విమర్శించిరి. వాని సలహా వలన లాభము, నష్టము కూడ వాటిల్ల గలదని వారు తెలిపిరి. నిజమునకు మన జాతి యందున్న సభ్యత అంతయు బ్రాహ్మణులలోనే నెలకొని యున్నది. మన జాతియందలి జిజ్ఞాసువులుకూడ వారే. వారు జిజ్ఞాసువులగుటకు అవకాశమును కల్పించిన జీవనోపాధిని వారికి లభింపకుండ చేసిన యెడల మన జాతియే మొత్తము మీద నష్టపడును. ఇతర జాతుల యందలి న్యాయస్మృతి సంబంధమగు దానవిధానముతో మన భారత దేశమందలి విచక్షణశూన్యమగు దాన విధానమును పోల్చి శ్రీవారు ఇటుల చెప్పిరి. "ఇతర దేశీయు లవలంబించు దారిద్ర్య నివారణ పద్ధతుల ఫలితమును గమనింపుడు. మన దేశము లోని సోమరిపోతు, వానికి సంతోషముగా ఇచ్చిన దానినే సంతోషముతో పుచ్చుకొని సంతుష్టుడై ప్రశాంతముగ జీవించును. పశ్చిమ దేశము లందలి సోమరిపోతన్ననో, నరునికి తిండిమీది కంటె స్వాతంత్ర్యము మీది ప్రేమ హెచ్చు అనెడు సూత్రము ననుసరించి, దరిద్ర శరణాలయ మునకు పో నిష్టపడడు. దోపిడిగాడై సంఘమునకు శత్రు వగును. దండననీతి, రక్షకపద్ధతి (పోలీసు), కారాగార ములు (జైలు), ఇట్టివ్యవస్థలకు అతడు ఎంతయో అవసరము కల్పించినాడు. హిందూదేశములో విచక్షణ శూన్యమగు దానపద్ధతి కలదు, నిజమే. కాని యిక్కడి సన్న్యాసులు

నిష్కపట పురుషులు కాకున్నను, తమ సద్గ్రంథముల లోని విషయమును ఏకొంచెమో తప్పక నేర్చి తీరవల యును. లేకున్న ఒక పిడచ అన్నము కూడ వారికి పుట్టదు. పాశ్చాత్యజాతులందు విచక్షణయుతమగు దానపద్ధతి గలదు, నిజమే. కాని దానివలన దారిద్ర్య నివారణ శాసన మనెడు అతివ్యయ కారణమగు సంప్రదాయ మవసరమైనది. ఇంత చేసినను తుదకు వారు ముష్టివారిని అపరాధులనుగా మార్చిన వారైరి!"

కలకత్తాలో శ్రీ స్వాములవారి కర్పించిన స్వాగత పత్రము, దానికి శ్రీ స్వాముల వారొసగిన ప్రత్యుత్తరము :

శ్రీ వివేకానందస్వాములవారు కలకత్తాకు చేరి నప్పుడు ప్రజలు అత్యుత్సాహముతో శ్రీవారి కెదురేగి గౌరవించిరి. శ్రీవారు చక్కగ అలంకరింప బడిన ఆ నగర వీథుల గుండ పోవునప్పుడు శ్రీవారి నొక్కసారి కనులార చూచిన చాలునని ఆతురపడుచు ఆబాలగోపాలము మార్గ మంతయు క్రిక్కిరిసి పోయెను. వారము దినములు గడచిన పిమ్మట శోభాబజారులోని కీ. శే. రాజా రాధాకాంత దేవ బహాదూరు వారి నివాసము నందు శ్రీవారికి బహిరంగ స్వాగత సత్కారము కావింపబడినది. అప్పుడు రాజా వినయ కృష్ణదేవ బహాదూరుగారు అధ్యక్షత వహించిరి. అధ్యక్షులు కొలది పరిచయ వాక్కులు పలికిన పిమ్మట, ఈ క్రింది స్వాగతపత్రమును చదివి ఒక రజత పేటిక యందు అమర్చి శ్రీవారి కర్పించిరి.

శ్రీమత్ వివేకానంద స్వాములవారికి

ప్రియసోదరా!

మీ జన్మభూమికి మీరు తిరిగి విజయము చేయు ఈ సమయమున, కలకత్తా నగరమునకును ఇంక వంగదేశ మందలి ఇతర ప్రాంతములకును చెందిన హిందువులమగు మేము కృతజ్ఞతతోడను, గర్వముతోడను ప్రేమపూర్వక ముగా స్వాగత మర్పించు చున్నాము. ప్రపంచమునందలి అనేక ప్రదేశములందు మీరు కావించిన ఘనకార్యము వలనను, మీ ఉత్తమాదర్శమువలనను, మన మతమునకును మన దేశమునకును అందునను ముఖ్యముగా మన రాష్ట్ర మునకును మహాగౌరవము కలిగినది.

1893–వ సంవత్సరములో చికాగో నగరమున విశ్వ ప్రదర్శన సందర్భమున జరిగిన మతమహాసభయందు మన ఆర్యుల మతధర్మములను మీరు విశదపఱచి యుంటిరి. మీరు కావించిన వివరణముయొక్క సారాంశము శ్రోతలలో అత్యధిక సంఖ్యాకులకు దివ్యాదేశమైనది! శైలివలననేమి, భావపటుత్వమువలననేమి, ఆ సందేశ సరళి వారిని తన్మయుల చేసివేసినది. కొందఱు సంశయాత్ములై విని యుండవచ్చును; కొందఱు దానిని విమర్శించి యుండవచ్చును. కాని దాని వలన విజ్ఞానవంతులగు అమెరికనులలో చాల మంది మత భావముల విషయమున పూర్తిగా మారిపోయిరి. వారి హృదయాకాశమున నూతన తేజస్సు ఉదయించినది. త

సహజశ్రద్ధతోడను, సత్యపరాయణత తోడను, మీ సందేశముయొక్క పూర్ణ ఫలమును పడయుటకు వారు నిశ్చయించుకొనిరి. దానితో మీ ప్రబోధావకాశములు విశాలతరములైనవి; మీ కార్యక్రమము వ్యాప్తి చెందినది. అనేక రాష్ట్రములనుండి అనేక నగరములనుండి వచ్చు ఆహ్వానములను మీరు అంగీకరింపవలసి వచ్చినది. అనేక ప్రశ్నలకు సమాధానముల నిచ్చుచు, అనేక సంశయములను తీర్చుచు, అనేక సమస్యలను పరిష్కరించుచు వచ్చితిరి. ఈ కార్యములెయు మీరు మహత్తర శక్తితోడను, సామర్థ్యముతోడను, నిష్కాపట్యము తోడను నిర్వహించితిరి. అందువలన శాశ్వతఫలములు చేకూరినవి. మీ బోధ అమెరికను కామన్వెల్తు నందలి అనేక విద్వత్సంఘముల మనస్సున గాఢముగ నాటి, వారి జిజ్ఞాసను పరిశోధనాభిలాషను పురికొల్పినది. అనేక సందర్భములందు వారి మతభావములు స్పష్టముగు పరివర్తనమును చెందినవి. భారతీయుల ఆదర్శముల యెడ వారికి గౌరవము అతిశయించినది. మతములను పరస్పరమును పోల్చి పరిశీలించుటకును, ఆధ్యాత్మికధర్మములను పరిశోధించుటకును పెక్కుక్లబ్బులు, సమాజములు నెలకొల్పబడి సత్వరముగా వృద్ధిగాంచినవి. ఆ దూర పాశ్చాత్య భూమియందు మీరు కావించిన కృషికి అవియెల్ల సాక్షులు. లండను నగరమున వేదాంతతత్త్వశాస్త్ర బోధకై ఏర్పడిన ఒక కళాశాలను నిజమునకు మీరే నిర్మించితిరనవచ్చును. అందు మీరు పరంపరగా ఒసగిన ఉపన్యాసములను వినుటకై ఎందరో ఆతురపడుచు వచ్చి విని విశేష

ముగా అభినందించియుండిరి. వానిమహిమ, ఆ ఉపన్యాస భవనముల ఆవరణమును దాటి చాలదూరము వ్యాపించినది. మీరు లండను నగరమును విడిచివచ్చు తరుణమున, ఆ నగరము నందలి వేదాంత శాస్త్రపాఠకులు మీకు సమర్పిం చిన వినతి పత్రమునందు చూపిన ప్రగాఢకృతజ్ఞత వలన వారి మనస్సులందు మీ బోధ ఎట్టిప్రేమను ఎట్టి గౌరవమును ఉదయింపజేసెనో తెల్లమగుచున్నది.

ఆర్యుల మత ధర్మసూత్రములతో మీకు గల గాఢ తర పరిచయమును, వాగ్రూపమునను గ్రంథరచనా మూల మునను భావప్రకటనము చేయుటలో మీకుగల సామర్థ్య మును, ముఖ్యముగా మీ శీల మహిమయును, మతబోధకు లుగా మీరు సాధించిన విజయమునకు కారణములు. మీ ఉపన్యాసములు, మీవ్యాసములు మీ గ్రంథములు, ఆధ్యా త్మికముగను, భాషావిషయకముగను అద్భుత ప్రభావము గలవి. అవి యిక మహాఫలముల నొసంగకుండు టెట్లు? ఐనను నిరాడంబరమును, నిష్కపటమును, త్యాగపూరిత మును అగు మీ శీలము, మీ జీవితాదర్శము, మీ వినయ సంపత్తి, మీ భక్తి, మీ దీక్షాపరాయణత, ఆ మహిమకు, వాక్కుతో వర్ణింపజాలని విధమున వన్నె తెచ్చినవి.

మన మతములోని సూక్ష్మధర్మములను ఉపదేశించి మీరు కావించిన లోకోపకారమునకు మాకృతజ్ఞతను తెలుపు నీసమయమున, మీ గురుదేవుడగు శ్రీరామకృష్ణ పరమహంసలవారిని సంస్మరించి సభక్తికముగ సంభావించు

చున్నారము. మిమ్ము మాకు ప్రసాదించినదియు వారే. మీలోగల దివ్యతేజమును, అసాధారణమగు అద్భుత పూర్ణాత్మదృష్టితో ముందుగనే కనిపట్టి వారు మీభవ్య జీవిత విశేషముం గూర్చి జోస్యము చెప్పియున్నారు. ఓహో! అది యిప్పుడు సాక్షాత్కారమునకు వచ్చుచుండు టెంతయు ఆనందదాయకముగ నున్నది. భగవంతుడు మీకు ప్రసాదించిన ఆత్మదృష్టిని, దివ్యశక్తిని ప్రకాశమునకు తెచ్చిన మహనీయుడు ఆయనయే. ఆయన పవిత్రామోదము కొఱకై నిరీక్షించుచున్న మీసంకల్పములకును, ఆశయములకును, క్రమగతిని ప్రసాదించి అదృశ్యజగమున మీ పరిశోధనలందు తోడుగ నిలిచి దారి చూపినదియు ఆ మహాపురుషుడే. భావిసంతానమునకు ఆయన యిడిన దివ్య ప్రసాదమే మీరుగా మూర్తీభవించినది !

మహాత్మా, సుస్థిరముగ మీరు ఏర్పఱచుకొనిన దివ్యమార్గమందు ధీరతతో సాగిపొండు ! మీరు జయింపవలసియున్న ప్రపంచ మొకటి గలదు. అజ్ఞానులకును, సంశయాత్ములకును, బుద్ధిపూర్వకముగ కన్నులు మూసికొనువారికిని, భారతీయుల మతధర్మమును విప్పి చెప్పి దాని గౌరవమును మీరు నిలువ బెట్టవలసి యున్నది. మా అభిమానగౌరవముల మూలగాను తెలుగున ధీరులరై పనిచేయ మొదలిడితిరి. మీ రిప్పటికే సంపాదించిన విజయములకు అనేక దేశములు సాక్ష్యము పలుకుచున్నవి. కాని చేయవలసినది ఇంకను చాల గలదు. మన మాతృదేశమగు ఈ భారతభూమి మీ

పైని ఆశలు పెట్టుకొని యున్నది. భారతీయుల మతధర్మ మును భారతీయులలోనే అనేకులకు విప్పి చెప్పి బోధింపవలసి యున్నది. అట్టి గురుతర కార్యమునకు మీరు సంసిద్ధతతో పూనికవహింపుడు. మీయందును, మన ఉద్యమముయొక్క సన్మహిమము నందును, మాకు సంపూర్ణ విశ్వాసముకలదు. మన జాతీయమతము భౌతిక విజయమును సాధింప జూచుట లేదు. దాని గమ్యస్థానము పారమార్థికము. జడమతుల కన్నులకు కానరాక, జిజ్ఞాసువులకు ప్రత్యక్షమగు సత్య తత్త్వమే మనమతముయొక్కదివ్యాయుధము. ప్రపంచమును, అవసరమగుపట్ల భారతీయులను సైతము, వారి అంతర్దృష్టిని సారించి, ఇంద్రియానుభవములకు అతీతముగ నిలిచి, పవిత్ర శాస్త్రగ్రంథములను విధ్యుక్తమార్గమున పఠించి, పరమార్థ మును ప్రత్యక్షము చేసికొని, మానవులై పుట్టిన తమస్థితిని, తమ పరమావధిని, తెలిసికొనుడని మీరు హెచ్చరింతురు గాక. అట్టి ప్రబోధము చేయుటకును, అట్టి హెచ్చరికను కల్పించుటకును, మీకన్న అర్హులు ఇతరులు లేరు. భగవ న్నిర్ణీతమై చూపట్టు ఈ మీ మహోద్యమమున హృదయ పూర్వకముగా సానుభూతిని చూపుటకును, కార్యసాధన యందు నిష్కపటముగ తోడ్పడుటకును సిద్ధముగ నుంటిమని ప్రియసోదరా, ఇటుల మనవి చేసి కొనుచున్నాము.

ఇట్లు,

తమ అనుంగు మిత్రులు, భక్తులు.

శ్రీస్వాములవారు ఈక్రింది తెలుగున ప్రత్యుత్తరమొసగిరి.

వరుసు వ్యక్తిత్వమును బాసి సమష్టితత్త్వమున కలిసి పోవ కాంక్షించుచుండును. అతడు సర్వసంగపరిత్యాగము గావించి పరుగిడిపోవ జూచును. శారీరక సంబంధముల నన్ని టిని ఒక్కుమ్మడిగా త్రెంపివేయ చూచును. గతమును మఱచి, తానొక మానవుడ నను మాటను సైతము విస్మరించుటకు ప్రయత్నించును. అట్లయ్యును వాని హృదయాంతరాళ మున, ఒక సూక్ష్మధ్వని, ఒక విచిత్ర తంత్రీస్పందనము, ఒక రహస్యవాణి, పాశ్చాత్య ప్రపంచమందుగాని, ప్రాచ్య ప్రపంచమందుగాని 'స్వస్థానము స్వర్గతుల్య'మని ఘోషించు చుండును. సామ్రాజ్యప్రధాన నగరవాసులారా! నేనిప్పుడు మీా ఎదుట నిలుచునది ఒక సన్న్యాసిగా కాదు ; మత బోధ కుడనుగా కూడ కాదు. మున్ను మీాతోడ ముచ్చటలాడుచు తిరుగు లాడిన కలకత్తా కుఱ్ఱడుగనే మీాయెదుటికి వచ్చు చున్నాను. ఓహో, నాచిన్ననాటివలెనే స్వేచ్ఛగా ఈ నగరవీథులందు ధూళిలో కూర్చుండి నాయన్నలారా, నా మనస్సున నున్న దానిని మీాకు విప్పిచెప్పుట నా కెంతయు ఆనందకరము! మీారు 'సోదరా' అనెడు సాటిలేని ప్రేమ లొల్కు పదముతో నన్ను సంబోధించినందులకు హృదయ పూర్వక వందనములను మీాకు అర్పించు చున్నాడను. ఓహో, నిజముగా నేను మీాసోదరుడనే గదా! అట్లే మీారును నాకు సోదరులు! నేను ఇక్కడికి బయలు దేరి వచ్చునపుడు ఆంగ్లమిత్రుడొకడు "స్వామీా! సర్వభోగ సమన్వితమును, మహాతేజోవిరాజితమును, అసదృశశక్తిమంత

మును అగు ఈ పాశ్చాత్యప్రపంచమున గడించిన నాలు గేండ్ల అనుభవముతో మీ మాతృదేశమున కిప్పుడు మరలుట మీకెట్లున్నది?" అని ప్రశ్నించినాడు. "నే నక్కడ నుండి బయలుదేరి రాక పూర్వము నేను భారతదేశమును ప్రేమించి యుంటిని. ఇప్పుడు ఆ భారతదేశపు ధూళిసైతము పరమపావనమై నాకు గోచరించుచున్నది. అచ్చటి గాలియే నాకు పరమ పవిత్రమై చూపట్టుచున్నది! ఆ దేశమిప్పుడు ప్రియతమ యాత్రాస్థానముగా, తీర్థక్షేత్రముగా కాన్పించు చున్నది!" అని ప్రత్యుత్తర మిచ్చితిని. కలకత్తా నగర వాసులారా! నా అనుంగు సోదరులారా! మీరు నాయెడ చూపుచున్న ప్రేమకు తగినరీతిని నాకృతజ్ఞతను మాటలతో తెలుపజాలను. ఇంతేల, మీయెడల నా కృతజ్ఞతను తెలుప యత్నింపనే కూడదేమో! ఏలయన మీరు నా సోదరులు గదా! మీరలు విధిగా నిర్వహింప దగిన సోదరధర్మమును నిర్వహించుచున్నారు. ఔను, ఇది భారతీయులకు సహజమగా ధర్మమే గదా! ఇటువంటి కుటుంబబాంధవములు, ఇటువంటి బంధుత్వములు, ఇటువంటి అనురాగము, మన మాతృదేశపు సరిహద్దులను దాటినచో మరెక్కడను కాన రావు.

మతమహాసభ బ్రహ్మాండకార్య మనుటకు సందియము లేదు. ఆ సభను ఏర్పాటుచేసిన పెద్ద మనుష్యులను ఈ దేశమందలి వివిధనగరములనుండి మనము అభినందించియుంటిమి. వారు మన యెడల చూపిన ఆదరణనుబట్టి మనకు వందనీయులే; కాని ఆ మహామతసభయొక్క చరిత్రను ఒకింత

మీకు తెల్పెదను వినుడు. వారు ఒక గుట్టమును తెచ్చి దానిపై నెక్కి స్వారిచేయ కాంక్షించిరి. క్రైస్తవేతర మూఢ జనులను చేర్చి ఒక విధమగు ప్రదర్శనము కావించుటకు ఉబలాటపడిరి. కాని వారు కోరుకొనినది ఒకటి, జరిగినది మఱియొకటి! అటులకాక తప్పినది కాదు. వారిలో చాల మంది ఆదరభావము గలవారే; అందుకై వారికి కావలసి నన్ని వందనములను మనము సమర్పించి యున్నాము.

అమెరికాలోని నా కర్తవ్యము మహామతసభకు సంబంధించినదే కాదు. అది ఆనుషంగికము, అనగా నా మార్గములో సంఘటిల్లిన ఒకానొక విషయము. అది నాకొక అవకాశమును కల్పించినది. అందులకు ఆ సర్వమతపరిషత్ సభ్యులయెడ మనము సదా కృతజ్ఞులమై యుందుము గాక! కాని నిజముగా మనము వందనముల నర్పించ వలసినది ఆ అమెరికను మహాజాతికి! తక్కిన చోట్లకంటె అక్కడ సోదర భావము పూర్ణవికాసము పొందియున్నది. మీరు రైలు బండిలో ఒక అమెరికాదేశీయుని ఐదు నిమిషములపాటు కలిసికొనుడు, చాలును. అతడు మీ స్నేహితుడై పోవును. మరుక్షణమే అతిథిగా తనయింటికి రమ్మని ఆహ్వానించును. అక్కడ దాపఱికములేక తన జీవితసరళిని సర్వమును నీకెఱుక పఱచును. అమెరికను జాతియొక్క శీలలక్షణము ఆ తీరున నున్నది. అది మనకు చాల హృద్యముగనుండును. వారు నాయెడ చూపిన ప్రేమను నేను వర్ణించి చెప్ప జాలను. ఎంతటి అద్భుతాదరణతో వారు నన్నుచూచిరో

తెలుపుటకు నాకు కొన్ని సంవత్సరముల కాలము పట్టును. కాబట్టి ఆ మహాజాతికి మనము వందనముల నర్పింప వలసి యున్నది. నాకంటె ఇంగ్లీషువారి యెడల జాతినిబట్టి ఎక్కువ ద్వేషముతోనిండినహృదయముతో మఱెవరును ఆంగ్లభూమి యందు అడుగిడి యుండరు. ఇరుగో ఈ యున్నతాసనమున కూర్చుండిన ఆంగ్లమిత్రులు ఆవిషయమునుగూర్చి సాక్ష్యము చెప్పగలరు. నేను వారిమధ్య నివసించిన కొలది, ఆంగ్ల జాతీయ జీవన మనెడు ఆ మహాయంత్రము ఎటుల పని చేయునో నేను చూచిన కొలది, నేను వారితో కలిసి పోయిన కొలది, ఆ జాతియొక్క హృదయనాడి ఎచ్చట గలదో నేను కనుగొన గలిగితిని. అప్పుడు నేను వారిని మిక్కిలిగా ప్రేమించితిని. సోదరులారా! ఇక్కడనున్న మీలో ఎవరును నాకంటె ఎక్కువగా ఇప్పుడు ఇంగ్లీషు వారిని ప్రేమింపజాల రనుకొందును. అక్కడ ఏమి జరుగు చున్నదో మీరు చూడ వలయును. మీరు వారితో కలసి మెలసి యుండవలయును. తత్త్వశాస్త్రము, ముఖ్యముగా మనజాతీయ వేదాంత తత్త్వశాస్త్రము, కొద్దిలో చెప్పు నటుల, మన సర్వదుఃఖములకు మన పరితాపములకు కార ణము, ఏకైక కారణము, అజ్ఞానమే! ఇక్కడ మనకును ఆంగ్లేయులకును మధ్య పొసగు కష్టముల కన్నిటికిని ముఖ్య ముగా అజ్ఞానమే కారణమని గ్రహింపవలసి యున్నది. మనమువారి నెఱుగము; వారు మనలను ఎఱుగ కున్నారు. దురదృష్టవశమున పారమార్థికత, ఇంతేల నీతి వర్తనము కూడ, లౌకిక సంపదతో ముడివేయబడి యుండునని

పాశ్చాత్యులభావము. కాబట్టి ఆంగ్లేయుడు గాని లేక ఇతర పాశ్చాత్య దేశీయుడు గాని మన దేశమున అడుగిడిన తత్క్షణమే దారిద్ర్యముతోడను, దుఃఖముతోడను నిండిన దేశము వాని కంటబడును. అంతట ఇక్కడ మత మనునదియే లేదనియు, నీతివర్తనము సైతము ఉండజాలదనియు అతడు వెంటనే నిశ్చయించుకొనును. సత్యముగా వాని అనుభవము అట్టిదిగనే యుండును. యూరపునందు, దుర్భరమగు శీతోష్ణ స్థితిని బట్టియు, ఇంకను అనేకములగు ఇతర కారణముల చేతను, దారిద్ర్యము, దుష్టవర్తనము పెనవేసికొని పోయినవి. భారతదేశమున అటుల లేదు. అందుకు మారుగా ఈ దేశమున ఒకపురుషుడు దరిద్రుడైన కొలది నీతివర్తనమున మేటి యగు చుండుట నా అనుభవములో నున్నది. ఈ విషయము గ్రహించుటకు చాలకాలము పట్టును. విదేశ ప్రజలలో ఎందఱు దీనిని అర్థము చేసికొనుటకు, భారతదేశ జాతీయజీవనము యొక్క ఈ రహస్యమును గుర్తెఱుగుటకు ఓపిక పట్టగలరు! ఈ జాతిని పరిశీలించి అర్థము చేసికొనుటకై అంతటి ఓపిక పూనగలవారు చాల కొలదిమందియే యుందురు. ఇక్కడ మాత్రమే, ఈ జాతియందుమాత్రమే, దారిద్ర్యమనగా దోషవర్తనము కాదు: దారిద్ర్యమనగా పాపజీవనముకాదు. దారిద్ర్యమనగా దుష్టవర్తనము కాకుండుటయే గాక, ఆ దారిద్ర్యమే దివ్యలక్షణమై పోయి దరిద్రుడు ధరించు కౌపీనము దేశములోని పరమశ్రేష్ఠుడు ధరించు దివ్యాంబరముగా నెంచెడు ఏకైక జాతి ఇక్కడ మాత్రమే కలదు. ఇదేవిధముగా మనముకూడ పాశ్చాత్యుల

సాంఘికాచారములను ఓపికతో పరిశీలింప వలసియున్నది. మనము వారిని గుఱించి వేగిరముగా పిచ్చి పిచ్చి అభిప్రాయములను వెలువరించుట తగదు. వానిని పరిశీలించుటకు తగిన ఓపిక మీకున్నయెడల, వారిలో స్త్రీపురుషులు కలిసి మెలగుట, భిన్నభిన్నములగు వారి ఆచార మర్యాదలు అన్నియు సార్థకములే యని మీకు తెలియవచ్చును. వాని అన్నిటికిని ఉత్తమపక్షము గలదు. ఐనను వారి ఆచార మర్యాదలను మనము అవలంబింప వలయునని గాని, మన వానిని వారు అవలంబింప వలయునని గాని, నా అభిప్రాయము కాదు. జాతియొక్క ఆచారమర్యాదలు ఆజాతిలో శతాబ్దముల తరబడి క్రమముగా పెరిగి వచ్చియుండును. ప్రతిదానికిని వెనుక గొప్ప ప్రయోజనముండును. కాబట్టి వారు మన ఆచార మర్యాదలను గాని, మనము వారి ఆచార మర్యాదలను గాని హేళన చేయతగదు.

ఈ సభ ఎదుట ఇంకొక విషయము తెలుప గోరుచున్నాను. ఇంగ్లాండులో నేను చేసిన పని అమెరికాలో చేసినదానికంటె నాకు ఎక్కువ తృప్తికరముగా నున్నది. ఇతరజాతులవారి మేధాశక్తికంటె ఆంగ్లేయుని మేధాశక్తి అధికమైనది. ధైర్యశాలియు, సాహసికుడును, దీక్షాపరుడును అగు ఆంగ్లేయుని మెదడులో ఒక సంకల్పము ఏదేని ఒకసారి నాటుకొనిపోయిన యెడల అది యెన్నడును ఇక జారిపోదు. అత్యంతము కార్యపరతంత్రమగు ఆ జాతియొక్క సమర్థత దానిని పెంపొందజేసి సత్వరఫలమొసంగునటుల చేయును.

ఇతర దేశములలో అట్లుకాదు. అట్టి తీవ్రకార్యపరతయు, సునిశితమగు జాతీయ చైతన్యమును మఱెక్కడను కాన్పింపదు. వారియందు ఊహారచన తక్కువగను కార్యధురీణత హెచ్చుగను నున్నవి. ఆంగ్లపురుషుని హృదయముయొక్క జీవధార యెవరికి గోచరము కాగలదు? ఎంతటి భావనాశక్తి కలదో, ఎంతటి అనుభూతి కలదో ఎవరికి ఎఱుక? వారిది వీరులజాతి; వారు సత్యముగ క్షత్రియులు. తమభావములను గుప్తముగ నుంచి ఎన్నడును వెలువరింప కుండుట వారివిద్య; వారు బాల్యమునుండి అటువంటి శిక్షణమునే పడయుదురు. ఆంగ్లపురుషుడు భావోద్రేకమును వెలువరింపగా చూడగల్గుట అరుదు. ఆంగ్లస్త్రీ కూడ అట్టిదియే. ఆంగ్లస్త్రీలు పనులకు పోవుతరి, మహాసాహసులగు వంగదేశీయులుకూడ అనుకరింప జంకునంతటి వీరకార్యములు చేయగా నేను చూచితిని. అయినను, శౌర్యసూచకమగు ఈ బాహ్యాకారము ఎంతటిదిగ నున్నను, ఈ యోధాకృతికి వెనుక ఆంగ్లేయజాతియొక్క హృదయములో గొప్ప దాక్షిణ్యభావనిధి మఱుగుపడి యున్నది. నీ వొకసారి దానిని చేరుటకు మార్గము తెలిసికొని అక్కడకు చేరితివా, ఆంగ్లేయునితో నీవు సహవాసముచేసి స్వయముగా వానితో కలిసి పోగలిగితివా, అతడు తనహృదయమును తెఱచును. ఇక నీకతడు శాశ్వతమిత్రుడే; నీ దాసుడే అయిపోవును! కాబట్టి ఇంగ్లాండులో నేను చేసినపని తక్కిన తావులందు కంటె ఎక్కువ తృప్తికరముగా నున్నదని నా అభిప్రాయము. రేపు నేను మరణింపనున్నను, ఇంగ్లాండులో నేను ప్రారంభించిన

పని నాశ మందక నిరంతరము వృద్ధిగాంచుచునే నడవ గలదు.

సోదరులారా! మీరు నా హృదయమునందు మహోక భావమును, అత్యంతగంభీరభావమును మేల్కొల్పితిరి. మీరు నా గురువుయొక్క, నా స్వామియొక్క, నా నాయకునియొక్క, నా పరమాదర్శముయొక్క, నా సజీవదైవతము యొక్క, శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణపరమహంసలయొక్క నామమును సంస్మరించితిరి. తలపులతోడగాని, మాటల తోడగాని, చేతలతోడగాని, నేను ఏమేని సాధించి యున్నచో, ప్రపంచమునకు ఉపయోగకరమగు ఒక్క పలుకేని నా పెదవులనుండి వెలువడి యున్నచో, అదంతయు శ్రీవారిదే; నాయది అనజాలను. కాని నా పెదవులనుండి శాపములు వెలువడినయెడల, నా హృదయమునుండి ద్వేషము పొరలినయెడల, అదంతయు నాదే; శ్రీవారిది కాదు. దుర్బలమగు సమస్తము నాదియే. ఉజ్జీవకరమును బలవర్ధకమును నిర్మలమును పావనమును అగు సర్వమును శ్రీవారి ప్రేరణమే, శ్రీవారి భాషణమే; సర్వమును శ్రీవారిదే. మిత్రులారా! ప్రపంచము ఆ మహాపురుషుని ఇంకను తెలిసికొనవలసియున్నదనుట సత్యము. ప్రపంచ చరిత్రయందు మహాత్ముల గుఱించియు వారి జీవితముల గుఱించియు కథలను చదువుచున్నాము. ఇవన్నియు శతాబ్దముల తరబడి వారి వారి శిష్యుల వ్రాతలను చేతలను ఆధారము చేసికొని మనకు చేరుచున్నవి. వేలకొలది సంవత్సరములుగా చెక్కి చెక్కి ఆకారము కల్పించిన ఈ

ప్రాచీన మహాప్రవక్తల జీవితములు మనకు లభించుచున్నవి. ఇంత జరిగినను, నేను స్వయముగా ఎవరిని నా కన్నులతో చూచి యున్నాడనో, ఎవరినీడను నేను జీవించియున్నాడనో, ఎవరిపాదములచెంత నేను సమస్తము నేర్చుకొంటినో, అట్టి శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణపరమహంసలవారి జీవితముతో పాటి రాదగినంతటి దివ్యతేజోమయజీవితము ఒక్కటేని లేదని నా అభిప్రాయము. ఓహో మిత్రములారా! గీతలోని ఈ సుప్రసిద్ధ వాక్యము మీ కందరకు తెలిసియుండును.

యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

"అధర్మమునకు వృద్ధియు ధర్మమునకు నాశనమును, ఓ భారతపుత్రా! ఎప్పుడెప్పుడు కలుగుచుండునో అప్పుడప్పుడు నేను అవతరించుచుందును. సాధువుల రక్షించుటకొఱకును దుష్టుల శిక్షించుటకొఱకును ధర్మమును తిరిగి స్థాపించుటకొఱకును ప్రతియుగమునందును నేను పుట్టుచుందును" అని దీని యర్థము.

దీనితోపాటు మీరు ఇంకొక విషయమును గ్రహింపవలసియున్నది. అట్టి విషయమొకటి నేడు మన కన్నులయెదుట గోచరించుచున్నది. అధ్యాత్మ సాగరమున మహాతరంగ మొకటి బయలు వెడలి వచ్చుటకు పూర్వము సంఘమునందు ఎల్లెడలను చిన్న చిన్న సుడులు కాన్పించు

చుండును. అట్టివానిలో నొకటి లేచి మొదట, ఎవరికిని తెలియరాక, ఎవరికిని కాన్పింపకుండ, ఎవరి ఊహకును చిక్కకుండనే విజృంభించి, తక్కిన చిన్న చిన్న సుడుల నన్నిటిని మ్రింగివేసి తనలో జీర్ణము చేసికొనెనో యనునటుల పెరిగి, పెద్దదై, మహాతరంగరూపము తాల్చి, ఎవరికిని నిలువరింప సాధ్యముకానంతటి మహాశక్తితో సంఘముపై పడును. అట్టిది మన కన్నుల యెదుట జరుగుచున్నది. కన్ను లున్నచో మీ కది కాన్పించును. మీ హృదయము వికసించియున్నయెడల దానిని స్వీకరింతురు. మీరు సత్యా న్వేషులైతిరేని మీ కది దొరకును. సూర్యోదయపు జాడలను చూడజాలనివాడు గ్రుడ్డివాడే, నిజముగా కన్నులు లేనివాడే. ఓహో! మీ రెన్నడు విని యెున నుండని ఒక దూరపు పల్లెలో ఒక బీద బ్రాహ్మణ కుటుంబమున జన్మించిన ఈ బాలుడు అనేక శతాబ్దముల నుండి 'మూర్తిపు పూజలను' ఖండించుచు ప్రేలుచుండిన విదేశములలో ఈ నాడు యథార్థముగా అర్చనములను పడయుచున్నాడు. అది యెవరి శక్తి? అది మీదియా నాదియా? అది శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణపరమహంసల రూపమున అవతరించిన దివ్యశక్తి తప్ప అన్యము కాదు. ఏలయన మీరును, నేనును, మహా ఋషులును, ప్రవక్తలును, ఇంతేల అవతారములు సైతము, చివరకు ఈ బ్రహ్మాండమంతయు కూడ, ఘనీభూతమై మానవ రూపముదాల్చిన ఆ మహాశక్తియొక్క అంశమూర్తులే! ఇచ్చట నేడు ఒక మహాశక్తి అభివ్యక్తమగుచున్నది. దాని యొక్క ప్రారంభ కార్యములను మాత్రమే మనము చూడ

గలుగుచున్నాము. ఈ తరము గడచి పోక పూర్వమే ఆ శక్తియొక్క విచిత్ర కార్యములను ఇంకను హెచ్చుగా మీరు చూడగల్గుదురు. భారతదేశమున సదా పనిచేయు చుండవలసియున్న ఆ చైతన్యశక్తిని మనము మఱచుచు వచ్చుచున్న కారణమున, భారతదేశము నుద్ధరించుటకై ఈ తరుణమున ఆ మహాశక్తి అవతారము తాల్చినది.

ప్రతిజాతికిని దాని ప్రత్యేకలక్షణమగు ఒక కార్య విధానము ఉండును. కొందఱు రాజ్యతంత్రము ద్వారము నను కొందఱు సంఘసంస్కరణముల ద్వారమునను మఱి కొందఱు వేఱువిధానములతోడను పనిచేయుదురు. మనమో మతమును మాత్రమే ఆధారము చేసికొని కదలగలము. ఆంగ్లేయుడు రాజనీతిద్వారమువనే మతధర్మమును సైతము గ్రహింపగల్గును. అమెరికాదేశీయుడు సంఘసంస్కరణ ద్వారముననే మతధర్మమును సైతము తెలిసికొనజాలును. కాని హిందువన్ననో, రాజనీతిని సైతము మతద్వార ముననే గ్రహింపగల్గును. సంఘధర్మము సైతము మతద్వారముననే రావలయును. హిందువునకు సర్వ మును మతద్వారముననే రావలసియుండును. ఏలయన అది వాని గానమునకు పల్లవి. వాని జాతీయజీవితగానము నందు తక్కినవన్నియు రాగభేదములుగ నుండును. దానికి ఆపద వాటిల్లినది. మన జాతీయ జీవితమునందలి ఈ పల్లవిని మార్చబోవుచున్నట్లున్నాము. మన శరీరమునకు ఆధార మగు వెన్నెముకను మార్చ చూచుచున్నట్లున్నాము. ఆధ్యాత్మికమగు మన బ్రహ్మాదండమును తొలగించి దాని

స్థానమునందు రాజకీయమగు బ్రహ్మదండమును నిలుపుటకై యత్నించుచున్నాము. అందు మనము కృతకృత్యులమైన యెడల దాని మూలమున మనకు వినాశమే చేకూరి యుండెడిది. ఆ ఆపద తొలగినది. కావుననే ఈ దివ్యశక్తి అవతరించినది. ఈ మహాపురుషుని మీరెటువంటి దృష్టితో గ్రహింపజూచినను నేను సరకుగొనను. మీరు ఆయనయెడ ఎంతటి గౌరవము చూపుదురో అను విషయము లెక్క లోనిది కాదు. భారత దేశమున అనేక శతాబ్దములకు పిమ్మట నేడు ఈ మహాద్భుత దివ్యశక్తి అవతరించి వచ్చెనని నేను యథార్థముగా ముఖాముఖిని ప్రతిజ్ఞ చేసి చెప్పు చున్నాను. హిందువులగుటచేత మీరా శక్తిని పరిశీలించి తెలిసికొని భారత దేశముయొక్క క్షేమము కొఱకును పునరుద్ధరణము కొఱకును దానిమూలమున అఖిల మానవ కోటియొక్క శుభము కొఱకును ఏమి జరుగుచున్నదో తెలిసికొనుట మీ విధి. ఓహో! ప్రపంచమందలి ఏ దేశమందుగాని విశ్వమతభావములనుగూర్చియు, విశ్వ మానవసౌభ్రాత్రమునుగూర్చియు వాదోపవాదములు జరుగు టకు చాలముందుగనే, ఇచ్చట ఈ నగర సమీపమున తన జీవితమంతయును నానామతమహాసభగా ఒక మహా పురుషుడు గడిపియుండెను సుడీ!

మన శాస్త్రములలో చెప్పబడిన పరమోత్తమ గమ్యార్థము నిర్గుణపరబ్రహ్మము. ఆ నిర్గుణపరబ్రహ్మదర్శ మును ప్రాపింప గలుగునట్టి ఉత్తమార్హత మనలో ప్రతి వానికిని భగవదనుగ్రహమువలన లభించుగాక యని నేను

ఆశించుచున్నాను. కాని అది అసంభవమగుటచేత మానవ జాతిలో అత్యధిక సంఖ్యాకులకు సగుణదైవతము అత్యావసరముగా నున్నది. తనజీవితములో పరమాదర్శముల గూర్చుకొని ఒక ధ్వజముక్రింద చేరనిదే ఏ జాతియు ఏర్పడజాలదు: ఘనత కూర్చుకొనజాలదు; ఎంతమాత్రమును కార్యసాధనము చేసికొనజాలదు. రాజకీయాదర్శములుగాని, రాజకీయాదర్శములకు ప్రతినిధులై నిలుచు మహాపురుషులుగాని, చివరకు సాంఘికాదర్శములుగాని, వాణిజ్యాదర్శములుగాని భారతదేశములో ప్రబలములు కాజాలవు. ఆధ్యాత్మికాదర్శములు మనయెదుట సుప్రతిష్ఠితములు కావలెను. ఉత్తమ పారమార్థిక వ్యక్తులను ఎదుట నుంచుకొని వారి చుట్టును ఉత్సాహముతో గుమికూడవలయును. మన వీరులు పారమార్థిక పురుషులుగనే ఉండవలయును. శ్రీరామకృష్ణ పరమహంసల రూపమున అట్టి వీరుడొకడు మనకై మూర్తీభవించినాడు! ఈ జాతి అభ్యుదయము కాంచగోరునెడల ఈ నామము చుట్టును ఉత్సాహముతో చేరి నిలువవలయును. నా మాట నమ్ముడు; శ్రీరామకృష్ణపరమహంసలవారిని గురించి బోధించునది ఎవరా యను విషయము ప్రధానము కాదు. నీవో, నేనో, ఇంకొకరో, ఎవరైన కావచ్చును. వారి ఆదర్శమును నేను మీ యెదుట పెట్టుచున్నాడను. ఏమి చేయుటో నిర్ణయించుకొనవలసినది మీరు. ఈ జీవిత దివ్యాదర్శమును గురించి మీరు ఏమి చేయనున్నారో ఇప్పుడే నిర్ణయించుకొనుట భారత మహాజాతియొక్క క్షేమమునకును, అందలి మనశాఖయొక్క క్షేమమునకును

అవసరము. ఒక విషయమును మనము జ్ఞప్తియందుంచు కొనవలయును. మనము చూచిన వానిలో నెల్ల పరమ పవిత్రమైన జీవితమిది. అంతేకాదు, మనము గ్రంథములలో చదివియున్న జీవితములన్నిటిలోగూడ ఇది పావనతమమైన దని నేను మీకు స్పష్టముగా చెప్పుచున్నాను. ఈ యథార్థ విషయము మీఎదుట జరిగినది. మహాద్భుతమగు ఇట్టిఆత్మశక్తి సాక్షాత్కారమును మీరుగ్రంథములలోకనుగొనజాలరు. అంత కన్నను కనులార చూడగలమని ఆశింపజాలరు. ఆ మహాను భావుడు నిర్యాణము చెందిన పది సంవత్సరములలోపలనే వాని మహిమ భూగోళమునంతను ఆవరించి వేసినది. ఇది మీ ఎదుట జరుగుచున్న యథార్థ విషయమే గదా! కాబట్టి మన జాతియొక్క కల్యాణము కొఱకును, మన మతము యొక్క క్షేమము కొఱకును ఈ ఉత్తమ పారమార్థికాదర్శ మును మీ ఎదుట నుంచుట నా విధియై యున్నది. నన్ను బట్టి ఆయన ఎట్టివాడో మీరు విచారించి నిర్ణయింప బోకుడు. నేనందుకు తగని దుర్బలమగు ఉపకరణమను. నా ఆధారమున ఆయన స్వరూపమెట్టిదో మీరు నిర్ణయింప చూడకుడు! ఆయన శిష్యులలో నేను గాని మఱొకడు గాని నూరు జన్మలెత్తినను ఆయన సత్యస్వరూపమున కోట్యంశము నైనను సమర్థతతో నిరూపింపజాలము. అంతటి మహాత్ముడు ఆయన! మీకు మీరే స్వతంత్రముగా జిజ్ఞాస చేసికొనుడు. మీ హృదయాంతరాళములయందు ఆ యఖండ సాక్షి వెలుంగుచున్నాడు. ఆయన, ఆ శ్రీరామకృష్ణపరమ హంసయే, మన జాతియొక్క క్షేమము కొఱకును మన

దేశముయొక్క అభ్యుదయము కొఱకును మానవకోటి యొక్క కల్యాణము కొఱకును మీ హృదయములను వికసింపజేసి, మీరు బుద్ధిపూర్వకముగ ప్రయత్నించినను ప్రయత్నింపకున్నను, తప్పక రానున్న అద్భుత పరివర్తనకు మిమ్ము పాత్రులుగ జేసి మీరు స్థిరచిత్తములతో పనిచేయు నటుల అనుగ్రహించుగాక! ఏలయన ఆ ప్రభువు సంకల్పించిన కార్యము మీయొక్కగాని, నాయొక్కగాని ఆమోదము కొఱకు ఆగియుండునది కాదు. ఈ భూరజమునుండి వందల కొలదిగా వేలకొలదిగా తన సేవకులను ఆయన నిర్మించుకొన జాలును. ఆ మహాపురుషుని ఆశ్రయించుకొని ఏమాత్ర మైనను పనిచేయు భాగ్యము లభించెనేని అది మన అదృష్టము! మన ధన్యత!!

దీని నాధారము చేసికొని నా భావన విశాలవ్యాప్తి కాంచుచున్నది. మీ రిప్పుడు నాకు తెలిపినటుల, మనము ప్రపంచమునే జయింపవలసి యున్నది. మనము జయించియే తీరవలెను. భారతదేశము లోకమును జయింపవలయును. వా గమ్యార్థము అంతకు తగ్గునది కాదు. ఇది చాల గొప్ప దిగా కాన్పింపవచ్చును. మీలో చాలమందికి ఇది అబ్బుర ముగా కూడ చూపట్టవచ్చును. సత్యముగా అది అంతటిదే. మనము ప్రపంచమును జయించియే తీరవలెను; గత్యంతరము లేదు. జీవనమునకు లక్షణము వికాసము. మనము వెలువడి పోవలయును; వికాసము పొందవలయును; చైతన్యమును ప్రకటింపవలయును; లేదా పతితులమై ముడిగి చావ వలయును. ఇంతకన్న మార్గాంతరము లేదు. బ్రతుకుటో

లేక చచ్చుటో, ఈ రెంటిలో ఒకదానిని నిర్ణయించు కొనుడు. ఇప్పుడు మన దేశములో మనకున్న క్షుద్రములగు మత్సరములను వివాదములను గుఱించి విచారించుదము. ప్రతిచోటను ఇట్టివి యున్నవి. నా మాట నమ్ముడు. రాజకీయ జీవితములతో వర్ధిలు ఇతర జాతులవారికి వారి విదేశాంగ తంత్రములు కలవు. వారికి స్వదేశమున పోరాట ములు పెచ్చు పెరిగి నప్పుడు దేశాంతరములందు ఎవరితో నో పోరాటము పెట్టుకొందురు. అంతటితో వారియింటి పోరు ఆగిపోవును. మనకును ఇట్టి పోరాటములే యున్నవి; కాని వాని నాపుటకు విదేశ రాజకీయ తంత్రములు మనకు లేవు. ప్రపంచమునందలి ఇతరజాతులవారికి మన శాస్త్ర ధర్మములను బోధించుట యనెడు సనాతన విదేశాంగ తంత్ర మును మనము చేపట్టవలసియున్నది. జాతీయముగ మనకిది ఐకమత్యమును చేకూర్చు ననుటకు వేఱొక రుజువు కావలయునా యని మీలో రాజకీయతంత్రజ్ఞు లగువారిని అడుగు చున్నాను. ఈ మహాసభయే కావలసినంత సాక్ష్యము నిచ్చుచున్నది. రెండవ విషయము ఈ స్వార్థపరత్వములు అట్లుండగా, స్వార్థత్యాగులును ఉత్తములును సజీవులును అగు ఆదర్శమూర్తులు మన వెనుక నున్నారు. భారత దేశముయొక్క దౌర్భాగ్యమునకును పతనమునకును ముఖ్య హేతువులలో నొకటి దీని సంకుచితత్వము. ఈ జాతి సంకు చితమై ముత్యపు పురుగువలె ముడుచుకొని తన చిప్పలోనికి దూరిపోయినది. తన ముత్యములను రత్నములను మానవ కోటిలోని యితరజాతులకు పంచియిచ్చుటకు నిరాకరించినది.

ఆ ర్యేతర జాతులవారు చైతన్యప్రదములగు మనధర్మముల కొఱకై దప్పిగొని యుండగా వారిని నిరాకరించినది. ఇది యొక గొప్ప కారణము. మనము దేశాంతరములకు వెళ్లి యితర జాతుల అనుభవములతో మన అనుభవములను పోల్చి చూచుకొనకుండుట మన పతనమునకు ముఖ్యకారణము. ఈ కొలదిపాటి చలనమును, భారత దేశమున మీ రిప్పుడు చూచు కొలదిపాటి జీవచిహ్నమును, శ్రీరాజా రామమోహనరాయలు మన బహిష్కరణావరణపు గోడలను పగులత్రెన్ని వెలుపలికి వచ్చిన నాటినుండియే ప్రారంభమైనదని మీకు తెలియును. ఆనాటినుండి భారతచరిత్ర క్రొత్తమార్గమును పట్టినది. మఱి యిపుడు అతిశయించిన వేగముతో సాగి పోవుచున్నది. పూర్వకాలమున చిన్న చిన్న నదీప్రవాహములు ఉండెడివి; ఇక పెద్దపెద్ద వరదలు రానున్నవి. వాని నెవ్వరును ఆపజాలరు. కాబట్టి మన మిప్పుడు బయటికి పోవలయును. ఇచ్చి పుచ్చుకొనుట జీవశక్తికి లక్షణము. మనము ఎల్లపుడును పుచ్చుకొనువారముగనే ఉండవలయునా? ప్రతిదానిని, చివరకు మన మతమును కూడ పాశ్చాత్యుల పాదములచెంత కూర్చుండి నేర్చుకొనవలసిన దేనా! మనము వారినుండి యంత్రరహస్యములను నేర్చుకొనవచ్చును. ఇంకను ఇతర విషయములు అనేకము నేర్చుకొందము గాక! కాని మనమును కొంత నేర్పవలసి యున్నది. వారికి మనము నేర్పవలసినది మన మతము, మన పరమార్థతత్త్వము. ప్రపంచము తన నాగరికతను పూర్తి గావించుకొనుటకు వేచి యున్నది; భారత దేశము

నుండి వెలువడనున్న రత్నరాసుల కొఱకు నిరీక్షించు చున్నది; అనేక శతాబ్దములుగా పతితమై దైన్యమున క్రుంగి యున్నను ఈ భారతజాతి తనరొమ్మునకు హత్తుకొని కౌగిట గదించిన పిత్రార్జిత మహోద్భుత పరమార్థతత్త్వమును ప్రపంచమునకు పంచి యీయవలయును. ప్రపంచము ఆ నిధి కొఱకు కనుపెట్టుకొని యున్నది!

మన పూర్వులు గడించి పెట్టిన ఈ విచిత్ర రత్న రాసులకొఱకు భారతేతర దేశములందు ఎంతమంది ఆకలి గొని కృశించిపోవుచున్నారో, ఎంతమంది దప్పిగొని పరితపించు చున్నారో, మీకేమియు తెలియుటలేదు. మన మిక్కడ వ్యర్థప్రసంగములు చేయుచున్నాము. ఒకరితో నొకరము వాదులాడుకొను చున్నాము. ప్రతి పవిత్ర విషయమును గుఱించియు పక పక నవ్వుచున్నాము; వేళాకోళము చేసికొనుచున్నాము. దైవీసంబంధమగు ప్రతిదానిని గుఱించియు హేళన చేయుట మనజాతికొక దురభ్యాసమై పోయినది. ఈ భారత వర్ష క్షేత్రమున మన పూర్వులు భద్రపరచి యుంచిన అమృతమునందు ఒక చుక్కను గ్రోలుటకై, చేతులు చాచుచు ఆరాటముతో గోడల బైట ఎన్నిలక్షలమంది హృదయావేదనతో నిరీక్షించు చున్నారో మనకు తెలియ వచ్చుటలేదు. కాబట్టి మనము వెలుపలికి పోయి మన ఆధ్యాత్మికతత్త్వమును వారికిచ్చి దానికి బదులుగా వారియ్యగల దానిని దేనినైనను గ్రహింతుము గాక! ఆత్మప్రపంచవిచిత్రములను ఒసగి జడప్రపంచ చిత్రములను కొనుగోలుచేసెదము గాక! మనము ఎల్లప్పుడును

విద్యార్థులు గనే యుండదగదు. ఉపాధ్యాయులముగ కూడ నుండ వలసియున్నది. సమత్వము లేనిది మిత్రత్వము ఉండజాలదు. ఒక పక్షమువాడు సదా ఉపాధ్యాయుడుగనే యుండి, రెండవ పక్షమువాడు సదా వాని పాదములకడనే కూర్చుండుచో సమత్వ మెట్లుండును? ఆంగ్లేయునితో గాని, అమెరికా వానితో గాని నీవు సమానముగా నుండ గోరునెడల, వారివలన నేర్చుకొనుటయే కాక వారికి నేర్ప గలిగియు నుండవలయును. శతాబ్దముల తరబడి ప్రపంచమునకు నేర్పకలది నీకడ కావలసి నంత కలదు; ఈ పని జరుగవలయును. మన రక్తములో సాహసమును ఉత్సాహమును ఉండవలయును. మనము వంగదేశీయులము. ఊహాశక్తి గలవారమని మనకు ప్రసిద్ధి గలదు. మన యందది కలదనియే నా నమ్మకము. ఊహాశీలురమనియు, విశేషమగు ఉద్రేకముగలవారమనియు మనలను వెక్కిరించుచుందురు. మిత్రులారా! నా మాట వినుడు. బుద్ధిశక్తి గొప్పదనుట నిజమే, కాని అది కొన్ని హద్దుల లోపల ఆగి పోవలసి యుండును. ఒక్క హృదయ ద్వారమున మాత్రమే ఆవేశము పుట్టును. ఉద్రేకభావముల ద్వారముననే అత్యుత్తమ రహస్య విషయములు అందుకొనుటకు వీలగును. కాబట్టి భావోద్రేకముగల వంగదేశీయుడే ఈ పని నిర్వహింప వలయును.

* "ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరా న్నిబోధత! లెండు! మేల్కొనుడు! మీ గమ్యార్థమును చేరువఱకు

---

* కఠోపనిషత్తు.

ఆగకుడు!'' కలకత్తానగర తరుణ వయస్కులారా! లెండు, మేలుకొనుడు; సమయము మంగళకరముగ నున్నది. అదిగో అప్పుడే సర్వమును మన ఎదుట సిద్ధమగుచున్నది. ధైర్యము వహింపుడు. భయపడకుడు. మన గ్రంథములందు మాత్రమే 'అభయః' అను విశేషణమును భగవంతుని గుఱించి ప్రయోగించి యున్నారు. మనము 'అభయః' భయములేని వారము కావలయును. అప్పుడు మనము పూను కార్యము నెరవేరినట్లే! లెండు! మేల్కొనుడు! మీ దేశము ఈ మహాయజ్ఞమును కోరుచున్నది. యువకులే దానిని నిర్వహింపవలసియున్నది. యువకులును బలయుతులును సత్త్వవంతులును దృఢకాయులును బుద్ధిశాలులును అగు వారు నిర్వహింప దగినదే ఈ కార్యము. ఈ కలకత్తానగర మున వందల కొలదిగా, వేల కొలదిగా అటువంటి యువకు లున్నారు. మీరు చెప్పినటుల ఇప్పుడు నేను ఏమేని సాధించియుండినను, పూర్వము ఈ కలకత్తానగర వీధుల యందు ఆటలాడుచు కొఱగాని కుఱ్ఱవాడని అనిపించుకొనిన వాడనే అని జ్ఞప్తి నుంచుకొనుడు. నేనే అంతపనిని చేసి యుండగా మీరు ఇంకను ఎంత ఎక్కువ పని చేయగలు గుదురో! లెండు, మేలుకొనుడు, ప్రపంచము మిమ్ము ఆహ్వానించు చున్నది. భారతదేశమునందలి ఇతర ప్రాంతము లందు బుద్ధిశక్తి యున్నది; ధనమున్నది; కాని ఉత్సాహము మాత్రము నా జన్మభూమియందే కలదు. అది ఇప్పుడు వెలువడి రావలయును. కాబట్టి కలకత్తా నగర యువజను లారా! మీ రక్తములోని ఉత్సాహ శక్తితో లేచి నిలువ

బడుడు. మీరు దరిద్రులనియు, మీకు స్నేహితులు లేరనియు తలంపకుడు. ఓహో! ధనము ఎన్నడైన ఒక పురుషుని సృష్టింపగా చూచిన వారు కలరా? పురుషుడే సదా ధనమును సృష్టించుచుండును. ఈ ప్రపంచమంతయు సత్యసంపన్నుడగు మానవునిచేత, ఉత్సాహశక్తిమూలమున విశ్వాసబలముతో నిర్మాణ మగుచున్నది. ఉపనిషత్తులలోనికెల్ల అత్యంతము మనోహరమగు కఠోపనిషత్తును మీలో చదివిన వారికి ఆ రాజు మహాయజ్ఞము చేయబోవుచు శ్రేష్ఠమగు వస్తువులను దానము చేయుటకు బదులుగా, ఎందుకును కొఱగాని ఆవులను గుఱ్ఱములను ఎటుల దానము చేయ మొదలిడెనో జ్ఞప్తి యుండును. ఆ సమయమున వాని కుమారుడగు నచికేతుని హృదయములోనికి 'శ్రద్ధ' ప్రవేశించి నటుల ఆ గ్రంథమున కలదు. ఈ 'శ్రద్ధ' అను మాటకు అర్థముగా వేఱొక మాట నుపయోగించుట నాకిష్టము లేదు. అర్థము తప్పిపోవును. ఇది ఒక అద్భుత శబ్దము. దీనిని చక్కగా అర్థము చేసికొని దీనినే వాడుకొను చుండవలయును. దీని మహిమను కొంచెము చూతము. నచికేతుడు వెంటనే తనలో తానిట్లు అనుకొనెను. "నేను చాలమందికంటె గొప్పవాడను; కొందఱికంటె తక్కువవాడను. కాని ఎందునను నేను కడగొట్టువాడను కాను. నేను కూడ కొంతపని చేయగలను." వాని ధైర్యము పెంపొందినది. అంతట ఆ పిల్లవాడు తన మనస్సులో నున్న సమస్యను అనగా మృత్యురహస్యమును తెల్పవలయునని పూనుకొనినాడు. ఆ పరిష్కారము మృత్యుదేవతయగు

యముని ఇంటికి పోయిన గాని తేలునది కాదు. అక్కడికే ఆ పిల్లవాడు వెళ్లినాడు. అక్కడ ధీరుడగు నచికేతుడు యముని గృహమునొద్ద మూడు దినములు వేచి యున్నాడు. పిమ్మట అతడు కోరుకొనిన దానిని ఎట్లు సాధింప గలిగెనో మీకు తెలియును గదా! ఈ శ్రద్ధయే మనకు కావలసినది. దురదృష్టవశమున శ్రద్ధ అనునది భారతదేశమునుండి దాదాపుగా అదృశ్యమై పోయినది. ఆ కారణముచేతనే మన మీ ప్రస్తుత దుఃస్థితికి వచ్చినాము. నరునకు నరునకు నడుమ గల భేదము శ్రద్ధయందు గల భేదమే తప్ప వేఱు కాదు. ఒకపురుషుని ఘనునిగను, వేఱొకని దీనునిగను అధమునిగను చేయునది ఈ శ్రద్ధయే. దీనుడ ననుకొను వాడు, దీనుడై పోవునని నా గురువర్యుడు చెప్పుచుండెడి వాడు. ఆ మాట సత్యము. ఈ శ్రద్ధ మీలో ప్రవేశింప వలయును. పాశ్చాత్య జాతులయందు ఎటువంటి జడశక్తి ప్రకటితమై మీకు కాన్పించు చున్నదో చూడుడు. అది అంతయు శ్రద్ధయొక్క మహిమయే. వారు తమ శరీర బలమును నమ్ము కొందురు. మీరు మీ ఆత్మబలమును నమ్ముకొనినయెడల ఇంకను ఎంత అతిశయముగా అది పని చేయ గలదో! ఆ అఖండాత్మను, అఖండశక్తిమయుని నమ్ము కొనుడు. మీ గ్రంథములును, మీ ఋషిసత్తములును ఏకాభిప్రాయముతో దీనినే బోధించియున్నారు. ఏదియు వినాశము చేయజాలని ఆ ఆత్మయందు అనంతశక్తి కలదు. మీ ఆవాహనముకొఱకై అది ఎదురు చూచుచున్నది. భారతీయ వేదాంతమునకును, తక్కిన తత్త్వశాస్త్రము

లన్నిటికిని. సమస్త గల గొప్పభేదము ఇక్కడనే యున్నది. ద్వైతులును, విశిష్టాద్వైతులును, అద్వైతులును, అందఱును సమస్తము ఆత్మయందే కలదని దృఢముగా విశ్వసింతురు. అది వెలుపలికి వచ్చి సువ్యక్తము కావలయును. కాబట్టి నేను కోరు కొనునది ఈ శ్రద్ధయే. మనఅందఱకును కావలసినదియు ఈ శ్రద్ధయే. ఈ విశ్వాసము మీలో కలదు. ఈ విశ్వాసమును మీ అనుభవమునకు తెచ్చుకొనుట యను మహాకార్యము నిర్వహింపుడు. గాంభీర్యమును గంగపాలు చేసి ప్రతి దానిని వేళాకోళము చేయు బుద్ధి ఈ జాతియొక్క రక్తములోనికి చొచ్చుకొని పోవుచున్నది. ఈ ఘోరవ్యాధిని తొలగించు కొనుడు. ఈ పెద్ద రోగమును తప్పించుకొనుడు. సాహసము పూనుడు. శ్రద్ధను సంపాదించు కొనుడు; తక్కిన దంతయు వచ్చి తీరును.

ఇప్పటికి నేనేమియు చేసి యుండనే లేదు. ఆ పనిని మీరు చేయవలయును. నేను రేపు మరణించినను ఈ కార్యము ఆగిపోదు. వేలకొలదిగా ముందునకు వచ్చి ఈ కార్యమును చేపట్టి, నేను ఊహతో కల్పన చేసికొనిన పేరాసల నన్నిటిని మించి ఈ మహా కార్యమును ముందునకు సాగించుకొని పోవుదురని నేను నిశ్చయముగా నమ్ముచున్నాను. నామాతృదేశమునందు, ముఖ్యముగా నా మాతృదేశపు యువకుల యందు నాకు విశ్వాసము కలదు. యువకుల మూపులపై ఇంతవరకు మోపబడిన కార్యభారములన్నిటికంటె ఘనతమమైనది ఈ వంగదేశ యువకుల

మీద ఇప్పుడు పడినది. దాదాపు పది సంవత్సరములనుండి భారతదేశము నందంతటను నేను సంచారము చేసి యున్నాను. భారతమాతను ఉద్ధరించి, ఆధ్యాత్మికముగా ఆమెకు అర్హమగు స్థానమును మఱొకసారి సంపాదించి పెట్టగలశక్తి వంగదేశయువకుల నుండి ప్రభవింపనున్నదని నా నిశ్చిత విశ్వాసము. అహో! మన పితరులు కనిపట్టిన అఖండ పరమార్థ సత్యములను బోధించుచు ఉపదేశముల గావించుచు ప్రపంచపు మూల మూలకు ప్రచారము సాగించెడు వీరవరులు ఈ వంగదేశపు యువకులనుండియే—అద్భుత భావస్ఫూర్తియు, ఉత్సాహపూరిత రక్తమునుగల ఈ నా యువకసోదరులనుండియే — ఉదయము గాంచ నున్నారు. మీ యెదుటనున్న ఘనతర కర్తవ్యము ఇదియే. కాబట్టి "లెండు! మేల్కొనుడు! ఈప్సితార్థసిద్ధి యగువఱకు నిలువకుడు!" అనుచు మఱొకసారి మిమ్ము హెచ్చరించుచు నా యుపన్యాసమును ముగింతును! భయపడ బోకుడు. మానవ చరిత్రయందంతటను మహాశక్తి ప్రజలనుండియే ప్రభవించుచు వచ్చినది! అట్టి ప్రజాశ్రేణులనుండియే ప్రపంచమునందలి మహా మనీషావంతులందఱును వచ్చియున్నారు. చరిత్ర యందు ఒక్కసారి సంఘటిల్లినదే మరల సంఘటిల్లు చుండును. దేనికిని మీరు భయపడ వలదు. మీరు అద్భుత కార్యములను చేయగలరు. భయపడిన తత్క్షణమే మీరెందుకను కొఱగాకుండ పోవుదురు. లోకములోని దుఃఖమున కంతకును ముఖ్యకారణము ఈ భయమే. మూఢ విశ్వాసములలోనెల్ల అత్యధికమగునది ఈ భయమే. మన

దుఃఖమున కంతకును ప్రధానకారణము ఈ భయమే. నిర్భయత ఒక్క క్షణములో స్వర్గమును సైతము తెచ్చిపెట్ట గలదు: కాబట్టి "ఉత్తిష్ఠత, జాగ్రత. ప్రాప్య వరాన్ నిబోధత — లెండు, మేల్కొండు, గమ్యస్థానము చేరు వఱకును ఆగకుడు."

మహాశయులారా! మీరు నాయెడల చూపిన ఆదరణ కంతకును మఱొకసారి మీకు వందనములర్పించుచున్నాను. ఏ కొంచెమైనను, ప్రపంచమునకును ముఖ్యముగా నా దేశమునకును నా దేశప్రజలకును సేవ చేయుట నా కోరిక. అదియే నిశ్చయమగు నా దృఢాభిలాష!

సర్వతోముఖ వేదాంతము

కలకత్తాలో ఒసగబడిన ఉపన్యాసము

చాలపూర్వము, చరిత్రరచనగాని, సాంప్రదాయిక కథల మందకాంతులుగాని చొరని పురాణకాలమునుండి ఒక జ్యోతి సుస్థిరముగ వెలుంగుచున్నది. బాహ్యపరిస్థితుల వలన ఒక్కొకప్పుడు దాని కాంతి తగ్గుచున్నట్లున్నను, ఇతరసమయములందు దేదీప్యమానముగ ప్రకాశించుచు వచ్చినది. అది ఆరిపోక నిశ్చలమై నిలిచి తనకాంతులను భారతదేశమున ప్రసరింపచేయుటయే గాక తన మహిమను ప్రపంచములోని సర్వజిజ్ఞాసువుల మనఃక్షేత్రములందును

నింపినది. ఆ జ్యోతి మన ఉపనిషన్మతమే. నిశ్శబ్దముగా, మెల్లమెల్లగా, ఎవరి కనుల బడక రాలుచు, నవ నవ కోమలములగు గులాబిపూలను వికసింపజేయు ఉషఃకాలపు మృదుతుషారమువలె, ఆడంబరము లేక, సుకుమారముగ నుండియు సర్వశక్తిమంతమై ఈ ఉపనిషన్మతము — అనగా వేదాంత తత్త్వము — ప్రశాంతముగ ప్రకాశించుచున్నది. ఇది, ఈ భారత భూమిలో మొదట ఎప్పుడు అభ్యుదయ మందెనో ఎవరును ఎఱుగరు. దాని నెఱుంగుటకు జరిగిన ఊహాలన్నియు—ముఖ్యముగా పాశ్చాత్యగ్రంథకర్తలవి—వ్యర్థమైనవి. వాని కాల నిర్ణయములు మిక్కిలి పరస్పర విరుద్ధములుగ నున్నవి. కాని హిందువులమగు మనము పారమార్థిక దృష్టితో చూచి వానికి ఆదియే లేదందుము. ఈ ఉపనిష త్తత్త్వసిద్ధాంతము, ఈ వేదాంతము—నరునకు ఆధ్యాత్మిక క్షేత్రమున ఇంత వఱకు ప్రసాదింపబడిన ప్రజ్ఞానరాశిలో మొట్టమొదటిదియును తుట్టతుదిదియును అని చెప్పుటకు నేను సాహసించుచున్నాను. ఈ వేదాంత మహాసముద్రము నుండి ప్రకాశ తరంగములు వెలువడి మాటిమాటికి తూర్పు దెసకును, పడమటి దెసకును వ్యాపించుచు వచ్చినవి. ప్రాచీనకాలమున ఇవి పడమటి దిశగా పోయి, ఆథెన్సు నగరమునందో, అలగ్జాండ్రియా నగరమునందో, ఆంటియోక్ నగరమునందో, గ్రీకుల మనస్సుల నెదుర్కొని సంచలనము కలిగించినవి. ప్రాచీన గ్రీకుల మనస్సులపై మన సాంఖ్య సిద్ధాంత ప్రభావము దీపించియుండుట స్పష్టము. ఈసాంఖ్యమునకును, భారత దేశమందలి తక్కిన సిద్ధాంతము

లన్నిటికిని, ఉపనిషత్తులే, అనగా వేదాంతమే, ఏకైక ప్రమాణము! భారతదేశములో ఈనాడు మనము చూచుచున్న పరస్పర భిన్న సంప్రదాయములు ఎన్నియున్నను, పూర్వకాలమునందు ఎన్ని ఉండి పోయినను, ఉపనిషత్తులే అనగా వేదాంతమే ఈ సిద్ధాంతములన్నిటికిని మూలాధారమై, ఏకైక ప్రమాణమై, ఉండెడిది. నీవు ద్వైతివైనను, విశిష్టద్వైతివైనను, అద్వైతివైనను, విశిష్టాద్వైతివైనను, శుద్ధాద్వైతివైనను లేక మఱెట్టి ద్వైతివిగాని అద్వైతివిగాని అయినను, లేక మఱేపేరు పెట్టుకొనినను, నీకు ప్రమాణములగు శాస్త్రములును, వేదములును, ఈ ఉపనిషత్తులే. భారతదేశములో ఏసిద్ధాంతము ఉపనిషత్ప్రమాణము నంగీకరింపదో అది ఆస్తిక మనిపించుకొనజాలదు. బౌద్ధ జైన సిద్ధాంతములు సైతము ఉపనిషత్తుల ప్రమాణమును అంగీకరింపకపోవుట చేతనే భారతదేశము నుండి బహిష్కరింపబడినవి. ఈరీతిగా—మనకు తెలిసినను తెలియకున్నను—భారతదేశములోని అన్ని సంప్రదాయములందును ఉపనిషత్తుల ప్రమాణము అంతర్లీనమై యున్నది. హిందూమతమని మనము పేర్కొను మహావటవృక్షము—దానియొక్క మహత్తరములును అసంఖ్యాకములును అగు శాఖోపశాఖలతో సహా—వేదాంత ప్రభావముతో సర్వత్ర నిండి యున్నది. బుద్ధిపూర్వకముగనో, అబుద్ధిపూర్వకముగనో మనము వేదాంతమునే భావన చేయు చున్నాము, వేదాంతమునందే జీవించు చున్నాము. వేదాంతమునే శ్వాసించుచున్నాము, వేదాంతమునందే

మరణించుచున్నాము. ప్రతి హిందువుడును ఇట్లే చేయుచున్నాడు. కాబట్టి భారతదేశమునందు, భారత శ్రోతలకు వేదాంత బోధ చేయుట విపరీత చర్యగా కాన్పించును. ఐనను బోధింపవలసినది అది యొకటియే. ఆ బోధయే ఈ కాలమున అత్యావశ్యకము. ఏలన, నేనిప్పటికే చెప్పినటుల, భారత సంప్రదాయము లన్నియు ఉపనిషత్తులను శిరసా వహింపవలసినవే! ఐనను ఈ సంప్రదాయములందు పరస్పర విరుద్ధత లనేకము లున్నట్లు పైకి కానిపించును. అనేక పర్యాయములు ప్రాచీన ఋషులు సైతము ఈ ఉపనిషత్తుల యందు అంతర్లీనమై యున్న సామరస్యమును అర్థము చేసి కొనలేక పోయిరి. చాలసార్లు ఆ ఋషులే తగవులాడుకొనిరి. అందువలననే "భిన్నభావములేని ఋషులు లేరు" అనుట ఒక సామెతయై పోయినది. కాని ద్వైతములైనను, అద్వైతములైనను, విశిష్టాద్వైతములైనను, మఱెట్టి భావములైనను గల ఉపనిషద్వాక్యములందు అంతర్లీనమై యున్న ఈసామరస్యమును తొల్లిటికన్న చక్కగా ధ్రువపఱుపవలసిన అవసరమిప్పు డేర్పడినది. ఆ సామరస్యము నిప్పుడు బహిరంగముగా అఖిల ప్రపంచమునకు వెల్లడిచేయవలయును. ఈపని భారతదేశమునందు ఎంత అవసరమో అన్యదేశములందును అంత అవసరమై యున్నది. అటువంటిసామరస్యరూప వ్యాఖ్యానమై ఎవనిజీవితమంతయు ఒప్పినదో, ఎవని బోధకంటె ఎవని జీవితము వేయిరెట్లు ఉపనిషత్తులకు సజీవమగు భాష్యముగనుండెనో, ఎవడు మానవరూపము దాల్చిన ఉపనిషత్తులయొక్క సారాంశమో, అటువంటి మహాపురుషుని

యొక్క పాదసేవ చేయు మహాభాగ్యము భగవదనుగ్రహము వలన నాకు లభించినది. ఆ సమరస భావము నా కొకింత ప్రాప్తించి యుండవచ్చును. దానిని ప్రకటింపగలనో, లేనో నాకు తెలియదు. కాని అదే నా ప్రయత్నము. వేదాంత మతములు పరస్పర విరుద్ధములు కావనియు, అవన్నియు ఒకదాని కొకటి అవసర మనియు, ఒకదాని నొకటిసార్థకము చేయు ననియు, ఒకటి మఱొక దానికి సోపానమువలె నమరి యుండి పరమగమ్యమగు "తత్త్వమసి" లేక అద్వైతభావము చేరువఱకు నడపుకొనిపోవుననియు విశదము చేయుటయే నా జీవితోద్దేశము! పూర్వమొకప్పుడు కర్మకాండము భారత దేశమును పరిపాలించుచుండెను. ఆ వేదభాగమునందు ఉత్త మాదర్శములు చాల కలవనుట నిజమే. మన ఈనాటి నిత్య పూజావిధానము ఆ కర్మకాండ సూత్రములకు అనుగుణము గానే జరుగు చున్నది. అట్లయ్యును వేదములయొక్క కర్మ కాండ భారతదేశమునుండి దాదాపుగా అదృశ్యమైనది. మన అనుదిన జీవితములో ఏ అత్యల్పభాగమో తప్ప ఆ కాండయొక్క నియమముల ననుసరించుటయే లేదు. మన సామాన్య జీవితమునందు మనము చాల వఱకు పౌరాణి కులమో, తాంత్రికులమో అనజెల్లును. కొన్ని వేదమంత్ర ములను ఉపయోగించు నప్పుడు సైతము, మన భారతీయ బ్రాహ్మణులు వానిని వేదోక్త విధమునగాక చాలవఱకు తంత్రముల ప్రకారమో, పురాణముల ప్రకారమో ప్రయో గించుచున్నారు. అటు లగుటచేత — వేదములయొక్క కర్మకాండను అనుసరించు వారము అనెడు అర్థములో —

మనము వైదికులమని చెప్పుకొనుట సమంజసముకాదని నా భావము. కాని మనమందఱమును వేదాంతుల మను మాట మాత్రము యథార్థము. హిందువులమని చెప్పు కొను వారి నందఱను వేదాంతులని పేర్కొనుట యుక్తము. ఆ వైదాంతిక నామము ద్వైతాద్వైత సంప్రదాయముల వారందఱకును వర్తించునని ఇంతకు ముందే తెలిపియున్నాను.

ఇప్పుడు భారతదేశములోనున్న సంప్రదాయములు సామాన్యముగా ద్వైతము అద్వైతము అనెడు రెండు గొప్పతరగతులుగా విభజింపబడుచున్నవి. ఈ సాంప్రదాయికులలో కొందఱు స్వల్పభేదములకు ప్రాముఖ్యమొసగి, వానిని ఆధారము చేసికొని, శుద్ధాద్వైతులమనియు, విశిష్టాద్వైతులమనియు ఏమేమో క్రొత్తపేరులను పెట్టుకొందురు. అవి అంత పాటింపతగినవికావు. విశాల విభాగమున వారందఱు ద్వైతులో అద్వైతులో అగుదురు. ఈ కాలమున కాన్పించుచున్న సంప్రదాయములలో కొన్ని చాల క్రొత్తవి; తక్కినవి మిక్కిలి పురాతన సంప్రదాయములయొక్క రూపాంతరములుగా కనబడుచున్నవి. మొదటి తరగతికి నిదర్శనముగా శ్రీ రామానుజాచార్యులవారి జీవితమును, వారి సిద్ధాంతమును పేర్కొందును. రెండవదానికి శ్రీ శంకరాచార్యులవారిని పేర్కొందును. రామానుజాచార్యులవారు ఆధునికభారతదేశపు ద్వైతవేదాంతులలో ప్రముఖుడు. తక్కిన ద్వైత సాంప్రదాయికు లందఱును బోధల సారాంశమున ఏర్పడు తమ తమ సంప్రదాయముల నిర్మాణమునందును, ఆ నిర్మాణమునందు గల కొన్ని అతి

సూక్ష్మవిషయములందును ప్రత్యక్షముగనో, పరోక్షము గనో, శ్రీ రామానుజాచార్యులవారినే అనుసరించుచున్నారు. శ్రీ రామానుజాచార్యులవారిని వారి సంప్రదాయమును భారతదేశమునగల ఇతర ద్వైత వైష్ణవ సంప్రదాయము లతో పోల్చి చూచిన యెడల, నిర్మాణమునందును బోధ లందును పద్ధతులందును ఎంతగా సమాన లక్షణములు కనిపించునో చూచిన యెడల, మీరు అబ్బుర పడుదురు. దక్షిణదేశమున మధ్వముని యను మహాగురువు ఉండెను. ఆయన ననుసరించి మన వంగదేశమున చైతన్యులవారు బయలుదేరి మాధ్వుల తత్త్వశాస్త్రమును చేపట్టి వంగ దేశమున ప్రచారము గావించిరి. దక్షిణదేశమున విశిష్ట ద్వైత శైవులు మున్నుగాగల ఇతర సంప్రదాయములు కూడ కలవు. దక్షిణ భారతదేశమున కొన్ని భాగములందును సింహళమునందును తప్ప భారతదేశపు ఇతర ప్రాంతము లందు చూపట్టు శైవులు చాలవఱకు అద్వైతులు. ఈ అద్వైతేతరులగు శైవులు విష్ణువు స్థానమున శివుని నిల్పుదు రన్న మాటే గాని, జీవాత్మను గురించిన సిద్ధాంతమునందు తప్ప ప్రతివిషయమునను రామానుజానుచరులే అనవల యును. రామానుజాచార్యులవారి అనుచరులు జీవుడు అణురూపుడని — నలుసువలె అతిసూక్ష్మమై యుండువా డని — చెప్పుదురు. శంకరాచార్యులవారి అనుచరులన్ననో, జీవుడు విభువు, అనగా సర్వవ్యాపకుడు అందురు. ఇట్టి అద్వైతేతర సంప్రదాయములు ఎన్నియో ఉండెను. ప్రాచీన కాలమునందు అట్టి సంప్రదాయము లనేకములను శంకర

సంప్రదాయము మ్రింగివేసి తనలో జీర్ణము చేసికొనినటుల కన్పించు చున్నది. కొన్ని భాష్యములందు శంకరునిమీద సైతము ఒక్కొక బాణము విడువబడుట అప్పుడప్పుడు గోచరించును. అందు ముఖ్యముగా విజ్ఞాన భిక్షువు తన భాష్యమునందు తాను అద్వైతియై యుండియు శంకరాచార్యులవారి మాయావాదమును ఎగురగొట్టివేయుటకు ప్రయత్నించినాడు. ఈ మాయావాదమును విశ్వసింపనట్టి కొన్ని అద్వైతసంప్రదాయములున్నట్లు కాన్పించుచున్నది. వారు శంకరాచార్యులవారిని ప్రచ్ఛన్న బౌద్ధుడని నింద చేయుటకు కూడ వెనుదీయరైరి. ఈ మాయావాదము బౌద్ధులనుండి తీసికొనబడి వేదాంతసంప్రదాయములోనికి చొప్పింపబడెనని వారి అభిప్రాయము. అది ఎట్లున్నను ఈ కాలమున అద్వైతులందఱును శంకరాచార్యులవారి ఆధిపత్యమునే అంగీకరించుచున్నారు. శంకరాచార్యులవారును, వారి శిష్యవర్గమును, భారతదేశమునందలి ఉత్తరప్రాంతములందును దక్షిణప్రాంతములందునుగూడ, అద్వైతమతమును బోధించుచు గొప్ప ప్రచారము కావించిరి. శంకరాచార్యులవారి ప్రభావము మన వంగదేశమునందును, కాశ్మీరమునందును, పాంచాలమునందును అంతగా వ్యాపింపలేదు. కాని దక్షిణదేశమునందలి స్మార్తులందఱును శంకరాచార్యులవారి అనుచరులే! కాశీనగరము కేంద్రముగా, ఉత్తర భారత దేశమునగూడ అనేక ప్రాంతములందు శంకరాచార్యులవారి ప్రభావము చాల గాఢముగా వ్యాపించినది.

శంకరాచార్యులవారుగాని రామానుజాచార్యులవారు గాని తాము సిద్ధాంతప్రారంభకుల మని చెప్పుకొని యుండ లేదు. శ్రీరామానుజాచార్యులవారు తాను బోధాయనుల వారి వ్యాఖ్యానమును అనుసరించు చున్నటుల స్పష్టముగా తెలిపి యున్నారు:—"భగవద్బోధాయనకృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్రవృత్తిం పూర్వాచార్యాః, సంచిక్షిపుః తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే" (భగవాన్ బోధాయనులవారు రచించిన విపులమగు బ్రహ్మసూత్ర వృత్తిని పూర్వపు ఆచార్యులు సంగ్రహపఱచిరి. వారి అభి ప్రాయానుసారముగా సూత్ర వాక్యములను వివరించు చున్నాడను) అని శ్రీభాష్య మనెడు తన గ్రంథము ఆరంభ మున శ్రీరామానుజాచార్యులవారు చెప్పి యున్నారు. వారు దానిని చేపట్టి సంక్షిప్తముగా చేసిరి. దానినే మన మీనాడు చూచు చున్నాము. బోధాయనులవారి వ్యాఖ్యా నమును చూచు నవకాశము నామట్టుకు నాకెన్నడును లభింప లేదు. వ్యాససూత్రములకు బోధాయనులవారు చేసిన వ్యాఖ్యానమును తప్ప తక్కిన వ్యాఖ్యానములన్నిటిని కీ॥ శే॥ దయానంద సరస్వతిస్వాములవారు త్రోసివేయ జూచిరి. వీలున్నపుడెల్ల రామానుజాచార్యులవారిని ఖండించుచుండిన ఈయనయు ఆ బోధాయన భాష్యమును చూపజాలక పోయిరి. నేను భారతదేశమందంతటను దానికొఱకై వెదకితిని. ఇంతవరకు అది నాకనుల బడలేదు. కాని తాను బోధాయన భాష్యములోని భావములను తీసికొను చున్నటు లును, కొన్ని సందర్భములందు అందలి వాక్యములనే తాను

సంగ్రహించు చున్నటులును ఆభావములను సంగ్రహించియే ఇప్పటి రామానుజభాష్యమును సిద్ధము చేసినట్లును శ్రీ రామానుజులవారు స్పష్టముగా తెలిపి యున్నారు. శంకరా చార్యులవారును అట్టిపనినే చేసినటుల కాన్పించు చున్నది. ప్రాచీన వ్యాఖ్యానము లుదాహరింపబడిన స్థలములు కొన్ని శంకర భాష్యమునందును గలవు. శ్రీశంకరాచార్యులవారి గురువును, వారి గురువుయొక్క గురువును, అదే సంప్ర దాయమునకు చెందిన వేదాంతు లగుటయేకాక కొన్ని విధములం దీయనకన్న వారు ఆ మతమందు ఎంతో యెక్కువ చౌరవను సాహసమును చూపినవా రగుటచేత ఆయన బోధించిన దొక స్వనిర్మిత నూత్నమతము కానేకాదనుట స్పష్టము. శ్రీరామానుజాచార్యులవారు తమ భాష్యమును బోధాయన భాష్యమును, ఆధారము చేసికొని రచించినటు లనే శంకరాచార్యులవారును తమ భాష్యము నొక పూర్వ భాష్యము నాధారముచేసికొని రచించియుందురు గాని వీ రేభాష్యమును అనుసరించినదియు ఇప్పుడు కనుగొనుటకు వీలు లేకున్నది. మీ రెన్నడేని కని విని యుండు దర్శనము లన్నియు ఉపనిషత్తుల ప్రమాణముమీద ఆధారపడి యుండు నవియే. అది శ్రుతిప్రమాణమని చెప్పినప్పుడెల్ల ఉపనిషత్తు లనియే వాని అభిప్రాయము. అవి సదా ఉపనిషత్ప్రమాణ ములనే ఉదాహరించుచుండెను. ఉపనిషత్తుల తర్వాతనే భారతదేశపు ఇతర తత్త్వశాస్త్రములు వచ్చుచున్నవి. కాని వానిలో ఏదియు భారతదేశమునందు వ్యాసులవారి తత్త్వశాస్త్రము పొందినంత ప్రామాణ్యమును పొందలేక

పోయెను. ఈ వ్యాసులవారి తత్త్వసిద్ధాంతము సైతము అంతకు ముందుగల కపిలుని సాంఖ్యసిద్ధాంతముయొక్క పరిణామమే! ఒక్క భారతదేశమునందలివే గాక ప్రపంచమందలి ప్రతి తత్త్వసిద్ధాంతమును కపిలునికి అపారముగా ఋణపడినదే. తత్త్వసిద్ధాంతవిషయమునను, మనశ్శాస్త్ర విషయమునను భారతదేశ చరిత్రయందు కపిలుని నామమే అత్యగ్రగణ్యమని చెప్ప వచ్చును. కపిలుని ప్రభావము ప్రపంచమునందు ఎల్లెడల గోచరించుచున్నది. గణనకెక్కిన తత్త్వసిద్ధాంతము వెలసినచోట నెల్ల కపిలుని సిద్ధాంతప్రభావము మీరు గుర్తింప జాలుదురు. వేలకొలది సంవత్సరములు గడచి పోయినను ఈ మహాత్ముడు కపిలుడు అసదృశ తేజోమూర్తియై, అద్భుతప్రభావుడై యిప్పటికిని నిలిచియేయున్నాడు. అతని తత్త్వ సిద్ధాంతమున చాలభాగమును, అతని మనశ్శాస్త్రమును, భారతదేశమునందు—బహు స్వల్ప భేదాభిప్రాయముతో—అన్ని సంప్రదాయముల వారును అంగీకరించు చున్నారు. మన (వంగ) దేశమునందు మన నైయ్యాయిక దార్శనికులు భారతీయ తత్త్వశాస్త్రజ్ఞుల ఆమోదము నెక్కువగా పడయ జాలక పోయిరి. వీరు వర్గోపవర్గాది క్షుద్రవిషయములందును అతి క్లిష్టమగు పారిభాషికభాష నభ్యసించుటందును జీవితకాలము నంతయు వ్యర్థపఱచుకొనుచు తర్కమునందే మునిగిపోయి తత్త్వసిద్ధాంతములను వేదాంతులకు వదలి వేసిరి. ఈ నవీన కాలమున భారతీయతత్త్వజ్ఞులలోని అన్ని సంప్రదాయముల వారును వంగదేశపు నైయ్యాయికుల తర్కపరిభాషనే

అవలంబించు చున్నారు. గదాధర, జగదీశ, శిరోమణి నామములు నదియాజిల్లాలో (నవద్వీపము ఆ జిల్లాలోనిది) ఎంత ప్రఖ్యాతి గలవిగ నున్నవో, మళయాళ దేశమందలి కొన్ని నగరములందును అంతటి ప్రఖ్యాతిని పడసియే యున్నవి. కాని వేదాంతవిషయమున మాత్రము "వ్యాస సూత్రములు" సుస్థిరస్థానమును పడసి, తత్త్వసిద్ధాంతము నందలి వేదాంతపక్షము ఏ బ్రహ్మమునుగూర్చి మానవులకు బోధించుచున్నదో, ఆ బ్రహ్మమువలెనే శాశ్వతముగ వ్యాస సూత్రములుకూడ దేశమున నాటుకొని పోయినవి. తర్కము అనునది శ్రుతి ప్రమాణమునకు పూర్తిగా తలయొగ్గ వలసి వచ్చినది. శ్రీశంకరాచార్యులవారు ప్రవచించినటుల వ్యాసుడు తర్కములో ఏ మాత్రమును దిగలేదు. సూత్రములను వ్రాయుటలో వాని ముఖ్యోద్దేశము వేదాంత వాక్య ప్రసూనములను ప్రోగు చేసి ఒక్క దారముతో హారము కూర్చుటయే. ఉపనిషత్తుల ప్రమాణమునకు లోబడి యున్నంత వఱకు మాత్రమే ఆ సూత్రములు అంగీకరింప బడుచున్నవి. అంతకు మించిన ప్రామాణికత వానికి లేదు.

నేను చెప్పినటుల భారతదేశములోని అన్ని సంప్రదాయముల వారును ఈ వ్యాససూత్రములను పరమ ప్రమాణముగా అంగీకరించుచున్నారు. భారతదేశములోని ప్రతి నూతన సంప్రదాయమును తన దృక్పథానుకూలముగా ఈ వ్యాససూత్రములకు ఒక క్రొత్త వ్యాఖ్యానమును కూర్చుటకు యత్నించును. ఈ భాష్యకర్తలలో గల భేదములు

ఒక్కొక్కప్పుడు చాల గొప్పవిగా నుండును. కొన్ని సమయములందు వారు శ్రుతివాక్యములను తికమకలు చేయుట కూడ వెగటు పుట్టుచుండును. వ్యాససూత్రములకు పరమ ప్రమాణ పదవి సిద్ధించినది. ఎవనికి గాని వేదాంత సూత్రముల మీాద ఒక నూతన భాష్యమును రచించు వఱకును భారతదేశములో క్రొత్త సంప్రదాయమును నిర్మించు నధికారము కలుగదు.

ఆ పిమ్మటి ప్రామాణికత భగవద్గీతకు కలదు. సుప్రసిద్ధమగు శంకరాచార్యులవారి ఘనత అంతయు గీతాప్రచారము నందే యున్నది. గీతను బోధించుట, దానిని గురించి బహుసుందరమగు భాష్యమును రచించుట ఈ మహాపురుషుడు తన దివ్యజీవితమున గావించిన అనేక ఘనకార్యములలోని కెల్ల ఉత్తమోత్తమ కార్యము. భారతదేశమున ఆస్తిక సంప్రదాయనిర్మాత లందఱును ఆ పిదప ప్రతివారును ఒక్కొక్క గీతాభాష్యమును రచించియున్నారు.

ఉపనిషత్తులు పెక్కులు కలవు. అవి నూట ఎనిమిది అని ప్రతీతి. కాని ఇంకను చాల కలవని కొందఱనుచున్నారు. వీనిలో కొన్ని అనంతరకాల విరచితములనుట స్పష్టము. ఉదాహరణగా అల్లాను స్తోత్రము చేయునట్టియు, మహమ్మదును రజసుల్లా అని పేర్కొను నట్టియు అల్లోపనిషత్తు ఒకటి గలదు. ఇది హిందువులకును, మహమ్మదీయులకును, పఖ్యము కూర్చుటకై అగ్బరు కాలమున వ్రాయబడిన దట. ఎక్కడనో సంహితలయందు ఒకచోట అల్లా శబ్దమో, ఇల్లా

శబ్దమో దొరకగానే దానిని పట్టుకొని దాని ఆధారమున ఒక ఉపనిషత్తును వ్రాసివేసిరి. ఈ రీతిగా అల్లోపనిషత్తులో మహమ్మదు "రజసుల్లా" అయిపోయినాడు—దాని అర్థము ఏమైనను కానిండు. ఇతర సాంప్రదాయికములగు ఉపనిషత్తులుకూడ ఇట్టివే గలవు. అవి కేవల నవీనములని మనము కనిపట్ట గలము. వేదములలో సంహితాభాగము నందలి భాష అతి ప్రాచీన మైనది. ఆ ప్రాచీనభాషకు వ్యాకరణములేదు. కావున ఉపనిషత్తులను సృష్టించుట చాల సులభమైనపని. కొన్ని సంవత్సరముల క్రిందట వేదభాష యొక్క వ్యాకరణము నేర్చుకొను భావము నాకు కలిగెను. అంతట పట్టుదలతో పాణినీయ వ్యాకరణమును, మహాభాష్యమును చదువుట ప్రారంభించితిని. వైదికవ్యాకరణము సూత్రములకుగల అపవాదములతో నిండియుండుట జూచి అబ్బుర పడితిని. ఒక సూత్రము ఉండును. దాని క్రిందనే ఈసూత్రము అపవాద రూప మైనది అను వ్యాఖ్యానము గోచరించును. కాబట్టి ఎవరైనను, దేని నైనను రచించుటకు ఎంత స్వేచ్ఛ గలదో చూడుడు. ఈ స్వేచ్ఛను కొంత నిరోధించునది యాస్కుని నిఘంటువు ఒక్కటియే, కాని చాలవఱకు ఇందులో నుండునవి అసంఖ్యాకములగు సమానార్థకపదములు మాత్రమే. ఈపరిస్థితులలో మీకిష్టమువచ్చినన్ని ఉపనిషత్తులను వ్రాయుట ఎంత తేలికయో చూడుడు. ప్రాచీన వైదిక శబ్దములవలె నుండునట్లు చేయుటకు వలయు మాటలను కొంచెము సంస్కృత భాషాజ్ఞానమును సంపాదించు కొనిన చాలును. వ్యాకరణ భయము లేదు! కావున

మీరు రజసుల్లానో, మఱేయితర సుల్లానో ఆవాహనము చేయవచ్చును. ఈ రీతిగా ఉపనిషత్తులనేకములు సృజింప బడినవి. ఇప్పుడు గూడ అట్టివి సృజింపబడుచునే యున్నవని నావినికి. భారతదేశమున కొన్ని ప్రాంతములందు వేర్వేఱు తెగల వారు అట్టి ఉపనిషత్తులను సృజించుచున్నారని నాకు చక్కగా తెలియును. అయినను కొన్ని ఉపనిషత్తులలో, చూచిన మాత్రముననే సత్యసిద్ధములని తెలుపు గుఱుతులు కలవు. ఇట్టివానిని మహాభాష్యకర్తలు, అందును ముఖ్యముగా శంకరులు, ఆ పిదప రామానుజులు మొదలగు ఆచార్యపురుషులు తీసికొని వానిపై వ్యాఖ్యానములను రచించియున్నారు.

ఉపనిషత్తులను గుఱించి మీకు నేను తెలుప తలంచిన ఇంక నొకటి రెండు భావములుకలవు. అవి ఒక జ్ఞానమహా సముద్రము. కావున వానిని గుఱించి మాటాడుటకు నావంటి అల్పజ్ఞునకు సైతము ఏండ్లును పూండ్లును పట్టును. ఎన్నో ఉపన్యాసము లీయవలసియుండును. అందుచే వానినిపఠించువా రెఱుగవలసిన ఒకటి రెండు విషయములు మాత్రము మీకు తెలుపుదును. మొట్టమొదటిది: ప్రపంచములోనెల్ల అవి అత్యద్భుతములగు కావ్యములు. మీరు వేదములలోని సంహితాభాగమును చదివిన యెడల అప్పుడప్పుడు అత్యద్భుతములగు రమణీయ వాక్యములు మీకు గోచరించును. ఉదాహరణకు—"తమ ఆసీత్తమసాగూఢమగ్రే" "చీకటి చీకటిలో మాటువడి నప్పుడు" మున్నగు 'అవ్యక్త' వర్ణనగల సుప్రసిద్ధ శ్లోక మొకటి కలదు. ఆ కవిత్వమును చదివినచో

అందలి ఉదాత్తత అనుభవమునకు వచ్చును. భారతదేశము నందును ఇతరదేశములందునుకూడ సుందరమగుదానిని వర్ణన చేయు ప్రయత్నములు జరిగెనని మీరు గుర్తించు కొనుడు. కాని ఆ అన్యదేశీయు లెప్పుడును కండరము లందును, దృశ్యప్రపంచము నందును, జడపదార్థమునం దును, ఆకాశమునందును, అఖండత్వమును కనుగొనుటకే యత్నించిరి. మిల్టన్‌గాని, డాంటీగాని లేక ఏ పాశ్చాత్య కవి వరుడుగాని ప్రాచీనుడైనను, అర్వాచీనుడైనను అఖండ తత్త్వముయొక్క స్వరూపమును చిత్రింప గోరునప్పుడు వెలు పలికి ఎగిరి పో జూచును. ఉపాధి మూలమున అఖండ తత్త్వమును నీ అనుభవమునకు తీసికొనిరా ప్రయత్నించును. అట్టి ప్రయత్నము ఇక్కడ కూడ జరిగినది. సంహితలందు అఖండవ్యాప్తి కన్నులకు కట్టినట్లు అద్భుతముగా ప్రదర్శింప బడినది. ఇంకెక్కడను అంత అద్భుత చిత్రణము కానిపిం పదు. ''తమ ఆసీత్తమసాగూఢమ్'' అను పైవాక్యమును గుర్తుంచుకొని చీకటిని గుఱించి ముగ్గురు కవులుచేసిన వర్ణ నలను పరిశీలింపుడు. మన కాళిదాసు ''సూచీభేద్యై స్తమోభిః'' (సూది మొనతో గ్రుచ్చగల తమస్సు) అని వర్ణించినాడు. ఇక మిల్టనో ''కాంతికాదు, రూపముదాల్చిన అంధకారము'' అని వర్ణించినాడు. ఇక ఉపనిషత్తునందలి వర్ణనచూడుడు : ''చీకటి చీకటిని ఆవరించినది'' లేక ''చీకటి చీకటియందు దాగినది''. ఉష్ణదేశములందు నివ సించు మనకిది అర్థము కాగలదు. ఆకస్మికముగ వర్షాగమన మగును. కాఱుమబ్బులు ఆకసమంతటను అలముకొనును.

ఇంకను ఎటనుండియో దొరలుకొని వచ్చు నల్లని మేఘములచే ఆవరింపబడి ఒక్క క్షణములో దిఙ్మండలము చీకట్లు క్రమ్మును. సంహితా భాగమునందలి ఈ వర్ణనలన్నియు దృశ్యప్రపంచమునకు సంబంధించినవే. ఇతర దేశములందు వలెనే ఇక్కడను ఈ జీవిత మహాసమస్య యొక్క పరిష్కారప్రయత్నములు బాహ్యప్రపంచము ద్వారమున జరిగినవి. జిజ్ఞాసువులగు గ్రీకులును, ఇప్పటి యూరపియనులును "జీవము" "పురుషుడు" మున్నగు అనేక పవిత్ర సమస్యలన్నిటికిని బాహ్యప్రపంచమునందే పరిష్కారమును అన్వేషింప ప్రయత్నించిరి. మన పూర్వులును అటులే చేసిరి. వారును యూరపియనులవలెనే విఫలులైరి. కాని పాశ్చాత్యులు ఇంకే ప్రయత్నమును చేయలేదు. అక్కడనే నిలిచి పోయిరి. ఈ జననమరణ మహాసమస్యల పరిష్కారము కొఱకు బాహ్యప్రపంచముననే వెదుకసాగిరి. బురదలో దిగబడినటుల అచ్చటనే ఆగిపోయిరి. మనపూర్వులుకూడ అది అసాధ్యమని కనుగొనిరి; కాని ఆ పరిష్కారమును తెలిసికొనుటకు ఈ ఇంద్రియములు ఎంతమాత్రమును సమర్థములు కావని ధైర్యముతో ప్రకటించిరి. ఈ నిర్ణయము ఉపనిషత్తునందు కంటె మిన్నగా మఱెచ్చటను ప్రకటింపబడ లేదు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (అక్కడనుండి మనస్సుతోసహా వాక్కు వెనుకకు మరలివచ్చును.) "న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి" (ఈ నేత్రములు అచటికి పోజాలవు. వాక్కును చేరజాలదు.) ఈ విధముగా ఇంద్రియములు బొత్తుగా అస

మర్థములని ప్రకటించు వాక్యములనేకములు గలవు. కాని వారంతటఆగి పోక నరుని ఆభ్యంతర ప్రకృతి మీదికి దృష్టిని మరల్చి, తమ ఆత్మవలన సమస్యాపరిష్కారము సాధించుటకు యత్నించిరి. అనగా, బాహ్యప్రకృతియందు ఏమి చేయుటకును వీలులేక పోవుటచేతను, ప్రత్యుత్తరము గాని ఆశగాని, దొరకక పోవుటచేతను, వారు దృశ్య ప్రకృతిని పూర్తిగ వదలి వేసిరి. ఈ మూఢమగు నిర్జీవ పదార్థము సత్యమును తెలుప జాలదని వారు గ్రహించిరి. అంతట నరునిలోని దివ్యాత్మ కడకు మరలి పోయి అక్కడ సమస్యాపరిష్కారమును కనుగొనిరి.

'తమేవైకం జానథ, ఆత్మానాం అన్యా వాచో విముంచథ' (ఈ ఆత్మను మాత్రమే తెలిసికొనుడు. ఇతర మంతయు వ్యర్థ ప్రసంగము. అది చేయకుడు, వినకుడు) అని వారు ఘోషించు చున్నారు. ఆత్మయందు వారికి సంశయ పరిష్కారము చిక్కినది. అందే అన్ని ఆత్మలకు పరమాత్మ, దేవుడు, జగదీశ్వరుడు; నరుని ఆత్మతో వానికి గల సంబంధము; మనము వానియెడల నిర్వర్తింప వలసిన ధర్మము; తద్వారా పరస్పరము మనలో మనకు ఏర్పడు సంబంధము: ఇవన్నియు వారికి విశదమైనవి. మఱియు ఈ సందర్భముననే ప్రపంచమున గల కవిత్వములో మనోహరతమ మగునది కలదు. జడప్రపంచపు భాషలో ఈ ఆత్మను వర్ణన చేయు ప్రయత్నము ఇంక వారు చేయలేదు. ఇంతేల వారు ఆవర్ణనమున ప్రత్యక్షరూపమగు భాషనే విసర్జించి వేసిరి. ఇంద్రియములకు అఖండ బ్రహ్మమును

గుఱించిన భావమును కలిగించుటకై ఆ ఇంద్రియముల కడకు వారికి దిగి రాలేను. దృశ్యమానమును, జడమును, నిర్జీవమును, పంచభూతమయమును, ఇంద్రియ గమ్యమును, విశాలమును అగు అనంతలోకము మరల అందు గోచరింపదు. దానికి మారుగా మరియొకటి వచ్చును. ఈ క్రింది మనోహర వర్ణనము అందు కుదాహరణముగా కైకొనుడు :

"న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం
నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః
తమేవ భాంతమనుభాతి సర్వం తస్య
భాసా సర్వమిదం విభాతి ॥"

అహో! ప్రపంచములో దీనిని మించిన ఉదాత్త కవిత్వము ఏది! (అచ్చట సూర్యుడు ప్రకాశింపజాలడు. చంద్రుడు, నక్షత్రములు ప్రకాశింపజాలవు. మెఱుపు సైతము ప్రకాశింపజాలదు. ఇక ఈ అగ్ని మాట చెప్పనేల?) ఆహా! లోకమున ఇంతకన్నను మహోదాత్తమగు కవిత్వము ఉండగలదా! ఉపనిషత్తులలోని కెల్ల అత్యద్భుతమగు కఠోపనిషత్తును కైకొనుడు. ఎటువంటి అద్భుతనైపుణ్యము, ఎటువంటి విచిత్ర కళాసంపత్తి ఆ కావ్యమునందు గోచరించుచున్నది! దాని ప్రారంభమే అబ్బురము గొల్పుచున్నది. శ్రద్ధచేత ఆవహింపబడిన లేబ్రాయపు కుఱ్ఱడు యముని చూడగోరును. గురువులలో నెల్ల కడు చిత్రమూర్తి యగు మృత్యుదేవతయే జనన మరణముల గుఱించిన మహారహస్యములను ఆ పిల్లవానికి బోధించును.

ఆ పిల్లవాని వాంఛితార్థము ఏది ? మరణముయొక్క రహస్య మును కనుగొనుట !

మీరు జ్ఞప్తియందుంచు కొనవలయునని నేను కోరెడు రెండవవిషయము ఇది. ఉపనిషత్తుల ప్రామాణికత మానవులపై ఆధారపడనే పడదు. వానియందు అనేకపురుషులు, అనేక వక్తలు, అనేక గురువులు ఉదాహరింపబడియుండుట నిజమేకాని, వానిలో ఒక్కడైనను ఈ ఉపనిషత్తులకు ఆధారభూతుడుకాడు. ఒక్క శ్లోకమైనను వారిలో నొకని జీవితముపై ఆధారపడి యుండలేదు. వీరందఱును వెనుక నెక్కడనో మెదలుచు వారి నీడలుమాత్రము తెరమీాద కానిపించునో అన్నట్లుందురు. వారు పట్టుకొనుటకు చిక్కరు. చూపులకు దొరకరు. ఇట్టివారని విస్పష్టముగా గోచరింపరు. ఉపనిషత్తులు వారిపై నాధారపడినవి కానేకావు. వానికి గల బలమంతయు అందలి అత్యద్భుతములు, దేదీప్యమానములు, జ్ఞానతేజోమయములు అగు వాక్యములందేకలదు; రచయితలమీాద కాదు. యాజ్ఞవల్క్యులు ఇరువదిమంది పుట్టుదురుగాక, జీవింతురుగాక, మరణింతురుగాక లెక్కలేదు. లెక్కకువచ్చునవి శ్రుతి వాక్యములే. శ్రుతివాక్యములు వ్యక్తులపై ఆధారపడనివి, కాని యేవ్యక్తులను ఖండింపవుకూడ. ప్రపంచమున ఇదివఱకు ఉద్భవించినట్టియు ఇంక నుద్భవింపనున్నట్టియు వ్యక్తులనందఱిని తన కౌగిట చేర్చుకొన జాలునంతటి విశాలత, ఆదరణ అందుకలవు. నరులను, అవతారులను, ఋషివరులను పూజించుటకు అది అడ్డు చెప్పదు. పైగా అట్టి దానిని సదా సమర్థించును. కాని

దానికి మానవులతో సంబంధము లేదు. ఉపనిషత్తులు ప్రతి పాదించు ఈశ్వరునికి అనగా నిర్గుణునికి పురుషభావ మెట్లు లేదో అట్లే అందలి వాక్యములకును పురుషాధారము, పురుషసంబంధము లేకుండుట అద్భుతమగు విషయము. ఆధునిక భౌతికశాస్త్రజ్ఞుడు సత్యమెంత అనన్యాధారమై యుండగోరునో అంత స్వయంప్రామాణికతతో ఈ ఉపనిష త్సత్యములు జ్ఞానసిద్ధులకును, జిజ్ఞాసువులకును, తత్త్వజ్ఞులకును, తార్కికులకును గోచరించును. ఇవియే మన ప్రమాణ గ్రంథములు. క్రైస్తవులకు బైబులు ఎట్టిదో, మహమ్మ దీయులకు ఖురాను ఎట్టిదో, బౌద్ధులకు త్రిపిటకము ఎట్టిదో, పారశీకులకు జండఅవెస్టా ఎట్టిదో మనకు ఉపనిషత్తులు అట్టి వని మీరు జ్ఞప్తియందుంచుకొనవలయును. పురాణములు, తంత్రములు మున్నగు గ్రంథములన్నియు, చివరకు వ్యాస సూత్రములు సైతము, ద్వితీయములును తృతీయములును అగు ప్రమాణములే. ప్రప్రథమ ప్రమాణము వేదములు. మనుధర్మశాస్త్రముగాని, పురాణములుగాని మఱి ఏ ఇతర గ్రంథములుగాని ఉపనిషత్తుల కనుకూలముగానుండు నంత వఱకే పరిగ్రాహ్యములు. ప్రతికూలములగునప్పుడు నిర్దా క్షిణ్యముగ వానిని త్రోసి వేయవలసినదే. ఈవిషయము మనము ఎల్లప్పుడును జ్ఞప్తియందుంచుకొనదగినది. కాని దురదృష్టము వలన భారతదేశము ఈ కాలమున ఆ మాట మఱచి పోయినది. ఏ అల్పగ్రామాచారమో మన కిప్పుడు యథార్థమగు ప్రమాణముగా కాన్పించుచున్నది. ఉపని షత్తులబోధ అటుల కాన్పించుట లేదు. వంగదేశమున

ఏ మారుమూల గ్రామములోనో వాడుకలో నున్న స్వల్పాభిప్రాయము వేదవాక్యమంతటి అధికారము కలదిగా, అంతకంటె అధికమైనదిగా కూడ పరిగణింపబడుచున్నది. 'పూర్వాచారము' అను శబ్దమునకు ఎంతటి విచిత్ర మహిమ కలదో చూడుడు! గ్రామవాసికి కర్మకాండలోని అత్యల్పాంశమొక్కటి అత్యధిక గౌరవాస్పదమగు సదాచారముగా కాన్పించుచున్నది. దానిని అనుసరింపనియెడల వానిని "పో, నీ వింక హిందువుడవు కావు" అని నెట్టి వేయుదురు. అటులే ఏదో ఒక తంత్రమును చేపట్టి "ఈ తాంత్రికాచారమును అనుసరించి తీరవలయు" ననెడు వారు దురదృష్టవశమున నా మాతృభూమియందు అసంఖ్యాకముగా నున్నారు. వారి అభిప్రాయములో అటుల చేయనివాడు సదాచారి కాడు. కాబట్టి ఉపనిషత్తులయందే ప్రధాన ప్రామాణ్యము కలదనియు, గృహ్యసూత్రములకు శ్రౌత సూత్రములకు సైతము వేదములకంటె తక్కువ ప్రామాణ్యమే కలదనియు జ్ఞప్తియందుంచుకొనుట మనకుముఖ్యము. అవి మనపూర్వులగు మహాఋషుల వాక్కులు. నీవు హిందువు కాగోరుదువేని వానిని విశ్వసింప వలయును. భగవంతుని గురించి నీకు ఏవేవో స్వతంత్రభావము లుండ వచ్చును. కాని వేదములు ప్రమాణములు కావంటివా నీవు నాస్తికుడవే. క్రైస్తవులయొక్కయు బౌద్ధులయొక్కయు మత గ్రంథములకును, మన మతగ్రంథములకును భేదము ఇక్కడనే యున్నది. వారివన్నియు పురాణములే, శాస్త్రగ్రంథములు కావు. ఏలయన వానియందు జలప్రళయకథనమును,

రాజవంశ చరిత్రలును, రాజజీవితములును, మహాపురుషుల జీవితములును నిట్టి వనేకము లభివర్ణింపబడియున్నవి. ఇది పురాణ లక్షణము. అవి వేదములకు అనుగుణముగానున్నంత వఱకు మంచివే; బైబులును, ఇతరజాతుల ధర్మగ్రంథములును వేదములను అనుసరించినంతవఱకు పూర్ణముగా యోగ్యమైనవే, వ్యతిరేకముగా నున్నపుడు, గ్రాహ్యములు కాజాలవు. ఖురాన్ విషయముకూడ అంతియే. దానియందు నీతిబోధలు అనేకము కలవు. అవి వేదములకు అనుగుణముగా నున్నంతవఱకు వానికి పురాణములతో సమానమగు ప్రామాణికత సిద్ధించును. అంతకుమించిన గౌరవము లేదు. మనవేదములు అపౌరుషేయములనియు, వానికి ఆదిలేదనియు హిందూమత భావము. ఒక క్రైస్తవమతప్రచారకుడు తమ మతగ్రంథములు చారిత్రక లక్షణములు కలవిగాన అవి సత్యములని నాతో ఒకప్పుడు చెప్పినాడు. అందులకు నేనిట్లు ప్రత్యుత్తరము చెప్పితిని. "మా శాస్త్రములకు చారిత్రక లక్షణములు లేవు. అందువలననే అవి సత్యములైనవి. మీవి చరిత్రాత్మకములు కాబట్టి ఎవడో ఒకడు ఇటీవల వానిని వ్రాసియుండును. మీవి మానవనిర్మితములు; నావియో అట్టివికావు. నావానికి చారిత్రక లక్షణము లేకపోవుటయే వానికి వన్నె దెచ్చుచున్నది" ఇదియే వేదములకును ఈ నాడు ప్రపంచమునకల ఇతర మత గ్రంథములన్నింటికిని గల తారతమ్యము!

ఇక ఉపనిషత్తుల బోధలను విచారింతము. భిన్న భిన్నములగు వాక్యములు వానియందు కలవు. అందు కొన్ని

పూర్తిగా ద్వైతపరములు, మరికొన్ని అద్వైతపరములు. అయినను భారతదేశమునగల వివిధ శాఖా సంప్రదాయముల వారందఱిచేతను అంగీకరింపబడిన సిద్ధాంతములు కొన్ని కలవు. ఒకటి సంసారమును గుఱించిన, అనగా జీవుని జన్మాంతరమును గుఱించిన, సిద్ధాంతము. రెండవది మానసిక శాస్త్రవిషయమందలి ఏకీభావము. మొదట శరీర మొకటి యున్నది. దానిలోపల సూక్ష్మశరీరమన బడెడు మనస్సు కలదు. దానికిని లోపల జీవుడుండును. పాశ్చాత్యుల మానసిక శాస్త్రమునకును, భారతీయుల మానసిక శాస్త్రమునకును ఇదియే ముఖ్య భేదము. పాశ్చాత్య మన స్తత్త్వశాస్త్రమునందు మనస్సే ఆత్మయనబడును. ఇక్కడనో అటులకాదు. అంతఃకరణము (లోపలనుండు ఉపకరణము) అనబడెడు మనస్సు జీవుని స్వాధీనములో నుండు ఒక పనిముట్టు మాత్రమే. దీనిసాహాయ్యమున జీవుడు శరీరముమీదను, బాహ్యప్రపంచముమీదను పని చేయును. ఈ విషయమున అందఱికిని ఏకాభిప్రాయము కలదు. ఈ జీవుడు లేక ఆత్మ (లేక జీవాత్మ అని కొన్ని సంప్రదాయముల వారిచేత పిలువబడునది) ఆదిలేనిదియు, నిత్యమును అనియు, అది తుదిని మోక్షమును పొందువఱకు జన్మపరంపరలను పొందుచు సాగిపోవును అనియు అందఱును అంగీకరించుచున్నారు. ఇంకొక విషయమునందు గూడ వీరందఱును ఏకీభవించుచున్నారు. పాశ్చాత్యసిద్ధాంతమునకును భారతీయసిద్ధాంతమునకును గల ప్రాణప్రాయమగు భేదమును అత్యంత స్పష్టముగా అత్యంత ప్రధానముగా

ఇదియే గుర్తింపజేయును. సర్వమును ఆత్మయందే కలదనెడు సిద్ధాంతమే ఇది. ఎక్కడనో వెలుపలనుండి వచ్చునదేదియు లేదు. నిజమునకు అంతయు లోపలినుండి వెలికి వచ్చునదే. సకల శక్తులును, సర్వపవిత్రతయు, సమస్త మహనీయతయు ఆత్మయందే ఉన్నవి. యోగి పొందగోరు అణిమ, లఘిమ, గరిమ, మొదలగు అష్టసిద్ధులు, నిజమునకు "సంపాదింపబడునవి" కావనియు, అవి ఇదివరకే ఆత్మలో నున్నవి గనుక వానిని వ్యక్తరూపమునకు తెచ్చుటకే తాను ప్రయత్నించుచున్నాననియు యోగి చెప్పును. మీ పాదముక్రింద ప్రాకులాడు అత్యల్ప క్రిమియందు సైతము ఈ ఎనిమిది విధములగు యోగసిద్ధులును ఇదివఱకే ఉన్నవని పతంజలి చెప్పుచున్నాడు. భేదమంతయు శరీరమువలన అనగా ఉపాధివలన కల్పితమగుచున్నది. ఆ క్రిమి ఉత్తమతర శరీరమును పడసినతోడ్తోడనే ఈ మహిమలు వ్యక్తములగును. అంతేగాని అవి అక్కడ నున్నవే! "నిమిత్తమప్రయోజకం ప్రకృతీనాం వరణభేదస్తు తతః క్షేత్రికవత్" (సత్కార్యములుగాని దుష్కార్యములుగాని స్వభావ పరివర్తనమునకు ప్రత్యక్ష కారణములు కావు. కాని అవి ప్రకృతి పరిణామమున కడ్డుపడు ఆటంకములను ఛేదించుటకు మాత్రమే పనికివచ్చును — సేద్యగాడు నీటి మార్గమును అడ్డగించు దిబ్బలను ఛేదించినంతనే ఆ నీరు తన స్వభావము చేతనే ప్రవహించునట్లు.) ఎక్కడనో ఉన్న మహాతటాకము నుండి తనపొలములోనికి నీటిని పాఱించుకొను సేద్యగాని సుప్రసిద్ధోదాహరణమును ఈ సందర్భమున పతంజలి ఇచ్చు

చున్నాడు. తటాకము ఇదివఱకే నీటితో నిండి యున్నది. ఒక్కక్షణములో అది వాని పొలమును నించివేసియుండును. కాని పొలమునకును, తటాకమునకును పెద్దకట్ట అడ్డమున్నది. ఈ అడ్డము తొలగింపగానే ఆ నీరు స్వశక్తిచేతను, స్వబలము చేతను పరుగులిడి వచ్చును. ఈ ప్రబల శక్తియు, పవిత్రతయు, పూర్ణతయు ఇదివఱకే ఆత్మయందున్నవి. ఉన్న అవరోధ మంతయు దానిపైని కప్పియున్న ముసుగునుబోలు ఈ ఆవరణమే. ఎప్పుడు ఈ ముసుగు తొలగునో అప్పుడే ఆత్మ పవిత్రతను పడయును; దాని మహిమలన్నియు వ్యక్తరూప మొందును. పాశ్చాత్య భావమునకును ప్రాచ్య భావమున కును గల మహాభేదమిదియేయని మీరుజ్ఞప్తియందుంచుకొన వలయును. ఈభావభేదమువలననే "మానవులు ఆజన్మ పాపులు" మున్నగు విపరీత సిద్ధాంతములను బోధించుటయు, అట్టి విపరీత సిద్ధాంతములను విశ్వసింపని మనబోంట్లను దుశ్చరితులనుటయు కలుగుచున్నది. మనము స్వాభావిక ముగనే దుష్టులమైన యెడల మన మింకెన్నడును యోగ్యు లము కాజాలమని వారు నిదానించి ఆలోచింపరు — స్వభా వము మాఱనేరదు గదా. మాఱినచో దానిని స్వభావ మనుటలో భావవైరుద్ధ్యము కలదు. — మారునది స్వభా వము కాజాలదు. మనము దీనిని జ్ఞప్తియందుంచుకొన వలయును. ఈ విషయమున ద్వైతులును, అద్వైతులును, భారతదేశములోని తక్కిన వారందఱును ఏకాభిప్రాయు లుగ నున్నారు.

భారత దేశమున అన్ని సంప్రదాయములవారును విశ్వ సించెడు మఱియొక విషయము దేవుడు కలడనుట. దేవుని గుఱించి వారి భావములు భిన్నములనుట నిజమే. ద్వైతులు సగుణబ్రహ్మమును — సగుణబ్రహ్మమునే — విశ్వసింతురు. సగుణుడు అను మాటయొక్క అర్థమును మీరింక కొంచెము వివరముగా తెలిసికొనవలయునని కోరుచున్నాను. భగవంతు నకు ఒకశరీరము కలదనియు, అతడు ఎక్కడనో ఒక సింహాసనముమీద కూర్చుండి ఈ ప్రపంచమును ఏలుచుండు ననియు ఆ మాటకు అర్థముకాదు. సగుణు డనగా గుణము లతో కూడిన వాడు అనియే అర్థము. సగుణదైవతము యొక్క వర్ణనలు అనేకములున్నవి. ఈ జగత్తుయొక్క పరిపాలకుడుగను, సృష్టికర్తగను, రక్షకుడుగను, లయకర్త గను ఉండు ఈ సగుణదైవతమును అన్ని సంప్రదాయముల వారును నమ్ముదురు. కాని అద్వైతులు మఱికొంతకూడ నమ్ముదురు. గుణనిరూపణము పొసగనిచోట ఏ విశేషణ మును పనికిరాదు. ఈ సగుణదైవతమునకు ఒక ఉన్నతదశ కలదనియు, అం దది సగుణ నిర్గుణమై భాసించుననియు వారి నమ్మకము. విశేషములు లేనివానిని వర్ణించు విశేషణము లెట్లుండగలవు? కావున అద్వైతి భగవంతునకు సత్తు, చిత్తు, ఆనందము అనెడు మూటిని తప్ప ఏ గుణములను ఆరో పింపడు. అఖండ సచ్చిదానందమనియే అద్వైతియొక్క భగవద్వర్ణనము. శంకరాచార్యులవారు చేసినది ఇదియే. కాని ఉపనిషత్తు లింకను లోతునకు దిగి ఆ బ్రహ్మమును గుఱించి "నేతి, నేతి" అనగా "ఇది కాదు, ఇది కాదు"

అనుటతప్ప ఇంకేమియును వివరించుటకు వీలుకాదని చెప్పు చున్నవి.

భారతదేశమునందలి భిన్నసంప్రదాయములన్నియు ఈ యంశమునందు ఏకీభవించుచున్నవి. కాని ద్వైత పక్షమునుగూర్చి మాటాడునప్పుడు, ద్వైతసిద్ధాంతములకు ఆధునిక ముఖ్యప్రతినిధి యగు శ్రీ రామానుజాచార్యుల వారిని భారతదేశములోని ద్వైతులకు ఆదర్శమూర్తినిగా భావించి మాటాడుదును. ఈ భారతదేశములో ఇతర ప్రాంతములందు పుట్టిన మహామతకర్తలను గుఱించి వంగ దేశములోని మన ప్రజలకు తెలిసినది బహుస్వల్పము. ఇది మిక్కిలి శోచనీయము. మహమ్మదీయ యుగమునందు ఒక్క మన చైతన్యులవారు తప్ప, తక్కిన గొప్ప మతకర్త లందఱును దక్షిణ భారతదేశమునందే జన్మించిరి. దక్షిణ భారతదేశపు మేధాబలమే ఇప్పుడు నిజముగా భారత దేశమును పరిపాలించుచున్నది. ఏలయందురా, చైతన్యుల వారు సైతము అచ్చటి సంప్రదాయములలో ఒకటియగు మధ్వసంప్రదాయములోని యొక శాఖకు చెందినవారే! రామానుజాచార్యులవారి సిద్ధాంతము ననుసరించి దేవుడు, జీవుడు, ప్రకృతి అనెడు మూడును శాశ్వతమైనవి. జీవులు నిత్యులు; సర్వకాలము వ్యక్తిస్వరూపులై శాశ్వతముగ నుందురు. వాని వ్యక్తిత్వ మెప్పటికిని అట్లే నిలిచియుండును. మీ ఆత్మ శాశ్వతకాలము నా ఆత్మనుండి వేఱుపడియే యుండునని రామానుజాచార్యులవారు పల్కుచున్నారు! ఆత్మ కలదనుటయు భగవంతుడు కలడనుటయు ఎటుల

యథార్థమో, ఈ ప్రకృతి శాశ్వతమై యుండుననుటయు అటుల యథార్థమే. ప్రకృతికూడ శాశ్వతముగా వేరు పడియే నిలిచియుండును. భగవంతుడు సర్వాంతర్గతుడును, జీవాత్మకు సారభూతుడగువాడును. అతడు అంతర్యామి. ఈ అర్థమున భగవంతుడు ఆత్మతో ఐక్యమై యుండుననియు ఆత్మకు మూలసత్త్వమనియు ఒక్కొకప్పుడు రామానుజుల వారు భావించుచున్నారు. ప్రళయకాలమునందు ప్రకృతి యంతయు "సంకుచిత" మగునప్పుడు ఈ ఆత్మలన్నియు సంకోచముపొంది అనగా ముడుచుకొని నలుసులువలె నేర్పడి అటుల కొంత కాలము నిలిచియుండునని ఆయన అభిప్రాయము. ఆ పిమ్మట కల్పారంభమున ఈ ఆత్మలన్నియు తమ తమ పూర్వకర్మానుసారముగా వెలువడి వచ్చి ఆ కర్మఫలములను అనుభవించుచుండును. ఆత్మయొక్క సహజమగు అమలత్వమును, పూర్ణత్వమును, సంకోచపఱచు ప్రతి కార్యమును పాపకార్యమనియు ఆ ఆత్మను వెలికిదీసి వికసింపజేయు ప్రతి కర్మయు పుణ్యకార్యమనియు శ్రీ రామానుజులవారు చెప్పుచున్నారు. ఆత్మయొక్క వికాసమునకు తోడ్పడు ప్రతి కార్యమును ధర్మమగును. దానిని సంకోచింపజేయునదెల్ల అధర్మమగును. ఇటుల ఆత్మ తనకర్మలచేత వికాసమును సంకోచమును పొందుచు పోయి పోయి భగవదనుగ్రహము వలన తుదకు మోక్షమును పడయును. అటువంటి అనుగ్రహము కొఱకు నిష్కళంకముగా తీవ్రప్రయత్నము చేయునట్టి అన్ని ఆత్మలకును ఆ భగవదనుగ్రహము లభించునని శ్రీ రామానుజాచార్యులవారు చెప్పుచున్నారు.

"ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః" అను ప్రసిద్ధవాక్యము శ్రుతియందు గలదు. — ఆహారము శుద్ధముగా నున్నప్పుడు సత్త్వము శుద్ధమగును. సత్త్వము శుద్ధమగునప్పుడు స్మృతి శుద్ధమగును. స్మృతి అనగా "ఈశ్వరజ్ఞప్తి"; నీవు అద్వైతి వైనచో "మన పరిపూర్ణతయొక్క జ్ఞప్తి" అని అర్థము చెప్పుకొనవచ్చును. సత్త్వము శుద్ధముగా నున్నప్పుడు ఈ స్మృతి సత్యతరమును, స్థిరతరమును, అవ్యయమును అగును. ఇది యొక మహా వివాదఘట్టము. మొట్టమొదట "సత్త్వము" అనగా ఏమి? శరీరము మూడువిధములగు పదార్థముల కూడిక చేత ఏర్పడు చున్నది—గుణముల చేత కాదు. ఇది సాంఖ్యసిద్ధాంతము; దీనిని మన తత్త్వసాంప్రదాయికులందఱును అంగీకరించు చున్నారు. సత్త్వము, రజస్సు, తమస్సు అనునవి గుణము లని సామాన్యముగా అభిప్రాయపడుచున్నారు. అటుల కాదు. అవి ఎంతమాత్రమును గుణములు కావు. అవి ఈ జగత్తుగా ఏర్పడిన ద్రవ్యములే! ఆహారశుద్ధితో, అనగా ఆహారము పరిశుభ్రముగానున్న యెడల సత్త్వమను ద్రవ్యము శుద్ధమగుచుండును. ఇట్టి సత్త్వమును సంపాదించుటే వేదాంతముయొక్క ప్రధానాశయము. నే నిదివఱకే చెప్పి యున్నటుల ఆత్మ స్వతస్సిద్ధముగా శుద్ధమును పూర్ణమును అయినది. కాని అది రజస్సు, తమస్సులయొక్క అణువు లతో ఆవరింపబడి పోయినదని వేదాంత సిద్ధాంతము. ఈ మూటిలో సత్త్వాణువులు మిక్కిలి ప్రకాశవంతములుగా నుండును. వెలుతురు అద్దముగుండ చొచ్చుకొని పోగలంత

సులభముగా ఆత్మయొక్క ప్రకాశము ఈ సత్త్వాణువుల నుండి చొచ్చుకొని పోగలదు. కాబట్టి రజస్తమస్సుల అణువులు పోయి సత్త్వాణువులు మిగులునెడల, ఆ దశ యందు ఆత్మయొక్క మహిమయు అమలత్వమును వ్యక్తములై ఆత్మస్వరూపమును ఎక్కువగా ప్రకటించును.

కాబట్టి ఈ సత్త్వమును సంపాదించుకొనుట అవసరము. "ఆహారము శుద్ధముగా నున్నప్పుడు" అని శాస్త్రోక్తి. ఈ ఆహారమనుమాటకు భోజనము అని అర్థము చేసి రామానుజులవారు తమ సిద్ధాంతమునందు దీనికొక ముఖ్యస్థానమిచ్చినారు. అంతటితో పోక అది హిందూదేశమంతకును, అన్ని సంప్రదాయములకును వ్యాపించినది. కాబట్టి దీని అర్థమేమో బాగుగా విచారణచేయుట అవసరము. ఏలయన రామానుజాచార్యులవారి అభిప్రాయము ననుసరించి ఈ ఆహారశుద్ధి మనజీవితమునందు ప్రధానవిషయములలో నొకటి యగుచున్నది. ఆహారమును అపరిశుద్ధముచేయునది ఏదని శ్రీరామానుజాచార్యులవారు విచారించుచున్నారు. మూడు విధములగు దోషములు అన్నమును అపరిశుద్ధపఱచును. ఒకటి జాతిదోషము; అది ఆ పదార్థముయొక్క జాతికే స్వతస్సిద్ధమైనది. ఉదాహరణ: నీరుల్లి, వెల్లుల్లి మొదలగువానియందలి వాసన. రెండవది ఆశ్రయదోషము; ఇది ఆహారము ఎవనియొద్దనుండి వచ్చునో ఆ నరునివలన కలుగునది. దుష్టుల ఆహారము అపరిశుద్ధత కల్పించును. భారతదేశములో మహాపురుషులు అనేకులు తమ జీవితము పర్యంతటను ఈ విషయమును నిష్కర్షగా పాటించుట నేను

స్వయముగా నెఱుగుదును. ఆ ఆహారము తీసికొని వచ్చిన వారు ఎవరో దానిని తాకినట్టి వారెవరో తెలిసికొనుశక్తి వారికుండెడిది. ఒకసారిగాక అనేక పర్యాయములు నా జీవితములో ఈ విషయమును నేను చూచియున్నాను. మూడవది నిమిత్తదోషము. అనగా అపరిశుద్ధ వస్తువులయొక్క గాని, విషయములయొక్క గాని దోషము ఆహారమునకు తగులుట. దీనిని గుఱించి మనమింక కొంత జాగ్రత్తగా విచారించుట మంచిది. ముఱికి, దుమ్ము, వెంట్రుకలు కలిసిన ఆహారమును తినుట ఈ దేశములో అలవాటైపోయినది. ఈ మూడు దోషములు తొలగింపబడిన ఆహారము సత్త్వశుద్ధిని కలుగజేయును. అనగా సత్త్వమును శుద్ధిచేయును. ఆస్తికధర్మజీవన మప్పుడు మిక్కిలి తేలికగా ఆచరింప వీలుకల్గును. పరిశుద్ధమైన ఆహారమును తినుటచేతనే సాధ్యమగునెడల ప్రతివాడును ధర్మజీవనమును ఆచరింపగలడు. నాకు తెలిసినంతలో ఈ మూడు దోషములను తొలగించుకొన జాలనంత అప్రయోజకుడు, అశక్తుడు ఈ ప్రపంచములో ఎవడును లేడు. ఇక శంకరాచార్యులవారు ఈ ఆహారశబ్దమునకు మనస్సులో చేరిన సంకల్పరాశియని అర్థముచేసి ఆ సంకల్పరాశి శుద్ధమగు నప్పుడు సత్త్వము శుద్ధమగునేగాని అంతవఱకును కాజాలదు అని పలుకుచున్నారు. నీ యిష్టమగుదానిని నీవు తినవచ్చును. ఆహారము మాత్రమే సత్త్వమును శుద్ధిచేయునెడల ఇంకనేమి? ఒక కోతిని తెచ్చి అది బ్రతికి యున్నంతకాలము పాలతోను, అన్నముతోను పెంచినచో అది మహాయోగి అయిపోవునా? అటులగుచో ఆవులు, లేళ్లు

యోగిసత్తములే కదా! కొందఱు చెప్పునట్లు చాలసార్లు స్నానముచేయుటచేతనే స్వర్గము లభించునెడల, మొట్ట మొదట చేపలు స్వర్గమును చేరును. శాకాహారముచేతనే నరుడు స్వర్గమునకు పోగలుగు నెడల ఆవులును, లేళ్లును వానికంటె ముందుగా స్వర్గము చేరును.

సరే దీనికి పరిష్కారమార్గమేమి? రెండును అవసరములే. ఆహారమును గుఱించి శంకరాచార్యులవారు తెలుపునట్టి అభిప్రాయమే నిస్సంశయముగా ముఖ్యమైనది. శుద్ధాహారము శుద్ధసంకల్పమును బలపఱచు ననుటకుకూడ సందియము లేదు; వానికి చాల సంబంధమున్నది. కావున రెండును అవసరమే. కాని, ఆధునిక భారతదేశమునందు శంకరాచార్యులవారిబోధను మఱచి పోయి "పరిశుద్ధమగు ఆహారము" అను అర్థమునే పాటించుచున్నాము. అందు వలననే ఆస్తికధర్మము వంటింటిలో దూఱినదని నేను చెప్పితిని. అందులకు ప్రజలు నామీద కోపావేశులైరి. మీరు నాతో చెన్నపురి వచ్చియుండిన యెడల నా మాటల లోని సత్యమును మీరెఱిగియుందురు. వంగదేశీయులు వారికంటె మేలు. అన్నము వంక ఇతరులు చూచినంత మాత్రముననే దానిని పారవేయువారలు చెన్నపురిలో గలరు. ఇంత చేసినను అక్కడి ప్రజలు ఇక్కడి వారికంటె ఉత్తములుగా నున్నారని చెప్పజాలను. ఆహారనియమము వలనను, భోజనకాలమున దృష్టిదోషము పాటించుటవలనను పరిపూర్ణత వచ్చునదైనచో, వారందఱును సమగ్రులై యుండవలయును. కాని వారటుల లేరు.

రామానుజశంకరుల భావములను రెంటిని ఏకము చేసి పూర్ణరూపమును కల్పింపవచ్చును. కాని అప్రధాన విషయమునకు ప్రధానవిషయమున కిచ్చినంత ప్రాముఖ్య మీయతగదు. అట్లిచ్చుట గుఱ్ఱమునకుముందు బండినికట్టుట వంటిది. తినదగినది ఈ ఆహారమా ఆ ఆహారమా అను విషయమును గురించియు, వర్ణాశ్రమాచారములను గురించియు గందరగోళములు నేడు చెలరేగుచున్నవి. ఈ అఱపులలో వంగదేశీయులు దిట్టలుగ నున్నారు. "ఈ వర్ణాశ్రమములను గురించి మీ కేమి తెలియును" అని మీలో ప్రతివానిని నేను అడుగుచున్నాను. ఈ దేశములో ఈ నాడు ఆ చతుర్వర్ణములు ఎక్కడ నున్నవి? నాకు జవాబుచెప్పుడు! ఆ చతుర్వర్ణములు నాకు కన్పించుటలేదు. మన వంగదేశపు సామెతయగు "తలయే లేని తలనొప్పి" వలె మీరీ వర్ణాశ్రమముల నిక్కడ సృష్టింప జూచుచున్నారు. ఇక్కడ నాలుగు వర్ణము లిప్పుడు లేవు. బ్రాహ్మణ శూద్రవర్ణములు రెండే నాకు కాన్పించు చున్నవి. క్షత్రియులు, వైశ్యులు ఉన్నయెడల వారేరి? ఓ బ్రాహ్మణులారా, హిందూ మతానుసారముగా వారిని—ప్రతి క్షత్రియుని, ప్రతి వైశ్యుని—యజ్ఞోపవీతములు ధరించి వేదములను చదువు కొనుడని ఏల బోధింపకున్నారు? ఒకవేళ వైశ్యులును క్షత్రియులును వంగదేశమున లేరనుకొందము. బ్రాహ్మణులు శూద్రులు మాత్రమే ఉన్నారనుకొందము. అగుచో శూద్రులు మాత్రమే యున్న దేశమున బ్రాహ్మణులు నివసింప రాదని శాస్త్రములుచెప్పుచున్నవిగదా! కావునమూటముల్లె

సర్దుకొని వెడలిపొండు. మీరు వేయిసంవత్సరములుగా మ్లేచ్ఛుల తిండితిని మ్లేచ్ఛుల సేవచేయుచున్నారు. అట్టివారిని గుఱించి శాస్త్రములేమి చెప్పుచున్నవో మీకు తెలియునా? అందుకు ప్రాయశ్చిత్తమేమో ఎఱుగుదురా? చేతులార తన్నుతాను తగులబెట్టుకొనుట! మీరు గురువులమని పేరు పెట్టుకొని కపటవేషధారులై తిరుగ దలచితిరా? మీకు మీ శాస్త్రము లందు విశ్వాసము గలదేని—అలగ్జాండరు చక్రవర్తితో వెళ్లి యుండిన కారణమున తాను మ్లేచ్ఛుని ఆహారము తిని నటుల భావించి, తన్నుతాను దహనము చేసికొనిన బ్రాహ్మణ శ్రేష్ఠుని వలె—మిమ్ము మీరు వెంటనే దహనము చేసి కొనుడు! ఆ విధముగా చేసినచో ఈ జాతి అంతయు మీకు పాదాక్రాంతము కాగలదు. మీరు మీ శాస్త్రములను విశ్వసింపరు. అయినను ఇతరులు విశ్వసించునట్లు చేయగోరు చున్నారు. ఆ రీతిగా మీరు ఈ కాలమున చేయజాలరేని మీ దుర్బలతను ఒప్పుకొనుడు; ఇతరుల దుర్బలతను క్షమింపుడు. ఓ వంగదేశపు బ్రాహ్మణులారా! ఇతరవర్ణ ములవారిని ఉద్ధరింపుడు; వారికి చేయూత నొసంగుడు. వారిని వేదములు చదువుకొననిండు; ప్రపంచములోని ఇత రార్యజాతులతో సరి తూగు ఆర్యులు కానిండు. మీరును అటులే ఆర్యులు కండు.

మీ దేశమును మారణముచేయుచున్న హేయమగు వామాచారమును విసర్జించివేయుడు. మీరు భారతదేశము నందలి ఇతర ప్రాంతములను చూచి యుండలేదు. మన సంఘమున ఎంతగా ఈ వామాచారము వ్యాపించెనో చూచి

నప్పుడు, మన నాగరకతను గుఱించి ఎంతగా గర్వపడు చున్నను, మనసంఘమునకు మిగుల లజ్జాకరమగు దశ వాటిల్లినటులే తలంచు చున్నాను. వంగదేశమున మన సంఘము వామాచార సాంప్రదాయికులనెడు తేనెటీగలకు తేనెపెరగా నున్నది. పగలు బయటికి వచ్చి ఆచారమును గుఱించి పెద్ద పెద్ద ఉపన్యాసములు చేయువారే రాత్రులందు ఈ భయంకర వ్యభిచారమును సాగించుచు, అతిఘోరము లగు గ్రంథములను ప్రమాణము చేసికొనుచున్నారు! ఆ గ్రంథములు ఇట్టి నీచ కార్యములను చేయుడని వారిని ఆజ్ఞా పించుచున్నవట! వంగదేశీయులగు మీకు ఆసంగతి తెలి యును. వంగదేశపు శాస్త్రములన్నియు వామాచార తంత్ర ములే! శ్రుతులను బోధించుటకు మారుగా బండ్లకొలదిగా ఆ తంత్రములను ప్రకటించి మీబిడ్డల మనస్సులలో విషము నింపుచున్నారు. కలకత్తానగర జనకులారా! ఈ వామాచార తంత్రములవంటి ఘోరగ్రంథములు, వాని అనువాదము లతో సహా, మీ బాలబాలికల చేతులలోనికి వచ్చి వారి హృదయములను విషపూరితములు చేసివేయగా, ఈ బిడ్డలు అవియే హిందువుల శాస్త్రములనెడు విశ్వాసముతో పెరిగి పెద్దవారగుట మీకు లజ్జాకరముగ తోచుటలేదా? మీకు సిగ్గుకలదేని మీబిడ్డల చేతులలోనుండి వానిని పెఱికి పార వేసి, సత్యములగు శాస్త్రగ్రంథములను వేదములను గీతను ఉపనిషత్తులను వారిచే చదివింపుడు.

భారతదేశమందలి ద్వైత సాంప్రదాయికుల సిద్ధాం తము ననుసరించి వేర్వేఱు జీవాత్మలు శాశ్వతముగా వేఱు

పడియే యుండును. భగవంతుడు నిమిత్తకారణమాత్రుడై అదివఱకే గల ద్రవ్యరాశినుండి జగత్తును సృష్టిచేయును. అద్వైతుల సిద్ధాంతప్రకారమన్ననో భగవంతుడు జగత్తునకు నిమిత్తకారణమును, ఉపాదానకారణమును కూడ అగుచున్నాడు. అనగా ఆయన ఈ జగత్తునకు సృష్టికర్త అగుటయే గాక దీనిని తనలో నుండియే సృష్టి చేయుచున్నాడు. ఇది అద్వైతుల సిద్ధాంతము. జగత్తును భగవంతుడు తనలో నుండియే సృష్టించియు ఆ జగత్తునుండి తాను సదా వేఱుపడి యుండుననియు, సర్వమును ఆ జగదీశ్వరునకు సదా లోబడి యుండుననియు నమ్మునట్టి అసంస్కృతద్వైత సంప్రదాయములు కొన్ని గలవు. భగవంతుడు తనలో నుండియే జగత్తును పరిణమింపజేసెననియు, జీవాత్మలు తుదకు నిర్వాణమును పొంది ఖండత్వమును బాసి అఖండబ్రహ్మమే అగుననియు విశ్వసించునట్టి సంప్రదాయములు కూడ కలవు. కాని ఈ సంప్రదాయములు అదృశ్యములై పోయినవి. ఈనాడు భారతదేశములో కాన్పించు అద్వైత సంప్రదాయమంతయు శంకరాచార్యులవారిని అనుసరించు వారిదే. శంకర మతానుసారము భగవంతుడే జగత్తునకు నిమిత్తకారణమును, ఉపాదాన కారణమునుకూడ. మాయవలన ఇట్లు గోచరించునే కాని యథార్థముగా అటులగుట లేదు. భగవంతుడు, లేక బ్రహ్మము ఈ జగత్తుగ అగుటయే లేదు. నిజమునకు ఈ జగత్తు లేనేలేదు; ఉన్నది బ్రహ్మము ఒక్కటియే. అద్వైతవేదాంతమున గ్రహింపవలసిన అత్యంత మహనీయవిషయము ఈ మాయావాదమే. మన తత్త్వ

శాస్త్రములోని ఈ అత్యంత క్లిష్ట విషయమును విమర్శించి చెప్పుటకు ఇప్పుడు నాకు సమయము చాలదని నాభయము. మీలో పాశ్చాత్య తత్త్వశాస్త్రముతో పరిచయముగల వారికి ఇట్టి అంశమొకటి క్యాంటు మహాశయుని సిద్ధాంతమున గోచరింపగలదు. కాని మీలో క్యాంటును గుఱించి ప్రొఫెసర్ మ్యాక్సుముల్లరు గారి వ్రాతలను చదివినట్టివారికి ముందుగా ఒక హెచ్చరిక చేయుచున్నాను. గొప్ప తప్పు టర్థమునకు దారితీయు భావమొకటి ఆవ్రాతలలో కలదు. దేశ కాల నిమిత్తములును, మాయయు అభిన్నములనెడు భావమును మొట్టమొదట కనుగొనినది శ్రీశంకరాచార్యుల వారే! శంకరభాష్యములలో ఇందుకు నిదర్శనములగు వాక్యములను ఒకటి రెండు కనుగొని నామిత్రుడగు ప్రొఫెసర్ మ్యాక్సుముల్లరు గారికి పంపగల అదృష్టము నాకు కలిగినది. కాబట్టి ఆ సిద్ధాంతముకూడ భారతదేశములోనిదే. అద్వైత వేదాంతుల ఈ మాయాసిద్ధాంతము బహు చిత్రమైనది. నిజమునకు కలదంతయు బ్రహ్మమొక్కటే. కాని ఈ మాయవలన భిన్నత్వమేర్పడినది. ఏకత్వమే, అనగా అద్వితీయ బ్రహ్మమే, పరమ ప్రాప్యము. ఈ అంశమున భారతీయ సిద్ధాంతమునకును పాశ్చాత్య సిద్ధాంతమునకును మధ్య అనంతమగు విభేదము కలదు! వేలకొలది సంవత్సరములకు పూర్వమే ఈసిద్ధాంతమును ప్రతిజ్ఞా పూర్వకముగా భారతజాతి ప్రపంచములో నెలకొల్పినది. వేర్వేఱు జాతుల వారు దీని ఖండనమునకు పూనిరి. తుదకు వారందఱును నమసిపోయిరి. ఈ భారతజాతిమాత్రము అమరముగా

నిలిచియే యున్నది. ఆ ప్రతిజ్ఞ ఇదియే: ఈ జగత్తు భ్రాంతి మయము: ఇది అంతయు మాయ. నీవు నేలమీద విస్తరి వేసికొని వ్రేళ్లతో ముద్దలు చేసికొని తినువాడవైనను, బంగరు పళ్లెములలో చేగరిటెలతో తినువాడవైనను, మహా సౌధములందు నివసించు సామ్రాట్టువైనను, శుష్కదరిద్రుడ వైనను, మరణము ఒక్కటియే తుదకు నీ గతి. అంతయు సమమే. అంతయు మాయయే. ఇది ప్రాచీన భారతీయ సిద్ధాంతము. ఎన్నియో జాతులు దీనిని ఖండించుటకు, కల్ల యని రుజువు చేయుటకు పరంపరగా ప్రయత్నించుచునే యున్నవి. వారు గొప్పవారై, భోగము గమ్యార్థముగా పెట్టుకొని, చేతిలో పూనిన అధికారమును సంపూర్ణముగా వినియోగించి అత్యంత వైభవములలో తులతూగుచున్నారు. కాని మఱుక్షణముననే మరణము వాతపడి పోవుచున్నారు! మనము సర్వమును మాయగా చూచుచు శాశ్వతముగా నిలిచియున్నాము. మాయయొక్క సంతానము శాశ్వతమై జీవించుచుండ భోగముయొక్క సంతానము విలయమందు చున్నది!

మఱియొక గొప్ప భేదముకూడ కలదు. జర్మను తత్త్వశాస్త్రమునందు హేగెలు, షోఫెన్‌హార్ మహా శయులు చేసిన యత్నములవంటివే, సరిగా అటువంటి భావములే, ప్రాచీన భారతదేశమునందును ప్రకటింప బడినవి. అదృష్టవశమున ఈ హేగెలు మతము జడ్డిగము లోనే మిడుతపోటు తిన్నది. అనగా ప్రారంభములోనే నశించినది. కావున దాని శాఖలు పెరిగి వినాశకరమగు

దాని ఊడలు మన మాతృదేశమందు నాటుకొనకుండ పోయినవి. అద్వితీయమగు అఖండతత్త్వము అల్లకల్లోల మైనదనియు, వ్యక్తిత్వమునంది విడివడిన స్వరూపమే ఆ యఖండతత్త్వమునకన్న ఉత్తమమనియు హేగెలు అభి ప్రాయము. లోకమే అలోకముకంటె గొప్పదనియు, సంసారమే నిర్వాణముకంటె శ్రేష్ఠతరమనియు ఆతడు తెల్పి నాడు. ఇదియే అతని ప్రధానభావము. మీరు ఈ సంసార ములో దిగబడిన కొలదిని జీవనవ్యావృత్తులచే మీ ఆత్మ ఆవరింపబడిన కొలదిని మీరు గొప్పవారగుచుందురట. ఆ సిద్ధాంతవాదులు ఇట్లందురు: "మే మెట్లు భవనములను నిర్మించుచున్నామో, రాజవీథుల నెట్లు శుభ్రపఱచు చున్నామో, ఇంద్రియ భోగముల నెట్లు అనుభవించు చున్నామో గమనింపుడు" ఈ ప్రతి అల్ప భోగమునకును వెనుక ద్వేషమును, దుఃఖమును, భయమును దాగియుండ వచ్చును. మన తత్త్వవేత్తలు ఇట్లుకాక, ప్రప్రథమము నుండియు, పరిణామమనుపేర బరగు వ్యక్తీకరణమంతయు ఆ అవ్యక్తతత్త్వము వ్యక్తమగుటకు చేయు వృథా ప్రయత్న ములే యని పల్కుచున్నారు. ఈ విశ్వమున కంతకును మహాకారణ రూపమగు నీవు క్షుద్రములగు బురదగుంటలలో ప్రతిబింబింప చూచుచున్నావు. కాని కొంతకాలము అటుల ప్రయత్నించిన పిమ్మట అట్టి ప్రయత్నమంతయు వ్యర్థమని తెలిసికొని వెనుదిరిగి నీ వెక్కడనుండి వచ్చితివో అక్కడికే మరలిపోవుదువు. ఇదియే వైరాగ్యము లేక సర్వసంగ పరిత్యాగము. ఇదియే మతధర్మమునకు ప్రారంభము.

మతముగాని, నీతిధర్మముగాని, ఆత్మార్పణబుద్ధి లేక ఏప్రారంభము కాగలవు? సంగత్యాగమే దీనికి "ఓ, నా, మా"లు. "త్యాగము చేయుము, త్యాగము చేయు"మని వేదము ఘోషించుచున్నది. పరిత్యాగము చేయుము. అదీ యొకటియే మార్గము. "న ప్రజయా ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః" (సంతానము ద్వారమునగాని, సంపద ద్వారమునగాని, అమృతత్వమును పొందజాలవు. త్యాగముచేతమాత్రమే అది సాధ్యమగును.) భారతీయ గ్రంథములలోని శాసనము ఇదియే. సింహాసనముల నలంకరించుచు కూడ సంసార త్యాగమును చేసినవారు కలరు! జనకమహారాజు కూడ సర్వ పరిత్యాగము చేసెను. జనకుని మించిన గొప్పత్యాగి ఎవడు? ఈ దినములలో అందఱమును జనకుల మనిపించుకొన ఉబలాట పడుచున్నాము. ఔను, కూటికి, గుడ్డకు దిక్కులేక అల్లాడుచుండు దీన సంతానమునకు వీరు *జనకులే! వీరికి జనక నామము ఈ విధముగా వర్తించును. పురాణ ప్రసిద్ధుడగు ఆ జనకునకుగల భవ్య దివ్య భావములు వీరియందు పూజ్యము! వీరే మన అభినవ జనకులు! ఇప్పుడు ఇట్టి జనకత్వమును కొంచెము త్యాగము చేసి లక్ష్యమును గుర్తించి నడువుడు. మీరు త్యాగముచేయ గలిగితిరా మీకు ఆత్మధర్మము చేజిక్కును. అటుల చేయ లేరా తూర్పునుండి పడమర వఱకు ప్రపంచమున గల పుస్తకముల నన్నిటిని మీరు పాఱ జదువుదురు గాక,

* 'జనక' దను పదమునకు తండ్రియని అర్థము.

గ్రంథాలయములన్నిటిని గుటక వేసి మ్రింగుదురు గాక, గొప్పపండితు లవుదురు గాక, కర్మకాండమును మాత్రమే పట్టుకొని వ్రేలాడుచో మీరు వ్యర్థులే! మీకు ఆత్మసిద్ధి కలుగలేదు. త్యాగమువలననే ఈ అమృతత్వమును పొందుట సాధ్యము. వైరాగ్య మొక గొప్పశక్తి—విశ్వము నంతను ధిక్కరించి నిలువగల మహాశక్తి. తత్ప్రభావమున మాత్రమే "బ్రహ్మాండమ్ గోష్పదాయతే" (ఈ బ్రహ్మాండమంతయు ఆవు అడుగుపెట్టుచోట గలుగు చిన్ని గుంట వంటి దగును.) ఈ వైరాగ్యమే మన భారతదేశ మహాధ్వజము! లోక మంతటి పైనను అది ఎగురుచున్నది. మృత్యువు వాతబడి పోవుచున్న జాతులను హెచ్చరించుట కొఱకు, నిరంకుశ ప్రభువులను మందలించుట కొఱకు, లోకములోని దుష్టులను అదలించుట కొఱకు పదే పదే హిందూదేశము ప్రకటించు చున్న అనశ్వరభావము ఇదియే. హిందూప్రజలారా! ఈ ధ్వజమును మీ చేతులనుండి జారిపోనీయకుడు! ఆకాశమున ఎగురు నటుల దానిని పట్టుకొని యుండుడు! మీరు దుర్బలులై త్యాగము చేయలేకున్నను ఆదర్శమును మాత్రము క్రిందు చేయకుడు. "నేను దుర్బలుడను. సంసార త్యాగము చేయజాలను" అని ప్రకటింపుడుగాని శాస్త్ర ములను తిక మక చేయుచు మోసపు వాదనలకు దిగి కపట వేషధారులు కాజూడకుడు. అజ్ఞానులగు ప్రజల కన్నులలో దుమ్ముగొట్ట ప్రయత్నింపకుడు. ఆ పని మాత్రము చేయ వలదు. మీ లోపమును ఒప్పుకొనుడు. ఆ త్యాగసిద్ధాంతము మహా మహిమాఢ్యమైనది. ఆ ప్రయత్నములో లక్షల

కొలది కార్యసిద్ధిని పొందజాలకున్నను మునిగి పోయిన దేమున్నది! పదిమంది—ఇరువురైనను—శూరాగ్రేసరులు విజయశీలురై తిరిగివచ్చిన చాలదా! అందు ప్రాణముల గోల్పోయిన లక్షలాది యోధులు ధన్యులు. వారోడ్చిన నెత్తురే ఈ విజయమును సంపాదించినది! బొంబాయి రాష్ట్రములోని వల్లభాచార్య సంప్రదాయ మొక్కటితక్క ఆ యా వైదిక సంప్రదాయములందెల్లెడల వైరాగ్యమే అద్వితీయమగు ఆదర్శముగా నున్నది. వైరాగ్యము లోపించిన యెడల ఏమి తటస్థించునో మీలో చాలమందికి తెలియునుగదా! మనకు పూర్వాచారము కావలసియే యున్నది. అందులో బీభత్సమగు పూర్వాచారమును పాటించువారు సైతము, ఊపిరాడకుండ బూడిదతో కప్పు కొను వారు సైతము, చేతులు పైకి ఎత్తుకొని నిలుచుండు వారు సైతము, మనకు అవసరమైనవారే. వారి చర్య అస్వాభావికముగా నున్నను త్యాగభావమును వారు మనకు బోధించుచున్నారు. భారతదేశములోనికి చొరబడి వచ్చి, మన ఆయువు పట్టులనే తినివేయుచు, మనజాతి నంతను నిర్వీర్యులనుగా, బేలలనుగా, కపటవేషగాండ్రనుగా, చేయు చున్న విలాస పరాయణత్వమునకు లోబడి పోవలదని మన జాతిని వారు హెచ్చరించుచున్నారు. మనకు వైరాగ్యము కొంచెము అవసరముగా నున్నది. ప్రాచీన కాలమునందు వైరాగ్యము భారతదేశమును జయించినది. అది మరల భారతదేశమును జయింపవలయును. ఇప్పుడు సైతము ఈ వైరాగ్యమే భారతీయాదర్శములం దెల్ల మిక్కిలి ఉదాత్త

మును ఉన్నతమునై వెలయుచున్నది. బుద్ధదేవుని దేశము, రామానుజుని దేశము, శ్రీరామకృష్ణుని దేశము, వైరాగ్యమునకు పుట్టినిల్లగు దేశము, ఎచ్చోట పూర్వకాలము నుండియు కర్మకాండను ఖండించు బోధలు వెలసెనో అట్టి దేశము, ఎచ్చోట ఈ నాడు సైతము సర్వ సంగ పరిత్యాగ మొనర్చి జీవన్ముక్తులయిన మహాత్ములు వందలకొలదిగ ఉన్నారో అట్టి దేశము, అటువంటి దేశమేనా తన పరమాదర్శములను విడనాడు కొనునది? ఎన్నటికిని కాదు. భోగ పరములగు పాశ్చాత్యాదర్శములతో తలలు తిరిగి పోయిన వారు కొందఱుందురుగాక! వెక్కసమగునటుల ఇంద్రియ భోగములను—పశ్చిమ దేశములను పాడొనర్చి లోకమును శాపగ్రస్తము చేసిన ఇంద్రియభోగములను—పూర్తిగా అనుభవించు మనుజులు వేలకొలదిగ, లక్షలకొలదిగ నుందురుగాక. అయినను ఈ నా మాతృభూమియందు ఆ మతధర్మమునే సత్యమని నమ్మి, ఎంతటి ఇడుములు వచ్చినను లెక్కసేయక, అవసరమగు నెడల సమస్తమును బలియిచ్చుటకు సంసిద్ధముగా నుండువారు వేలకొలది మహనీయులు నిలిచియే యుందురు!

మన సంప్రదాయములన్నియు సర్వసామాన్యముగ పాటించుచుండు మఱొక ఆదర్శమును మీకిపుడు నివేదింప గోరుచున్నాను. అది కూడ మహావిస్తృత రూపమైనదే. "మతమనునది ప్రత్యక్షానుభవమునకు తెచ్చుకొన వలసిన విషయము" అనెడు అనన్య సామాన్య సిద్ధాంతము ఈ భారత దేశమందు మాత్రమే చూపట్టు చున్నది. "నాయ

మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన’’—‘‘ఈ ఆత్మ ప్రసంగములచేత లభ్యమగునది కాదు. బుద్ధిబలముచేత కూడ లభ్యమగునది కాదు. విశేషమగు వేదాధ్యయనముచేతను లభ్యమగునది కాదు. వేద పఠనము వలన సైతము ఆత్మ లభ్యము కాదు’’ అని ప్రకటించునది ప్రపంచములో మన వేద మొక్కటియే. ఏ యితర ధర్మగ్రంథమునందును ఇట్టి ప్రకటన కానరాదు. ప్రగల్భములు పనికి రావు; ఉపన్యాసములు వ్యర్థములు, ఇట్టివేవియు ఉపకరింప జాలవు; అయినను ఆత్మను ప్రత్యక్షానుభూతికి తెచ్చుకొన వలయును. అయ్యది గురువు వలన శిష్యునకు లభించును. శిష్యునకు ఈ అంతర్దృష్టి లభించినప్పుడు సమస్తమును తేటతెల్లమై పోవును. అంతట ఆత్మసాక్షాత్కారము అనుభవములోనికి వచ్చును!

ఇంకొక భావము: కులగురువు, లేక వంశపారంపర్య గురువు అనునొక వింత ఆచారము వంగదేశమున కలదు. ‘‘నా తండ్రి నీకు గురువు. కావున ఇప్పుడు నేను నీ గురువను. నా తండ్రి నీతండ్రికి గురువు, కావున నేను నీకు గురువుగా నుందును.’’ గురువు అనగానేమి? వెనుదిరిగి శ్రుతులలో నేమున్నదో చూతము. ‘‘వేదరహస్యము నెఱింగినవాడు’’ గురువు. కాని గ్రంథావలోకనవ్యగ్రులుగాని, వైయ్యాకరణులుగాని, పండితులుగాని అంతమాత్రముచేతనే గురువులు కాజాలరు. పరమార్థమును తెలిసినవారే గురువులు. ‘‘యథా ఖర శ్చందనభారవాహీ భారస్య వేత్తా నతు చందనస్య’’ (గంధపు చెక్కలు మోయు గాడిద ఆ

చెక్కల బరువు నెఱుంగునే గాని వాని సుగంధమును ఎఱుంగజాలదు.) అట్టివా రీపండితులు. అట్టివారు మనకు అవసరము లేదు. వారికే అపరోక్షానుభూతి లేనిచో, వా రేమిబోధింప గలరు? ఇక్కడ ఈ కలకత్తా నగరమున నేను బాలుడనుగా ఉన్నప్పుడు మతధర్మమును తెలిసికొనగోరి ఇక్కడకు అక్కడకు పోవుచుండెడివాడను. ప్రతిచోటను పెద్ద పెద్ద ఉపన్యాసము లిచ్చుచుండువారు చెప్పినదంతయు విని, "మీరు దేవుని చూచితిరా?" అని అడిగెడి వాడను. ఆ ఉపన్యాసకుడు 'భగవంతుని చూచుట' అనుమాట విన గానే విత్తాకు పడెడివాడు. "నేనుచూచితిని" అని నాతో చెప్పిన మహాత్ముడు శ్రీరామకృష్ణపరమహంస ఒక్కడే. అట్లనుటయేగాక "నీకుకూడ భగవంతుని గాంచు మార్గము చూపెదను" అని పలికెను. గురువు అనగా శాస్త్రవాక్య ములను పీడించి తికమకలు చేయువాడు కాదు. "వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్రవ్యాఖ్యానకౌశలం వైదుష్యం విదుషాం తద్వద్భుక్తయే న తు ముక్తయే"(శబ్దప్రయోగ వైచిత్రియును, అనర్గళమగు ఉపన్యాసశక్తియును, శాస్త్రవాక్యములను వివర ణముచేయు నేర్పును, పండితులయొక్క భుక్తికొఱకేగాని ముక్తికొఱకు గాదు.) 'శ్రోత్రియః' అనగా శ్రుతుల రహస్యము తెలిసినవాడు, 'అవృజినః' అనగా పాపరహితుడు, 'అకామ హతః'—కామహతుడు కానివాడు, బోధించుటచేత డబ్బు సంపాదించుటకు కోరిక లేనివాడు, శాంతుడు, సాధువు అయిన వాడు గురువు. అతడు వసంతఋతువు వంటివాడు. అది ఆయా వృక్షములకు ఆకులను పూవులను కల్పించియు, ఉప

కారము చేయుట తన స్వభావము కావున ఆ చెట్లనుండి ఏమియు కోరుకొనదు. అంతటితో సరి. గురువు అనగా అట్టివాడు. "తీర్ణాః స్వయం భీమభవార్ణవం జనా అహేతునాన్యానపి తారయంతః" (ఈ ఘోర సంసార సాగరము తాను దాటిన వాడై, ఏమాత్రమును లాభాపేక్ష లేక ఆ సముద్రమును ఇతరులు దాటుటకు సాయపడు వాడు గురువు.) ఇతరుడు గురువు కానేరడని యెఱుగుడు. "అవిద్యాయామంతరే వర్తమానాః స్వయం ధీరాః పండితమ్మన్యమానాః। జంఘన్యమానాః పరియంతి మూఢాః అంధేనైవ నీయమానా యథాంధాః" (తామే అజ్ఞానాంధకారములో మునిగి యుండియు, గర్వకారణమున సర్వమును తెలిసితి మనుకొను మూఢులు ఇతరులకు సాయ పడగోరి తూలుచు తూలుచు నానా వక్రగతుల పడి గిర గిర తిరుగు లాడుదురు. గ్రుడ్డి వారు గ్రుడ్డివారికి త్రోవ జూప బూనిన, ఉభయులును గోతిలో పడుదురు గదా!) ఇది వేదవాక్యము. దీనితో మీ ప్రస్తుతాచారమును పోల్చి చూచుకొనుడు. మీరు వేదాంతులును, విధ్యుక్తమార్గవర్తులును. అవునా? మీరు ఉత్తమ హిందువులును, శిష్టాచారపరులును. సరే నేను కోరునది మీరు ఇంకను శిష్టాచారపరులు కావలయునని. మీరు అధికాధికముగా పూర్వాచారపరులైనకొలదిని అధికాధికముగా వివేకవంతు లగుదురు. అధికాధికముగా నవీనాచారపరాయణులైన కొలదిని అధికాధికముగా మతిహీనులై పోవుదురు. మరల మీ పూర్వపు సదాచారమును అవలంబింపుడు. ఏల యందురా, ఆ దినములలో ఈ పుస్తక

ములనుండి వెలువడిన ప్రతి శబ్దము దృఢమును, సుస్థిరమును, నిష్కపటమును అగు హృదయమునుండి వెలువడినదే! ప్రతిస్వరమును నిష్కళంకమే! అటు పిమ్మట పతనము వచ్చినది. కళలందును, శాస్త్రములందును, మతము నందును, ప్రతిదానియందును జాతికంతటికిని భ్రష్టత్వమే కలిగినది. కారణములను గుఱించి విమర్శించుటకు మనకు కాలము చాలదు. ఆ భ్రంశకాలమున వ్రాయబడిన పుస్తకములన్నియు విషజాడ్య పూరితములును, జాతీయతా పతన సూచకములును, జవసత్త్వములకు మారుగా ఏడ్పులను పెడబొబ్బలను మాత్రము వెలువరించినవి. బల మహితమును, చైతన్యమహితమును అగు ఆ పూర్వదిన ములకై మరలుడు. వెనుకకు పొండు. ఆ ప్రాచీన నిర్ఝరిణులనుండి కడుపార సుధారసము గ్రోలుడు. మరల బల వంతులు కండు. భారతదేశము సజీవమగుటకు అది యొకటియే మార్గము!

నేడు మనకు గల వ్యక్తిత్వము అద్వైత సిద్ధాంత ప్రకారము భ్రాంతి మూలకమైనది. ప్రపంచమందంతటను ఇది దురవగాహవిషయముగనే యున్నది. ఎవనితోనైనను నీకొక ప్రత్యేకవ్యక్తిత్వము లేదు అని చెప్పుము. తన వ్యక్తిత్వము ఎట్టిదో తెలియకపోయినను అది పోవునేమో యని అతడు చాల భయపడును. కాని ఎన్నడును వ్యక్తిత్వ మనునదియే లేదనియు, నీ జీవితమున ప్రతిక్షణమును నీవు మారుచునే యున్నావనియు అద్వైతము బోధించుచున్నది. నీవు బాలుడవుగా నుంటివి. అప్పుడు ఒక విధముగా

భావించెడి వాడవు. ఇప్పుడు యువకుడవు. ఇప్పుడు వేఱొక విధముగా భావించుచున్నావు. ఇక ముసలివాడ వవుదువు. అప్పుడు ఇంకొక తీరున భావింతువు. ప్రతివాడును సర్వదా మారిపోవుచుండును. అటులుండగా ఇంక నీ వ్యక్తిత్వ మెక్కడ? అది నీ శరీరములో గాని నీ మనస్సులో గాని, నీ సంకల్పములో గాని లేదనుట స్పష్టము. వీని అన్నిటికిని లోపల నీ ఆత్మ యున్నది. ఆ ఆత్మ బ్రహ్మమే అని అద్వైతి చెప్పుచున్నాడు. రెండు అఖండ పదార్థములుండజాలవు. ఉన్నది ఒకవ్యక్తియే; అది అఖండము. మనము తార్కిక జీవులముగదా, హేతుబద్ధ విచారమేగదా మనకు తృప్తి కరము. సరే! ఆ తర్కవిచార మెటువంటిది ? అది వర్గీకరణ రూపమైనది. ఆ వర్గీకరణము చేసికొనుచు పోయిపోయి ఇక ముందునకు పోజాలక ఆగిపోవుదువు. ఖండవస్తువు అఖండ ముగా వర్గీకరింపబడినప్పుడు గాని, అనగా అఖండములో చేర్పబడి నప్పుడుగాని దానికి విశ్రాంతి దొరకదు. ఏదేని ఒక ఖండవస్తువును తీసికొని దానిని పృథక్కరణము చేయుచు పొమ్ము. తుదకు అఖండపదార్థమును, లేక ఆ పరం ధామమును చేరువఱకు నీ కెక్కడను విశ్రాంతి చిక్కదు. ఉండునది ఆ అఖండవస్తువు మాత్రమే అని వేదాంతి పలుకు చున్నాడు. తక్కినదంతయు మాయ. తక్కిన దేదియు సత్యత్వము కలదికాదు. ఏ భౌతిక వస్తువులో నైనను సత్యమై యుండునది ఈ బ్రహ్మమే. మనమును ఈ బ్రహ్మమే. ఈ ఆకారము మొదలగున వన్నియు మాయ. ఈ ఆకారమును ఈ రూపమును తొలగించితివా, నీవు నేను అందఱమును

ఒక్కటియే అగుదుము. కాని నేను అను శబ్దమును గురించి మనము జాగ్రత్త పడవలెను. సామాన్యముగా "నేను బ్రహ్మమైనచో ఇది ఎందుకు చేయలేను, అది ఎందుకు చేయలేను?" అని జనులు శంకింతురు. కాని, ఇచట "నేను" అను శబ్దమును వేఱొక అర్థములో ప్రయోగించుచున్నాము. నీవు బద్ధుడవని తలచితివేని, ఇంక బ్రహ్మము కావు. ఏకోఱంతయు లేక తనలోపలనే కాంతినంతయు గల ఆ పరమాత్మవు కాజాలవు. వాని ఆనందమంతయు వాని సుఖములన్నియు వాని లోపల నుండును. అతడు సర్వసమగ్రుడు, స్వయంతృప్తుడు. వాని కేమియు కొఱంతలేదు. అతడు దేనినిగాని అపేక్షింపడు. పూర్తిగా నిర్భయుడు, సంపూర్ణముక్తుడు. బ్రహ్మమనగా ఇదియే. దీనిలో మన మందఱమును ఒక్కటే!

కావున ద్వైతులకును అద్వైతులకును గల ముఖ్య విభేదము ఇదియే అనదగును. శ్రీశంకరాచార్యుల వారి వంటి గొప్ప భాష్యకర్త సైతము కొన్ని వాక్యములకు నాకు అసమంజసములని తోచు అర్థములను కొన్ని సందర్భము లందు చెప్పినాడు. ఒక్కొకయెడ రామానుజాచార్యుల వారు వాక్యములకు అర్థములు చెప్పుపద్ధతి కూడ అంత విస్పష్టముగా నుండదు. "ఏకం సద్విప్రా బహుధా వదంతి— ఉండు వస్తువు ఒకటియే. ప్రాజ్ఞులు దానికి అనేక నామములు పెట్టిరి" అనెడు మహాద్భుత భావమును ఎన్నడో భారతదేశము కన్గొని, ఇకమీదట ప్రపంచమునకు ప్రసాదింపవలసి యున్నను, ఈ శ్రుతియొక్క అభిప్రాయమునకు

విరుద్ధముగా, ఒక్క సంప్రదాయమే సత్యము కాగలదనియు తక్కినవన్నియు అసత్యములనియు ఒక దుర్భావము మన పండితులలో సైతము ఉన్నది. ఈ "ఏకం సద్విప్రా బహుధా వదంతి" అనెడు సిద్ధాంతమే ఈ జాతియొక్క బ్రతుకు తెరువును ఇంతవఱకు తీర్చిదిద్దినది. కాని కొలదిమంది ప్రాజ్ఞులు తప్ప, అనగా కొలదిమంది పారమార్థిక సాధకులు తప్ప ఈ సూత్రమును అందఱును తఱచుగా మఱచి పోవుచునే యున్నారు. అవును, ఈ మహాసూత్రమును మనము ఎప్పటి కప్పుడు మఱచి పోవుచునే యున్నాము. అద్వైతమో ద్వైతమో విశిష్టాద్వైతమో ఏదో ఒక్కటిమాత్రమే సత్యమై యుండవలయును అని అభిప్రాయపడువారు పండి తులలో నూటికి తొంబది ఎనిమిది మంది యుందురని తలం చెదను. మీరు కాశీకి వెళ్లి అచ్చటి ఘట్టములలో ఒక దాని యందు కొంచెము సేపు కూర్చుండిన యెడల నేను చెప్పుదానికి రుజువు మీకే తెలిసి పోగలదు. ఈ వివిధ సంప్రదాయముల గుఱించియు, భిన్న భిన్న విషయముల గుఱించియు, ఎడ తెఱపి లేని ఆబోతు కుమ్ములాటలు అచట నిరంతరము జరుగుచునే యుండును.

అది అట్లు జరుగుచునే యున్నది. ఈ సందర్భమున హిందూదేశమున మహాపురుషుడగు శ్రీరామకృష్ణపరమ హంస అవతరించెను. భారతదేశమునందలి భిన్న భిన్న సంప్రదాయములందు అంతర్లీనమై యున్న సామరస్యమునకు ఆయన జీవితము ఆచరణరూపమగు వ్యాఖ్యానము. జ్యోతి శ్శాస్త్రమునందలి "భూమధ్య సిద్ధాంతము" "సూర్యమధ్య

సిద్ధాంతము''ల వలె, ఈ రెండు సిద్ధాంతములుకూడ అవసరమే యని ఆయన జీవితమే స్పష్టము చేయు చున్నది. జ్యోతిశ్శాస్త్రములో భూమియే కేంద్రము అను సిద్ధాంతము మొదట నేర్పబడును. ఈ సిద్ధాంతము నాధారము చేసికొని విద్యార్థి ఇట్టి భావములతోడనే ఖగోళశాస్త్రమునంతను గ్రహించును. కాని ఖగోళశాస్త్రము నందలి సూక్ష్మాంశములను నేర్వ ప్రారంభించి నప్పుడు వానికి నడుమనుండునది సూర్యుడను సిద్ధాంతము అవసరమగును. అప్పుడది వానికి ఎక్కువ బాగుగ కూడ తెలియును. సహజముగ ఇంద్రియ సంబంధమగు సిద్ధాంతము ద్వైతము. ఇంద్రియములు మనకు పరిమితులు పెట్టునంతవఱకు సగుణ బ్రహ్మమును మాత్రమే మనము చూడ గలుగుదుము; సగుణమును తప్ప ఇతరమును తెలిసి కొనజాలము. ఈ ప్రపంచమున ఉన్నది ఉన్నటుల మనము గ్రహించి తీరవలయును. ''నీవొక శరీరమ వని భావించుకొనుచుండు నంత కాలము, నీవొక మనస్సు వని భావించుకొనునంత కాలము, నీవు ఒక జీవుడ వని భావించు కొనుచుండునంత కాలము ఆత్మ, ప్రకృతి, వాని సృష్టికర్త అనెడు మూటిని నీ ప్రతి అనుభవమునందును నీవు పొందక తప్పదు'' అని శ్రీ రామానుజాచార్యులవారు చెప్పు చున్నారు. అయినప్పటికిని మనస్సు సూక్ష్మతరమగుచు పోయి పోయి తుదకు ఇంచుమించుగా లయముచెంది నప్పుడు, మనకు భయము గలిగించునవియు, దుర్బలుల చేయునవియు, మనలను ఈ స్థూల దైహికజీవితమున బంధించి యుంచునవియు అగు ఆ యా విషయము లన్నియు

అదృశ్యములై పోయినప్పుడు ఈ శరీరభావము సైతము అదృశ్యమగును. అట్టి స్థితి లభించినప్పుడు గాని ఈ ప్రాచీన దివ్యసిద్ధాంతముయొక్క సత్యము బోధపడజాలదు. "ఇహైవ తై ర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః। నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః" (సమస్తమును సమముగా చూచుట యందు ఎవరి మనస్సులు సుస్థిరమైనవో వారు ఈ జన్మయందే జనన మరణ చక్రమును దాటుచున్నారు. ఏలయన బ్రహ్మము నిర్మలమును సర్వసమమును అయియున్నది. కాబట్టి అటువంటివారు బ్రహ్మమునందే జీవించుచున్నటుల చెప్పుదురు.)

"సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరం।
న హిన స్త్యాత్మ నాత్మానం తతో యాతి పరాం గతిం॥

"ఇట్లు ఈశ్వరుని సర్వత్ర సమముగా చూచు యోగి ఆత్మను ఆత్మచే హింసించుకొనడు. అతడు పరమగతినే పొందును."

ఆల్మోరా పట్టణమున స్వాములవారికి ఒసగబడిన

స్వాగతపత్రము, శ్రీవారి ప్రత్యుత్తరము

శ్రీస్వాములవారు ఆల్మోరా చేరగనే ఆపురవాసులు శ్రీవారికి హిందీభాషలో నొసగిన స్వాగతపత్రము యొక్క అనువాదము:

"మహాత్మా! పాశ్చాత్య ప్రపంచమున ఆధ్యాత్మ విజయమును సాధించిన పిమ్మట మీ మాతృభూమి యగు భారతదేశమునకు మరలి వచ్చుటకై మీరు ఇంగ్లాండులో బయలుదేరితిరని విన్నప్పటినుండియు మిమ్ములను చూచు భాగ్యము కొఱకై ఎదురు చూచు చుంటిమి. సర్వేశ్వరుని అనుగ్రహము వలన ఆ శుభలగ్నము తుదకు ఘటిల్లినది. 'ఒకనిని పూర్ణహృదయముతో ప్రేమించు పురుషుడు వానిని చూడ గలుగుట నిశ్చయము' అని భక్తావతంసుడగు తులసీదాస కవివరుడు పలికిన పలుకు నేడు పూర్తిగ ఫలించినది. ఎల్లరము వినిర్మల భక్తితో మీకు స్వాగత మర్పించుటకొఱకు ఇచ్చోట సమకూడి యున్నాము. ఎంతయో శ్రమ తీసికొని మీ రీ పట్టణమునకువచ్చి కృపా మతిని మాకు దర్శన మిచ్చి నందున మేమెంతయు ధన్యుల మైతిమి. అందులకు తగు కృతజ్ఞతను తెలుపజాలకున్నాము. మీరు ధన్యులు. మిమ్ము యోగారూఢుల జేసిన ఆ పూజ్య గురుదేవులు మున్మాటికిని ధన్యులు. ఈ ఘోర కలియుగ మున సైతము ఆర్యజాతులయందు మీవంటి నాయకాగ్రేస రులను గన్న భారతభూమి ధన్యము. మీ జీవిత ప్రారంభ దశయందే నిరాడంబరవృత్తి వలనను, నిష్కాపట్యము వలనను, సద్వర్తనము వలనను, పరోపకార చింతన వల నను, తీవ్రసాధన వలనను, సచ్ఛీలము వలనను, జ్ఞానబోధ వలనను ప్రపంచమందంతట వినిర్మల కీర్తిచంద్రికలు వెల యించితిరి. తత్కారణమున మేమెంతయు గర్వపడు చున్నాము.

శ్రీశంకరాచార్యులవారి కాలము నుండి ఇప్పటి వఱకు ఈ దేశములో ఎవరును నిర్వహింప జాలని మహా కార్యమును నిజముగా మీరు నిర్వహింప గలిగితిరి. ప్రాచీన భారత దేశపు ఆర్యుల సంతతివారిలో ఒకడు తన తపోబలము చేత భారతీయుల ప్రాచీన మతము ఇతర మతములకంటె శ్రేష్ఠతరమని ఇంగ్లండు అమెరికా విద్వద్వరుల ఎదుట ఋజువు చేయగలడని ఎవరముగాని కలలోనైన తలంపలేదు. షికాగో నగరమున జరిగిన అఖిల ప్రపంచ మతమహాసభ యందు సమావేశమైన వివిధ మతముల ప్రతినిధుల ఎదుట, వారి కన్నులు తెఱచు తీరున ప్రాచీన భారత దేశపు మతము యొక్క శ్రేష్ఠత్వమును అతి సమర్థతతో మీరు ఋజువు చేసితిరి. ఆ మహా సభయందు పండితులగు వక్తలు తమ తమ మార్గములందు తమ తమ మతములను సమర్థించు కొనిరి. కాని మీరందఱిని మించి ప్రకాశించితిరి. ఏ ఇతర మతమును వేదమతమునకు సాటి రా జాలదని పూర్తిగ నిర్ధారణ చేసితిరి. ఇంతియేగాక ఆ పాశ్చాత్య ఖండములందు అనేక స్థలములలో ఈ ప్రాచీన జ్ఞానమును గుఱించి ప్రచారము గావించి పెక్కుమంది విద్యాధికుల దృష్టిని ప్రాచీన ఆర్యమతము వైపునకును, తత్త్వ సిద్ధాంతములవైపు నకును ఆకర్షించితిరి. ఇంగ్లాండులో సైతము మన ప్రాచీన మత ధ్వజమును సంస్థాపించితిరి. ఇప్పుడు దానిని తొలగించుట సాధ్యము కానేరదు.

ఇప్పటి వఱకు అమెరికా యూరపు ఖండములందలి నవీన నాగరక జాతులవారు మన మతముయొక్క సత్య

స్వభావమును గుఱించి పూర్ణముగా అజ్ఞానములో నుండిరి. కాని మీ ఆధ్యాత్మికోపదేశములవలన మీరు వారి నేత్రములను తెఱచితిరి. ఈ ప్రాచీన మతమును 'దురహంకారులు నిర్మించిన చిక్కులమారి మత' మనియు 'బుద్ధిహీనులకు పనికి వచ్చు ప్రలాప రాశి' అనియు తమ అజ్ఞానము కొలది హేళన చేయుచువచ్చినవారే అది ఒక మహారత్నఖని యని యిప్పుడు తెలిసికొను నటుల చేసితిరి. సత్యముగా, మూఢులగు నూర్గురు కొడుకులకంటె నీతిమంతుడును, విద్వాంసుడును అగు ఒక కొడుకుండుట శ్రేష్ఠతరము. 'ఒక్కడైనను చంద్రుడే తన కాంతిచేత చీకటి నంతను పోద్రోలగలడు; కాని నక్షత్రము లన్నియు కలిసికూడ అటుల చేయ జాలవు.' మీవంటి పుణ్యాత్ముడగు సత్పుత్రుడే సత్యముగా లోకమున ప్రయోజకుడు కాగలడు. భారతమాత తన దీనదశయందు మీవంటి పవిత్రకుమారులను చూచుకొని ఊరట నొందుచున్నది. అనేకులు సముద్రమును దాటి విదేశములకు పోయి దిక్కు తెలియక ఇటునటు పరువులు వెట్టుదురు. కాని మీ పురాకృతసత్కర్మమహిమ వలన దూరమున సముద్రమున కావల నున్న వారికి మన మతముయొక్క గొప్పతనమును విశదముచేసి వచ్చితిరి. మనోవాక్కాయ కర్మములచేత మానవకోటికి ఆధ్యాత్మిక జ్ఞానమును ప్రసాదించుటయే మీ జీవిత పరమావధిగా పెట్టుకొంటిరి. బ్రహ్మజ్ఞాన బోధ చేయుటకు మీరు సర్వకాలము సిద్ధముగా నున్నారు.

మీరు ఇచ్చోట ఒక మఠమును స్థాపింప వలయునని ఉద్దేశించితి రని విని మిక్కిలి ఆనందించితిమి. మీ ప్రయత్న ములు సఫలీ కృతములగు గాక యని హృదయ పూర్వక ముగా భగవంతుని ప్రార్థించుచున్నాము. శ్రీశంకరా చార్యులవారు సైతము పారమార్థిక విజయములను సాధిం చిన పిమ్మట ఈ ప్రాచీనమత సంరక్షణార్థము ఒక మఠమును ఈ హిమాలయములలో బదరికాశ్రమమున స్థాపించి యు న్నారు. అదే తీరున మీ కోరిక గూడ సఫలమైన యెడల భారత దేశమునకు గొప్ప మేలు చేకూర గలదు. ఈ మఠ స్థాపన వలన కూమోన్ ప్రజలమగు మేము ప్రత్యేకమగు ఆధ్యాత్మిక ప్రయోజనములను పడయ జాలుదుము. ఆవిధ ముగా ఈ ప్రాచీనమతము మాలో క్రమముగా అడుగంటి పోకుండ చూచుకొనగలమని ఆశించుచున్నాము.

అతి ప్రాచీన కాలమునుండియు భారత దేశమునందు ఈ ప్రాంతము సన్న్యాసమునకు ప్రసిద్ధి చెందిన క్షేత్రముగా నున్నది. భారత ఋషులలో ఉత్తమోత్తములు భక్తి తోడను, తపస్సాధనతోడను ఈ క్షేత్రమున వాసము చేసిరి. కాని ఆవిషయము పూర్వకాలపు ముచ్చటైపోయినది. మీరు కృపామతితో ఇక్కడ మఠమును స్థాపించి ఆ పూర్వ దశను మేము తిరిగి చూచునటుల చేయుదురుగాక యని ఆశించుచున్నాము. ఈ పుణ్యక్షేత్రమునందే సత్యమగు మత ధర్మము, కర్మ, ఆత్మశిక్షణము, సద్వర్తనము విలసిల్లి నట్లు హిందూ దేశము నందంతటను పేరు మ్రోగి యున్నది. కాని ఇప్పుడదంతయు కాలగతికి లోనై క్షీణించినది. మీ

సత్ప్రియత్నముల వలన ఈక్షేత్రము పూర్వపు ధర్మోన్నతిని తిరిగి పడయునుగాక యని మేము ఆశించుచున్నాము.

మీ రిచ్చటికి వేంచేయుట వలన మాకు గలిగిన ఆనందమును తగు రీతిని ప్రకటింప జాల కున్నాము. పూర్ణారోగ్యమును అనుభవించుచు పరోపకార జీవనమును గడపుచు మీరు చిరంజీవులై వర్ధిల్లుదురు గాక. మీ ఆధ్యాత్మిక శక్తులు సతతము వృద్ధిచెందుచు మీ కృషివలన ఈ భారతదేశదురవస్థను సత్వరము తొలగించునుగాక."

ఇదియేకాక మఱి రెండు వినతిపత్రములును సమర్పింపబడినపిదప శ్రీస్వాములవారు ఈ క్రింది రీతిని సంక్షేపముగా ప్రత్యుత్తర మొసగిరి :

మన పూర్వులు దివ్యస్వప్నముల గాంచినట్టిక్షేత్రము ఇది. భారతీయులకు తల్లియగు పార్వతీదేవి పుట్టినది ఇక్కడనే కదా! భారతదేశములో ప్రతి భక్తిపరుడును తన చరమదశలోవచ్చి మానవ జీవిత కావ్యమునందలి తుది అధ్యాయములను పూర్తిచేయ కోరుకొనునది ఈ పవిత్రక్షేత్రముననే! ఈ దివ్యభూమియందలి పర్వత శిఖరముల మీదను, ఇందలి గుహాంతరాళములందును, వేవేగమ దూకుచు పరుగులిడు నిచ్చటి సెలయేళ్ల తీరములందును, పరమార్థభావములు సంభావితము లైనవి. వానిలో అతి స్వల్పాంశమే యెఱింగిన పరదేశీయులు సైతము వానిని మిక్కిలి ప్రశంసించిరి. అతి సమర్థులగు విమర్శకులు ఆ భావరాజములు అసమాన మహిమాఢ్యము లని ప్రవచించి యున్నారు.

నా బాల్యము నుండియు నా జీవితమును ఎక్కడ గడప వలయునని ఉవ్విళ్లూరు చుంటినో అట్టి పుణ్యభూమి ఇదియే. ఇక్కడనే యుండిపోవుటకు అనేక పర్యాయములు నేను ప్రయత్నించుట మీరందఱు ఎరిగినదే. అట్టి తరుణము ఆసన్నము కాక పోయినను, ఈ పుణ్యభూమికి దూరముగా విసరి వేయబడి ఎచ్చటనో పని చేయ వలసిన వాడనైనను, ఎచ్చట మహాఋషులు పవిత్రజీవితము గడపిరో, ఎచ్చట తత్త్వవిద్య ప్రభవించినదో, అట్టి పర్వతరాజ పార్శ్వంబుల నెచ్చటనేని నా జీవితమునందలి తుది దినములను గడప వలయునని గాఢముగా వాంఛించుచున్నాను. పూర్వము ఉద్దేశించిన విధమున నే నిప్పుడు చేయలేనేమో అనిపించు చున్నది. ఆహా! ఆ నిశ్శబ్దత, ఆ అజ్ఞాతవాసము, నా కనుగ్రహింపబడు గాకయని ఎంతగనో కోరుకొనుచున్నాను. భూలోకమున గల క్షేత్రము లన్నింటిలోను ఇక్కడనే—ఈ మహాక్షేత్రమందే—నా అంత్యదివసములు గడచుగాక' యని ఆశించుచు సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను. పరమేశ్వరుడు నా కోరికను మన్నించి అనుగ్రహించునను విశ్వాసము నాకు కలదు.

ఓ పుణ్యక్షేత్ర నివాసులారా!

పా[illegible]దేశములందు నేను నిర్వహించిన స్వల్ప [illegible] మీరు అత్యుదారముగా నన్ను అభినం[illegible]జ్ఞతను తెలుపుచున్నాను. అయినను [illegible]దు గాని, ప్రాచ్య దేశములందు గాని

ఆ విషయమును గురించి మాటాడు నభిలాష నాకు లేదు. శిఖరము తర్వాత శిఖరముగ ఈ పర్వతశ్రేణులు నా కన్నులకు గోచరింప నారంభింపగనే పనిచేయవలయునను ఇచ్ఛయు, అనేక సంవత్సరములుగా నా మెదడున రేగుచున్న ఆ ఉద్రేకమును శాంతిలి పోవుచున్నటుల కాన్పించుచున్నది. ఇదివఱకు నిర్వర్తించినట్టియు, ఇక ముందు నిర్వహింప నున్నట్టియు, దేనినిగురించి యైనను ప్రసంగించుటకు మారుగా ఈ హిమాలయములు సర్వదా బోధించునట్టిదియు, ఇచ్చటి వాతావరణమే ఉద్ఘోషించుచున్నట్టిదియు, ఇచ్చట నుడులు తిరుగుచు పరుగులు వెట్టు ప్రవాహములు ప్రబోధించుచున్నట్టిదియు అగు ఆ ఏకైక ధర్మము, ఆ వైరాగ్యము, నా మనస్సున ఆవహించు చున్నది. "సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్య మేవాభయం" ('పుడమిని సమస్తమును భయముతో కూడియున్నది. మానవుని భయరహితుని చేయగలది వైరాగ్య మొక్కటియే!') సత్యముగ అట్టి వైరాగ్యభూమి ఇదియే!

ఇప్పుడు మీతో పూర్తిగ మాటాడుటకు నాకు వ్యవధి లేదు; పరిస్థితులును అనుకూలముగ లేవు. కాబట్టి ఈ హిమాలయ పర్వతములు వైరాగ్యమునకు నిదర్శనములుగ నున్నవనియు, మనము మానవకోటికి బోధింపవలసి యున్న ఉత్తమ ధర్మము వైరాగ్యమే యనియు మాత్రము తెలుపుచు ముగించుచున్నాను. మన పూర్వులు తమ అంత్యదినములలో ఇచ్చోటికే ఆకర్షింప బడెడి వారు. అదే తీరున దశ దిశల నుండి మహాత్ములు భవిష్యత్కాల

మున ఈ పర్వత రాజముచే ఆకర్షింపబడ నున్నారు. అప్పుడు ఆ యా సంప్రదాయముల నడుమనున్న పోరాటములన్నియు, సిద్ధాంతములందు గల విభేదములన్నియు ఇక జ్ఞప్తికి రావు. నీ మతమనియు, నా మతమనియు సాగించు వాగ్వాదములు అదృశ్యములై పోవును. అప్పుడు సనాతన మతమే నిజమునకు ఏకైక మతమనియు, ఆంతర్యమున గల పరమాత్మను దర్శించుటే దాని లక్ష్యమనియు, మిగిలినదెల్ల వ్యర్థప్రలాపమే యనియు ఎల్లరును గ్రహింతురు. ఈ సంసారము బూటకములలో నెల్ల బూటకమని తెలిసికొని భగవంతుడును, భగవంతుని సేవయు తప్ప అన్యమంతయు శూన్యమని గ్రహించిన తపోధనులు ఇచ్చటికి రానున్నారు.

మిత్రులారా! నా మనస్సున గల ఒక ఉద్దేశమును గురించి మీరు ఔదార్యము పెంపున ప్రస్తావించితిరి. ఈ హిమాలయ పర్వతములలో ఒక మఠమును స్థాపించు విషయమే అది. అటుల ఎందుకు జరుగ వలసి యున్నదో నేను బాగుగ తెలిపియే యుంటినని తలంచెదను. ఈ విశ్వమతమును బోధించుటకు ప్రధాన స్థానములలో ఒకటిగా నేను ఏర్పఱచుకొనిన కేంద్రమిదియే! ఈ పర్వతములు మన జాతికి సంబంధించిన అత్యుత్తమ స్మరణీయాంశములతో సంబంధము గలిగియున్నవి. భారతీయ మత చరిత్రనుండి ఈ హిమాలయమును తొలగించిన యెడల ఇక మిగులునది అత్యల్పము. కాబట్టి ఆ కేంద్రములలో ఒకటి ఇక్కడ ఉండవలయును. తీవ్రప్రచారము కొఱకే గాదు; అధిక శాంతి కొఱకును, తపస్సు కొఱకును, వినిర్మలత కొఱకును కూడ

అది ఇక్కడనే నెలకొని యుండవలయును. ఎప్పుడో ఆ కోరిక సఫలము కాగలదని నా నమ్మకము. వేరు సమయములందు మిమ్ము కలిసికొని మీతో మాటాడుటకు ఇంతకన్న మంచి అవకాశములు కల్గునని నేను విశ్వసించు చున్నాను. ఇప్పటికి మీరు నా యెడల చూపిన ప్రేమను గుఱించి మఱొకసారి మీకు కృతజ్ఞతను తెల్పుచున్నాను. అది నా వ్యక్తియెడలగాక మన మతముయొక్క ప్రతినిధి నగుటచేత చూపబడిన అభిమాన మని నేను భావించుచున్నాను. అది మన హృదయములను ఎన్నడును వీడి పోకుండు గాక. మన మీక్షణమున ఎంత నిర్మలముగా నుంటిమో అంత నిర్మలముగను, అధ్యాత్మవిద్యను గుఱించి మన మిప్పుడు ఎంత ఉత్సాహముతో నుంటిమో అంతటి ఉత్సాహము తోడను, నిరంతరము ఉందుము గాక !

వైదికధర్మముయొక్క సిద్ధాంత సాధనలు

శ్రీ స్వాములవారు ఇక్కడ అతిథిగా నుండు కాలము ముగియనున్న సమయమున ఆల్మోరా యందలి శ్రీవారి స్నేహితులు హిందీ భాషలో ఒక ఉపన్యాస మిమ్మని కోరిరి. శ్రీవారు అట్టి ప్రయత్నము చేయుటకిది మొట్టమొదటిసారి యైనను అందుకు ఒడంబడిరి. వారు నెమ్మదిగ ప్రారంభించిరి. కాని త్వరలోనే ఉపన్యాసవిషయమువలన ఉత్సాహప్రేరితులైరి. వారు ఉపన్యసించినకొలది వాక్యనిర్మాణము, శబ్దగతి అప్రయత్నముగా వానియంతట అవియే అమరుచున్నటుల

తోచినది. ఉపన్యాస ధోరణికి అనుకూలపడుటలో హిందీ భాషయందు గల పరిమితులను చిక్కులను ఎఱిగినవారు శ్రీవారి ప్రయత్నము జయప్రదమైనదనియు, బహుశః అది అసదృశవిజయమనియుకూడ అభిప్రాయము తెలిపిరి. ఆ భాషయందు తమకు గల ప్రయోగపటిమను, వక్తృత్వము నకు అనుకూలముగ ఆ భాషను అభివృద్ధిచేయుటకు ఇదివఱకు కలనైన అనుకొని యుండని అవకాశములు ఆ భాషయందు కలవని శ్రీ స్వామివారు ఋజువుచేసిరనిరి.

ఇంగ్లీషు క్లబ్బు కడ మఱొక ఉపన్యాసము ఇంగ్లీషులో నొసగబడినది. వైదికధర్మముయొక్క సిద్ధాంత సాధనలు అనునది ఉపన్యాసవిషయము. ఆ యుపన్యాస సారాంశము లివి — శాఖాదేవతల పూజారంభము, ఇతర ఉపజాతుల జయించుట మూలమున దాని విజృంభణము; వీని చరిత్రను గుఱించి కొంచెము వివరించిన పిమ్మట వేదములనగా ఎట్టివో తెలిపిరి. వాని స్వభావము, స్వరూపము, వాని బోధ సూక్ష్మముగా విశదీకరించిరి. పిమ్మట జీవాత్మను గుఱించి మాటాడుచు ప్రాణప్రదములు, ఆధ్యాత్మికములు అగు తత్త్వ రహస్యములను బాహ్యప్రపంచముయొక్క సాయమున పరిష్కారము చేయ జూచు పాశ్చాత్యుల పద్ధతిని, బాహ్య ప్రకృతిలో అట్టి పరిష్కారము తేలజాలదని కనుగొని అన్వేషణమును ఆంతర్యమునకు త్రిప్పిన ప్రాచ్యపద్ధతిని పోల్చి చూపి వివరముల తెల్పిరి. తమకు విశిష్టమైన అంతర్లక్ష్య సాధనమును కనుగొనిన గౌరవమును, ఆ పద్ధతియొక్క ఫలితార్థముగా వెలలేని పారమార్థిక విద్యారత్నములను

మానవకోటికి పంచిపెట్టిన కీర్తియు, తనజాతికి చెల్లునని సహేతుకముగ తెల్పిరి. హిందువునకు సహజముగ ప్రియమై యొప్పు ఈ ప్రస్తావన అంతటితో నిలిపి జీవునకు బ్రహ్మము నకు గల సంబంధమును, జీవుడు బ్రహ్మమును భక్తిపూర్వక ముగ వెదకి వానియందు ఐక్యమగునట్టి సాధనను వర్ణించి నప్పుడు ఆధ్యాత్మిక విద్యాగురువుగా తన బోధనాశక్తిని శ్రీవారు అత్యున్నత దశకు ఉద్ధరింప గలిగిరి. కొంతసేపటి వఱకు శ్రీవారును, వారి పలుకులును, వారి శ్రోతలును, అందఱియందును పర్వియున్న అధ్యాత్మభావమును అన్నియు ఏకమై పోయినటుల గోచరించినది. నేను, నీవు, ఇది, అది అను భావములే స్మరణకు రావయ్యెను. అక్కడ చేరిన వ్యక్తులందఱును పరవశులైరి. ఆ మహాగురువునుండి దేదీప్య మానమై వెలువడు పారమార్థిక తేజమునం దెల్లరును మునిగిపోయిరి. శ్రీవారి పలుకులు సర్వమును ప్రమాన్పడ చేసినవి.

శ్రీవారు ఉపన్యసించుచుండగా తఱుచు విన్నవారికి ఇట్టి అనుభవములు అప్పుడప్పుడు కలుగుచుండును. శ్రద్ధగా విచక్షణాపరులై వినుచుండెడు శ్రోతల యెదుట ఉపన్యసించు నప్పుడు వివేకానందస్వామి అను వ్యక్తి అదృశ్యమగును. అప్పుడు అల్పవివరములు, వ్యక్తిభావములు సమసిపోవును. నామరూపములు దూరమై పోవును. ఆత్మమాత్రమే నిలిచి యుండి వక్తయు, శ్రోతయు, వక్తృవచనమును ఏకమై అందు లయించి పోవును.

భక్తి

పంజాబునందలి శియాల్‌కోటయం దొసగిన ఉపన్యాసము

పాంచాల, కాశ్మీర దేశములనుండి వచ్చిన ఆహ్వానములను అంగీకరించి శ్రీ వివేకానందస్వాములవారు ఆ ప్రాంతములందు సంచారము చేసిరి. శ్రీవారు కాశ్మీరములోనే నెలకు పైగా గడపిరి. మహారాజును ఆయన సోదరులును శ్రీవారియొక్క ఉద్యమమును, మిక్కిలి మెచ్చుకొనిరి. మూరీ, రావల్‌పిండి, జమ్మూ నగరములందు కొన్ని కొన్ని దినములు గడపుచు ఆయా చోటులందు ఉపన్యాసములిచ్చుచు వచ్చిరి. పిమ్మట శ్రీ స్వాములవారు శియాల్‌కోటకు విజయముచేసి అక్కడ ఒకటి ఆంగ్లమునను, ఒకటి హిందీలోను రెండు ఉపన్యాసముల నొసగిరి. శ్రీవారి హిందీ ఉపన్యాస విషయము 'భక్తి'. దాని సంక్షేపానువాదము ఈ క్రింద నొసగబడినది.

ప్రపంచమున గల ఆయా మతములు వానియందు అవలంబించు పూజావిధానములనుబట్టి వేర్వేఱుగ తోచుచున్నను సత్యమునకు అవిఅన్నియు నొకటియే. కొన్ని చోటుల ప్రజలు గుళ్లను గట్టి వానియందు పూజలు గావింతురు. కొన్నింటియందు అగ్నిని పూజింతురు. కొన్నింటియందు విగ్రహములనుపెట్టి వానిముందు సాష్టాంగపడుదురు. ఇట్లుండ దేవుడనిన విశ్వాసమే లేనివారు అనేకులు గలరు. అందఱును

సత్యవంతులే. యథార్థమగు భావమును, ఆంతరమగు మత ధర్మమును విచారించు నెడల మతము లన్నియు ఏకరూపముగ నుండును. కొన్ని మతములందు భగవంతుని పూజించుట లేదు. ఇంతేల, భగవంతుడున్నాడనియు నమ్మరు. కాని ధర్మాత్ములును, ఉత్తములును అగు నరులను దేవతలవలెనే పూజింతురు. ఈ సందర్భమున ఉదాహరణముగా బౌద్ధ మతమును చెప్పకొనవచ్చును. దేవుని యెడల చూపినను లేక మహాపురుషుల యెడల చూపినను భక్తి యనునది సర్వత్ర ఉన్నది. భక్తిరూపమగు ఉపాసన సర్వత్ర శ్రేష్ఠ మైనది. ఈ భక్తిని జ్ఞానమునకన్న ఎక్కువ సులభముగ పొందవచ్చును. జ్ఞానమునకు అనుకూలపరిస్థితులును, తీవ్ర సాధనయు అవసరము. దైహికముగ మంచి ఆరోగ్యవంతుడై సమస్త సంసార సంగములనుండి విడివడినగాని ఎవడును ఈ యోగమును సక్రమముగా సాధన చేయజాలడు. కాని భక్తియో ఎట్టి జీవితావస్థయందున్నను సులభముగా సాధన చేయవచ్చును. భగవంతునియెడ గాఢమగు ప్రేమయే భక్తి యని భక్తిసూత్రములను రచించిన శాండిల్యఋషి చెప్పు చున్నాడు. ప్రహ్లాదుడును ఇదే రీతిగా పల్కుచున్నాడు. నరునకు ఒకనాడు తిండి దొఱకని యెడల అతడు బాధపడును. అతని కొడుకు మరణించిన యెడల అది, అతని కెంత దుఃఖకరము. భగవంతునికొఱకై పరితపించు నప్పుడు భక్తుని హృదయమున అటువంటి దుఃఖమే అనుభవ మునకు వచ్చును. భక్తియొక్క గొప్ప సుగుణ మేమనగా అది మనస్సును నిర్మలము చేయును. పరమేశ్వరుని యెడల

కుదిరిన సుస్థిరభక్తి ఒక్కటియే మనస్సును పవిత్రము చేయ జాలును. "ఓభగవంతుడా! నీకు నామము లనేకములుగా నున్నవి. కాని ప్రతినామమునందును నీ మహిమ ప్రకాశించు చున్నది. అందు నిగూఢమును, మహనీయమును అగు అర్థము గర్భితమై యుండును." దేశ కాల వివక్ష లేక నిరంతరము మనము భగవంతుని గుఱించి స్మరించుచుండ వలయును.

భగవంతుని పూజించుటలో ఉపయోగించు భిన్న భిన్న నామములు చూపులకు మాత్రమే అటుల భిన్నములై కాన్పించును. ఒకడు తాను భగవంతుని పూజించు విధానమే మహా మహిమాఢ్యమైనదని తలంచును. ఇంకొకడు తన మార్గమే మోక్షమును సంపాదింపగల మహిమాన్విత విధానమని భావించును. కాని అన్ని విధానములయొక్క యథార్థమగు మూలాధారమును కనుగొనుడు; అది ఒక్కటి గనే యుండును. శైవులు శివుని మహా మహిమాఢ్యు డందురు. వైష్ణవులు విష్ణుని సర్వశక్తిమంతుడని కొలుతురు. దేవ్యారాధకులు తమ దేవి విశ్వమునం దెల్ల సర్వశక్తిమతి యని ఎవరికిని తీసిపోక వాదింతురు. నీకు సుస్థిరభక్తి కావలయు నెడల వైరభావములను వీడవలయును. ద్వేషము భక్తిమార్గమున మిక్కిలి ప్రతిబంధముగా నిలుచును. ఎవరి యెడలను ద్వేషములేని నరుడే భగవంతుని చేరజాలును. అప్పుడు సైతము తన ఇష్టదైవతము నెడల భక్తి చూపుట అవసరమే. "విష్ణువును, రాముడును ఒకటియే యని నాకు తెలియును. ఐనను కమలనేత్రుడగు రాముడే నా

ఉత్తమ నిధానము" అని హనుమానుడు వచించుచున్నాడు. నరునికి పుట్టుకతో వచ్చు విశిష్టములగు వాసనలు వానితో ఉండిపోవును. ప్రపంచమంతయు ఒకే మతమును అవలంబింపజాల కుండుటకు ఇదియే ముఖ్యహేతువు. ఒక్క మతము మాత్రమే ఉండుటను భగవంతుడును నిరాకరించుగాక! ఏలయన అప్పుడు ప్రపంచము గజిబిజిగా నుండును. క్రమ విధానముగల విశ్వముగ నుండజాలదు. ప్రతి నరుడును తనకు విశిష్టములగు సంస్కారములను అనువర్తింప వలసి యున్నది. తనమార్గము ననుసరించి సాగి పోవుటకు సాయపడు గురువు లభించినయెడల అతడు పురోభివృద్ధి గాంచును. ప్రతి నరుని వాని ఇచ్చ చొప్పున పోనీయ వలయును. అటుల గాక వానిని బలవంతముగా వేఱొక మార్గములో ప్రవేశపెట్టిన యెడల అతడు తనకున్న దానినిగూడ కోల్పోయి ఎందుకును కొఱగాని వాడగును. ఒకని ముఖము వేఱొకని ముఖమును పోలి యుండని రీతి, ఒకని స్వభావము వేఱొకని స్వభావమును పోలియుండదు. కావున వానిని వానికి అనుకూలమగు విధమున వర్తింపకుండ మన మేల అడ్డు పెట్ట వలయును? ఒక నది ఒకానొక దిశగా పాఱుచున్నది. నీవు దానిప్రవాహమునుమార్చి వేఱొక సరళ మార్గమున ప్రవేశపెట్టితి వేని అది ఎక్కువ వేగముగా ప్రవహించును. దానిశక్తి హెచ్చును. కాని దాని సరళ మార్గమునుండి బొత్తిగా మార్చివేయ ప్రయత్నించినయెడల తత్ఫలము ఏమగునో చూడుము. నీరా తగ్గిపోవును. మఱియు దాని బలమును క్షీణించును. ఈజీవితము చాల ముఖ్య

మైనది. కాబట్టి ఎవని సంస్కారము ఎటుల ప్రేరణచేయునో ఆమార్గమున వానిని నడుపవలయును. భారతదేశమున మత వైరము లేదు. ప్రతిమతమును నిరాటంకముగా వదలివేయ బడినది. కావుననే మతము సజీవమై నిలిచినది. ఒకమతమే సత్యమనియు, తనమతమును విశ్వసింపని వాడు మూర్ఖు డనియు, ఇతరుడు కపటియనియు, కపటి కానియెడల తన మతమునే అవలంబించెడు వాడనియు, భావించుట వలననే మతవిషయకముగా పోరాటములుకలుగుచున్నవని జ్ఞప్తియం దుంచుకొన వలయును.

ప్రజలందఱు ఒకే మతము నవలంబింప వలయు ననుట భగవంతుని ఇచ్ఛ అగునెడల ఇన్ని మతములు ఏల పుట్టుకొని వచ్చినవి? ప్రతివానిని ఒకే మతము అనుసరింప బలాత్కరించుటకు అనేకు లిదివఱకు వ్యర్థ ప్రయత్నములుచేసిరి. కత్తి యెత్తి ప్రజల నందఱిని ఒకే మతములోనికి చేర్చుటకు ప్రయత్నించి నప్పుడు సైతము దాని స్థానమున పదిమతములు పుట్టుకొనివచ్చినవని చరిత్ర సాక్ష్య మిచ్చుచున్నది. ఒకేమతము అందఱికిని సరిపడదు. నరుడు క్రియాప్రతిక్రియలనెడు రెండుశక్తుల సమ్మేళనతో ఏర్పడుచున్నాడు. ఈ శక్తులు వానిని జిజ్ఞాసువుగా చేయు చున్నవి. అట్టిశక్తులు నరుని మనస్సునకు వ్యాయామము కల్పింపనియెడల అతడు జిజ్ఞాస చేయుటకు, అనగా ఊహ చేయుటకు అశక్తుడై పోవును. మానవుడనగా మననము చేయువాడని అర్థము. మనుష్యః అనగా మనస్సు గలవా డని అర్థము. అట్టి మనుష్యునియొక్క మననశక్తి, లేక జిజ్ఞాస

శక్తి, లేక ఊహాశక్తి నష్టమై పోయిన తత్క్షణమే అతడు పశుసమానుడై పోవును. అట్లగుటకు ఎవరు కోరుకొందురు? అట్టి దుర్దశ భారతదేశ ప్రజలకు వాటిల్లకుండ భగవంతుడు రక్షించుగాక! మనుష్యుని మనుష్యునిగా నిలుపుటకు ఏకత్వమున భిన్నత్వము ఉండుట అవసరము. ప్రతివిషయమునను, భిన్నత్వమును అనగా !వైవిధ్యమును పోషింపవలయును. భిన్నత్వ ముండువఱకే ఈ ప్రపంచము నిలువగలదు. ఒకటి చిన్నదిగా ఇంకొకటి పెద్దదిగా ఉండుట మాత్రమే భిన్నత్వమని భావింపరాదు. ఈ జీవితమున అన్నియు తమ తమ స్థితిలో సమముగా స్వధర్మమును నిర్వహించిన యెడల భిన్నత్వము సురక్షితముగనే యుండును. ప్రతిమతము నందును యోగ్యులును, సమర్థులును ఉండి తాము పూనిన మతమును గౌరవభాజనముగా నొనర్చు చున్నారు. ప్రతి మతమునందును అటువంటి వారు ఉందురు గాన ఏ సంప్రదాయము నెడలను ద్వేషమనునది యుండరాదు. అటులైనచో పాపమును ప్రోత్సహించు మతమును మనము గౌరవింప వలయునా అని మీరు ప్రశ్నింపవచ్చును. దీనికి జవాబు వ్యతిరేకముగా నుండు ననుట నిశ్చయము. అటువంటి మతమును తత్క్షణము బహిష్కరించివేయ వలసినదే. అది అనర్థ మూలము. మతములన్నియు తప్పక నీతిమీద ఆధారపడి యుండ వలయును. ధర్మము కంటెను పవిత్రశీలము గొప్పదిగ భావింపవలయును. ఈ సందర్భమున ఆచారమనగా బాహ్యమునందును, అభ్యంతరమునందును శుచిగా నుండుట యని అర్థము. శరీరమును శాస్త్రములలో చెప్ప

బడినట్లు జలము మొదలగు వస్తువులతో కడుగుట వలన బాహ్యశౌచము సంపాదించు కొనవచ్చును. అభ్యంతరమున నుండు నరుడు అబద్ధమాడకుండుట వలనను, కల్లు సారాయములను సేవింపకుండుట వలనను, అవినీతి కార్యములను చేయకుండుట వలనను, పరోపకారము చేయుట వలనను పవిత్రుడగుచున్నాడు. ఏ పాపమును చేయక, అబద్ధము పలుకక, త్రాగక, జూదమాడక, దొంగతనము చేయక కాలముగడపినచో, నీకు మంచిదే. కాని అది నీ ధర్మముమాత్రమే అగును. అందువలన నిన్ను మెచ్చుకొనవలసిన పని లేదు. నీవు కొంత పరోపకారము కూడ చేయవలసి యున్నది. నీవు నీకు ఉపకారము చేసికొందువు కావుననే ఇతరులకును ఉపకారము చేయవలసి యున్నది. ఇచ్చట ఆహార నియమములను గుఱించి కొంత చెప్పెదను. పూర్వాచారము లన్నియు మాసి పోయినవి. వీనితో కూర్చుండి తినకూడదు, వానితో కూర్చుండి తినకూడదు అను పిచ్చి నమ్మకములు తప్ప మరేమియు మన దేశీయుల యందు మిగులలేదు. వందల కొలది సంవత్సరములకు పూర్వము విధించిన ధర్మసూత్రములలో స్పర్శసంబంధమగు శుచి మాత్రము శిథిలముగాక నిలిచియున్నది. శాస్త్రము మూడు విధములగు ఆహారము తిన కూడదని చెప్పుచున్నది. మొదటిది ఉల్లి, వెల్లుల్లి వంటి పదార్థములు; ఇవి స్వభావము చేతనే దోషము కలవి. వీనిని విశేషముగా మెక్కిన యెడల కామము పుట్టును. అంతట నరునకును నారాయణునకును కూడ అసహ్యము పుట్టించు అవినీతి కార్యములు

జరుగును. రెండవది : అన్యపదార్థములవలన అపవిత్రమైన ఆహారము. భోజనము చేయుటకు పూర్తిగ శుచియై ఒబ్బిడిగా నుండు ఏదేని స్థలమును ఏర్పఱచు కొనవలయును. మూడవది: దుష్ట మానవులు తాకిన ఆహారమును భుజింపరాదు. ఏలయన అట్టి వస్తువుల సంపర్కము వలన మనలో చెడ్డ సంకల్పములు పుట్టును. బ్రాహ్మణుని కుమారుడైనను పోకిరివాడై దురభ్యాసములు కలవాడైనచో అతడు తాకిన ఆహారమును తిన కూడదు.

ఇట్టి నియమముల భావమేమో అంతరించినది. ఉత్తమ కులమునందు పుట్టకున్నచో వాడు ఎంతటి మహాజ్ఞానియైనను, పవిత్ర పురుషుడైనను వాని చేతి ఆహారమును తినరాదు అనుట మాత్రము నిలిచి యున్నది. ఈ ప్రాచీన విధులను నిర్లక్ష్యము చేయుట మిఠాయి దుకాణములందు మాత్రము కానవచ్చును. అక్కడికి పోయి చూచిన యెడల ఆ మిఠాయి అంగడి అంతటను ఎగురుచుండు ఈగలను, రోడ్డమీద నుండి గాలికి కొట్టుకొని వచ్చి మిఠాయిని కప్పివేయు దుమ్మును, శుభ్రతయు ఒబ్బిడియు లేని వస్త్రముల ధరించిన అంగడివాడును ప్రత్యక్షమగుదురు. షాల్కా షాపులో అద్దాల పెట్టెయందుంచిన తప్ప మిఠాయిని కొనబోమని ఏక కంఠముతో కొనువారెల్లరును చెప్పివేయవలయును. అందువలన ఈగలు ముసిరి, కలరా ప్లేగు పుట్టించు క్రిములను మిఠాయికి అంటింపకుండ ఆపినట్టి పుణ్యము లభించును. మనము సర్వతోముఖముగ అభివృద్ధిగాంచవలసి యున్నది. కాని అటుల వృద్ధిగాంచుటకు మారుగా వెనుక

పడిపోవుచున్నాము. సీటిలో ఉమ్మి వేయుట తగదని మనువు చెప్పి యుండగా మనము నానావిధములగు అశుద్ధములను పావన నదులయందు పడవేయు చున్నాము. ఈ విషయము లన్నియు చూడగా మన బాహ్య శరీరపు శుచియు చాల అవసరముగనే కాన్పించు చున్నది. మన శాస్త్రకారులు ఆ సంగతిని బాగుగ నెఱుంగుదురు. ఆహార శౌచమును గుఱించిన ఈ ఆచారముయొక్క యథార్థమగు భావము నాశమై పోయినది. అక్షరములు మాత్రము నిలిచియున్నవి. దొంగలు, త్రాగుబోతులు, నేరగాండ్రు స్వకులమువారై నంతమాత్రమున మనతో నుండుటకు ఒప్పుకొను చున్నాము. కాని యోగ్యుడును, ఉత్తముడును అగువాడు తనతో సమానముగ గౌరవనీయుడగు ఒక తక్కువ జాతివానితో భోజనము చేసినయెడల అతనిని వెలిపెట్టు చున్నాము. అట్టి శీలవంతుని పోనాడుకొను చున్నాము. ఈ ఆచారము మన దేశమున కెంతయు వినాశకరము. పాపుల సంపర్కము వలన పాపమే మూడు ననియు, పుణ్యపురుషుల సహవాసము వలన పుణ్యము వచ్చుననియు, దుర్మార్గులకు దూరముగా నుండుటయే బాహ్యశౌచ మనియు మనము స్పష్టముగా గ్రహింప వలసి యున్నది. ఆభ్యంతర శౌచము ఇంతకన్నను ఎక్కువ కఠినమైన ధర్మము! అందు సత్యము పల్కుట, బీదలకు ఉపకారము చేయుట, నిస్సహాయులకు తోడ్పడుట మొదలగు నవి ఇమిడి యున్నవి. మనము సదా సత్యమునే పల్కుచున్నామా? తఱుచుగా జరుగు చున్నదిది. ఏదో తమ పబ్బము గడుపు కొనుటకు ప్రజలు డబ్బుగల వారి

ఇండ్లకు బోయి వారిని పేదల పెన్నిధానమనియు, దీనుల పాలిటి కల్పవృక్షమనియు, ముఖస్తుతులు చేయుట ప్రారంభింతురు; ఆ ధనికులు తమ ఇంటికి వచ్చు పేదల కుత్తుకలను కత్తిపెట్టికోయువారైనను సరియే! ఇది యంతయు నేమి? అబద్ధ మాడుట తప్ప మరేమియు కాదు. మనస్సును మైల పడ వేయునది ఇదియే. కాబట్టియే ఏనరుడైనను తన అంతఃకరణమును పవిత్రము చేసికొని, పండ్రెండు సంవత్సరముల కాలము ఒక్క దుష్టసంకల్పము నైనను తన హృదయములోనికి రానీయని యెడల, అట్టివాడు నోట నేది పల్కిన అది జరిగి తీరునని చెప్పినమాట ఎంతయుసత్యమే. సత్యసంధతయొక్క శక్తి ఇటువంటిది. బాహ్యమునందును, ఆంతర్యము నందును శుచియైనవానికి మాత్రమే భక్తి కుదురును. చిత్రమేమనగా భక్తియే చాలవఱకు మనస్సును పవిత్రము చేయును! హిందువులవలె శరీరముయొక్క బాహ్యశౌచమునకు అధికమగు ప్రాముఖ్యమును యూదులు, మహమ్మదీయులు, క్రైస్తవులు ఒసగకున్నను ఏదో ఒక రూపమున కొంతవఱకు దానిని వారును గమనించుచునే యున్నారు. అది కొంతవఱకు సదా అవసరమగుచుండు నని వారును తెలిసికొనిరి. యూదులు విగ్రహ పూజను ఖండింతురు. కాని వారికిని ఒక దేవాలయము ఉండెడిది. అందు వారొక పెట్టెను ఉంచెడివారు. దానికి "ఆర్క్" అనిపేరు. దానిలోపల దైవాజ్ఞాఫలకములు భద్రపరుప బడియుండును. ఆ పెట్టెపైన రెక్కలు విప్పుకొని నిలుచుండిన ఇద్దరు దేవదూతల విగ్రహము లుండును. వాని

మధ్య మేఘరూపమున భగవంతుడు ప్రత్యక్షమగునని వారు భావనచేసెడివారు. ఆ దేవాలయము చాల కాలము క్రిందటనే ధ్వంసమైనది. కాని అదే నమూనాతో క్రొత్త దేవాలయములు నిర్మింపబడినవి. వానిలో మందసములు పెట్టి మతగ్రంథములను అందుంచుచున్నారు. రోమన్ కాథలిక్కులు, గ్రీకుక్రైస్తవులు, ఒక విధమైన విగ్రహా రాధన కలవారే. ఏసుయొక్కయు, వాని తల్లియొక్కయు విగ్రహములను వీరు పూజింతురు. ప్రాటెస్టెంటులందు విగ్రహార్చనము లేదు. కాని వారు సగుణరూపమున భగ వంతుని పూజించుచునే యున్నారు. అది మఱియొక రూప మగు విగ్రహారాధనయే అనవచ్చును. పార్సీలును, ఇరాని యలును చాలవఱకు అగ్నిపూజను జరుపు చున్నారు. మహమ్మదీయులు ప్రవక్తలను, మహాపురుషులను పూజిం తురు. మఱియు ప్రార్థన సమయములందు "కాబా" వైపునకు ముఖములు త్రిప్పుదురు. మతసాధనలో ప్రథమ దశయందు బాహ్యమగు నెద్దానినైన ఆధారము చేసికొనుట మానవులకు అవసరమని ఈ విషయములు రుజువు చేయు చున్నవి. అంతఃకరణము నిర్మలమైన కొలది వారు సూక్ష్మ భావములవైపు దృష్టిని మరల్తురు. "జీవుడు బ్రహ్మముతో ఐక్యానుసంధానమును పొందగోరుట ఉత్తమము. ధ్యాన సాధన మధ్యమము. నామ పఠనము అధమము. బాహ్య పూజ అధమాధమము". అయినను ఈ తుది సాధన చేయుటలో పాపము మాత్రము లేదని స్పష్టముగా గ్రహింప వలయును. ప్రతివాడును తాను దేనిని చేయుటకు సమర్థుడో

దానినే చేయవలయును. అటులచేయకుండ వానిని నిరుత్సాహ పఱచినయెడల తన గమ్యమును సాధించుటకొఱకు మఱొక రూపమున దానినే అతడు చేయును. కాబట్టి విగ్రహారాధన చేయువారిని దూషింపరాదు. వారు అట్టి పరిణామదశ యందున్నారు. కాబట్టి అటులే చేసితీర వలయును. అట్టివారు ఉత్తమదశను పొందుటకై ముందునకు సాగిపోవునట్లు బుద్ధిమంతులైనవారు సాయపడ వలయును. అంతియే గాని ఆ యా పూజా విధానముల గుఱించి వాదులాడుటవలన ప్రయోజనము లేదు.

కొందఱు ధనమును కోరి భగవంతుని పూజింతురు. మఱికొందఱు పుత్రసంతానమును కోరి పూజలు చేయుదురు. వీరు భాగవతుల మని చెప్పుకొందురు. కాని వారిది భక్తికాదు. వారు నిజముగు భాగవతులు కారు. బంగారమును చేయ గలనని ఏదొంగసాధువైనను వచ్చిన యెడల వీరందఱును వానిచుట్టు మూగుదురు. అయినను తాము భాగవతుల మనియే భావించు కొందురు. పుత్ర సంతానము కొఱకై భగవంతుని పూజించినయెడల అది భక్తి యనిపించు కొనదు. ధనవంతులు కాగోరి పూజలు చేసిన యెడల అది భక్తి కాదు. స్వర్గమును కోరినను కూడ భక్తి కాదు. నరక బాధల నుండి రక్షణ కోరి దేవ పూజలు చేసినను అది భక్తి యనిపించు కొనదు. భయము, ఆశ ఉన్నంత వఱకు భక్తి ఫలింపదు. "ఓ దేవా! నాకు సౌందర్య వతి యగు భార్య అక్కఱలేదు. జ్ఞాన మక్కఱలేదు. మోక్షమును అక్కఱలేదు. నేను నూరుసార్లు చావనిమ్ము,

పుట్టనిమ్ము; నేను కోరు కొనునది సదా నీ పాదసేవ మాత్రమే".

"ధర్మమును కోర, మఱియు న ♦ ర్థమ్ము కోర;
కాంక్షతో నేను కామ భో ♦ గముల కోర;
కర్మమును బట్టి ఏదైన ♦ కలుగ నిమ్ము
నరకు సేయను సుంతయు ♦ నరకు సేయ;
ఎన్ని జన్మమ్ములెత్తిన ♦ నెత్త నిమ్ము;
నీ పదాంభోజ యుగమందు ♦ నిశ్చల మగు
భక్తి యుండిన చాలు; మ ♦ త్ప్రార్థనమ్ము
స్వీకరింపుము శ్రీకృష్ణ! ♦ స్వీకరింపు."

నరుడు సమస్తము నందును నారాయణుని, నారాయణు నందు సమస్తమును చూడగలిగినప్పుడు మాత్రమే పూర్ణ భక్తి లభించును. అప్పుడు మాత్రమే పిపీలికాది బ్రహ్మ పర్యంతము ప్రతి దానియందును విష్ణువు అవతారము తాల్చి వానికి గోచరింపగలడు. అప్పుడు మాత్రమే సర్వమునందును భగవంతుడు ప్రత్యక్షమై యున్నటుల తెలిసికొనగలడు. అప్పుడు మాత్రమే భగవంతుని విడిచి అన్య మిసుమంతయు నుండ జాలదను అనుభవము వానికి కలుగును. అప్పుడు, ఆ దశయందు మాత్రమే, తాను సమస్త భూతముల కంటెను అత్యల్పము అను భావము కలుగును; సత్యమగుభక్తితాత్ప ర్యముతో భగవంతుని పూజింప గలుగును. అప్పుడు ఆ నరుడు తీర్థములను, బాహ్యాపూజా విగ్రహములను విడిచి

వైచి ముందుకుసాగిపోవును. ప్రతి వానిని పరమ పవిత్రమగు దేవాలయముగా చూడగలుగును. శాస్త్రములలో భక్తి అనేక రీతులుగా వర్ణింపబడి యున్నది. భగవంతుడు మన తండ్రి యనియు, తల్లియనియు అనేకవిధములుగా చెప్పుకొనుచున్నాము. మనలోని భక్తిని గాఢముచేసికొనుటకును, భగవంతునికి దగ్గఱఅయి ప్రేమాస్పదులమై ఉండుట కొఱకును, ఈ బంధుత్వములను కల్పన చేసికొందుము. కాబట్టి ఈపేరు లన్నియు ఒక విధముగా సమంజసములే! అనగా ఈ శబ్దములు కేవలము ప్రేమ సూచకములగు శబ్దములే! అవి నిజమగు భక్తుడు భగవంతుని గుఱించి అనుభవించునటువంటి అనురాగ పూర్వకమగు ప్రేమయొక్క ఫలితార్థమే. రాసలీలయందలి రాధాకృష్ణులగాథను పరిశీలింపుడు. ఆ కథ యథార్థమగు భక్తుని ప్రపత్తి భావమునకు చక్కని నిదర్శనముగా నున్నది. ఏలయన స్త్రీ పురుష ప్రేమను మించిన ప్రేమ ప్రపంచములోలేదు. అట్టి గాఢమగు ప్రేమ ఉండు నెడల భయముగాని ఇతరానుబంధములుగాని ఉండవు. ఆ జంటను ఏకముచేసి అవ్యయమగు అనురాగబంధమున కట్టివేయు సర్వోత్కృష్టభావ మొక్కటి నిలిచియుండును. తల్లిదండ్రుల యెడ గౌరవము చూపవలసి యుండుటచే వారి మీది ప్రేమలో కొంచెము భయముకూడ కలిసి యుండును. కాని ప్రేయసీప్రియులప్రేమ అట్టిదికాదు. భగవంతుడు దేనినేని సృష్టిచేసినాడో లేదో మనకా విచారమేల? అతడు మన రక్షకుడను విషయముకూడ మనకెందుకు? అతడు మన ప్రియుడు. కావున సమస్త భయ సంకల్పము

లను వీడి మనము వానిని ప్రేమింతుముగాక. నరుడు తనకే కోరికయు లేనప్పుడే, తనకు అన్యసంకల్పము పొడగట్ట నప్పుడే, భగవంతుని గుఱించి వెఱ్ఱివాడై పోవు నప్పుడే నిజముగా భగవంతుని ప్రేమింప జాలును. ప్రియునకు తన ప్రియురాలియందు గల ప్రేమయెట్టిదో మనకు భగవంతుని యందు ఉండవలసిన ప్రేమ అట్టిది. కృష్ణుడు భగవంతుడు, రాధ వానిని ప్రేమించు చున్నది. ఆ ప్రణయకథను వర్ణించు కావ్యములను మీరు చదువుడు. అప్పుడు భగవంతుని ఎట్లు ప్రేమింపవలయునో ఊహింపగలరు. కాని ఎంతమంది దీని భావమును గ్రహింతురు? పూర్తిగ దుష్ట చిత్తులై పోయి, నీతియననేమో తెలియని జనులు దీనినంతను ఎట్లు అర్థము చేసికొన గలరు? ప్రజలు తమ మనస్సుల నుండి సమస్త సాంసారిక భావములను తొలగించుకొని స్వచ్ఛమగు నీతితోడను ఆధ్యాత్మిక భావముతోడను జీవించు నప్పుడు మాత్రమే, వారికి చదువులు రాకపోయినను, అతి సూక్ష్మములగు భావములను గ్రహింప గలుగుదురు. అయ్యో! అటువంటి వినిర్మలభావముగలవారు ఎంత తక్కువగా నుందురో గదా! తలచుచో మానవుడు దుర్వ్యాఖ్యానములుచేసి భ్రష్టము చేయజాలని మతము ఒకటేనియు లేదు. ఉదాహరణము చూడుడు. ఆత్మ శరీరము నుండి పూర్తిగ భిన్నమై యుండునని ఒకడు భావన చేయుచున్నాడు. అతడు శరీరముతో నీచములగు పాపకార్యములు చేయుచు తన ఆత్మ అసంగమై నిర్మలముగ నుండుననును. మతములను యథార్థముగా అనువర్తించు నెడల సంపూర్ణముగ పవిత్రుడు కాజా

లని హిందువుగాని, మహమ్మదీయుడుగాని, క్రైస్తవుడుగాని ఒక్కడైనను ఉండడు. కాని మంచిదో, చెడ్డదో తమ నైజముచేతనే మానవులు నడపబడుచున్నారు. దీనిని కాదనుటకు వీలు లేదు. అయినను భగవన్నామము చెవిని పడగానే పరవశము చెందువారును, భగవత్కథలను చదువునప్పుడు ఆనందబాష్పములు రాల్చువారును కొందఱు ఎల్లప్పుడును లోకములో ఉండియే తీరుదురు. అట్టి మానవోత్తములే యథార్థముగ భక్తులు.

మతసాధనయొక్క ప్రథమదశ యందు నరుడు భగవంతుని తన స్వామిగను తాను వాని సేవకుడుగను భావనచేయును. తనకు నిత్యావసరవస్తువులు మున్నగువానిని ప్రసాదించినందులకు భగవంతునియెడల కృతజ్ఞతను చూపును. మీరిట్టి సంకల్పములను అవలకు నెట్టివేయుడు. ఆకర్షవంతమగు శక్తి ఒకటి కలదు. అదియే దేవుడు. ఆ శక్తికి లోబడియే సూర్యుడు, చంద్రుడు, సర్వమును కదలుచున్నవి. ఈ లోకములోని సమస్తమును మంచిదిగాని చెడ్డది గాని, భగవంతునిదే. మన జీవితములో శుభముగాని, అశుభముగాని, ఏమి జరిగినను అదెల్ల మనలను భగవంతునికి దగ్గఱగా కొనిపోవుచునే యుండును. ఒకడు ఏదో స్వార్థము కారణముగా వేఱొకని చంపు ననుకొనుడు. తన్ను గుఱించియో ఇంకొకని గుఱించియో ప్రేమయే ఆ కార్యమునకు హేతువుగ నుండును. మనము పుణ్యము చేసినను, పాపము చేసినను మనలను ప్రేరేపించునది ప్రేమయే.

పులి తానో. తనకూన యో ఆకలిగానుండుటచేత నే పశువును చంపుచున్నది.

భగవంతుడు ప్రేమ స్వరూపి. ఆయన సమస్తము నందును ప్రత్యక్షమై యుండును. తనకు తెలిసినను, తెలియ కున్నను ప్రతివాడును భగవంతునిచేత ఆకర్షింపబడు చున్నాడు. ఒక స్త్రీ తన భర్తను ప్రేమించు నప్పుడు, తన్నాకర్షించు మహాశక్తి తన భర్తయందున్న భగవంతుడే యని గ్రహించుట లేదు. ప్రేమమయు డగు భగవంతుడే పూజార్హుడగు ఏకైక వ్యక్తి. భగవంతుని సృష్టికర్తగను, రక్షకుడుగను మాత్రమే భావన చేయునంతకాలము మనము బాహ్యపూజలు మాత్రమే చేయుదుము. కాని సమస్తము నందు భగవంతుని, భగవంతునియందు సమస్తమును చూచుచు, ఆ హద్దులను దాటిపోయి భగవంతుని ప్రేమావ తారముగ భావనచేయ గలిగినప్పుడే మనకు పరాభక్తి సిద్ధింప గలదు!

హిందూమతమునందలి సామాన్య సూత్రములు

శ్రీ స్వాములవారు లాహోరు విజయము చేసినప్పుడు ఆర్యసమాజము యొక్కయు, సనాతన ధర్మ సభయొక్కయు నాయకులు శ్రీవారికి ఘనమగు స్వాగతము నొసంగిరి.

స్వాములవారు లాహోరునందున్న కొలది కాలములోనే మూడు ఉపన్యాసముల నిచ్చిరి. మొదటిది "హిందూమతము నందలి సామాన్య సూత్రముల" గురించి; రెండవది "భక్తి"ని గురించి; మూడవది "వేదాంతము"ను గురించిన శ్రీవారి ప్రసిద్ధోపన్యాసము. మొదటిసారి శ్రీవారిట్లు ప్రసంగించిరి.

పావనమౌ ఆర్యావర్తమునందు సైతము పరమ పవిత్రముగ నెంచబడు ప్రదేశమిది. మహానుభావుడగు మనువు ప్రశంసించిన బ్రహ్మావర్త మిదియే. ఈ దివ్యభూమి యందే తొలుత ఆత్మాన్వేషణము ప్రారంభమైనది. చరిత్ర నిరూపించుచున్నట్లు ఇక్కడనుండియే యీ ఆత్మసాధన వెల్లువలై భారలి ప్రపంచమునెల్ల ముంచెత్తవలసియున్నది. తన యందు ప్రవహించు మహాస్రవంతుల బోలి ఎచ్చోట ఆధ్యాత్మిక సాధనలు వెల్లివిరిసి ప్రపంచము నందంతటను, ఉత్తరమునుండిదక్షిణమునకు, తూర్పునుండిపడమరకు సంచారము చేసి మేఘ గంభీర ధ్వనితో స్వయంప్రకటనకావించు కొనెనో ఆ భూమి ఇదే! భారతదేశముపై వచ్చి పడిన అన్ని దండయాత్రల, దోపిడుల, మొదటి దెబ్బతిని ఓర్చుకొన వలసి వచ్చినది ఈ ప్రదేశమే! వెలుపలనుండి ఆర్యావర్తములోనికి చొరబాటి వచ్చిన అనాగరిక జాతులవారి తాకిడికి ప్రథమమున రొమ్ము చూపవలసివచ్చిన వీరభూమి ఇదియే! ఇన్ని పీడలకు లోనయ్యును తన ఔన్నత్యమును, తన బలమును పూర్తిగ పోనాడుకొనక ధీరతమొయి నిల్చినది ఈ వసుంధరయే! ఆధునిక యుగమున నానక్ సాధువు తన

అబ్బురంపు విశ్వప్రేమ సిద్ధాంతమును బోధించి, హిందువు లను మహమ్మదీయులను ప్రపంచము నంతటిని తన కౌగిటను చేర్చుకొనుటకై తన బాహువులను దీర్ఘముగాచాచినదియు, తన విశాల హృదయమును తెఱచినదియు ఇచ్చోటనే! మన జాతీయ మహావీరశ్రేణులయందెల్ల అత్యంత ప్రఖ్యాతి పడసిన ఉత్తమోత్తమ వీరశ్రేణికి చెందిన గురుగోవిందసింగు జన్మించినది ఇక్కడనే. తన రక్తమును, తన సన్నిహితప్రియ బంధువర్గముయొక్క రక్తమును మత ధర్మ సంరక్షణార్థము బలియొసంగి, ఆ పిమ్మట ఎవరి కొఱకై తాను రక్త బలి దానము చేసెనో వారే తన్ను ఏకాకినిచేయగా, దక్షిణ దేశమునకు విశ్రాంతికై వెడలి తనదేశమును గుఱించి పల్లెత్తి ఒక్క దూషణ వాక్కునైనను పలుకక, ఒక్క నిందోక్తినైనను వెలువరింపక, గుండెపోటు తినిన సింగము వోలె అసువులు బాసిన ఆ మహావీరుడు ఉద్భవించిన దిక్కడనే!

ఓ పంచనదీ క్షేత్రవాసులారా! ఇక్కడ ఈ మన ప్రాచీన క్షేత్రమందు మీ ఎదుట నేను నిలిచినది బోధకుడనుగా కాదు. ఏలయన, ఇతరులకు బోధింప గలిగినంతటి పరిజ్ఞానము నాకులేదు. ప్రాచ్యభాగమునుండి పశ్చిమ భాగమునందు నివసించు సోదరులతో యోగక్షేమములను పరస్పరానుభవములను ముచ్చటించుకొనుటకు వచ్చియున్నాను. నేనిక్కడకు వచ్చుట మన మధ్యగల విభేదములను కనుగొనుటకు కాదు. మనకు ఐకమత్యము ఎక్కడ కుదురునో గ్రహించుటకొఱకే. ఏ ఆధారములమీద

మనము సదా సోదరులముగా ఉండిపోగలమో, ఏ ఆధార ముల ననుసరించి సనాతనమగు మన ప్రాచీనవాణి ఇంకను శక్తిమంతముకాగలదో తెలిసికొనుటకు నేను ప్రయత్నించు చున్నాను. మీతో నిర్మాణకార్యక్రమమును గుఱించి కొంచెము ముచ్చటించుటకు వచ్చితినిగాని నిర్మూలన ప్రకర ణమునకు ఉద్యమించి రాలేదు. ఖండనకు కాలము గడిచి పోయినది. నిర్మాణకార్యముకొఱకు మన మందఱమును నిరీ క్షించుచున్నాము. దాదాపు నూరుసంవత్సరముల నుండి మన ఈ మాతృదేశము నందంతటను విమర్శలు వెల్లువలై ప్రవహించినవి. పాశ్చాత్య శాస్త్రజ్ఞానము విచ్చల విడిగా, మనలో లోపములుగల తావులందెల్ల నాట్యము సలిపినది. దాని ఫలితముగా నేడు సందు గొందులును, కన్నములును, అన్నిటికన్న స్పష్టముగా కనబడుచున్నవి. పూర్వము దేశ మందంతటను మహా మనీషావంతులును, ఉత్తములును, మాననీయులును, సత్యపరాయణులై ధర్మాన్వేషణ బుద్ధితో దేశమునెడల అభిమానము, తమ మతము దైవము నెడల గాఢతర భక్తి గలవారును అనేకులు జన్మించిరి. వీరు, ఈ మహాత్ములు, తీవ్రజిజ్ఞాసువులు కావుననే, సాంద్రమగు భక్తి గలవారు కావుననే, వారికి తప్పు అని తోచినదాని నెల్ల విమర్శించిరి. ఈ ప్రాచీన మహానుభావులకు ధన్యవాదములు. వారు చాల మేలునే చేసిరి. కాని ప్రకృత కాలపు వాణి 'విమర్శలిక చాలును' అని హెచ్చరించు చున్నది. విమ ర్శనము కావలసినంత జరిగినది. అవసరమగు నంత దోషా న్వేషణము జరిగినది. పునరుద్ధరణకును, పునర్నిర్మాణ

మునకును సమయ మాసన్నమైనది. చెల్లాచెదరైపోయిన మనబలగములను ప్రోగుచేసికొని, వానిని ఒక కేంద్రమున సమీకరించి, దాదాపు కొన్ని శతాబ్దములనుండి గమన ముడిగియున్న మన జాతిని ముందునకు నడుపవలసిన తరుణాము వచ్చినది. గృహమును శుభ్రపరచుట మైనది. తిరిగి గృహప్రవేశము చేయవలయును. మార్గము ఆయత్తమైనది. ఆర్యసంతానములారా! ముందునకు సాగిపొండు.

ఆర్యులారా! ఈ ఉద్దేశ్యమే నన్నిచ్చటికి తీసికొని వచ్చినది. మొట్టమొదటగనే నే నేపక్షమునకుగాని, సంప్రదాయమునకుగాని చెందినవాడను కానని ప్రకటించుచున్నాను. అవిఅన్నియు గొప్పవే. నాకు మాన్యమైనవే. వాని నన్నిటిని నేను ప్రేమింతును. నా యావజ్జీవము వానిలో యోగ్యమును, సత్యమును అగుదానినెల్ల కనుగొనుటకే ప్రయత్నించుచున్నాను. కాబట్టి మనమందఱము ఏ ఏ విషయములందు ఏకీభవింతుమో వానిని మీా ఎదుట పెట్టుటయు, సాధ్యమగునేని మనకు సఖ్యము ఏర్పడు ప్రణాళికను రూపొందించుటయు ప్రస్తుతము నా ఉద్దేశ్యము. భగవదనుగ్రహమువలన అట్టి ప్రణాళిక సాధ్యమగునెడల మనము దానిని ఆచరణలో పెట్టుదముగాక! మనము హిందువులము. ఈ 'హిందువు' అనుమాటను ఏ విపరీతార్థము తోడను నేను ప్రయోగించుటలేదు. ఈ మాటయందేమేని దూష్యమగు అర్థమున్నదని చెప్పువారితో నేను ఏకీభవింపను. సింధునదికి ఆవలనుందు ప్రజలు అని మాత్రమే ప్రాచీన కాలమున దీనికి అర్థముండెడిది. ఈనాడు

మనలను ద్వేషించు వారిలో అనేకులు దానియందు విపరీతార్థమును ఆరోపింతురుగాక. అయినను పేరులో ఏమున్నది? 'హిందు' అను నామము ప్రభావవంతమగు సర్వమును, ఆధ్యాత్మికమగు సర్వమును, స్ఫురింపజేయుటయో, లేక పతితులను నిర్భాగ్యులను ధర్మభ్రష్టులను తెలుపు అవమానసూచకపదముగ నిలిచిపోవుటయో మనపై ఆధారపడి యుండును. ప్రస్తుతము 'హిందు' అను శబ్దము ఏదేని చెడుగును సూచించినను సరకు చేయకుడు. ఈ శబ్దమే సర్వభాషలయందలి సర్వశబ్దములలో అత్యంత శ్రేష్ఠమైనదని మన క్రియలవలన రుజువు చేయుటకు సంసిద్ధుల మగుదుముగాక. నా పూర్వులను గురించి లజ్జనొందకుండుట నా జీవిత ధర్మములలో ఒకటిగా భావించుచున్నాను. నాకున్నంతగర్వము ప్రపంచములో ఎవ్వరికిని ఉండదు. కాని కపటము లేకుండ చెప్పుచున్నాను, నాగర్వము నన్ను గురించి కాదు, నా పూర్వులను గురించి. నేను గతమును గురించి విచారించినకొలది, నా దృష్టిని వెనుకకు మరల్చినకొలది, అధికాధికముగా గర్వము కలిగినది. అది నాకు బలము నొసంగినది; దృఢవిశ్వాసపూర్వకమగు సాహసమును కలిగించినది; నేలమీద దుమ్ములో పడియున్న నన్ను లేవనెత్తినది; మహనీయులగు మనపూర్వులు నిర్ణయించిన ఉత్తమ ప్రణాళిక ననుసరించి కృషిసల్పుటకు నన్ను ప్రోత్సహించినది. ప్రాచీనార్య సంతానములారా! ఈశ్వరానుగ్రహమువలన మీకును అట్టి గర్వభావము కలుగుగాక! మీ పూర్వులవిషయమై

అటువంటి విశ్వాసము మీ రక్తములోనికి చొఱబారుగాక! అయ్యది మీ జీవితములతో సారూప్యమును పొందుగాక! అయ్యది ప్రపంచముయొక్క మోక్షమునకై ఉపకరించుగాక!

మన మందఱమును ఏ అంశమునందు ఏకీభవింతుమో, మన జాతీయ జీవనమునకు సామాన్య మూలాధారము ఏదియో, సరిగా కనుగొన ప్రయత్నించుటకు పూర్వము మనము ఒక్కసంగతిని జ్ఞప్తియందుంచుకొన వలయును. ప్రతివానియందును ఒక వ్యక్తిత్వము ఉండు తీరున ప్రతి జాతికిని ఒక వ్యక్తిత్వ ముండును. ఒకడు మఱొకనికంటె కొన్ని కొన్ని విశేషములలోను తనకు విశిష్టములగు సహజ లక్షణములలోను భిన్నముగా నుండునట్లు ఒకజాతి మఱొక జాతినుండి కొన్ని కొన్ని విశిష్ట స్వభావములందు భిన్నముగా నుండును. ఈ ప్రకృతియొక్క కార్య నిర్వహణమునందు ఏదో కొంత పనిని నిర్వహించుట ప్రతివాని కర్తవ్యము. వాని పూర్వ కర్మనుబట్టి అతడు అనుసరింప వలసిన ఒక ప్రత్యేక కార్యవిధానము ఉండును. జాతుల విషయమునను ఈ సూత్రము వర్తించును. ప్రతిజాతియు నిర్వర్తింప వలసిన నిర్ణీత కార్యముండును. ప్రతిజాతియు ప్రకటింప వలసిన ఒక ప్రత్యేక సందేశ ముండును. ప్రతిజాతియు నిర్వహింప వలసిన ఒక విశిష్టమగు ఉద్యమ ముండును. కాబట్టి ప్రారంభమునుండియు మన జాతియొక్క ఉద్యమమును, అది సఫలము చేయవలసిన నిర్ణీత ధర్మమును, వివిధ జాతుల పురోగమనమునందు అది ఆక్రమింప వలసిన స్థానమును,

వివిధ జాతి సామరస్యమునకై అది చేయవలసిన విశిష్ట కృషిని, మనము తెలిసికొన వలసి యున్నది. కొన్ని సర్ప ముల నెత్తిమీద మణు లుండుననియు, ఆ మణులు వాని శిరస్సున నున్నంతవఱకు వాని నేమిచేసినను సరియే ఆ పాములు చావవనియు, చిన్నతనమున కథలు విని యుందుము. తమ ఆత్మలను చిన్నపక్షులలో దాచి యుంచు కొను రాక్షసులను, పెనుభూతములను గుఱించి కథలు వినుచుందుము. ఆ పక్షులు సురక్షితముగా నున్నంతకాలము ఈ రాక్షసులను చంపు శక్తి లోకములో నెవరికిని ఉండదు. ఈ భూతములను నీవు ముక్కలు ముక్కలుగా నరకుదువు గాక; వానిని చంపుటకు నీ వేమైనను చేయుదువుగాక; అవి మాత్రము చావవు. అటులే జాతులును ఉన్నవి. ఒకజాతి యొక్క ప్రాణము కేంద్రీకృతమైయుండు ప్రత్యేక విషయము ఒకటి యుండును. అక్కడ ఆ జాతియొక్క జాతీయత నెలకొనియుండును. దానిని ధ్వంసము చేయువఱకును ఆ జాతి చావదు. ఈ సాదృశ్యమును బట్టి ప్రపంచచరిత్రయందలి మహాద్భుత సంఘటన నొకదానిని మనము అర్థముచేసికొన వచ్చును. ఈ మన పుణ్యభూమి మీదుగా కెరటాలు కెరటాలుగా అనాగరికజాతుల దాడులు దొరలుచు పోయినవి. వందలకొలది సంవత్సరములు "అల్లాహో అగ్బర్" అను రణధ్వనులు ఆకసమును చీల్చివేసినవి. ఏ హిందువుగాని తన అంత్యకాలము ఎప్పుడు మూడ నున్నదో ఎరుగడు. ప్రపంచ చరిత్రలో ఇంతగా ఇడుమల గుడిచిన జాతి, ఇంతగా అణగద్రొక్కబడిన జాతి మఱియొకటి లేదు.

మనము ఇప్పటికిని అదే స్థితిలో ఉన్నాము. అవసరమగుచో మరల మరల కష్టముల నెదుర్కొనుటకు సంసిద్ధముగా నిలిచి యున్నాము. ఇంతియేకాదు; మనము బలముగలవారమని, అవసరమగుచో దేశాంతరములకు పోవుటకుసైతము సిద్ధముగ నిలిచియున్నామని తెలుపు సూచనలు ఇప్పు డిప్పుడు కానవచ్చుచున్నవి. వికాసము చైతన్యమునకు లక్షణముగదా!

మన భావములును, మన సంకల్పములును ఈ భారత దేశముయొక్క హద్దులలోనే ఒదిగియుండలేదు. ఇతర జాతుల వాఙ్మయములోనికి ప్రాకిపోయినవి. వివిధజాతుల యందు తమ అర్హస్థానమును ఆక్రమించుకొని, మనకు ఇష్ట మున్నను లేకున్నను, కొన్నియెడల నాయకత్వమును, నిరంకుశాధికారమును సైతము చేపట్టినవి. మొత్తముమీద ప్రపంచ వికాసమునకు భారతదేశము చేసిన దోహదము అధ్యాత్మవిద్యాప్రచారము. మానవుని అంతఃకరణమును ఆక్రమింపదగిన విషయములలో అత్యున్నతమును, అతి గంభీరమును, అతిసూక్ష్మమును అగు తత్త్వవిద్య భారత దేశమునుండి బహిర్గత మగుటవలననే మన జాతికి ప్రపంచ జాతులలో ఒక విశిష్టస్థాన మేర్పడినది. మనపూర్వులు అనేకములగు ఇతర విషయములందును కృషి సలిపిరి. ఇతర జాతుల వారివలెనే వీరును ఇంద్రియగోచరమగు బాహ్య ప్రకృతియొక్క రహస్యములను కనుగొనుటకై మొట్ట మొదట ప్రయత్నించిరి. అద్భుతమగు తమ మహామేధా బలముతో లోకమంతయు శాశ్వతముగ గర్వపడదగిన

గొప్ప అలౌకిక కార్యములను ఆ క్షేత్రమునకూడ సాధించి యుండెడివారు. కాని అంతకన్న ఉత్తమమైనదానికొఱకై వారు దీనిని విడిచివేసిరి. వేదపుటలనుండి ఉదాత్తమగు ఒక వాణి ఘోషిల్లుచు వినవచ్చుచున్నది—"ఆ నిర్వికార బ్రహ్మమును తెలుపునట్టి శాస్త్రమే ఉత్తమోత్తమమైనది!" వికారపుంజమును క్షణభంగురమును అగు ప్రకృతియొక్క, ఈ మర్త్యప్రపంచముయొక్క, ఈ దుఃఖసంసారముయొక్క, ఈ శోకమయలోకముయొక్క శాస్త్రముకూడ గొప్పది కావచ్చును. నిజమునకు గొప్పదే. అయినను ఎచ్చట మాత్రమే శాంతి కలదో, ఎచ్చట మాత్రమే శాశ్వత జీవనము కలదో, ఎచ్చట మాత్రమే అఖండత్వము కలదో, ఎచ్చట మాత్రమే దుఃఖమంతయు అంతరించుచున్నదో అట్టి నిర్వికార బ్రహ్మమును గుఱించిన, ఆ పరమానందమయుని గుఱించిన శాస్త్రమొక్కటియే మనపూర్వుల అభిప్రాయములలో అన్నింటిలోను ఉత్తమోత్తమము! ఇంతేల మనకు కూడును, గుడ్డను, తోడిమానవులను వశముచేసికొను శక్తిని ఒసగగల శాస్త్రమును, తోడి జీవరాసులను జయించి వానిపై పెత్తనము చెలాయించు టెటులో తెలుపు శాస్త్రమును, బలవంతులు బలహీనులపైని అధికారము చూపు యుక్తిని నేర్పు శాస్త్రమును వారపేక్షించిన యెడల కనుగొనగలిగెడి వారే! కాని ఈశ్వర కృపవలన అంతకన్న మిక్కిలి ఉత్తమమును, ఉన్నతమును, అత్యధికానందప్రదమును అగు ఆ అన్యవిషయమును వారు తత్క్షణము గుర్తించిరి. అది వారి జాతీయ స్వభావమైపోవుచుటకును, వేలకొలది

సంవత్సరములనుండి అనుస్యూతముగా పిత్రార్జిత సంపదగా మనదాక వచ్చువఱకును, అది మనలో సారూప్యము పొందు వఱకును, మన రక్తనాళములలో ప్రవహించు ప్రతి నెత్తురు చుక్కలోను అది జలజలలాడువఱకును, అది మన నైజ లక్షణమైపోవువఱకును, "మతము", "హిందువు" అను శబ్దములు అభిన్నములై పరగు వఱకును, వారు దానిని పట్టుకొని సాధించిరి. అది మనజాతీయ విశిష్టలక్షణము. దానినెవరును తాకలేరు. ఖడ్గమును అగ్నిని చేబూనివచ్చిన క్రూరజాతులలో, క్రూరదుష్టాచారములను తోడ్కొనివచ్చిన అనాగరిక జాతులలో, ఒక్కరేనియు మన ఆయువు పట్టును తాకజాలక పోయిరి. ఆ "జీవమణి" ని ఒక్కడును స్పృశింప జాలక పోయెను. మన జాతీయాత్మ నెలకొనియున్న ఆ "పక్షి" ని చంపు శక్తి ఒక్కనికి లేకపోయెను. కాబట్టి మత మనునది ఈ జాతియొక్క ఆయువుపట్టు. అది సురక్షితముగా నున్నంతకాలము ఈ జాతిని ధ్వంసముచేయగల శక్తి ఈ జగత్తున ఎక్కడను నుండదు. మన పిత్రార్జిత సంపదలన్నిటిలోను శ్రేష్ఠతమమగు అధ్యాత్మధర్మమును మనము అవలంబించి యుండునంత కాలము, అన్ని బాధలును, తాత్కాలికములగు అన్ని దుఃఖములును, మనకు ఏ హానియు కలుగజేయకయే దాటిపోవును. మనము ప్రహ్లాదునివలె ఆ అగ్ని జ్వాలలనుండి సురక్షితముగా బయట పడగలము. ఏ హిందువైన అధ్యాత్మపరాయణుడు కానియెడల, వానిని నేను హిందువనియే పిలువను. ఇతర దేశములందు ప్రతివానికిని మున్ముందుగా రాజకీయము ముఖ్యము; ఆ పిమ్మట కొంచెము

మతము. కాని ఇక్కడ భారతదేశమునందో మన జీవితము లందు ప్రప్రథమమును, ప్రధానమును అగు ధర్మము ఆధ్యాత్మికము! ఆ పిమ్మట కాలవ్యవధి యున్నచో ఇతర విషయములు వచ్చును. దీనిని మనస్సున పెట్టుకొని మన జాతీయ శ్రేయస్సుకొఱకు ప్రాచీనకాలమున జరిగినట్లే ఇక ముందును సదా పాటుపడవలయును. ప్రస్తుతము మన జాతి యొక్క ఆధ్యాత్మిక శక్తుల నన్నిటిని మున్ముందుగా కనుగొన వలసి యున్నది. భారతదేశములో జాతియైక్య మనగా అచ్చ టచ్చట చెదరియున్న ఆధ్యాత్మిక శక్తుల నన్నిటిని ప్రోగు చేయుటయే! భారతదేశములో ఒకజాతి యనగా ఒకే ఆధ్యాత్మిక సంకీర్తనమునకు అనుగుణముగా తాళమువేయు హృదయస్పందనముగల ప్రజారాశి యనియే అర్థము!

ఈ దేశములో కావలసినన్ని సంప్రదాయములు ఉండెడివి. ఇప్పుడు కావలసినన్ని యున్నవి. ఇకముందును కావలసినన్ని ఉండగలవు. ఏల యనగా మన మతము భావనారూపసిద్ధాంతములందు సంపూర్ణ స్వాతంత్ర్య మొసగు చున్నది. ఇది మన మతమునకు ప్రత్యేక లక్షణము! ఈ సిద్ధాంతముల ననుసరించి అతి స్వల్పాంశముల వివరణము జరుగును. మన శిరస్సులపైని ఉండెడి ఆకాశమంత విశాల ములును, సాక్షాత్తు మూలప్రకృతియంత శాశ్వతములును అగు ధర్మసూత్రములనుండి ఈ స్వల్ప వివరము లన్నియు నిర్మితము లగుచుండును. కాబట్టి సహజముగా సంప్రదాయ భేదములు మనదేశమున ఉండి తీరవలసినదే. కాని ఉండ తగనిది ఏది? ఈ సాంప్రదాయకములగు కొట్లాటలు

ప్రదాయములు ఉండి తీరవలసినవే అయినను దురభిమానము ఉండ నగత్యము లేదు. దురభిమానమువలన ప్రపంచ మెన్నడును బాగుపడదు. అయినను వేర్వేఱు సంప్రదాయములు లేనిది ప్రపంచము నడువజాలదు. ఒక చిన్న మానవ బృందము ప్రతి కార్యమును నిర్వహింపజాలదు. ఈ జగత్తున గల అనంత మగు శక్తిరాశి నంతను కొలదిమంది పురుషులు పరిపాలింప జాలరు. కావున పరిశ్రమవిభాగము బలాత్కారముగా నైనను జరగవలసినదే. అందువలననే అనేక సంప్రదాయ ములు ఏర్పడినవి. ఆధ్యాత్మికశక్తుల వికాసార్థము సంప్రదాయ భేదము లుండునుగాక! కాని అందువలన మనము పోరాట ములకు తలపడ వలసిన అగత్యము కలదా? మన ప్రాచీన గ్రంథములు ఈ విభేదము మిథ్య అనియు, ఇన్ని విభేదము లున్నను వీని యన్నింటను ఒక ఐకమత్యము ఒక సుందర సామరస్యము కలదనియు ఘోషించుట లేదా? "ఏకం స ద్విప్రా బహుధా వదన్తి" (ఉండు బ్రహ్మము ఒక్కడే. జ్ఞానులు వానిని అనేక నామములతో పిలుతురు) అని మన ప్రాచీనగ్రంథములు ప్రకటించుచున్నవి. కాబట్టి ఈ సంప్రదాయముల మధ్య తగవులు కలిగిన యెడల, ఈ వేర్వేఱు సంప్రదాయములు కొట్లాటలకు దిగిన యెడల, భారతదేశమున గల ఆయా సంప్రదాయముల నడుమ అసూయాద్వేషములు పొసగినయెడల, సర్వసంప్రదాయము లును సర్వకాలము గౌరవింపబడుచు వచ్చిన ఈ దేశములో ఆ వంశపురుషుల సంతానమని చెప్పుకొనుటకేని మనకు

యోగ్యత ఉండదుగదా! అది యెంతటి శోచనీయ స్థితియో ఆలోచింపుడు!

మన దేశములో వైష్ణవులుగాని శైవులుగాని, శాక్తేయులుగాని గాణాపత్యులుగాని, ప్రాచీన వేదాంతపద్ధతులకు చెందిన వారుగాని, నూతన మతములకు చెందినవారుగాని, పూర్వాచార సంప్రదాయములకు చెందిన వారుగాని, నవీన సంస్కారసంఘములకు చెందిన వారుగాని, కొన్ని మహాధర్మ సూత్రముల విషయమున ఏకీభవించుచున్నారని నా అభిప్రాయము. హిందువునని చెప్పుకొను వాడెల్ల ఈ ధర్మ సూత్రములను విశ్వసించుచున్నాడు. అయినను ఈ ధర్మ సూత్రములకు అర్థముచెప్పుటలో, వానికి వివరణములు కూర్చుటలో, సహజముగా భిన్నత్వము ఉండితీరవలసినదే. దానిని అందఱును ఆమోదింప వలసినదే. ఏలయన ప్రతి మానవుని బలాత్కారముగా మన స్థితియందే నొక్కి పెట్టుట మన సిద్ధాంతము కాదు. మన వ్యాఖ్యానము ననుసరించియే వర్తింపుమనియు మన విధానమునే అనుసరించి జీవింపు మనియు ప్రతిమానవుని బలాత్కరించుట పాతకము. వేదములు మత రహస్యములను బోధించు సనాతనగ్రంథములని ఇక్కడనున్న వారందఱు బహుశః విశ్వసింతురని అనుకొందును. ఈ పావనవాఙ్మయము ఆది లేక, అంతమును లేక, ఆద్యంతములులేని ప్రకృతితో సమాన ప్రతిపత్తి కలిగియున్నదని మన మందఱమును నమ్ముదుము. ఆ పవిత్ర గ్రంథము నెదుట నిలుచుండు నప్పుడు మత సంబంధములగు మనవిభేదములును మతవిషయకములగు తగవులాటలును

అన్నియును అంతరింప వలసి యుండుననియు, అధ్యాత్మ సంబంధములగు మత విభేదముల నన్నింటిని తీర్చుకొనుటకు వేదమే ఉత్తమ న్యాయస్థాన మనియు మనమందఱమును అంగీకరింతుము. ఆ వేదములు ఎట్టివి అను నిర్ణయమును గుఱించి మనకు వేర్వేఱు దృక్పథములు ఉండవచ్చును. ఒక భాగము మఱొకభాగము కంటె అధికపవిత్రత కలదని భావించు ఒక సంప్రదాయము ఉండుగాక! కాని మన మందఱమును ఈ వేదముల విషయమున సోదరుల మనియు, పూజనీయములును సనాతనములును ఆశ్చర్యజనకములును అగు ఈ గ్రంథములనుండియే మన కీనాడు గల శుభకర మును నిర్మలమును పవిత్రమును అగు సర్వమును లభించె ననియు మనము గ్రహించినంత కాలము ఆ విషయము అంతగా పాటింప దగినది కాదు. కాబట్టి మీరు వేద ప్రామాణ్యమును విశ్వసించు నెడల మొట్టమొదటగా ఈ సూత్రమును దేశమం దెల్లెడల బాహాటముగా పూర్ణ ప్రచారము చేయుడు. వేదములకు అర్హమగునట్టి ప్రాధాన్య మును ఒసంగుడు. సరే, వేదములతర్వాత మనమందఱమును విశ్వసించు రెండవ అంశమేది? ఈ జగమునంతను సృష్టించి రక్షించు మూలశక్తియై యుండు వా డెవడో, జగత్తనెడు ఈ విచిత్రసృష్టి కాలక్రమము ననుసరించి ఎవనినుండి వ్యక్తమై వెలువడుచు మరల ఎవనిలోనికి పోవుచుండునో అట్టి భగవంతు డొకడు ఉన్నాడనుట. ఈ భగవంతుని గుఱించి మన భావనలు భిన్నముగా నుండవచ్చును. ఒకడు పూర్ణముగా సగుణుడగు భగవంతునియందు విశ్వాసము

ఉంచవచ్చును. మఱొకడు సగుణు డయ్యును మానవ స్వరూపుడుగానట్టి భగవంతుని నమ్ముకొన వచ్చును. వేఱొకడు పూర్ణముగా నిర్గుణుడగు భగవంతునియందు నమ్మకము పెట్టుకొన వచ్చును. ఈ అందఱకును వేదము లందు ప్రమాణములు దొఱకును. మనమందఱమును భగవంతునియందు విశ్వాసము గల వారమే! దేనినుండి ఈ సమస్తమును కలుగుచున్నదో, దేనియందు ఈ సమస్తమును మనుచున్నదో, దేనిలోనికి తుదకు ఈసమస్తమును మరలుచున్నదో, అట్టి విచిత్రాఖండ శక్తిని నమ్మనివాడు హిందువునని చెప్పుకొనుటకు అర్హుడుకాడని దీని అర్థము. అట్లగుచో ఈ సిద్ధాంతమును గూడ దేశము నందంతటను ప్రచారము చేయుదముగాక. నీ కెట్టి భావనకలదో అట్టి దానినే ప్రచారము చేయుము; దానినే బోధింపుము. భేదము లేదు; మనము దానిని గుఱించి పోట్లాడబోవుట లేదు. భగవంతుని మాత్రము ప్రచారము చేయుము. మనకు కావలసిన దంతయు అదియే. ఒక భావన వేఱొక దానికంటె శ్రేష్ఠతరముగ నుండవచ్చును. కాని, వానిలో ఏదియు దూష్యము కాదని నీవు జ్ఞప్తియం దుంచుకొన వలయును. ఒకటి శ్రేష్ఠమైనది, మఱొకటి శ్రేష్ఠతరమైనది, ఇంకొకటి శ్రేష్ఠతమమైనది; అంతియేగాని చెడ్డది అనుమాట మన మతముయొక్క పరిభాషలోనికి రాదగదు. కాబట్టి తమకు ఇష్టమగు విధమున భగవంతుని నామమును ప్రచారము చేయు వారి నందఱిని భగవంతుడు ఆశీర్వదించునుగాక! భగవంతుని గుఱించి ఎంతెంత ప్రచారముజరిగిన ఈ జాతికి

అంతంత మేలు చేకూరును. భగవన్నామము స్మరింప వలయుననెడు భావముతో మన సంతానమును పెంచుదుము గాక! ఈ భావము పేదవారి ఇండ్లలోనికిని, దీనజనుల గుడిసెలలోనికిని, శ్రీమంతుల భవనములలోనికిని చొచ్చుకొని పోవుగాక!

నేను మీకు తెలుపదలచిన మూడవ భావమిది: పుడమియందలి ఇతరజాతులవలె, ఈ ప్రపంచము కొన్ని వేల యేండ్ల క్రిందట సృష్టింప బడెననియు, మరల ఒకానొక దినమున శాశ్వతముగ నాశముచేయబడుననియు మనము నమ్ముటలేదు. ఈ జగత్తుతో కూడ నరుని ఆత్మ, శూన్యము నుండి సృష్టింప బడెననియు మనము నమ్మము. మన మందఱము ఏకీభవించు మఱొక అంశము ఇదియే యని నేను తలంతును. ప్రకృతి ఆద్యంతములు లేనిదనియు, ఈ బాహ్యప్రపంచముయొక్క స్థూలద్రవ్యము కొన్నినియత సమయములందు తన అత్యంతసూక్ష్మదశకు మరలు ననియు, కొంత నియమిత కాలము వఱకు అటుల నిలిచి తిరిగి బహిర్గతమై మనము 'ప్రకృతి'యని పిలిచెడు ఈ అనంత మనోహర దృశ్యముగా వ్యక్తమగుచుండుననియు మనము విశ్వసింతుము. ఈ తరంగగతి కాలము ఆరంభ మగుటకు పూర్వము నుండియు జరుగుచున్నది. ఇంకను అనంతముగా శాశ్వతముగా జరుగుచునే యుండును. మన విశ్వాస మిట్లున్నది. హిందువులందఱును విశ్వసించు విషయ మింకొకటి కూడ కలదు. 'నరుడు' అనగా ఈ జడమయస్థూలశరీరము మాత్రము కాదు. ఆంతరమగు మనస్సనెడు సూక్ష్మశరీరము

మాత్రమును కాదు. ఈ శరీరము మాఱిపోవుచున్నది. అట్లే మనస్సును మాఱిపోవుచున్నది. కాని వీనికంటె శ్రేష్ఠతర మైనది ఒకటి కలదు. అది వీనికి అతీతముగనుండు ఆత్మ. 'ఆత్మ' అను శబ్దమును భాషాంతరమున తెలుప ప్రయత్నింపను. ఏ భాషాంతరీకరణము చేసినను తప్పే యగును. ఈ సూక్ష్మశరీరమునకు ఆవల ఒకటి యున్నది అని మన మందఱమును నమ్ముచున్నాము. అదియే నరుని ఆత్మ. దానికి ఆద్యంతములు లేవు. మరణమన్న నేమో అది ఎఱుగదు. తక్కిన జాతు లందఱి భావములకును భిన్నమగు ఈ విచిత్ర భావము మనకు గలదు. అదే మన ఆత్మ; అది శరీరము తర్వాత శరీరమును వరుసగా గ్రహించి అందు వసించుచుండును. తనకు అభిలాష ఉన్నంత వఱకు అటుల చేయుచుండును. తుదకు అది ముక్త మగును. ఆ పిమ్మట ఇక దానికి జననము లేదు. ఇచ్చట సంసార సిద్ధాంతమును సూచించుచున్నాను. మనశాస్త్రములు బోధించు 'జీవులు శాశ్వత'మనెడు సిద్ధాంతము ఇదియే. మనము ఏ సంప్రదాయమువారమైనను అందఱము ఏకీభవించు విషయ మిది ఒకటి. ఆత్మకును భగవంతునికినిగల సంబంధమును గుఱించి భావభేదము లుండవచ్చును. ఒక సంప్రదాయము ప్రకారము ఆత్మ భగవంతునినుండి శాశ్వతముగా వేఱుపడి యుండవచ్చును; వేఱొక సంప్రదాయము ప్రకారము ఆ అఖండాగ్ని రాశియందు ఒక రవ్వను బోలి యుండవచ్చును; ఇంకొక సంప్రదాయము ప్రకారము ఆ అఖండవస్తువుతో అభిన్నమై ఉండవచ్చును. మూలసూత్రమునందు మనకు

విశ్వాస మున్నంతవఱకు మనమెట్లు భావన చేసినను తొందఱ లేదు. ఆ మూలసూత్ర మిది : జీవాత్మ అనంతమైనది; అది ఎన్నడును సృష్టియైనది కాదు. కావున ఎన్నడును మరణిం పదు; అది వేర్వేఱు శరీరములలోనికి పోవుచు మానవ శరీర ములో పరిపూర్ణత్వమును పడయు వఱకు పరిణామము పొందు చుండును. ఈ సూత్రమునుగుఱించి మన కందఱకును ఏకీ భావము కలదు. ఇక ఉత్తమోత్తమమును అతి విస్మయ కరమును, అధ్యాత్మ క్షేత్రమున కనుగొనబడిన సిద్ధాంతము లలోనెల్ల శ్రేష్ఠతమమును అగు విషయము ఇంకొకటికలదు. పాశ్చాత్య తత్త్వశాస్త్రము, ప్రాచ్య వేదాంతము, ఈ విషయ ముననే ప్రధానముగా భేదించుచున్నవి. పాశ్చాత్య తత్త్వ శాస్త్రమును చదువుచుండిన మీలో కొందఱు దీనిని కనిపట్టియే యుండ వచ్చును. అది ఏది? – మనము శాక్తే యులమైనను, వైష్ణవుల మైనను, సూర్యోపాసకుల మైనను, బౌద్ధుల మైనను, జైనుల మైనను భారత దేశములోని మన మందఱమును జీవాత్మ స్వభావముచేత నే పవిత్రమైనదనియు, పూర్ణ మైనదనియు, అఖండశక్తి గలదనియు, దివ్యమైన దనియు విశ్వసించు చున్నాము. ద్వైతుల అభిప్రాయము ననుసరించి ఆత్మయొక్క ఈసహజ దివ్య తేజస్సు పూర్వపు దుష్కర్మవలన సంకుచితమైపోయినది. భగవదనుగ్రహము వలన అది తిరిగి వికాసమును పొంది తన పూర్ణత్వమును ప్రకటించును. ఇక అద్వైత సిద్ధాంతము ననుసరించి సంకోచ మనెడు ఈభావము సైతము కొంత వఱకు పొరపాటే. 'మాయ' ఆత్మను ఆవరించియుండుట చూచి ఆత్మ తన

మహిమను కోల్పోయినదని మనము భ్రమించుచున్నాము; ఇంతియే కాని దాని మహిమలు సంపూర్ణముగా ప్రకాశించుచునే యున్నవి. ఈభేదము ఎటువంటిదైనను; మన ప్రధాన సారాంశమును విచారించు నప్పుడు, ప్రాచ్యపాశ్చాత్య సిద్ధాంతముల మధ్య పరస్పర సమాధానము కుదరని గొప్ప భేద మొకటి కలదని స్పష్టమగుచున్నది. ఉత్తమమును శుభంకరమును అగు సర్వమును ప్రాచ్య ఖండవాసులు అభ్యంతరమున వెదకుదురు. పూజలు చేయునప్పుడు మనము కన్నులు మూసికొని భగవంతుని అభ్యంతరమునందు కనుగొన జూతుము. పాశ్చాత్యులో, భగవంతుని కొఱకు బాహ్యమునందు పైకిచూతురు. పాశ్చాత్యులకు వారిమత గ్రంథములు బాహ్యమునుండి పుట్టినవి. మనగ్రంథములో శ్వాసవలె అభ్యంతరమునుండి వెలువడినవి. మంత్రద్రష్టలగు ఋషుల హృదయములనుండి భగవంతుని శ్వాసగా అవి వెలువడినవి.

నా మిత్రులారా! నా సోదరులారా! మనము బాగుగా గ్రహింపవలసిన ముఖ్యాంశ మిది యొకటి. భవిష్యత్కాలమున మనము పట్టుదలతో అనుసరింపవలసినది ఈ ఒక్క విషయమే యని మీకు తెలుపుచున్నాను. ఈ ఒక్క విషయమును గుఱించి నాకు దృఢవిశ్వాస మమరినది. మీరు దీనిని చక్కగ గ్రహింపవలయునని నా ప్రార్థన — దివారాత్రములు తాను వ్యర్థుడనని మననము చేయుచుండు నరునివలన ఎట్టి శుభమును కలుగబోదు. ఒకపురుషుడు శేయింబవళ్లు తాను దుఃఖితుడనని అధముడనని వ్యర్థుడనని

స్మరించు చుండెనేని, అతడు వ్యర్థుడే అయిపోవును. నీవు 'అహం' 'అహం' అని స్మరింతువేని అటులే అయిపోవుదువు. నీవు 'నాహం' అనుచు 'నేను కా'నని తలంచి, పగలు రాత్రి వ్యర్థుడనని మననము చేయసాగితివేని నీవు నిజముగా వ్యర్థుడవే అయిపోవుదువు. ఈ మహా సత్యమును జ్ఞప్తియం దుంచుకొనవలయును. మనము ఆ సర్వశక్తిమయుని బిడ్డలము; మన మా అఖండ దివ్యాగ్నిలోని రవ్వలము. మనము శూన్యులమై పోవుటెట్లు? మనము సర్వమయులము. మనము సర్వమును చేయ సిద్ధముగ నున్నాము. మనము దేనినైనను చేయగలము. మనము ప్రతిదానిని చేసి తీరవలెను. ఈ ఆత్మవిశ్వాసము మన పూర్వుల హృదయములందు ప్రకా శించినది. నాగరికతాభివృద్ధియందు వారిని ముందునకు త్రోసికొని వచ్చిన క్రియాశక్తి ఈ ఆత్మవిశ్వాసమే! మనకు భ్రష్టత్వము వాటిల్లిన యెడల, దోషము చేకూరిన యెడల, నామాటను గుర్తుపెట్టుకొనుడు. ఆ భ్రష్టత్వము మన ప్రజలు ఆత్మవిశ్వాసమును కోల్పోయిననాడే ప్రారంభ మైనది. తనయందు తాను విశ్వాసము పోనాడుకొనుట యనగా భగవంతునియెడ విశ్వాసము పోగొట్టుకొనుటయే! నీలోనను, నీద్వారమునను కర్మ చేయుచున్న ఆ అఖండ శుభంకర దైవమునందు నీకు విశ్వాసము కలదా? ఈ అంతర్యామి ప్రతి పరమాణువు నందును వెలసి, నీ శరీర మంతటను, నీ మనస్సునందును, నీ ఆత్మయందును ఓతప్రోత ముగా (పడుగు పేకగా) వ్యాపించి యున్నటుల నీవు విశ్వసింతు వేని ఇక అధైర్యపడుటెట్లు? నేను ఒక చిన్న నీటిబుడగను

కావచ్చును; నీవు పర్వతోత్తుంగ తరంగము కావచ్చును. విచారమేల? ఆ అనంత సాగరము నీకును నాకునుగూడ ఆధార క్షేత్రమై యున్నది. ఆ అఖండచైతన్య సముద్రము, ఆ అఖండశక్తి జలరాశి, ఆ అఖండాత్మజలనిధి, నీదైన యటులే నాదియు కూడ. నా జన్మాదిగా నా చైతన్యము సాక్షిగా ఆ అనంత చైతన్య రాశితో ఇదివఱకే కలసి యున్నాను. దానితో యోగము నం దున్నాను. పర్వత మంత ఎత్తు గలిగి నీవు ఉన్నను, నీవలె ఆ అనంత క్షేమ నిధితో ఆ అఖండశక్తి రాశితో నేను కలిసియే యున్నాను. కాబట్టి నాసోదరులారా! ఈ జీవప్రదమైన, మాన్యమైన, ప్రభావవంతమైన మహాసిద్ధాంతమును మీబిడ్డలకు, వారు పుట్టిన నాటినుండియే బోధసేయుడు. మీరు వారికి అద్వైతము నేర్ప నక్కఱలేదు; ద్వైతమే బోధింపుడు; లేక మీ కిష్టమగు ఏమతమునైనను బోధింపుడు. ఏది బోధించినను ఈ భారత దేశమునందంతటను ఆత్మయొక్క పూర్ణత్వమును గూర్చిన ఈ సిద్ధాంతమే శాశ్వతమై నిలువగలదు. దీనినే సకల సంప్రదాయములును విశ్వసించుచున్నవి. ఆ మహా తత్త్వవేత్త కపిలాచార్యులు తెలిపినటుల జీవాత్మ స్వభావము చేతనే పవిత్రమైనది. కానియెడల ఎన్నడును అది పవిత్రతను పొందజాలదు. స్వభావముచేత ఏదేని పరిపూర్ణము కాని యెడల, ఒకప్పుడది పరిపూర్ణత్వమును పొందినను ఆ పూర్ణత్వము మరల జారిపోవును. నరుడు స్వభావముచేతనే అపవిత్రుడైన యెడల, నడుమ ఒక ఐదునిముసములపాటు పవిత్రుడైనప్పటికిని అతడు సదా అపవిత్రుడుగా ఉండి

పోవలసినవాడే. ఆ పవిత్రత్వము కొట్టుకొని పోవుకాలము వచ్చితీరును. అంతట పూర్వపు సహజమగు అపవిత్రత మరల తలసూపవలసినదే! కాబట్టి మన తత్త్వవేత్తలందఱును పుణ్యమే మన స్వభావమందురు. పూర్ణత్వమే మన నైజము; అంతియేకాని అపూర్ణత, మాలిన్యము, మన స్వభావములోనివి కావు. మనము ఈ విషయమును జ్ఞప్తియందుంచుకొందుముగాక. ఒక మహర్షి ప్రాణావసాన కాలమున తన మహాకార్యముల నన్నింటిని, తన మహోత్తమ సంకల్పముల నన్నింటిని, జ్ఞప్తికి తెచ్చుకొనుమని తన మనస్సును హెచ్చరించెనట! తన దోషములను లోపములను జ్ఞప్తికి తెచ్చుకొనుమని మనస్సునకు చెప్పలేదు! చూచితిరా! మనోహరమగు ఈ ఉదాహరణమును ఎన్నడును మఱవకుడు. లోపములా ఉండును. దుర్బలతయా ఉండి తీరును. అయినను నీ యథార్థస్వభావమును నిరంతరము జ్ఞప్తిలోనుంచుకొనుము. మన దౌర్బల్యమును పోగొట్టుకొనుటకు ఇది ఒకటియే మార్గము; మనదోషములను నివారించు కొనుటకు ఇది ఒకటియే త్రోవ!

భారతదేశములో వివిధ మత సంప్రదాయముల మధ్య సమానముగానున్న కొన్ని అంశములు ఇవిగా గోచరించుచున్నవి. ఒకవేళ భవిష్యత్కాలమున ఈ సమానాంశములను పురస్కరించుకొని పూర్వాచార పరాయణులును మతస్వాతంత్ర్యవాదులును, ప్రాతపద్ధతులవారును క్రొత్త పద్ధతులవారును, ఒండొరులను ఆలింగనము చేసికొనవచ్చును. అన్నిటిని మించి జ్ఞప్తిలో నుంచుకొనవలసిన

పోవలసినవాడే. ఆ పవిత్రత్వము కొట్టుకొని పోవు కాలము వచ్చితీరును. అంతట పూర్వపు సహజమగు అపవిత్రత మరల తలసూపవలసినదే! కాబట్టి మన తత్త్వవేత్తలందఱును పుణ్యమే మన స్వభావమందురు. పూర్ణత్వమే మన నైజము; అంతియేకాని అపూర్ణత, మాలిన్యము, మన స్వభావములోనివి కావు. మనము ఈ విషయమును జ్ఞప్తియందుంచుకొందుముగాక. ఒక మహర్షి ప్రాణావసాన కాలమున తన మహాకార్యముల నన్నింటిని, తన మహోత్తమ సంకల్పముల నన్నింటిని, జ్ఞప్తికి తెచ్చుకొనుమని తన మనస్సును హెచ్చరించెనట! తన దోషములను లోపములను జ్ఞప్తికి తెచ్చుకొనుమని మనస్సునకు చెప్పలేదు! చూచితిరా! మనోహరమగు ఈ ఉదాహరణమును ఎన్నడును మఱవకుడు. లోపములా ఉండును. దుర్బలతయూ ఉండి తీరును. అయినను నీ యథార్థస్వభావమును నిరంతరము జ్ఞప్తిలో నుంచుకొనుము. మన దౌర్బల్యమును పోగొట్టుకొనుటకు ఇది ఒకటియే మార్గము; మనదోషములను నివారించు కొనుటకు ఇది ఒకటియే త్రోవ!

భారతదేశములో వివిధ మత సంప్రదాయముల మధ్య సమానముగానున్న కొన్ని అంశములు ఇవిగా గోచరించుచున్నవి. ఒకవేళ భవిష్యత్కాలమున ఈ సమానాంశములను పురస్కరించుకొని పూర్వాచార పరాయణులును మతస్వాతంత్ర్యవాదులును, ప్రాతపద్ధతులవారును క్రొత్త పద్ధతులవారును, ఒండొరులను ఆలింగనము చేసికొనవచ్చును. అన్నిటిని మించి జ్ఞప్తిలో నుంచుకొనవలసిన

ఇంకొక విషయము కలదు. దానిని అప్పుడప్పుడు మనము మఱచు చుండుట చూడ నాకు విచారము కలుగు చున్నది. భారతదేశములో మతమనగా స్వయముగ అపరోక్షాను భూతియే. ఈ ప్రత్యక్షానుభవమునకు తగ్గిన దేదియు మతమే కాదు. "ఈ ధర్మమును నమ్ముకొనుము, నీకు క్షేమ మగును" అనునట్టి బోధలు మన చెవికెక్కవు. మనకు వాని యందు నమ్మకము లేదు. నిన్ను నీవు ఎట్టివానినిగా చేసి కొందువో అట్టివాడవుగానుందువు. ఈశ్వరకృపవలనను, నీసాధన వలనను నీ విప్పుడిట్టి వాడవైతివి. కొన్ని సిద్ధాంత ములను, కొన్ని ధర్మములను 'నమ్మట' వలనమాత్రము కాదు. భారతదేశములో అధ్యాత్మాకాశమునుండి విన వచ్చిన గంభీరశబ్దము అనుభూతి; అనగా ప్రత్యక్షానుభవము. "బ్రహ్మమును సాక్షాత్కారము చేసికొన వలయును" అను బోధ మన గ్రంథములందు మాత్రమే పలుమారు వినవచ్చు చున్నది. ధైర్యవంతములును, సాహసోపేతములును అగు పలుకులివి! కాని అవి సంపూర్ణముగా సత్యములే! ప్రతిశబ్ద మును ప్రతిస్వరమును సత్యమే! మతమును అనుభూతి చేయ వలయును. వినిన చాలదు. చిలుకవలె ఏదో శాస్త్రమును నేర్చుటచాలదు. దేనినిగాని మానసికముగా అంగీకరించినంత మాత్రమున మతము కాబోదు. అందేమియు ప్రయోజనము లేదు. అది మన లోపలికి ప్రవేశింప వలయును. చూడుడు, భగవంతుడున్నాడనెడు విషయమున మనకు గల గొప్ప నిదర్శనము మన తర్కము అటుల చెప్పుచున్నదనుట కాదు. ప్రాచీనులును నవీనులును కూడ భగవంతుని సాక్షాత్కా

రము పొందిరి. కనుకనే మనము ఋజువై నదనుచున్నాము. ఆత్మ కలదని ఋజువుచేయుటకు పటుతర కారణము లున్నవి. కాని మనము దాని ఉనికిని విశ్వసించుట అందువలననే కాదు. ముఖ్యముగా భారత దేశములో, పూర్వకాలమున పెక్కువేల మంది ఆత్మసాక్షాత్కారమును పొందిరి. ఈ కాలమునగూడ చాలమంది పొందుచున్నారు. భవిష్యత్కాలమునను అట్టి సాక్షాత్కారమును పొంది తమ ఆత్మలను చూడ గలుగువారు వేలకొలది ఉందురు. అందుచే ఆత్మ కలదను విశ్వాసము మనలో దృఢముగా నిలిచినది. నరుడు స్వయముగ దేవుని చూచువఱకు, తన ఆత్మను ప్రత్యక్షము చేసికొను వఱకు వానికి మోక్షములేదు. కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగ దీనిని అర్థము చేసికొందముగాక. మనము దీనిని గ్రహించినకొలదిని భారత దేశములోని సాంప్రదాయక దురభిమానము తగ్గిపోవుచుండును. ఏలయన భగవంతుని అనుభూతికి తెచ్చుకొని వానిని చూచినవాడే మతధర్మ పరాయణుడగును. ఎవడు దగ్గఱవానిలోనెల్ల దగ్గఱగను, దూరపువానిలోనెల్ల దూరముగను ఉండు దైవమును చూచునో వానియందలి హృదయగ్రంథులు తెగిపోవును. వానియందలి సంశయములు తీఱిపోవును. అతడు మాత్రమే కర్మఫలమునుండి ముక్తుడగును. ఓహో వ్యర్థప్రలాపములనే మతధర్మములుగను, కేవల బుద్ధిసాధ్య ప్రసంగములనే ఆత్మసాక్షాత్కారముగను భావించి మనము తఱచుగ పొరబడుచుందుము. అంతట సాంప్రదాయక దురభిమానములు బయలుదేరి పోట్లాటలు సాగును. అపరోక్షానుభూతియే

నిజమగు మతమని మన మొకసారి గ్రహించిన యెడల, మన హృదయములను పరిశోధించుకొని మతధర్మములను ఎంత వఱకు అనుభూతి చేసికొన గలిగితిమో తెలిసికొందుము. అప్పుడు మనమట్టుకు మనమే చీకటిలో దేవులాడుకొనుచు ఇతరులనుకూడ ఆ చీకటిలోని కే తీసికొనిపోవుచున్నామని గ్రహింతుము. అప్పుడు మనము పాక్షిక దురభిమానము లను వివాదములను దెబ్బలాటలను మానుకొందుము. ఎవ డేని శాఖాసాంప్రదాయకమగు పోరాటమును మొదలిడ ప్రయత్నించినయెడల వానిని ఇట్లు ప్రశ్నింపుడు: "నీవు భగవదనుభూతిని పడసితివా? నీవాత్మను కనుగొంటివా? లేదేని భగవంతుని పేరిట ప్రచారము చేయుటకు నీకేమి అధికారము కలదు? నీమట్టుకు నీవే చీకటిలో దేవులాడుచు నన్నుగూడ ఆచీకటిలోనికి లాగ ప్రయత్నించుట * గ్రుడ్డి వాడు గ్రుడ్డి వానికి త్రోవచూపుచు ఇద్దరును గోతిలోపడు చందమగును గదా".

కాబట్టి మీరు పోయి ఇతరుల దోషములను వెదకు టకు ముందు జాగ్రత్తగా ఆలోచన చేయుడు. వారు తమ హృదయములోని సత్యమును కనుగొనుటకు ప్రయత్నించు చున్నంతవఱకు భగవత్సాక్షాత్కారము పొందుటకు వారి మార్గమున వారిని పోనిండు. విశాలమును, నిష్కళంకమును అగు సత్యమే గోచరించుచో వారు పరమానందమునే పొందుదురు. భారతదేశమునందలి ప్రతి ఋషియు, సత్య

---

* "అంధేనైవ నీయమానా యథాంధాః" —కఠోపనిషత్తు.

సాక్షాత్కారము పొందిన ప్రతి సిద్ధపురుషుడును ఈ పరమా నందమును గుఱించి రుజువు పల్కుచున్నారు. అప్పుడు వారి హృదయములనుండి ప్రేమపూరిత వచనములు మాత్రమే వెలువడును. ఏలయన అకలంక ప్రేమస్వరూపియగు భగవంతుని వారిహృదయములు స్పృశించియుండును. అప్పుడు మాత్రమే సమస్తశాఖాదురభిమానపు పోరులును అణగిపోవును. అప్పుడు మాత్రమే మనము హిందు వను శబ్దమును, ఆ పేరు పెట్టుకొనిన ప్రతివానిని అర్థముచేసికొన గలము. అప్పుడు మాత్రమే అట్టి హిందువును మన హృద యములలోనికి ఆకర్షించుకొనుటకును, కౌగిట జేర్చుకొని గాఢముగ ప్రేమించుటకును, తగినస్థితి మనకు సంప్రాప్తించును. నా పలుకులు గుర్తుంచుకొనుడు; అప్పుడు మాత్రమే నీవు నిజమగు హిందువవై, హిందువను నామము ఉచ్చరింపగనే బలవర్ధకమగు విద్యుత్ప్రవాహము నీ తనువును పులకరింప చేయును. హిందువని పేరు పెట్టుకొని ఏ దేశమునందుండినను, మనభాషను మాటాడువాడైనను కాకపోయినను, అతడు నీకు సన్నిహిత ప్రియబంధువై తోచునప్పుడు మాత్రమే నీవొక హిందువు అనిపించుకొన దగుదువు. హిందువను పేరు గల ఎవడేని ఆపదలో నున్నప్పుడు నీ హృదయము కరగి నీ సొంతకుమారుడే ఆపదలో నున్నటుల నీవు అనుభూతి పడసినపుడు మాత్రమే నీవు హిందు వనిపించుకొనుటకు అర్హుడ వగుదువు. ఈ ఉపన్యాసారంభమున నేను పేర్కొనిన అసదృశ మహామూర్తియగు మీ గురుగోవిందసింగు మహా శయునివలె సోదర హిందువులకొఱకు సర్వమును భరించు

టకు సంసిద్ధముగ నున్నప్పుడే నీవొక హిందు వనిపించు కొనుటకు తగినవాడ వగుదువు. ఎవరు హిందూమతము యొక్క సంరక్షణకొఱకు తన రక్తమును బలియిచ్చెనో, ఎవరు యుద్ధభూమియందు తన కొడుకుల హత్యను కనులార చూచియు హృదయమును చిక్కబట్టి, తన దేశమును పీడించు శత్రువుల నెదిరించి పోరాడ సాహసించెనో, కటా! ఎవ్వరి కొఱకు తన రక్తమును తన సన్నిహితప్రియబంధువుల రక్తమును బలిగా నర్పించి అట్టివారిచేతనే తన మాతృదేశము నుండి వెళ్లగొట్టబడెనో ఆ అప్రతిమ మహామూర్తి, పోటు వడసిన సింహము తీరున యుద్ధభూమినుండి మరలి దక్షిణ దేశమున ప్రశాంతముగా ప్రాణములు విడుచుటకు ప్రవాసము పోయియు, కృతఘ్నులై తన్ను పరిత్యజించినవారినిగూర్చి ఒక్క కఠినవచనమునైనను తన పెదవులనుండి వెలువడ నీయడయ్యె! ఓహో! మీ దేశమునకు మీరుపకారము చేయగోరితిరేని మీలోని ప్రతివాడును అట్టి గురుగోవిందసింగు కావలసియుండును. మీ స్వదేశీయులందు వేలకొలది లోపములు మీకు కాన్పించుగాక. అయినను వారియందలి హిందూరక్తమునే గుర్తించి పాటింపుడు. వారు మీకు అపాయము కూర్చుటకే సర్వవిధముల ప్రయత్నించి యుండి నను మీరు పూజ లర్పింపవలసిన ప్రధానదేవతలు వారే! వారిలో ప్రతియొక్కడును మీపై శాపవాక్యములు విసరు చున్నను మీరు మాత్రము వారిపై దీవనలనే కురిపింపుడు. వారు మిమ్ము తరిమివేసినయెడల ఆ మహాసింహమువలె మౌనము వహించి చాటునకు పోయి శాంతముతో

మరణింపుడు. అట్టివాడే హిందువను నామమును ధరించుటకు అర్హుడు. అట్టి ఆదర్శమును నిరంతరము మనము ఎదుట నుంచుకొనవలయును. మన ఖడ్గముల నన్నింటిని పూడ్చి పెట్టుదము గాక! ఎల్ల దిశలను ఇట్టి మహాప్రేమవాహిను లను ప్రవహింప చేయుదము గాక!

తమ ఇష్టము వచ్చినటుల భారత దేశపునరుద్ధరణమును గుఱించి ప్రసంగములు చేయువారిని అట్లే చేయనిండు. ఈ విషయమై యావజ్జీవమును పాటు పడుచున్నట్టి, కనీసము పాటుబడ ప్రయత్నించుచున్నట్టి నేను, మీకు చెప్పున దేమనగా: మీరు ఆత్మపరాయణు లగువఱకు భారత దేశ మునకు పునరుద్ధరణము లేదు. అంతియే గాదు; సర్వప్రపంచ కల్యాణము సైతము దానిమీదనే ఆధారపడియున్నది. ఏలయనగా నేడు పాశ్చాత్య నాగరికతయొక్క పునాదులు సైతము అట్టడుగు వఱకు కదలియున్నవని నేను మీకు దాపరికము లేక చెప్పుచున్నాను. జడవాద మనెడు పొడి యిసుకపునాదులమీద కట్టబడిన మహాభవనములు ఏదో యొక దినమున భగ్నములై నేలకూలి నాశము కాక తీరదు. ప్రపంచ చరిత్రయే యిందుకు సాక్షి. జాతి తర్వాత జాతిగా లేచి నరుడనగా జడ మయ రాశియే యని ప్రకటించుచు తన ప్రభావమునంతను జడవాదము మీద నిలుపుచు వచ్చినవి. చూడుడు; పాశ్చాత్య భాషలో నరుడు ఆత్మను విడిచెనందురు. మనభాషలో నరుడు దేహమును విడిచె నందుము. పాశ్చాత్యుడు మొదటగా తానొక శరీరమై పిమ్మట ఆత్మను పొందుచున్నాడు. మనలో నరుడు ఒక

జీవుడు లేక ఆత్మయై తానొక శరీరము పడయుచున్నాడు. ఇక్కడనే ప్రపంచమంత విభేదము చూపట్టుచున్నది. కాబట్టి భౌతిక సౌఖ్యము మొదలగు ఇసుక పునాదుల ఆధారముపై నిర్మింపబడిన నాగరికతలన్నియు స్వల్పకాలము జీవించి, ఒకదాని తర్వాత ఒకటిగా ప్రపంచ రంగమునుండి అదృశ్యమై పోయినవి. కాని భారతమాతృ పాదముల చెంత నిలిచి భారతీయ నాగరికతను అభ్యసించిన జపాను, చైనావంటి ఇతర జాతులు ఈనాటివఱకు సజీవములై యున్నవి. మఱియు వానియందు పునరుద్ధరణ సూచనలు సైతము గోచరించుచున్నవి. వారి జీవములు "ఫీనిక్సు" పక్షి జీవమువలె వేయిసార్లు నాశము చేయబడినప్పటికిని మరల మరల అతిశయ వైభవముతో పునర్భవమగుటకు సంసిద్ధముగా నుండును. కాని జడమయ నాగరికత ఒక తడవ నేలకూల్పబడినపిదప మరల నెన్నడును తలయెత్త జాలదు. ఆ భవనము ఒక్కసారి కూలెనా ఇక నెన్నటికిని పనికిరాకుండ ముక్కలు ముక్కలై పోవును. కాబట్టి ఓపికతో వేచియుండుడు. మనకు భావిభాగ్యోదయము కానున్నది.

తొందర పడబోకుడు. ఇతరుల నెవరినిగాని అనుకరింప దలపకుడు. మనము నేర్చుకొనవలసిన గొప్పనీతిపాఠము ఇది యొకటి. అనుకరణము నాగరికత కాదు. నేను ఒక రాజువేషము వేసికొనవచ్చును. అంతమాత్రమున నేను రాజునా? సింహము చర్మమును కప్పుకొనిన గార్దభము సింహము కాగలదా? అనుకరణము, పిరికి తనముతో

కూడిన అనుకరణము, ఎన్నడును వృద్ధి అనిపించుకొన జాలదు. అది నరునియందు చూపట్టు దౌర్భాగ్య పతన సూచనయే! నరుడు తన్ను తాను ద్వేషించు కొనుట ప్రారంభించెనా వానికి తుట్టతుది దెబ్బ తగిలినట్లే! తన పూర్వులను గూర్చి లజ్జించుట ఆరంభించెనా అంత్యకాలము మూడినట్లే! ఇదిగో హిందూజాతిలో అధములలో నొకడనై నేనున్నాను. అయినను నాజాతిని గురించి నేను గర్వించు చున్నాను. నాపూర్వులను గురించి నేను గర్వపడు చున్నాను. హిందువునని చెప్పుకొనుటకు నేను గర్వించు చున్నాను. మీ సామాన్య సేవకులలో ఒకడ నగుటకును నేను గర్వపడు చున్నాను. నేను మీ తోడి దేశీయుడ ననియు, మీరు సాధుసంతాన మనియు, మనము ఈ ప్రపంచ ములో తేజరిల్లిన మహామహిమాన్యులగు ఋషుల వంశము వారమనియు, నేనెంతయు గర్వమును పొందుచున్నాను. కాబట్టి మీరును ఆత్మవిశ్వాసము పూనుడు. మీ పూర్వు లను గురించి గర్వపడుడు. వారినిగూర్చి ఎన్నడును సిగ్గుపడ బోకుడు, ఇతరులను అనుకరింపకుడు, నామాట వినుడు; ఎన్నడుగాని ఇతరులను అనుకరింపబోకుడు. మీరు ఇత రులను అనుకరించి వారి చేతిక్రిందికి పోవునప్పుడెల్ల మీ స్వాతంత్ర్యమును కోల్పోవు చుందురు. పారమార్థిక విషయములందు సైతము ఇతరుల చెప్పుచేతలలో పడి పని చేయ సాగితిరేని క్రమేణ మీ సంకల్పశక్తిని సైతము పోగొట్టు కొందురు. మీ సొంత అనుభవముల ద్వారమున మీకు గల దానిని ప్రకాశింప జేయుడు. ఇతరులను అనుక

రింపకుము. అయినను ఇతరులనుండి శుభంకరమగు దానిని తప్పక స్వీకరింపుము. మనము ఇతరులనుండి కూడ నేర్చుకొనవలసి యున్నది. బీజమును భూమిలో నాటుము. దాని పోషణకు కావలసిన ఎఱువును, గాలిని, నీటిని దాని కొసగుము. ఆ బీజము పెరిగి మొక్కయై మహావృక్షమై, ప్రకాశించునప్పుడు అది మట్టి యగునా? గాలి యగునా? లేక నీరగునా? అది తన కొసగబడిన సర్వమును జీర్ణము చేసికొని తన స్వభావము ననుసరించియే మొక్కయై మహావృక్ష మగుచున్నది. మీ స్థితియు అట్లే ఉండవలయును. ఇతరులనుండి మీరు నేర్వవలసిన విషయములు నిజముగా అనేక మున్నవి. క్రొత్త దానిని నేర్చుకొన నిరాకరించువాడు ఇదివఱకే ప్రాణముపోయిన శవముతో సమానుడు.

> "ఆదదీత పరాం విద్యాం ప్రయత్నాదవరాదపి।
> అంత్యాదపి పరం ధర్మం స్త్రీరత్నం దుష్కులాదపి॥

ఒక స్త్రీరత్నము నీచకులమందు పుట్టినదైనను భార్యగా స్వీకరింపుము. నీచజాతి పురుషునికైనను శుశ్రూష చేసి పరావిద్యను నేర్చుకొనుము. చండాలునికైనను సేవచేసి ముక్తికి త్రోవను తెలిసికొనుము" అని మనువు బోధించుచున్నాడు. ఇతరులనుండి మంచిని సర్వమును నేర్చుకొనుము; నీలోనికి తీసికొనుము; నీవు స్వాభావికమగు మార్గమున దానిని జీర్ణము చేసికొనుము. అంతియే గాని పరుల వేషముమాత్రము వేయకుము. ఈ భారతీయ జీవిత మార్గమునుండి తొలగిపోకుము. భారతీయులందఱును

పేకాశ్చాత్య జాతివారివలె ఉడుపులు ధరించుట, తిండి తినుట, ప్రవర్తించుట మున్నగునవి ఆరంభించుటవలన భారత దేశమునకు మేలుకలుగునని ఒక్క త్రుటికాలమైనను అపోహ పడకుము. కొన్ని సంవత్సరములపాటు అలవాటైన ఒక అభ్యాసమును వదలివేయుటలోనే ఎన్ని ఇబ్బందులు కలవో నీకు తెలియును. ఈ భారతీయత నీరక్తములో ఎన్ని వేల సంవత్సరములు జీర్ణమై యుండెనో దైవమునకే ఎఱుక. ఈ జాతీయవిశిష్టజీవనప్రవాహము ఒక తెన్నున ప్రవహించుచున్నది. అది అటుల ఎన్ని వేలఏండ్లుగా ప్రవహించుచున్నదో భగవంతుడే ఎఱుగును. దాదాపుగా మహాసముద్రమున కలియనున్న ఈ మహాప్రవాహము ఆ హిమవత్పర్వతముల మీది మంచుగడ్డలలోనికి మరలిపోగలదను నమ్మకము నిజముగా నీకున్నదా? అది అసంభవము. అటువంటి ప్రయత్నము దానిని ధ్వంసముచేయును. కాబట్టి ఈ జాతియొక్క జీవన స్రవంతియొక్క స్రోవను సరిచేయుము. ఈ మహానది యొక్క గమనమును అడ్డగించు గుట్టలను తొలగింపుము; మార్గమును శుభ్రపఱుపుము; కాలువను వాటము చేయుము. అప్పుడది సహజ బలముతోనే వడివడిగా వెల్లువయై ప్రవహించును. అప్పుడు ఈజాతి పరుగులిడుచు పురోగమనము సాగించును.

భారత దేశములో అధ్యాత్మ ప్రచారమునకు మార్గములు ఇవి యని సూచించుచు మనవి చేయుచున్నాను. ఇంకను ఇతర సమస్యలు చాలకలవు. వ్యవధి లేకపోవుట చేత ఈ సందర్భమున అవి యన్నియు మీకు తెలుపజాలను.

ఉదాహరణకు చిత్రమగు మనవర్ణవిభేదసమస్యను చూడుడు. ఈ సమస్యను గుఱించియు, దీని సాధక బాధకముల గుఱించియు నా యావజ్జీవము పరిశీలించుచున్నాను. భారత దేశములో దాదాపుగా అన్నిప్రాంతములందును దాని స్థితిని విచారించితిని. ఈ దేశములో దాదాపుగా ప్రతిభాగ మందును, అన్ని కులముల వారితోడను నేను కలిసి తిరిగి యున్నాను. దీని ప్రాధాన్యము ఎందున్నదో తెలిసికొనుటకై నా మనస్సులో చాల తికమకలు పడితిని. దీనిని గుఱించి పరిశీలన చేసినకొలదిని నా అబ్బురపాటు హెచ్చగుచు వచ్చినది. తుదకిప్పుడు దాని తేజముయొక్క ఒక చిన్న తళుకును మాత్రము చూడగలిగితిని. ఇప్పుడిప్పుడే దాని అర్థమును అనుభవముచేసికొన ప్రారంభించితిని. దీని తర్వాత కలిసి తినుట త్రాగుటను గుఱించిన ఇంకొక మహాసమస్య కలదు. ఆ మహాసమస్య మనము సామాన్యముగా తలంచు నటుల అంత వ్యర్థవిషయము కాదు. అన్నపానములను గుఱించి మనమిప్పుడు పెట్టుకొనిన పట్టుదలలు బహు విచిత్రముగను, మన శాస్త్రవిధులకు కేవలము వ్యతిరేకము గను నున్నవి. మనము తిను ఆహారముయొక్కయు, త్రాగెడు పానీయముయొక్కయు పారిశుద్ధ్యమునందు అశ్రద్ధ చేయుట వలన అనర్థముల పాలగుదుము. దాని యథార్థభావమును మనము కోల్పోయినాము.

నేను మీకు తెలుపదలచిన ఇతర ప్రశ్నలు చాల కలవు. ఈ సమస్యలను పరిష్కరించుటెట్లో, వాని రహస్య ములను కనుగొనుటెట్లో తెలుపవలెనని యున్నది; కాని

చాల కాలవ్యవధి అగువఱకును ఈ సభ సక్రమ స్థితికి రాలేక పోయినది. ఇప్పుడింకను మిమ్ము చాలకాలము ఇచ్చట నిలుపుట నా అభిమతముకాదు. కాబట్టి వర్ణవ్యవస్థ మున్నగు విషయముల గుఱించి ప్రసంగించుటకు ఇంకొక అవకాశము కలుగు వఱకును నా భావములను అట్లే యుంచెదను.

ఇంకొక మాట తెలిపి ఈ అధ్యాత్మభావములను గుఱించి మాటలాడుట విరమింతును. చాలకాలమునుండి భారతదేశములో మతము స్తబ్ధమై యున్నది. దాని నిప్పుడు క్రియాశక్తితో పూరింపవలయును. ప్రతివాని జీవితములోనికిని దానిని చొప్పించుట నా అభిమతము. పూర్వపు రీతిని మతము రాజుల మహాసౌధములందును దరిద్ర కృషీవలుల గుడిసెలందునుగూడ బ్రవేశింపవలసియున్నది. ఈజాతియొక్క సామాన్య పిత్రార్జిత సంపదయు సార్వజనీన జన్మస్వామ్య మును అగు మతమును ప్రతివాని గడప కడకును ధారాళ ముగా తీసికొని రావలసి యున్నది. దేవుడిచ్చిన గాలివలె అంత ధారాళముగను, అంత సులభసాధ్యముగను మన దేశములో మతము సర్వత్ర నిండియుండవలయును. భారత దేశములో మనము నిర్వహింపవలసినది ఇటువంటి పనియే; కాని చిన్ని చిన్ని శాఖాసంప్రదాయములను బయలు దేఱ దీసి, విభేదములు కల్పించు విషయములను పట్టుకొని ప్రాకు లాడుచు పోట్లాడుటవలన ఎన్నడును ఏ లాభము కలుగదు. మనమందఱమును ఏకీభవించు విషయములనే ప్రచారము చేయుదుము గాక. అప్పుడు విభేదములు వానియంతట అవియే నివారణ కాగలవు. నేను భారత ప్రజలకు మరల

మరల ఇదే చెప్పుచుందును. ఒక గదిలో శతాబ్దముల తఱబడి చీకటి యున్నది. ఆ గదిలోనికి పోయి అబ్బో ఇక్కడ చీకటిగ నున్నది, చీకటిగ నున్నది అని అరచు చుందు మనుకొనుడు. ఆ చీకటి పోవునా? దీపము తీసికొని రండు, తత్క్షణము ఆ చీకటి పటాపంచలై పోవును. ప్రజలను సంస్కరించుటకు తగిన కీలక మిదియే. వారికి శ్రేష్ఠతర విషయములను తెలుపుడు. నరుని యోగ్యతయందు విశ్వాసము పూనుడు. నరుడు పతితుడై భ్రష్టుడై పోయెనను నమ్మకము నాధారము చేసికొని మన కృషిని ప్రారంభింప నేల? ఏ సందర్భమునను, ఎంత నికృష్టుడుగా నున్నను, మానవునియందు విశ్వాసము పెట్టి నే నెన్నడును భంగపడ లేదు. నేను నరునందు విశ్వాసము ఉంచిన సందర్భమునం దెల్ల ఫలితము మొదట ప్రోత్సాహకరముగా కనపడకున్నను, చివఱకు జయప్రదముగానే ఉండెడిది. ఒకడు గొప్ప విద్వాంసుడుగ కనపడినను మిక్కిలి పామరుడుగ కనపడినను, దేవదూతగా కాన్పించినను లేక రాక్షసాధముడుగ కాన్పించి నను, వానియందు అచంచలమగు విశ్వాస ముంచుము. మొట్టమొదట మానవునియందు విశ్వాస ముంచుము. అటుల విశ్వాస ముంచిన పిమ్మట వానిలో దోషములు కాన్పించిన యెడల, అతడు నేరములు చేసిన యెడల, అతడు అత్యంతము మూఢములు, దుష్టములును అగు ధర్మములను అవలం బించిన యెడల, అవి అట్లు తటస్థించుట నిజముగా వాని స్వభావమునుబట్టి కాదనియు, శ్రేష్ఠతరాదర్శములు కొఱవడి యుండుటను బట్టియే యనియు నమ్ముము. ఒకడు అసత్య

మార్గమున పోయెనేని దానికి కారణము అతడు సత్యమును తెలిసికొనలేక పోవుటే! కాబట్టి దబ్బరయగు దానిని సవరించు మార్గము సత్యమగు దానిని వానికి తెలుపుటయే! అట్లుచేసి వానిని విచక్షణ చేసికొననిమ్ము. నీవు వానికి సత్యమును తెల్పుము; అంతట నీ పని తీరినట్లే. అతడు దీనిని అదివఱకు తనలోనున్న దానితో తన మనస్సులోనే సరిపోల్చి చూచుకొననిమ్ము. నామాట నమ్ముము, నీవు వానికి యథార్థముగా సత్యమునే ఒసగితివేని అసత్యము పారిపోయి తీరును. వెలుగు చీకటిని తరిమివేయుతీరున సత్యము అసత్యమును పాఱద్రోలి ధర్మమును వెలికి తీసికొని వచ్చును. దేశమును ఆధ్యాత్మికముగా నీవు సంస్కరింప దలచితివేని ఇదియే మార్గము, పోట్లాటకాదు! ప్రజలతో వారు చేయునది దోషమని చెప్పుటయుకాదు! ఇది ఒకటియే మార్గము. వారి యెదుట ధర్మము నుంచుము. ఎంత ఆతురతతో వారు దానిని స్వీకరింతురో చూడుము. ఎన్నడును నాశము చెందక నరునందు సదా వసించుచుండు దివ్యాత్మ మేల్కొని పైకివచ్చి ధర్మమగునట్టి సర్వమును, తేజోవంతమైన సమస్తమును, స్వీకరించుటకు ఎటుల చేతులు చాచునో నీవు స్పష్టముగా కనుగొన గలుగుదువు.

సృష్టికర్తయు, రక్షకుడును, మన జాతిపోషకుడును, మన పూర్వుల దైవమును అగు నతడు విష్ణువో, శివుడో, శక్తియో, లేక గణపతియో, వానిని ఏ పేరున పిలిచినను, వానిని సగుణరూపముగ పూజించినను లేక నిర్గుణరూపముగ ఉపాసించినను, వానిని సాకారునిగ అర్చించినను లేక నిరా

కారునిగ భావించినను, మన పూర్వులు ఎవనిని ప్రత్యక్షము చేసికొని "ఏకం స ద్విప్రా బహుధా వదంతి" (ఉన్న బ్రహ్మము ఒక్కడే. విప్రులు వానిని పెక్కు పేరులు పెట్టి పిలిచిరి) అనుచు అభివర్ణించిరో, ఆభగవంతుడు తన దివ్య ప్రేమతో మనలను ఆవహించుగాక! ఆయన తన ఆశీర్వాదములను మనపైని వర్షించుగాక! మనము పరస్పరము ఒకరి భావము నొకరు గ్రహించు నటుల చేయుగాక! మనము ఒకరి యెడల నొకరు సత్యమగు ప్రేమతో, సత్యము నెడ గాఢ తరాభిమానముతో పనిచేయునటుల చేయుగాక! స్వఖ్యాతి కొఱకుగాని, స్వప్రతిష్ఠకొఱకుగాని, స్వలాభముకొఱకుగాని, అత్యల్పపు కోరికయేనియు భారత దేశముయొక్క ఆధ్యాత్మిక పునరుద్ధారణ మహోద్యమమునందు చొఱబడ కుండుగాక!

భక్తి

(1897 సం॥రం నవంబరు 9 తేదీ లాహోరులో ఒసగబడిన ఉపన్యాసము.)

రొదలతో వడివడిగ ప్రవహించు ఉపనిషద్వాహిని నుండి ఒక ప్రతిధ్వని దూరమునుండి వచ్చుచున్నదో యను నట్లు వినబడుచున్నది. ఒక్కొకప్పుడది చాల అధికమై, సాంద్రమై విజృంభించుచున్నది. వేదాంత వాఙ్మయ మందంతటను దాని ధ్వని విస్పష్టముగ నున్నను అంత శక్తిమంత

ముగ మాత్రము లేదు. ఉపనిషత్తులయొక్క ప్రధానధర్మము పరతత్త్వముయొక్క భావమును, స్వరూపమును మనకు ప్రత్యక్షము చేయుటయే యని తోచుచున్నది. ఐనను ఈ అద్భుత గాంభీర్యమునకు వెనుక అక్కడక్కడ కావ్యచమత్కృతి గోచరించును. దీనిని చదివిచూడుడు: "న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం నే మా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః" (అచ్చట సూర్యుడు ప్రకాశింపడు. చంద్రుడు ప్రకాశింపడు. నక్షత్రములు ప్రకాశింపవు. ఇక అగ్నినిగురించి చెప్పునది ఏమి?) ఇట్టి మనోహర కవిత్వమును వినునప్పుడు ఇంద్రియ గోచర మగు ప్రపంచము నుండియేగాక బుద్ధి గోచరమగు ప్రపంచమునుండి సైతము ఎగిరిపోయి ఊహించుటకు వీలుకానిదియు, అయినను సదా మనలను ఆవరించియుండునదియు అగు వేఱొక ప్రపంచమునకు చేరుచుందుము. ఈ గాంభీర్యమున కంతకును వెనుక వేఱొక ఆదర్శము దాని ఛాయవలె అంటివచ్చుచున్నది. అది మానవజీవితముయొక్క ప్రత్యంశమునందును ప్రవేశించు చున్నది. రాను రాను విశాలమై మహాకారమును తాల్చు చున్నది. అది పూర్ణమును, విస్పష్టమును అగు భాషలో పురాణములందు వివరింపబడినది. అదియే భక్త్యాదర్శము. భక్తి బీజములు ఇదివఱకే యున్నవి. ఆ బీజములు సంహితయందు సైతము కలవు. ఉపనిషత్తులందు ఆ బీజములు కొంత పరిణామమును పొందినవి. పురాణములయందు వివరములతో నిరూపింప బడినవి. భక్తిని అర్థముచేసికొనుటకు మన పురాణముల భావమును గ్రహింపవలయును.

పురాణములు యథార్థమగునా కాదా యను గొప్ప వివాదము ఇటీవల బయలు దేరినది. సందిగ్ధార్థములు గల అనేక వాక్యములను తీసికొని పెక్కుఱు విమర్శింప సాగిరి. చాల చోట్ల ఆవాక్యములు ఆధునిక శాస్త్రపరిశోధనకు అగజాలవని నిరూపింపబడినవి. ఈ వివాదములు ఎట్లున్నను, పురాణ వాక్యములు శాస్త్రరీత్యా సమర్థింప దగినవా కావా అను విషయ మెట్లున్నను, వానియందలి భూగోళ వర్ణన అంగీకరింప దగినదా తగనిదా అను విచారణ ఎట్లున్నను, వానియందలి ఖగోళవివరణము మొదలగునవి నమ్మదగినవా తగనివా అను ప్రశ్న ఎట్లున్నను, ఈపురాణ సంపుటములలో ప్రతిదానియందును కొంచెము కొంచెముగా భక్తి సిద్ధాంతముయొక్క జాడలుమాత్రము విస్పష్టముగా గోచరించును. ఈ భక్తి సిద్ధాంతమే ఋషుల జీవితములందును రాజుల జీవితములందును సాదృశ్యములతో వివరింపబడి, మఱల మఱల సవ్యాఖ్యానముగా ప్రవచింపబడి మఱల మఱల పునరావృత్తి చేయబడుచు వచ్చినది. మహోమనోహరమగు భక్త్యాదర్శమునకు సాదృశ్యమును చూపుటయే పురాణములయొక్క ఉద్దేశముగా కనబడు చున్నది. ఈ ఆదర్శము, నేను చెప్పినటుల, సామాన్య మానవునకు చాల హితవుగా నుండును. వేదాంత జ్యోతియొక్క పూర్ణప్రకాశములోని గాంభీర్యమును అర్థము చేసికొనగలవారును, ఆమోదింపగలవారును, చాల కొలదిమందియే యుందురు. ఇక ఆ గాంభీర్యమునందు మెలగుచు దానిని అనువర్తించి జీవింపగలవారు ఇంకను స్వల్పముగ నుందురు. ఏలయనగా శుద్ధ

వేదాంతి అడుగు పెట్టవలసిన మొట్టమొదటి మెట్టే "అభయః" (జంకులేకుండుట) అనునది. నరుడు తాను వేదాంతిని అనుకొన సాహసించుటకు పూర్వము సమస్త దౌర్బల్యములును రూపుమాసి పోవలయును. అది ఎంత కష్టమో మన మెఱుగుదుము కదా! ప్రపంచముతో సకల సంబంధములను త్యజించిన వారు సైతము, తమ్ము పిఱికి వారినిగా చేయు సంగములేవియు లేనివారు సైతము, ఒక్కొక క్షణమున తామెంత దుర్బలులగుచుందురో, ఒక్కొక్కప్పుడు ఎంతగా మెత్తబడి పోదురో, ఎంతగా జంకుపడి పోదురో, వారి హృదయాంతరాళమున వారికే తెలియును. ఇక అనేక బంధములు కలిగి అసంఖ్యాకములగు బాహిర విషయములకును, ఆంతరవిషయములకును దాసులై వర్తింప వలసిన వారును, జీవితమున అనుక్షణమును దాస్యములో దిగబడి పోవుచున్నవారును ఎంత ఎక్కువ జంకవలయునో గదా! అట్టి వారికి పురాణములు అత్యంతరమణీయమగు భక్తి సందేశమును తెచ్చి అందించుచున్నవి; అట్టి వారికి మృదుకవిత్వమును ఉపశాంతికరముగా ప్రసాదించుచున్నవి. ధ్రువుడు, ప్రహ్లాదుడు మున్నగు వేలకొలది సాధు సత్తముల అద్భుత విచిత్ర కథలను అవి చెప్పుచున్నవి. ఈ ఉదాహరణలు ఆ భక్తి సందేశమును ఆచరణయోగ్యముగా చేయును. శాస్త్రదృష్టితో పురాణములు నిర్దుష్టములని మీరు నమ్మినను నమ్మకపోయినను ప్రహ్లాదుడు, ధ్రువుడు మున్నగు పౌరాణిక సాధు సత్తముల కథల ప్రభావమువలన పరివర్తనము చెందనివారు మీలో ఒక్కరును నుండరు. మన

తరమువారిపై కూడ పురాణముల మహిమ పర్వియున్న దని మనమంగీకరింపవలయును. ఇటీవల భ్రష్టమైన బౌద్ధమత సిద్ధాంతము మనకు నేర్పినదానికంటె, విశాలతరమై ప్రజా సామాన్యమునకు ఉపకరించెడి మతమును మనకు ప్రసాదించినందులకు ఈ పురాణములయెడ మనము కృతజ్ఞులమై ఉండవలయును. సులభమును కోమలమును నగు ఈ భక్తి భావము ఎట్లు ప్రేమగా పరిణమించునో పురాణములు వివరించుచున్నవి. అనుదినము ప్రత్యక్షజీవితమున మనము దానిని అనుష్ఠింపవలయును. నిజమునకు భక్తి ప్రేమయొక్క సారమే! సగుణమును, జడమును అగు ప్రేమ ఉన్నంతకాలము పురాణబోధలను దాటి ఎవడును పోజాలడు. ఇంకొకరిని అండచేసికొని నిలుచునట్టి దౌర్బల్యము మానవ స్వభావమునందున్నంత వఱకు ఈ పురాణములు ఏదో ఒక రూపమున ఉండి తీరవలసినదే. నీవు వానిపేర్లను మార్చవచ్చును. ఇదివఱకు ఉన్నవానిని నిరసింపవచ్చును. కాని అట్లు నిరసించిన తత్క్షణమే ఇంకొక పురాణము వ్రాయవలసిన అవసరమేర్పడును. ఈ ప్రాత పురాణములు అవసరము లేదను మహానుభావుడొకడు మనలో ఉద్భవించిన యెడల ఆయన మరణించిన ఇరువది సంవత్సరములలోపలనే ఆయన శిష్యులు ఆయన జీవితమును ఆధారము చేసికొని ఇంకొక పురాణము వ్రాసితీరుదురు. ఇదియే భేదము. మనుజుని స్వభావము ననుసరించి అది అవసరమే. సమస్త దోషములను, మాయాబంధములను, చివరకు ప్రకృతిసిద్ధములగు అవసరములను సైతము అతిక్రమించి, ధైర్య

సాహసోపేతులై, సర్వవిజేతలై, పరమహంసలుగా మాఱిన 'సాక్షాద్దేవత'లకు మాత్రము పురాణముతో పని లేదు. సామాన్యమానవుని పూజ సలుపుటకు సగుణ దైవతము లేనిదే సాగదు. ఒకవేళ సృష్టిలోని దేవతలను పూజింపడేని భార్యరూపముననో, బిడ్డరూపముననో, తండ్రి రూపముననో, మిత్రునిరూపముననో, గురునిరూపముననో, ఏదేని మఱొక రూపముననో మఱియొక దేవతను కల్పించుకొని పూజింప వలసినదే. పురుషులకంటె స్త్రీల విషయమున ఈ అవసరము హెచ్చుగానున్నది. ప్రకాశరేఖ సర్వత్ర ఉండవచ్చును. అది చీకటిస్థలములందుగూడ నున్నది. పిల్లులు మొదలగు జంతువులు చీకటిలో ఆ తేజస్సును చూడగలుగుచున్నవి గదా! కాని మనక్షేత్రమున మన కనుకూలమగు స్థితియందున్నప్పుడే ఆ ప్రకాశము మనకు కనబడును. నిర్గుణబ్రహ్మము మొదలగు తత్త్వ విషయములను గుఱించి మనము మాటలు చెప్పవచ్చును. కాని సామాన్యమానవులముగా ఉన్నంతకాలము కేవల నరరూపమున మాత్రమే మనము భగవంతుని చూడ గలము. భగవంతుని గుఱించిన మన భావనయు, మన పూజావిధానమును సహజముగా మానవలక్షణముతోకూడి యుండును. "ఈ శరీరము సత్యముగా భగవంతుడు వసించు ఉత్తమ దేవాలయము." కాబట్టి అన్నియుగములందును నరులు పూజింపబడుచునే వచ్చిరి! ఇట్టి పూజాపద్ధతిలో కొన్ని ఆడంబరములు సహజముగా వచ్చి చేరుచుండును. వానిని మనము ఖండింపవచ్చును, లేక విమర్శింపవచ్చును.

కాని ఇట్టి అత్యాచారము లెన్నియున్నను, అవి ఎంతగా మితిమీరిపోవుచున్నను, ఈ భక్తిసూత్రమునకు సత్యమును, సుస్థిరమును అగు ఒక ఆధారము, ఒక జీవము, కలదనియు అదిమాత్రము నిర్దుష్టముగనే యున్నదనియు సూక్ష్మముగా పరిశీలించినచో స్పష్టపడును. ఎట్టి ప్రాచీన కథలనైనను సరియే, శాస్త్రవిరుద్ధములగు ఏ వెఱ్ఱివిషయములైనను సరియే, గుణదోషవిమర్శ చేయకుండ ఊరక విగ్రహింగుడని నేను మిమ్ము కోరుటలేదు. దురదృష్టవశమున కొన్ని పురాణములలోనికి నానావిధములగు వామాచార సమర్థనములును ఎగబ్రాకినవి. వాని నన్నిటిని నమ్ముడని నేను మీకు బోధించుటలేదు. కాని మనము పోగొట్టుకొన తగని సారభూత విషయమొకటి కలదనియు, ఈ పురాణములు నిలిచియుండుటకు తగినంత కారణము కలదనియు నా అభిప్రాయము. అత్యున్నతములగు తత్త్వసిద్ధాంతములను సామాన్యమానవుల అనుదిన జీవితములలోనికి తెచ్చుటకును, మతమును అనుష్ఠానమునకు అనుకూలపఱచుటకును ఏర్పడిన భక్తిబోధ పురాణములందే కలదని నా నిశ్చితాభిప్రాయము.

తర్వాత భక్తిసాధనయందు జడ వస్తువుల వినియోగమును సమర్థించుచు శ్రీవారు ఇటుల చెప్పదొడగిరి. నరుడు తానున్నచోట నిలిచిపోక భగవదనుగ్రహమువలన సాగిపోయిన యెడల బాగుగనే యుండెడిది. అయినను ఉన్న విషయములు లేవనుకొని తగవులాడుట వ్యర్థము. ఇప్పుడు నరుడు భౌతికజీవిగా నున్నాడు. అతడు అధ్యాత్మతత్త్వమును గుఱించి ఎంతగా మాటలు చెప్పినను, భౌతికజీవిగా నున్నా

డనుట తప్పదు. కాబట్టి ఈ భౌతిక నరుని చేపట్టి అతనిని అధ్యాత్మజీవిగా చేయుటకై క్రమక్రమముగా పైకి తీసికొని పోవలయును. ఈ దినములలో నూటికి తొంబదితొమ్మిది మందికి అధ్యాత్మమనిననే అర్థమగుట లేదు. దానిని గురించి బోధింపగలుగుశక్తి ఇంకను తక్కువ. మనలను ముందుకు త్రోసికొని పోవు క్రియాశక్తులును, మనము కోరుకొను ఫలితములును అన్నియు భౌతికములే. హెర్బర్ట్ స్పెన్సరు మహాశయుడు చెప్పినటుల, అత్యల్ప ప్రతిరోధముగల మార్గమునందు మాత్రమే మనము పనిచేయగలము. మన పురాణములు అత్యల్ప ప్రతిరోధముగల మార్గమునే చూపు చున్నవి. ఈ పురాణముల వలన లభించిన ఫలితములు అద్భుతములును, అనన్య సామాన్యములునునై యున్నవి. భక్త్యాదర్శము యథార్థమునకు ఆధ్యాత్మికమైనది. కాని దానిని ప్రాపించు మార్గము జడవస్తు మార్గమున నడచు చున్నది. మనకు వేఱు గత్యంతరము లేదు. కాబట్టి ఈ భౌతిక ప్రపంచమున ఆధ్యాత్మిక తత్త్వమును సాధించుటకు అనుకూలించు ప్రతిదానిని చేపట్టవలయును. నరుడు ఆధ్యాత్మికజీవిగా పరిణామము పొందుటకై ప్రతిదానిని వినియోగించుకొనవలయును. (ఈ సందర్భమున శ్రీస్వాముల వారు కులభేదముగాని మతభేదముగాని లింగభేదముగాని పాటింపక, ప్రతివ్యక్తికిని వేదములను చదువు అధికారమును శాస్త్రములు ప్రాథమికధర్మముగా అంగీకరించెనని వివరించిన మీదట వారిట్లు నొక్కిచెప్పిరి.) భగవంతునియెడల భక్తి సాధన చేసికొనుటకు జడవస్తు మయమగు దేవాలయము

నరునకు ఎక్కువగా ఉపయోగపడునెడల అటులే జరుగు గాక! ఒక విగ్రహమును నిర్మించుకొనుట భక్త్యాదర్శమును చేరుటలో మానవునికి సాహాయ్యపడునెడల భగవంతుడు వానిని దీవించి వానికి ఇష్టమగునేని అట్టి విగ్రహములను ఇంకను ఇరువదింటిని ప్రసాదించునుగాక. పారమార్థిక గమ్యమును ప్రాపించుటలో ఏదైనను నరునికి సాయపడు నెడల అది నీతిమార్గమునకు అడ్డు రానంతవఱకు దానికి స్వాగతమే! కాని అవినీతికరమగునది ఏదియు తోడ్పడ జాలదు: పైగా వెనుకకుకూడ లాగిపట్టును. (ఈ సందర్భమున, భారతదేశములో విగ్రహములను పూజార్థము వినియోగించుటలో కలిగిన ఆక్షేపణ కొంతవఱకైనను కబీరుని వలన సంభవించెనని తెలిపిరి.) సగుణ దైవతము గలదను విశ్వాసములేని గొప్ప తత్త్వవేత్తలును, మత కర్తలును భారతదేశమున ఉండెడివారు. వారు తమ మతమును ధైర్యముగా ప్రజలకు బోధించిరి. అయినను విగ్రహముల ఉపయోగమును వారు ఖండింపలేదు. వారు విగ్రహపూజ భగవత్పూజయందు అత్యుత్తమ విధానము కాదని మాత్రము పల్కిరి. అది అత్యుత్తమ విధానమని వక్కాణించు పురాణము ఒకటైనను లేదు. (యూదులు తమ యెహోవా ఒక మందసములో నివసించు నను విశ్వాసముతో విగ్రహ పూజను చేసిరని చారిత్రక నిదర్శనములను చూపి, ఇతరులు చెడ్డదన్నంతమాత్రమున విగ్రహారాధనమును దూషించు అభ్యాసమును శ్రీవారు ఖండించిరి. ఆపిదప ఇట్లు చెప్పసాగిరి.) విగ్రహము గాని మఱే భౌతిక

రూపముగాని నరుని అధ్యాత్మపరాయణునిగా చేయుటకు ఉపకరించినను విగ్రహార్చనము జడ పదార్థద్వారమున చేయబడుపూజ కనుక అధమాధమము అని మన మత గ్రంథములన్నియు స్పష్టముగా వక్కాణించుచున్నవి. (హిందూదేశము నందంతటను బలాత్కారముగ విగ్రహారాధనను ప్రతివానిచేతను చేయింప వలయునను పట్టుదలను శ్రీస్వాములవారు పూర్తిగ ఖండించిరి.) దేనిని పూజింప వలయునో దేనిద్వారమున పూజింపవలయునో, నిర్ణయించి శాసించుటకు ఎవనికేమి పట్టినది? ఎవరెట్లు పురోగమనము సాగింప వలసియుండునో, వారివారి ఆధ్యాత్మిక వికాసము విగ్రహామును పూజించుటచేత సాధ్యమగునో అగ్నిని ఆరాధించుటచేత సాధ్యమగునో లేక స్తంభమును అర్చించుట వలన సాధ్యమగునో వారికే తెలియునుగాని ఇతరులకెట్లు తెలియును? ఆ విషయము సొంత గురువుల వలనను, గురు శిష్య సంబంధమువలనను నిర్ణయమై శాసింపబడ వలయును. ''ఇష్టము'' అను దానిని గుఱించి భక్తి గ్రంథములు నిర్ణయించిన సూత్రము మిక్కిలి సహేతుకమైనది. ప్రతివాడును తన ప్రత్యేక పూజావిధానమును, భగవంతునిచేరు తన ప్రత్యేక మార్గమును తానే నిర్ణయించుకొన వలయును. అది వాని ఇష్టము. ఆ నిర్ణీతాదర్శము వాని ఇష్టదేవత అనబడును. అతడు ఇతర పూజావిధానములయెడ సానుభూతితో గౌరవము చూపవలయును. అయినను తన గమ్యమును తాను చేరువఱకును, తన కిక జడమయ సహాయోపకరణములు అవసరములేని దశ సిద్ధించువఱకును తన ప్రత్యేక

విధానమునే అనుసరించుచు సాధనను సాగింపవలయును. ఈ సందర్భమున భారతదేశపు కొన్ని ప్రాంతములందు ఆచరణలోనున్న కులగురు పద్ధతిని గుఱించి కొంచెము హెచ్చరింపవలసియున్నది. ఇది ఒక విధమైన పరంపరాగతమగు గురుత్వము. మన శాస్త్రములు "వేదసారము నెఱింగినవాడును పాపరహితుడు అగు గురువు స్వర్ణము నపేక్షించిగాని, మఱి దేనిని వాంఛించిగాని శిష్యులకు బోధలు సేయడు. వాని కరుణ నిర్హేతుకము. తరులతానికుంజములనుండి వసంత ఋతువు ప్రతిఫలమును కోరదు. పరోపకారము చేయుట దాని స్వభావము. వానిని మరల ఉజ్జీవింపజేసి మొగ్గలను, పూవులను, ఆకులను ప్రసాదించును. అటులే ఆయనయు ప్రతిఫల మాసింపక విద్యాదానము చేయును. వాని జీవిత మంతయు పరోపకారార్థమే" అని చెప్పుచున్నవి. అట్టివాడే గురువు కాగలడు. ఇతరులకు అట్టి అర్హత లేదు. ఇంకొక అపాయముకూడ నున్నది. గురువనగా కేవలము బోధకుడు కాడు. బోధకత్వము బహు స్వల్పాంశము. హిందువుల విశ్వాసము ప్రకారము గురువు తన శిష్యులకు అధ్యాత్మ తేజస్సును దానముచేయును. కాబట్టి సద్గురుప్రసాద రక్ష లేనియెడల దుష్టత్వమునకును, కీడునకును లోనై నరుడు హాని పొందవచ్చును. అందుచే దుష్టగురువువలన ఉపదేశము పొందినవాడు దుష్టత్వమును నేర్చుకొనుట యను అపాయముపాలు కావచ్చును. కాబట్టి ఈ కులగురుసిద్ధాంతమును భారతదేశమునుండి బహిష్కరించుట అత్యంతావశ్యకము. గురుత్వము ఒకవృత్తిగా ఏర్పడ కూడదు. అట్టిది తుదముట్ట

వలయును. అది శాస్త్రవిరుద్ధమైన పద్ధతి. గురుశబ్దవాచ్యు డెవడును ఈ పలుగురుపద్ధతిని అనుసరించి, ప్రస్తుత దుఃస్థితికి సాయపడ రాదు.

శ్రీవారు ఆహారసమస్యను మాటాడుచు, తిండి విష యములో ఈనాడు పట్టుదలతో అనుసరించుచున్న ఆచార ములు చాలవఱకు పై పై మెఱుగులై పోయి, అవి ప్రారంభ మున ఎందుకొఱకై ఏర్పడినవో ఆ లక్ష్యమునుండి దూరమై పోయెననిరి. ఎవరు ఆహారమును తాకుటకు అర్హులో అను విషయమును గుఱించి జాగ్రత తీసికొనవలయునను భావ మును విమర్శించిరి. దానియందు తత్త్వసంబంధమగు గొప్ప రహస్యమున్నదనియు సామాన్యులు తమ అనుదిన జీవిత మున అట్టి జాగ్రతను తీసికొనుట కష్టమును, అసాధ్యమును, అసంభవమును అనియు చెప్పిరి. ప్రత్యేకము ఒక్క తరగతి వారికే సాధ్యమగు ఆదర్శమును సామాన్యముగా అందఱును ఆచరింపవలయునని పట్టు పట్టుట పొరపాటని తెలిపిరి. తమ జీవితములను పూర్ణముగా ఆధ్యాత్మిక సాధనలకు వినియో గించు వారికి మాత్రమే అది సాధ్యమగుననియు, మానవు లలో అత్యధిక సంఖ్యాకులు భౌతిక సుఖములతో ఇంకను తృప్తిపడకున్నారనియు, ఆధ్యాత్మిక జీవనమును బలాత్కార ముగా వారిపైని పడవేయ జూచుట వ్యర్థమనియు పలికిరి.

భక్తునికి నిర్ణయింప బడిన శ్రేష్ఠతమపూజ మానవ పూజయే. సత్యముగా ఏదేని ఒక విధమగు పూజను ఆచరింపదలచినచో తమస్థితి ననుసరించి ఒకనినో ఇద్దఱినో

ముగ్గురినో దరిద్రులను ప్రతిదినము తమ ఇండ్లకు తోడ్కొని వచ్చి వారిని నారాయణులనుగా భావనచేసి సేవింప వలయు నని శ్రీవారు సూచించిరి. అనేక దేశములలో దానము చేయుటను నేను చూచితిని. అది ఫలప్రదము కాకుండుటకు కారణము అది సత్సంకల్పముతో జరుగకుండుటయే. "ఇదిగో ఇది తీసికొని వెళ్లిపో" అందురు. అది యోగ్య మగు దానముకాదు. హృదయమున గల గర్వమును, లోకము తమ్ము పొగడవలయునను కాంక్షను, తాము దాన శీలురని లోకమెఱుంగుగాక యను కోరికను ఇది వెలువరించు చున్నది. హిందూశాస్త్రముల ప్రకారము దానమును గ్రహించు వానికంటె దానమిచ్చువాడు తక్కువ. ఏలయన పుచ్చుకొనువాడు ఆ సమయమున భగవంతుడన్నమాటే! కాబట్టి కొంతమంది దరిద్ర నారాయణులనుగాని, అంధ నారాయణులనుగాని, ఆకొన్న నారాయణులనుగాని, ప్రతి గృహమునకును ప్రతిదినమును తీసికొనివచ్చి దేవతా విగ్రహమును పూజించువిధమున వారికి చక్కగ భోజనము పెట్టి బట్టలు కట్టబెట్టుట ఉత్తమమగు పూజ యగును. ప్రతి దినమును ఇటుల చేయుచుండవలయును అని శ్రీవారు చెప్పిరి. వారెట్టి పూజలనుగాని ఖండనచేయలేదు. కాని ఉత్తమ విధమగు పూజ, ఇప్పుడు భారతదేశములో అత్యావ సరమగు పూజ, ఇట్టి నారాయణుల ఆరాధనమే యని తమ అభిప్రాయమును తెల్పిరి.

ఉపన్యాసమును ముగించుచు భక్తిని ఒక త్రికోణా కృతి గల యంత్రమునకు పోల్చిరి. ఒకకోణము ఏ కామము

నెఱుంగని భక్తి. రెండవకోణము భయము నెఱుంగనిది, ప్రతిఫలమునుగాని, మఱేవిధమగు ఉపకారమునుగాని, కోరి నెరపు భక్తి యాచకుని మతమో, బేరగాని మతమో అగును. దానిలో యథార్థమగు మతము అతిస్వల్పము. మీరు యాచకులుగా నుండరాదు. ఏలయన యాచన ఒకవిధమగు నాస్తికతయే. "గంగయొడ్డున కాపురముండు నరుడు త్రాగుటకు జలమును కోరి చిన్న కూపమును త్రవ్వుట వలె" నుండును. భగవంతుని, భౌతిక విషయములకొఱకు ప్రార్థన చేయువాడు ఇటువంటివాడే అనవచ్చును. భక్తుడగు వాడు సాహసముతో నిలబడి "దేవా నీవలన నే నేమియు కోరుకొనను. కాని నా వలన నీ కేమేని కావలయు నెడల ఇదిగో ఇచ్చుటకు సిద్ధముగనున్నాను" అనుటకు సంసిద్ధముగ నుండవలయును. ప్రేమ భయము నెఱుంగదు. అబలయై బక్కచిక్కియున్న స్త్రీ మార్గమున పోవుచు కుక్క మొఱిగినమాత్రాన ప్రక్కఇంటిలోనికి దూరుట చూడలేదా? మఱుసటిదినమున ఆమె అదేత్రోవను పోవుచుండును. ఆమె యొడిలో బిడ్డకలదు. సింహ మొకటి ఆమెపై బడును. అప్పుడామె ఏమిచేయును? ఆహా! తనబిడ్డను రక్షించు నిమిత్తము సింహమునోట బడును. ప్రేమకొఱకై పరగు ప్రేమ ఉత్తమోత్తమమైనది. తుదకు భక్తుడీ దశకు వచ్చును. అప్పుడు ప్రేమయే దైవము! ఇతర మేమియు కాదు. దేవుడు కలడని రుజువుచేయుటకు మానవు డెక్కడికి పోవలయును? దృశ్యమాన వస్తుజాలములోనికెల్ల మఱింత దృశ్యమానము ప్రేమ. సూర్యుని, చంద్రుని, నక్షత్రములను, ఆకాశమున

త్రిప్పుచున్న శక్తి ఆ ప్రేమయే! పురుషులందును, స్త్రీల యందును, పశువులందును ప్రతిప్రదేశమునందలి ప్రతిదాని యందును దాని మహిమ ప్రకటితమగుచున్నది. జడశక్తుల యందు భూమ్యాకర్షణము మొదలగు రూపములతో అది వ్యక్తమగుచున్నది. అది సర్వత్ర నున్నది. ప్రతి పరమాణువునందును, ప్రతి ప్రదేశమునందును, వ్యక్తమగుచునే యున్నది. ఈ విశ్వమునంతను నడుపుశక్తి ఎల్లెడల గోచరించుశక్తి ఆ అఖండప్రేమయే! అది సాక్షాత్ పరబ్రహ్మమే!

వేదాంతము

(1897 సం॥రం నవంబరు 12వ తేదీన లాహోరు నందు ఒసగబడిన యుపన్యాసము.)

మనము జీవించు ప్రపంచములు రెండు కలవు. ఒకటి బాహ్యప్రపంచము, రెండవది అంతరప్రపంచము. రైలు రెండు పట్టాలమీద నడచునట్లు మానవజాతియొక్క అభివృద్ధి ప్రాచీనకాలమునుండియు ఈ రెండు ప్రపంచములలోను జరుగుచున్నది. మొదట బాహ్యమున అన్వేషణము ప్రారంభమైనది. గంభీరములగు సమస్యలన్నింటికిని పరిష్కారము బాహ్యప్రకృతి నుండియే పొందవలయునని నరుడు మొదట ప్రయత్నించినాడు. సుందరమును దివ్యమును అగుదానికొఱకు తాను అనుభవించు ఆరాటమును

నలువైపుల తన్ను ఆవరించియుండు ప్రకృతివలన సంతృప్తి పజుచుకొన దలంచినాడు. తన స్వస్వరూపమును, తన ఆంతర్యమున గల సమస్తమును, జడ ప్రాపంచిక భాషలో ప్రకటింప యత్నించినాడు. అతడు పడసిన ప్రతిఫలము మహోత్కృష్టమైన దనుట సత్యము. భగవంతుని గుఱించియు వాని నర్చించు విధానమును గుఱించియు అత్యద్భుత సిద్ధాంతములును, మిక్కిలి మనోహరములగు సౌందర్య భావములును అతనికి లభించినవి. బాహ్యప్రపంచమునుండి నిజముగా దివ్యమైన భావములే లభించినవి. ఐనను ఆ రెండవదగు ఆభ్యంతరప్రపంచము కొంత ఆలస్యముగా మానవునికి ప్రత్యక్షమై దివ్యతరమును, సుందరతరమును విశాలతరమును అగు ఒక అనంతవిశ్వమును వాని ఎదుట నిలిపినది. వేదములలోని కర్మకాండభాగము అత్యాశ్చర్య కరములగు అధ్యాత్మభావములను బోధించుచున్నది. సృష్టి కర్తయు, పరిపాలకుడును, లయకారకుడును, అగు సర్వాధి నాయకుని గుఱించిన అద్భుతభావములు మన చిత్తమును కరగించివేయు భాషలో అవి మనకు ప్రదర్శించుచున్నవి. ఋగ్వేద సంహితలో ప్రళయవర్ణనను తెలుపు ఆ అత్యద్భుత శ్లోకము మీలో అనేకులకు జ్ఞప్తియుండవచ్చును. ఆహా! మరల ఎన్నడేని అంతటి భవ్యమగు శ్లోకము మఱియొకటి రచింపబడెనా అనిపించును. ఇంత చెప్పినకూడ అది బాహ్య గాంభీర్యమునుమాత్రమేవర్ణించుచున్నదని మనకు తెలియును. తుదకు అది స్థూలమే; భౌతికతత్త్వము కొంత దానికి అంటుకొనియే యున్నది. అయినను, అది భౌతికపదార్థమునకు

సంబంధించినభాషలో చేయబడిన అఖండ తత్త్వముయొక్క వర్ణన! ఆ భాష ఖండవస్తు సాంప్రదాయికమైనది. అది స్థూలశరీర పక్షమున అఖండమేయైనను, మానసికముగా అఖండముకాదు. స్థలభావమున అది అనంతమై తోచినను, సంకల్పమునకు సంబంధించి అనంతము కానేరదు. ఇక రెండవ భాగమగు జ్ఞానకాండయందు అనుసరింపబడిన మార్గము సంపూర్ణముగా ఇందుకు భిన్నముగ నున్నది. మొదటిది విశ్వముయొక్క రహస్యములకొఱకు బాహ్య ప్రకృతియందు జరిగిన అన్వేషణము. అతి గంభీరజీవన సమస్యలకు జడ ప్రపంచమునుండి పరిష్కారమును తెలిసికొన గోరు ప్రయత్నమది. "యస్యైతే హిమవంతో మహిత్వా" (దాని మహిమను హిమాలయములు ప్రకటించుచున్నవి) అను వర్ణనయందు ఉదాత్తమగు భావమే యున్నది. అయినను భారతీయునికి అది అంత ఉదాత్తమైనదిగా తోచలేదు. కావున భారతీయుని చిత్తము అంతర్ముఖము కావలసివచ్చెను. ఆ అన్వేషణము బాహ్యము నుండి ఆంతర్యమునకును, జడపదార్థమునుండి మనస్సునకును తిరిగి, పూర్తిగా వేఱొక త్రోవ త్రొక్కినది. "నరుడు మరణించుచున్నాడు గదా! వాడేమగుచున్నాడు?" అను విచారణ బయలుదేరినది. "అస్తీత్యేకే నాయమస్తీతి చైకే" (కొందఱు అతడు కలడనుచున్నారు; ఇతరులు అతడు లేకుండ పోయెననుచున్నారు. ఓ యమరాజా! ఇందేది సత్యము?) అనెడు విచారణ సాగినది. పూర్వవిచారణకు పూర్తిగ భిన్నమగు విధానము మనకిక్కడ గోచరించు

చున్నది. బాహ్యప్రపంచమునుండి పొంద దగిన దాని నంతను భారతీయుని బుద్ధి సంపాదించినది; కాని దానితో తృప్తిపొందలేదు. అది ఇంకను వెనుక నెంచి తన ఆత్మ లోనికే మునుంగజూచెను. అప్పుడు తుది పరిష్కారము లభించినది.

వేదములలోని ఈ భాగమునకు ఉపనిషత్తులు లేక వేదాంతము లేక అరణ్యకములు లేక రహస్యము అని పేరు. ఇచ్చట మతము ఒక్కసారిగా సమస్తమైన బాహ్య ప్రమాణములను వదలివేసినది. ఇచ్చట స్థూలపదార్థ సంబంధమగు భాష పూర్తిగా పరిత్యజింపబడి, ఆత్మసంబంధ మగు సూక్ష్మాతి సూక్ష్మభాషలో అధ్యాత్మవిషయములు వివరింపబడినవి. ఏవిధమగు స్థూలభావమును ఇంక దానిని అంటి వచ్చుటలేదు. ప్రపంచ సంబంధమగు ఏలాటి రాజీ ప్రయత్నములును అందు లేవు. మానవకోటి దర్శించిన వానిలోనెల్ల అత్యుత్తమములగు సత్యములను సాటిలేని ధైర్యసాహసములతో ప్రకటించిన మహాఋషుల అత్యద్భుత భావనాపటిమ ఉపనిషత్తులందు ప్రకాశించుచున్నది. సోదరులారా! దీనిని మీకు తెలుప గోరుచున్నాను. వేదములయొక్క ఈ జ్ఞానకాండ సైతము మహాసముద్రము వలె నున్నది. దానిలో లవలేశము తెలిసికొనుటకై నను అనేక జన్మలు పట్టును. ఉపనిషత్తులు వేదములకు శిరస్సు గాను భుజములుగాను శిరోభూషణముగాను ప్రకాశించు చున్నవని శ్రీ రామానుజాచార్యులవారు చేసిన వర్ణన సముచితమైనదనుట తథ్యము. ఉపనిషత్తులు నిశ్చయముగా

ఆధునిక భారతదేశమునకు బైబిలు వంటివి. హిందువులకు వేదములలోని కర్మకాండ యనిన అత్యంత గౌరవము. అయినను యుగాంతరములనుండి 'శ్రుతి' యనగా ఉపనిషత్తులనియు, ఉపనిషత్తులు మాత్రమే అనియు భావింపబడు చున్నది. మన మహాతత్త్వవేత్తలందఱును — వ్యాసుల వారుగాని, పతంజలిమహర్షి గాని, గౌతమబుద్ధుడుగాని, చివరకు సమస్త తత్త్వశాస్త్రములకు మూలపురుషుడగు కపిల మునీంద్రుడుగాని—తాము రచించిన గ్రంథములకు ప్రమాణములను ఉపనిషత్తులనుండి మాత్రమే కైకొనిరి. ఇంకెందుండియు వారు ప్రమాణములను గ్రహించి యుండలేదు. ఏలయన ఉపనిషత్తులందు మాత్రమే శాశ్వతముగా నిలిచి యుండు సత్యములు కలవు.

కొన్ని సత్యములు ఒకానొక పక్షముననే, ఒకానొక విధానముననే, కొన్ని ప్రత్యేకసందర్భములందే, కొన్ని సమయములందు మాత్రమే సత్యములై యుండును. అవి ఆ యా కాలములందున్న సంప్రదాయములపై ఆధారపడును. మఱికొన్ని సత్యములు నరుని మూలస్వభావము మీదనే ఆధారపడుచు నరజాతి యుండునంత కాలము స్థిరముగ నిలుచును. విశ్వజనీనముగా నుండదగినవి ఈ సత్యములు మాత్రమే. మనలో ఎన్నిమార్పులు సంభవించినను శ్రుతులందలి ఈ విశ్వజనీన సత్యములు, ఈ అద్భుత వేదాంత భావములు, అచలములై, అజేయములై, అమరములై, శాశ్వతములై మన సాంఘిక సంసర్గములయందును, మన వస్త్రధారణ వైఖరులందును, మన భోజన పద్ధతుల

యందును, మన పూజా విధానములందును తమ గాంభీర్యము చెంపున నిలిచియున్నవి. అయినను ఉపనిషత్తులయందు పక్వమునకు వచ్చిన సమస్త సిద్ధాంతముల బీజములును కర్మకాండలో ఇదివఱకే యున్నవి. అన్ని వేదాంత సంప్రదాయముల వారును సత్యమని అంగీకరించు సృష్టి సిద్ధాంతముగాని సమస్త భారతీయ సిద్ధాంత సంప్రదాయములకును ఆధారమగు బుద్ధి తత్త్వశాస్త్రముగాని ఇదివఱకు ఉన్నవే! అధ్యాత్మభాగమగు వేదాంతమును గూర్చి విచారణ ప్రారంభించుటకు పూర్వము ఈ కర్మకాండను గూర్చి నాలుగు మాటలు చెప్పవలసి యున్నది. పైగా వేదాంతము అను పదమును నేను ఏ అర్థముతో ప్రయోగించుచున్నదియు ముందుగా మీకు వివరముగా తెలుపవలసి యున్నది.

భారత దేశమున వేదాంతమను పదము అద్వైత సిద్ధాంతమునకుమాత్రమే చెల్లున నెడు పొరపాటు అభిప్రాయము ఈనాడు కలదు. ప్రస్థానములు మూడును సమాన ప్రాధాన్యము కలవి యని అన్ని మత సిద్ధాంతములను పరిశీలించునప్పుడు మీరు సదా జ్ఞప్తి నుంచుకొనవలయును. ప్రథమమున శ్రుతులుగలవు. శ్రుతులనగా ఉపనిషత్తులని నాభావము. తరువాత వ్యాససూత్రములు. తత్త్వజ్ఞులు వీనికి అత్యధిక ప్రాధాన్యమును ఇచ్చియున్నారు. ఏలయన అదివఱకున్న అన్ని తత్త్వసిద్ధాంతములయొక్క పరిణామఫలములే ఈవ్యాస సూత్రములు! ఈ సిద్ధాంతములు ఒకదాని కొకటి విరుద్ధములు గావు. పైగా ఒకదాని కొకటి ఆధారముగా

నున్నవి. ఒకే మహాసిద్ధాంతము యొక్క క్రమ వికాసము వ్యాస సూత్రములలో చక్కగా గోచరించును. అమ్మృతము లగు వేదాంత సత్యములు ఇందు సూత్రీకరింపబడినవి. ఉపనిషత్తులకును, వ్యాససూత్రములకును మధ్య భగవంతుని వేదాంతవ్యాఖ్యానమగు శ్రీ గీత కలదు. ఉపనిషత్తులు వ్యాససూత్రములు గీత ఈ మూటిని — ద్వైతాద్వైత విశిష్టాద్వైత ప్రతిపాదకములగు సమస్త సంప్రదాయములును శిరసావహించి తీరవలెను. కానిచో అవి ధర్మసమ్మతములుగా ఈ దేశమున గౌరవింపబడవు. ఈ సంప్రదాయములలో ప్రతి దానికిని ప్రస్థానత్రయమే ప్రమాణము! ఒక శంకరాచార్యులో, ఒక రామానుజాచార్యులో, మధ్వాచార్యులో, ఒక వల్లభాచార్యులో, ఒక చైతన్యులో ఎవరైనను ఒక నూతన సంప్రదాయమును స్థాపింప కోరిన యెడల ఈప్రస్థానముల మూడింటిని చేకొనవలయును. వానిమీద తమ క్రొత్త వ్యాఖ్యానమును రచింపవలసి యుండును. కాబట్టి ఉపనిషత్తులనుండి పుట్టిన సిద్ధాంతములలో ఒకదానికి మాత్రమే వేదాంతమను పదమును ప్రత్యేకముగా ప్రయోగించుట పొరపాటేయగును. వేదాంతము అను మాటలో ఈప్రస్థానములు మూడును ఇమిడి యున్నవి. అద్వైతివలెనే, విశిష్టాద్వైతియు వేదాంతి అని పిలుచుకొనుటకు సమానార్హత కలిగియుండును. నేనింకొక అడుగు ముందుకు పోయి యథార్థమునకు హిందువను మాటవలన మనము నిజముగా దేనిని అర్థము చేసికొనుచున్నామో అదియే నిజముగా వేదాంతి అనుదానికిని అర్థమని చెప్పుదును. ఈమూడు సిద్ధాంతము

14

లును వాడాపుగా స్మృతికి అందని పురాతన కాలము నుండియు ప్రచారములో నున్నవియే. శంకరాచార్యుల వారు అద్వైతసిద్ధాంతమునకు మూలకర్తయని మీరు తలంప కూడదు. ఏది శంకరాచార్యులు పుట్టుటకు పూర్వము యుగాంతరముల నుండి వచ్చుచున్నదో దాని తుది ప్రతినిధులలో ఈయన ఒకడు. అటులనే విశిష్టాద్వైత వాదమును. అది రామానుజాచార్యులవారి పుట్టుకకు పూర్వము చాల యుగములనాడే యున్నది. ఆయన వ్రాసిన వ్యాఖ్యానముల బట్టియే ఈవిషయమును ఇదివఱకే తెలిసికొని యున్నాము. ఇటులే ద్వైత సిద్ధాంతములును ఇతర సిద్ధాంతములతో పాటు ప్రాచీన కాలము నుండియు వచ్చుచునే యున్నవి. నా కొలదిపాటి జ్ఞానముతో అవి ఒకదానికొకటి విరుద్ధములు కావను నిర్ధారణకు వచ్చితిని. సనాతన మహాసూత్రములు దూరముగా వినవచ్చు మంద మృదు స్వరములవలె ఆరంభమై, క్రమముగా వికసించి, చివరకు అద్వైతవాదమను విజయగంభీరకీర్తనముగ షడ్దర్శనములందు పరిణమించినవి. అట్లే మానవ హృదయము క్రమక్రమముగా ఉత్తమోత్తమాదర్శముల వైపునకు, సర్వమును ఆఅద్భుత అభిన్నత్వములో కలిసిపోవు వఱకు, అనగా అద్వైత సిద్ధాంతము చేరువఱకు, క్రమ గతిని సాగిన వికాసముగా ఈ మూడు సిద్ధాంతములను మనము గ్రహింపవలసి యున్నది. ఈ మూడు వాదములును పరస్పర విరుద్ధములు కావు. అయినను అనేకులు ఈ పొరపాటుపడియుండిరి. అద్వైతబోధకుడు అద్వైతమును ప్రత్యేకముగా బోధించు

వాక్యములను చెక్కుచెదరకుండ నిలిపి, ద్వైత పరములును విశిష్టాద్వైత పరములును అయిన వాక్యములను సాగదీసి వానిని తన వాదములోనికి లాగికొని వచ్చుట మనకు తెలియును. అట్లే ద్వైతమతబోధకులు అద్వైతవాక్యములలోనికి ద్వైత పరమగు తమ అర్థమును చొప్పింప ప్రయత్నించుటయు కనబడు చున్నది. మన గురువులు మహానుభావులే. అయినను "గురువుల దోషములు సైతము చెప్పవలసి వచ్చును" అను ఒక సామెత కలదు. వారు ఈ విషయమున మాత్రము పొరపడిరని నా అభిప్రాయము. ఎవరుగాని వాక్యములను తికమకలు చేయు పనికి పూనుకొనవలసిన అవసరము లేదు. ఏ విధమగు మతము పేరిటను కపటవర్తనమునకును దిగవలసిన అగత్యము లేదు. వ్యాకరణమును ఆధారము చేసికొని ఏ విధమగు అసంగత ప్రలాపములకును దిగ నక్కఱలేదు. మన స్వంత భావములను ప్రతి వాక్యములోనికి చొప్పింప ప్రయత్నించు నంతటి బాధ మనకు వలదు. "అధికార భేద" మనెడు అద్భుత సూత్రమును మీరొకసారి గ్రహించితిరా, మీ పని ఏ చిక్కులు లేక సులభముగ సాగిపోగలదు.

"కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" (దేనిని తెలిసికొనిన సర్వమును తెలిసికొనినట్లగునో అది ఏది?) అను ఏకైకసమస్య ఉపనిషత్తుల ఎదుటనున్నది సత్యమే. ఆధునికుల భాషలో చెప్పునెడల ఉపనిషత్తుల గమ్యార్థము సమస్తముయొక్క తుది ఏకత్వమును కను

గొనుట అని చెప్పవలయును. జ్ఞానమనగా భిన్నత్వమునందు ఏకత్వమును కనుగొనుటతప్ప వేఱుగాదు. ప్రతి శాస్త్రమును దీనిపైననే ఆధారపడి యున్నది. నరుని విజ్ఞానమంతయు భిన్నత్వమునందు ఏకత్వమును కనుగొనుటమీదనే ఆధారపడియున్నది. కొలదిపాటి భిన్నసంఘటనల మధ్య ఐక్యమును కనుగొనుట మహాకార్యముగా నుండును. అట్టియెడ విచిత్రముగా భిన్నభిన్నమై చూపట్టు ఈ విశ్వమునందలి—అసంఖ్యాకములగు నామ రూప భేదముల తోడను, ఆత్మానాత్మ పదార్థ భేదముల తోడను, నిండియున్న ఈ జగత్తులోపలి — అద్వితీయ తత్త్వమును తెలిసికొనుట బ్రహ్మాండ కార్యముగా నుండక తప్పదు. ప్రతి సంకల్పమును వేఱొండు సంకల్పమునకు భిన్నముగనే యున్నది. ప్రతి ఆకృతియు మఱొక ఆకృతికి భిన్నముగనే యున్నది. ఇట్లుండ అనేక క్షేత్రములకును, అనంతలోకములకును, సామరస్యమును కూర్చుటయు, అంతులేని ఈ భిన్నవస్తుజాల మంతటిలో ఏకైక తత్త్వమును కనుగొనుటయు పరమ గమ్యముగా ఈ ఉపనిషత్తులు పరిగణించినవి. ఐనను అరుంధతీ న్యాయము ను ఒక విధానము కలదు. అరుంధతియను చాల చిన్న చుక్కను ఒకనికి చూపవలసి వచ్చినప్పుడు దానిదాపున బాగుగ మెఱయుచున్న పెద్ద నక్షత్రము మీద వానిదృష్టిని మొదటగా నిలుపుమందురు. ఆ తరువాత అరుంధతిమీదికి దృష్టిని మరల్చుట బహు సులభముగ నుండును. మనము నెరపవలసిన కార్యము ఇట్లేయున్నది. నా అభిప్రాయమును రుజువు చేయుటకు ఉపనిషత్తులను చూపిన చాలును.

ఆ పిమ్మట మీరే ఆ విషయమును చూచుకొందురు. దాదాపుగా ప్రతి అధ్యాయమును ఉపాసనారూపమగు ద్వైత బోధతో ప్రారంభమగును. ఈవిశ్వమునకు సృష్టి కర్తయు పోషకుడును ఎవరో, ఎవనిలోనికి తుదకు ఈ సర్వమును లయమై పోవునో, అట్టి భగవంతుని మొట్ట మొదట బోధింతురు. అతనిని మనము పూజింప వల యును. అతడు బాహ్యాంతరములగు ఈ సృష్టికంతకు అధిపతియు నాయకుడును ఐనను అతడు ఈప్రకృతికి వెలియై బాహ్యమునందు ఎక్కడనో యున్నట్లు కాన్పించును. ఒక్క మెట్టు ముందుకు పోయిన యెడల ఈ భగవంతుడు ప్రకృతికి వెలుపల లేడనియు దానిలో అంతర్యామియై యున్నా డనియు ఆ గురువే బోధింప బూనుట మనకు తెలియవచ్చును. తుట్టతుదకు ఈ రెండు అభిప్రాయములును పూర్వపక్షము చేయబడును. అప్పుడు కలదంతయు యథార్థముగా అతడే. భేద మేదియు లేదు. "తత్త్వమసి శ్వేతకేతో" (ఓ శ్వేత కేతూ అది నీవే అగుదువు). ఆ అంతర్యామియు తుదకు నరుని జీవాత్మయందు ఉండునదియు ఒకటియే! ఇచ్చట రాజీపడుట లేదు. ఇతరులేమని అభిప్రాయపడుదురో అను భయము లేదు. సత్యము — నిర్భయమగు సత్యము — నిర్భయమగు భాషలో తెలుపబడినది. ఈనాడు ఆ సత్య మును అట్టి నిర్భయమగు భాషలో బోధించుటకు మనము జంకవలసిన అగత్యము లేదు. ఈశ్వరానుగ్రహమువలన అట్టి సాహసప్రచారకుడుగా నుండగల ధైర్యము నాకు కలుగవలెనని ఆశించుచున్నాను.

మరల మొదటి విషయమునకు వత్తము. మనము మొట్టమొదట గమనింపవలసిన విషయములు రెండు గలవు. ఒకటి అన్ని వేదాంత సంప్రదాయములకును సామాన్యమగు ఆధ్యాత్మికాంశము. రెండవది సృష్టియంశము. నేను మొదటగా సృష్టివిషయము ఎత్తుకొనెదను. ఈనాడు ఆధునిక శాస్త్రమున నూతనముగ కనిపట్టబడిన విచిత్రాంశములు ఆకాశమునందుండి పిడుగులవలె మనపైన బడి, మన మెన్నడును కలనైన తలంచి యుండని విచిత్రములను మన కన్నులకు చూపుచున్నవి. అయినను వీనిలో చాలవఱకు యుగాంతరములకు పూర్వమే తెలిసికొనబడిన వయ్యును ఇప్పుడు మరల నూతనముగా కనిపట్టబడుచున్నవి. మొన్న మొన్ననే భిన్నభిన్నమై చూపట్టు శక్తుల మధ్య ఏకత్వము కలదని ఆధునిక శాస్త్రము కనుగొనినది. ఉష్ణము, కాంత శక్తి, విద్యుచ్ఛక్తి, ఇత్యాది పేర్లతో పిలువబడువాని నన్నిటిని ఒక్క మూలశక్తిలోనికి మార్చవచ్చుననియు, వాని నన్నిటిని ఇష్టమువచ్చిన ఒక్క పేరుతో వ్యక్తము చేయవచ్చుననియు నూతనశాస్త్రము మొన్ననే కనుగొని నది. కాని ఆ పని సంహితయందే జరిగియున్నది. సంహిత పురాతనముగను ప్రాచీనముగను కనబడుచున్నను దాని యందు నేను ఇప్పుడు ప్రస్తావించుచున్న శక్తిని గుఱించిన ఈ భావమే కాన్పించుచున్నది. ఈ శక్తులన్నియు — భూమ్యాకర్షణము ఆశ్లేషము లేక వికర్షణము అని మీరేపేరు పెట్టి పిలిచినను సరియే, అవి ఉష్ణముగాగాని విద్యుచ్ఛక్తిగాగాని కాంతశక్తిగాగాని ఏరూపమున వ్యక్త

మైనను సరియే—ఆ మూలశక్తియొక్క రూపాంతరములే. నరునియొక్క అంతఃకరణమునుండి ఉద్భవించు సంకల్పముగా వ్యక్తమైనను లేక బాహ్యావయవముల వలన జరుగు కార్య ముగ వ్యక్తమైనను ఆ శక్తులన్నియు దేనినుండి కలుగునో ఆ మూలశక్తికి 'ప్రాణము' అనిపేరు. ఇక ప్రాణమన నేమి? ప్రాణమనగా స్పందనము లేక అదురువంటి చలనము. ఈ విశ్వమంతయు దాని ప్రారంభదశకు మరలి పోయినప్పుడు ఈ అనంతశక్తి ఏమగును? అది శూన్యమై పోవునని తలతురా? అట్టుల కాజాలదు గదా. అది నాశనమై పోవు నెడల ఆ పిమ్మట వచ్చు తరంగమునకు కారణముగా నుండ దగు ఆధారమెక్కడ? ఏలయన ఈ చలనము తరంగ రూపమున లేచుచు పడుచు మరల లేచుచు మరల పడుచు సాగిపోవుచున్నది. ఇక్కడ 'సృష్టి'యను పదము జగత్తని అర్థమిచ్చుచున్నది. ఆ పదమునకు అర్థముగా "క్రియేషన్" అని చెప్పరాదు. ఆంగ్లమున మాటలాడుచున్న నాకు గత్యంతరము లేదు. సంస్కృతపదములను నా శక్తికొలది ఆంగ్లములోనికి మార్చవలసి వచ్చుచున్నది. సృష్టియనగా "ప్రొజెక్షన్", అనగా ఆవిష్కరణము, లేక వెలికి వచ్చుట అని అర్థము చెప్పవచ్చును. ఒక కల్పము తుదను సమస్త మును సూక్ష్మరూపము పొంది ఇంకను సూక్ష్మరూపము పొంది అది ఎట్లు ఆరంభమయ్యెనో అట్టి ప్రారంభదశకు మరలిపోవును. కొంతవఱకు నిశ్చలముగా అక్కడ నిలిచి మరల బహిర్గతమగుటకు అనగా వెలువడుటకు సిద్ధముగ నుండును. దీనిని సృష్టి లేక ఆవిష్కరణము అందుము. సరే

ఈ శక్తులన్నియు, అనగా ప్రాణములన్నియు ఏమగును? అవి అన్నియు వాని మూలరూపమగు ప్రాణములోనికి మారును. ఈ ప్రాణము దాదాపుగా నిశ్చల మగును. కాని పూర్ణముగా నిశ్చలము కాదు. వేదములోని ఒక సూక్తమున ఇది వర్ణింపబడి యున్నది. "అనిదవాతం" అనగా అది స్పందనము లేకుండ స్పందించెను. ఉపనిషత్తులయందు చాల సాంకేతికవచనములు కలవు. అవి అర్థము చేసికొనుట కష్టము. ఉదాహరణకు "వాతా" అను శబ్దము తీసికొనుడు. చాలచోట్ల గాలి అని దాని యర్థము. ఇంకను చాల తావులయందు దానికి చలనము అని అర్థము గలదు. ప్రజలు తరచుగా ఒక అర్థమునకు మఱొక అర్థమును చెప్పుకొని కలవర పడుచుందురు. ఇట్టి విషయమున మనము జాగ్రత్తగ నుండవలయును. సరే మనము జడ పదార్థమని పిలుచునది ఏమగును? శక్తులు జడపదార్థమంతటను అంతర్గతమై యుండును. అవి అన్నియు ఆకాశము లోనికి లయమైపోయి మరల దానినుండి వెలువడు చుండును. ఈ ఆకాశమే మూలపదార్థము. మీరు దానిని ఆంగ్లభాష లోనికి "ఈథర్" అనిగాని ఇంకొకటని గాని తర్జుమా చేయ వచ్చును. ఏనను ఈ ఆకాశము ద్రవ్యరాశియొక్క మూల స్వరూపము అని భావము. ఈ ఆకాశము ప్రాణముయొక్క ప్రేరణచేత స్పందించుచున్నది. తర్వాత సృష్టి పైకివచ్చు చున్నప్పుడు స్పందనము వేగిరమగును. అప్పుడు ఈ ఆకాశము, సూర్యులు, చంద్రులు, ఇతర మండలములు

అని మనము చెప్పుకొను తరంగ రూపములలోనికి ఎగుర గొట్టబడును.

అందింకను ఇట్లున్నది:— "యదిదం కించ జగత్ సర్వం ప్రాణఏజతి నిస్సృతం" (ఈ విశ్వములోని సర్వమును ప్రాణము స్పందించుట వలన ఆవిష్కృతమగుచున్నది). 'ఏజతి' అను పదమును మీరు గుర్తుంచుకొనవలయును. 'ఏజ' అనగా స్పందించుట; 'నిస్సృతం' అనగా ఆవిష్కృతము; 'యదిదంకించ' ఈ విశ్వములో కలది ఏదైనను.

ఇది సృష్టి విషయమగు ఒకభాగము. దాని నిర్మాణములోనికి రాగల సూక్ష్మవస్తువులు చాలగలవు. ఉదాహరణకు చూడుడు: సృష్టిక్రమము ఎట్టిది? మొట్టమొదట ఆకాశ మెట్లేర్పడినది? ఆ ఆకాశము నుండి తక్కిన వన్నియు ఎట్లు పుట్టుకొని వచ్చినవి? ఆకాశము స్పందించుట ఎట్లు ప్రారంభమైనది? దాని నుండి వాయువెట్లు కలిగినది—ఇట్టి ప్రశ్నలెన్నో కలవు. కాని సూక్ష్మము నుండి స్థూలము కలుగుచుండును అనెడు భావము ఇందు కలదు. స్థూల పదార్థము చిట్టచివర ఏర్పడుచున్నది. అది అన్నిటికంటె బాహ్యమున నుండును. ఈ స్థూల పదార్థమునకు పూర్వము సూక్ష్మపదార్థము ఉండవలయును. ఐనను సర్వమును రెండు వర్గములుగా ఏర్పడుట చూచితిమి కాని ఇంకను తుది అభేదము రావలసి యున్నది. శక్తియంతయు ఏకమై ప్రాణమగుచున్నది. ద్రవ్యమంతయు ఏకమై ఆకాశ మగుచున్నది.

ఈ రెంటను ఇంకను ఏకముగుట కానగునా? అవి రెంటను ఒకటిగా కలసిపోవునా? మన ఆధునిక శాస్త్రములు ఈ సందర్భమున మౌనమువహించి యున్నవి. వానికిక్కడ ఇంకను మార్గము దొరకలేదు. అట్లు జరుగుచో అవి ఆ ప్రాతకాలపు నాటి ప్రాణమునే, ఆ పురాణకాలమునాటి ఆకాశమునే, కనుగొనుచు నెమ్మది నెమ్మదిగా అదేమార్గము ననుసరించి రావలసి యున్నది. తర్వాత రావలసియున్న ఏకరూపము సర్వ వ్యాపకమును నిర్గుణమును అగు వ్యక్తి. దానికి ప్రాచీన పురాణములు బ్రహ్మ లేక చతుర్ముఖబ్రహ్మ అని పేరిడినవి. ఆధ్యాత్మిక తత్త్వశాస్త్రమున దానినే మహత్ అందురు. పై రెంటికిని ఐక్యము ఇక్కడ కలుగుచున్నది. నీమనస్సనునది మెదడు అనెడు బోనులో చిక్కుకొనిన ఈ 'మహత్' యొక్క ఒక రేణువు. అందఱి మెదడులలో మొత్తముగా చిక్కుకొనిన మనస్సుల నన్నిటిని కలిపి 'సమష్టి' అనుచున్నారు. ఇది అన్నిటికూడిక; విశ్వవ్యాప్తమైనది. ఈ వివరణము ఇంకను సాగిపోవలయును. ఇప్పటి కింకను పూర్తి కాలేదు. ఇచ్చట మనలో ప్రతివానిని ఒక పిండాండ మనవచ్చును. ఈ జగత్తంతను ఒకటిగా తీసికొనిన యెడల బ్రహ్మాండ మనవచ్చును. ప్రత్యేకసృష్టియందు ఏమేమి జరుగుచున్నదో అట్టిదియే వెలుపల గూడ జరుగుచున్నదని ధారాళముగా ఊహ చేయవచ్చును. మన మనస్సులను పరిశోధించుకొను శక్తి మనకున్న యెడల ఇక్కడ జరుగునదియే విశ్వమానసమునందును జరుగుచున్నదని నిరాఘాటముగా ఊహింపగలము. ఈ మన

స్సనునది ఏమిటో ఇప్పుడు విచారింపవలసియున్నది. ఆధునిక కాలమున పాశ్చాత్య దేశములలో భౌతిక ద్రవ్యశాస్త్రము వేవేగముగ వృద్ధి యగుచున్నకొలదిని శరీరనిర్మాణ శాస్త్రము క్రమక్రమముగా ప్రాచీన మతములు నిర్మించుకొని యున్న కోటలను ఒకదాని తర్వాత నొకటిగా పడగొట్టి వేయుచున్నది. దీనిని చూచి పాశ్చాత్య ప్రజలు ఎక్కడ నిలుచుటయో తెలియ జాలకున్నారు. ఏలయన ఆధునిక శరీరశాస్త్రము అడుగడుగునకు మనస్సును మెదడుతో ఐక్యము చేయుచున్నది. ఇది చూచి వారు దిగులుపడి పోవుచున్నారు. కాని భారతదేశములో మనకు ఇది సదా తెలిసియున్న విషయమే. హిందూబాలుడు మొట్టమొదటగనే మనస్సనునది జడ పదార్థమేయనియు, కాని సూక్ష్మమైనదనియు నేర్చుకొనుచున్నాడు. ఈ శరీరము స్థూలమైనది. దీని వెనుక సూక్ష్మ శరీరము అని మనము పేర్కొనునది కలదు. అదియే మనస్సు. ఇదియు జడమైనదే కాని అతి సూక్ష్మ రూపమున నుండును. ఇది ఆత్మకాదు. ఈ పదమును ఆంగ్లములోనికి భాషాంతరీకరణము చేయను. ఏల యందురా? ఈ భావము యూరపునందులేదు. కాబట్టి దీని భాషాంతరీకరణము సాధ్యము కాదు. జర్మనీదేశపు తత్త్వశాస్త్రజ్ఞులు 'ఆత్మ' అను మాటకు "సెల్ఫ్" అని భాషాంతరీకరణము చేసిరి. దానిని సర్వత్ర అందరు అంగీకరించినగాని ఉపయోగించుట సాధ్యముకాదు. కాబట్టి దానిని "సెల్ఫ్" అనుడు, లేక మరేపేరుతో నైన పిలువుడు. అది మన ఆత్మ. ఈ ఆత్మయే

అంతర్యామిననుండు సత్యమగు నరుడు. ఈ ఆత్మయే జడమగు మనస్సును తన పనిముట్టుగా ఉపయోగించుకొనుచున్నది. అధ్యాత్మ తత్త్వశాస్త్రమున ఈ మనస్సునకు అంతఃకరణ మనిపేరు. ఈ మనస్సు కొన్నికొన్ని అంతరింద్రియముల సాహాయ్యమున మన శరీరములో దృశ్యములై కాన్పించు అంగములను ఉపయోగించుచున్నది. ఈ మనస్సు యొక్క స్వరూపమెట్టిది? పాశ్చాత్య తత్త్వవేత్తలు మొన్న మొన్ననే ఈ కన్నులు నిజముగా చూచు ఇంద్రియములు కావనియు, వాని వెనుక వేఱుగా దృష్టి ఇంద్రియములు కలవనియు కనుగొనిరి. ఈ కన్నులు నాశనమైనను నరుడు ఇంద్రునివలె వేయికన్నులు కలవాడు కావచ్చును. కాని బాహ్యదృష్టి మాత్రము వానికి లభింపదు. ఔను మన తత్త్వశాస్త్రము దృష్టియనగా బాహ్యమున కన్పించు ఈ దృశ్యము కాదనెడు ఊహతో ప్రారంభ మగుచున్నది. సత్యమగు దృష్టి అంతరింద్రియములకు సంబంధించినది. ఆ కేంద్రములు మెదడులోపల నున్నవి. మీరు వానికేమి పేరులనైన పెట్టుడు. కాని ఈ కనుపడు కన్నులు, చెవులు, ముక్కు మొదలగునవి నిజమగు ఇంద్రియములు కావు. మఱియు ఈ ఇంద్రియములును మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మొదలగునవి కలిసి మొత్తముమీద (ఆంగ్ల భాషలో) "మైండ్" అని పేర్కొనబడుచున్నవి. ఆధునిక శరీర శాస్త్రజ్ఞుడు ఈ మెదడే మనస్సనియు, ఇన్ని ఇంద్రియములునుకూడి మెదడు ఏర్పడుచున్నదనియు చెప్పును. అది విని భయపడనక్కఱలేదు. మనకావిషయము ఎల్లప్పుడును

తెలిసిన సంగతియేయని వానికి చెప్పను. మన మతము యొక్క ప్రాథమిక సూత్రములలో అది ఒకటి.

సరే మంచిది. ఇప్పుడు ఈ మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మొదలగు వాని అర్థమేమో విచారింతము. మొట్టమొదట చిత్తమును విచారింతము. అది మానసిక పదార్థము. 'మహత్తు'లో ఒక భాగము. అది మనస్సుయొక్క వికారములన్నిటికిని వర్తించు సామాన్య నామము. వసంతకాలమున ఒకనాటి సాయంకాలము ప్రశాంతముగా అలలేమియు లేక ప్రసన్నముగనున్న ఒకసరస్సులో ఒకడు ఒకరాతిని పడవేయుననుకొనుము. అప్పుడు ఏమి జరుగును? మొట్టమొదట ఆ నీటికి దెబ్బతగులుట అనెడు క్రియ జరుగును. తర్వాత అచ్చటి నీరు పైకిలేచి ఆ రాతివెంట ఒక ప్రతిక్రియను కల్పన చేయును. ఈ ప్రతిక్రియ ఒక తరంగ రూపము తాల్చును. మొట్టమొదట ఆ నీరు కొలదిగా స్పందించి వెంటనే తరంగ రూపమగు ఒక ప్రతిక్రియను వెనుకకు పంపును. చిత్తమును ఈ చెఱువునకు పోల్చుదము. ఈ బాహ్యావస్తువులు దానిలో వేయబడు రాళ్ళవంటివి. ఈ ఇంద్రియముల ద్వారమున చిత్తము ఈ బాహ్యావస్తువులలో ఒకదానితో సంపర్కమును పొందగనే ఒక స్పందనము కలుగును. ఆ స్పందనమునకే మనస్సని పేరు. దానికి విస్పష్టమగు రూపమేర్పడలేదు. ఈ బాహ్యావస్తు సంపర్కమును లోపలికి తీసికొనిపోవుటకు ఇంద్రియములు అవసరమగును. మనస్సు ఏర్పడగనే ఒక ప్రతిక్రియ కలుగును. అది నిశ్చయముచేయు సత్త. దీనిని బుద్ధి అందురు. ఈ బుద్ధి కలిగిన తోడ్తోడనే

'అహం' అనెడు భావమును, బాహ్యవస్తువుయొక్క భావమును తెలుసుకొనును. నాచేతిమీద ఒక దోమ వ్రాలినది అనుకొనుము. ఆస్పర్శానుభవము చిత్తమునకు చేర్పబడును. అప్పుడు చిత్తము కొంచెము స్పందనము చేయును. ఈ స్పందనమునే ఆధ్యాత్మశాస్త్రమున "మనస్సు" అందురు. ఆపిమ్మట ఒక ప్రతిక్రియ ఏర్పడును. తత్క్షణమే నాచేతిమీద ఒకదోమ ఉన్నది, దానిని త్రోలవలెను, అనెడు భావము కలుగును. ఈరీతిగా ఆ చెఱువునందు రాళ్ళు పడుచుండును. కాని మామూలు చెఱువు విషయములో దానికి కలుగు ప్రతిదెబ్బయు బాహ్యప్రపంచమునుండియే వచ్చి తగులును. మనస్సనెడు చెఱువు సందర్భములో ఈ దెబ్బలు బాహ్యప్రపంచమునుండిగాని, ఆంతరప్రపంచమునుండిగాని రావచ్చును. ఈ వరుస అంతటిని కలిపి అంతఃకరణము అందురు. దీనితోపాటు ఇకముందు అద్వైతసిద్ధాంతమును గ్రహించుటలో మనకు సహాయపడునట్టి ఇంకొకవిషయమును కూడ మనము తెలిసికొనవలయును. మీరందఱు ముత్యములను చూచియుందురు. చాలమందికి ఆ ముత్యములెట్లేర్పడునో తెలిసియుండును. ముత్యపుచేపయొక్క చిప్పలోనికి ఒక ఇసుకరేణువు ప్రవేశించును. అంతట అచ్చట 'గులగుల' లాడును. ఆ ముత్యపుచేపయొక్క శరీరమునందు ఆ 'గులగుల' లాడు తావున ప్రతిక్రియ కలుగును. అంతట దాని శరీరమునుండి ఒకవిధమైన రసము ఊరి ఇసుకరేణువు చుట్టు చేరును. ఈ ద్రవము గడ్డకట్టి ముత్యముగా నేర్పడును. ఈ జగత్తంతయు అటులే ఏర్పడుచున్నది.

మనచేత నిర్మాణము చేయబడు ముత్యమే ఈ జగము. బాహ్యప్రపంచమునుండి మనకు వచ్చునది ఒక దెబ్బ మాత్రమే. ఆ దెబ్బ తగిలినది అనెడు జ్ఞానము కలుగుటకు కూడ మనము ప్రతిక్రియ సలుపవలెను. మనము ప్రతిక్రియ సలిపిన తోడ్తోడనే మన మనస్సులోని ఒక భాగమును ఆ దెబ్బవైపునకు మనము చాచుచున్నాము. మనము ఆ దెబ్బను గుఱించి తెలిసికొనునప్పుడు ఆ దెబ్బవలన ఆకృతి పొందిన మన మనస్సునే సుమా మనము నిజముగా తెలిసికొన్నది! కాబట్టి బాహ్యమున ప్రపంచమనునది ఒకటి స్థిరముగా నున్నదని విశ్వసింప గోరువాడు శరీరశాస్త్రమును బాగుగ నేర్చుకొను ఈ దినములలో ఒకవిషయమును ఒప్పుకొనక తప్పదు. బాహ్యమున కాన్పించు ప్రపంచమునకు "క" అను గుర్తు అనుకొనుడు. అప్పుడు మనము నిజముగా తెలిసికొనునది ఈ "క" యును, దానితో కూడిన మనస్సును! మనస్సనెడు ఈ తత్త్వము "క"అంతటిని తనలో ఇముడ్చుకొనగలంత పెద్దదిగా నున్నది. కాబట్టి ఈ "క" అనునది ఎల్లప్పుడును తెలియరాకుండనే తెలియ వీలగునది కాకుండనే ఉండును. అందువలన ఒకవేళ బాహ్యప్రపంచము ఉన్నను, అది సదా దెలియబడనిదిగను, దెలియ వీలుకానిదిగను ఉండును. బాహ్యప్రపంచమును గుఱించి మనము తెలిసికొనుచున్నామనుకొనునది మన మనస్సుచేత అచ్చు కొట్టబడి రూపముపొంది సిద్ధముగా నున్నదానినే! అంతరప్రపంచము సంగతియు అటులే యున్నది. ఈ సూత్రమే మనజీవుడు లేక 'ఆత్మ' అను

దానికిని వర్తించును. 'ఆత్మ'ను మనము తెలిసికొన వలయు ననినచో మనస్సు ద్వారముననే చూడవలసి యుండును. కాబట్టి ఈ ఆత్మను గుఱించి మనము తెలిసికొనిన కొంచెము సైతము మనస్సుతో సమ్మిళితమై యున్న ఆత్మను గుఱించి మాత్రమే. అనగా మనస్సుచేత కప్పివేయబడి అచ్చులో సిద్ధము చేయబడిన కల్పితాకృతియగు ఆత్మను మాత్రమే. అంతకంటె ఎక్కువ ఏమియు మనము చూచుటలేదు. కొంత సాగిపోయిన పిమ్మట ఈ విషయమునకు మరల వచ్చెదము గాక! కాని ఇప్పుడు చెప్పుకొనిన దానిని బాగుగ జ్ఞప్తిలో నుంచుకొన వలయును.

మనము తెలిసికొన దగిన తరువాతి విషయము ఇది: ఈశరీరమనగా ఎడతెగక ప్రవహించుచున్న ఒక జడద్రవ్య ప్రవాహముయొక్క పేరేగదా అను ప్రశ్న బయలుదేరు చున్నది. ఒక నది ఎడతెగకుండ ప్రవహించుచున్నదనుకొనుడు. పోయిననీరు పోవుచుండగా ఎప్పటికప్పుడు క్రొత్తనీరు వచ్చిదానిలో చేరుచుండును గదా! అటులే ప్రతిక్షణమును మనశరీరమునుండి కొంతద్రవ్యము బయటికి పోవుచుండగా మరలకొంతద్రవ్యము ప్రతి క్షణమును క్రొత్తగా వచ్చి దానిలోచేరుచున్నది. అయినప్పటికినిదానినంతనుకలిపి ఊహ చేసికొని, ఆ ఊహనే నది అనియో శరీరమనియో అనుచున్నాము. సరే, నదియని మనము పిలుచునది దేనిని? ప్రతి క్షణమును ఆ నీరు మారిపోవుచున్నది; ఆ తీరమును మారిపోవుచున్నది; ప్రతి క్షణమును పరిసరములుకూడ (అనగా దాని సమీపమున, చుట్టును ఉండునవియు) మారి

పోవుచున్నవి. ఇంక నది యనునది ఏది? ఈ వికార పరంపర యొక్క, అనగా మార్పుల వరుసయొక్క పేరుమాత్రమే ఆ''నది''. మనస్సుకూడ అట్టిదే. దీనిని ప్రసిద్ధముగా క్షణిక విజ్ఞానవాదము అందురు. దీనిని గ్రహించుట చాల కష్టము; అయినను గట్టి పట్టుదలతో తర్క బలముచేత బౌద్ధ తత్త్వశాస్త్రము బాగుగ నిరూపణము చేసినది. ఇది భారతదేశములో కొంత వేదాంతభాగమునకు విరుద్ధముగా బయలుదేరినది. దీనికి మనము సమాధానము చెప్పవలసి యున్నది. అద్వైతము యొక్క సాహాయ్యమున మాత్రమే దీనికి సమాధానమును కూర్ప గలము. మఱింక దేని వలనను అట్టి సమాధానము కుదరదు. అద్వైత మతమును గుఱించి ప్రజలకు విపరీత భావములున్నను, అద్వైతమును గుఱించి ప్రజలు పోరాటములు సాగించినను, ఈ అద్వైతము ప్రపంచమునకు ఎటుల తరణోపాయము కాగలదో మనము కనుగొందముగాక. అద్వైతమునందు మాత్రమే అనేక విషయములకు సహేతుకమగు సమాధానములు కలవు. ద్వైతమతమును ఇతర మతములును ఈశ్వరార్చనకు సాధనములుగా చాలమంచివే; మనసునకు సంతృప్తి నొసంగునవే. అవి మనస్సును ఉద్ధరించుటకు సాయపడి యుండవచ్చును; కాని ఒక నరుడు మతసాధకుడుగను తార్కికుడుగను కూడ నుండదలచునేని ప్రపంచములో వానికి ఉపకరింప తగినది అద్వైత సిద్ధాంత మొక్కటియే. సరే ఇపుడు ఒక ప్రక్క నుండి నిరంతరము నిండుచుండి రెండవ ప్రక్కను నీటిని వదలివేయుచుండు నదితో పోల్చి మనస్సును గుఱించి

విచారణ చేయుదము. మనము ఆత్మయని పిలిచెడు ఆ ఐక్యము ఎక్కడనున్నది? శరీరము నిరంతరము మారిపోవు చున్నను మనస్సు సతతము మార్పు చెందుచున్నను మన లోపల మార్పు చెందనిది ఒకానొకటి కలదు. అది వస్తువులను గుఱించిన మన భావములను మారని వానివలె కనబడునటుల చేయుచున్నది. వేర్వేఱు తావులనుండి వచ్చు కాంతి కిరణములు ఒక తెరమీదనో, ఒకగోడమీదనో, కదలక మారకయుండు ఇంక దేనిమీదనో పడినప్పుడు మాత్రమే ఆ కిరణములకు ఐక్యము ఏర్పడుట సాధ్యమగును. అప్పుడు మాత్రమే అవి పూర్ణస్వరూపముగ కూర్పునందుటకు వీలగును. నరుని ఇంద్రియములకు ఐక్యము ఎట్లేర్పడును? అతని వేర్వేఱు భావములు ఏకమై ఒక పూర్ణ స్వరూపము పొందుటకు వీలెట్లు కలుగును? మనస్సుకూడ మారిపోవు చుండునదే కావున దానిలో ఐక్యము సాధ్యమగునని చెప్పుట కెంతమాత్రమును అవకాశము లేదు. కాబట్టి శరీరమును మనస్సును కానిది వేఱొకటి ఉండి తీరవలయును. మన భావములన్నియు, మన ఇంద్రియానుభవము లన్నియు, దేనిమీదనిలిచి ఐక్యమును పొందగలవో, ఒక పూర్ణ స్వరూపముగ ఏర్పడ గలవో, అట్టిది ఏదో యొకటి, మారనిది, శాశ్వతముగ నుండునది, ఉండి తీరవలయును. అదియే నరునియందలి నిజమగు జీవుడు లేక ఆత్మ. పంచభూతములతో ఏర్పడినది ఏదైనను మీరు దానిని సూక్ష్మ ద్రవ్యమనుడు, లేక మనస్సనుడు, అది మారిపోవుచునే యుండును. మీరు స్థూలపదార్థము అనెడు ఈబాహ్య ప్రపంచముకూడ

సూక్ష్మద్రవ్యమగు మనస్సుకన్న మరింతగా మాఱిపోవుచున్నది. అందుచేత మార్పు చెందనటువంటిది ఏదో అది భౌతిక పదార్థము మాత్రము కాజాలదు; అది ఆత్మ పదార్థమై ఉండి తీరవలయును. అనగా అది జడద్రవ్యము కాజాలదు. అది అవినాశియై, నిర్వికారమై అనగా మార్పులేనిదై ఉండి తీరవలయును.

ఇప్పుడు ఇంకొక ప్రశ్న బయలుదేరుచున్నది. బాహ్య ప్రపంచమునందు మాత్రమే జనించు పురాతన వాదములనెల్ల దూరముగ నుంచుదము. సరే, ఈ బాహ్య ప్రపంచమునే ఎవరు సృష్టించిరి? జడపదార్థము కల్పన చేసినదెవరు? నరునందలి అంతరప్రకృతినుండి మాత్రమే మనము ఈ సత్యమును తెలిసికొనవలయును. ఆత్మను గుఱించియు ఈసందర్భమునను అదేవిధమగు ప్రశ్న ఉదయించుచున్నది. మనస్సునకు వేఱైనదియు, శరీరమునకు వేఱైనదియు నిర్వికారమును అగు ఆత్మ నరునియందు కలదని ఒప్పుకొనినప్పటికిని జీవులమధ్య భావములందును అనుభవములందును సానుభూతులందును ఐక్యము ఎట్లు కలుగుచున్నది అను ప్రశ్న కలుగును. నా జీవాత్మకు మీ జీవాత్మతోడి సంసర్గమెట్లు కలుగుచున్నది? అది అట్లు పనిచేయుటకు ఉపకరించు సాధనమేది? దేని ద్వారమున అది నీఆత్మను చేరగలుగుచున్నది? ఇతర జీవాత్మసంసర్గానుభవము నాకెట్లు కలుగుచున్నది? నీ ఆత్మతోడను నాఆత్మతోడను సంబంధమును కల్పించుకొని ఈమధ్యనుండు వస్తువేది? కాబట్టి ఇంకొక ఆత్మకలదని ఒప్పుకొనవలసిన అవసరము ఆధ్యాత్మికముగ

ఏర్పడుచున్నవి. అన్ని జీవాత్మలతోడను సంపర్కము కలిగి పనిచేయగలదియు, జడపదార్థములందును వానిమూలమునను పనిచేయగలదియు, ఆత్మయే అయియుండవలయును. ప్రపంచమునగల అసంఖ్యాకములగు జీవాత్మలనన్నిటిని తనలో ఇముడ్చుకొని వానిలో అంతర్యామియై వర్తించుచు అవి అన్నియు తనలోనే తన మూలముననే బ్రతుకునట్లును, తనలోనే తన ద్వారముననే ఒకదానితో ఒకటి సానుభూతి పొందుచు, ఒకదానినొకటి ప్రేమించుకొనుచు, ఒకదానికొకటి ఉపకారము చేయుచు, ఉండుటకు వసతిని కల్పించు విశ్వాత్మ ఒకటి ఉండితీరవలయును గదా! ఈ విశ్వాత్మయే పరమాత్మ. అదియే జగదీశ్వరుడు. ఆత్మ భౌతికపదార్థముతో ఏర్పడినది కాదు కావునను, అది ఆత్మమయము కావునను, జడపదార్థ ధర్మములకు అది లోబడి యుండదు అని తేలుచున్నది. జడపదార్థ ధర్మముల ననుసరించి దీనిని పరిశోధించుటకు కూడ వీలులేదు. ఇది అవిజేయము, అజము, అమరము, నిర్వికారము.

"నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతిపావకః
నచైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుతః
నిత్యః సర్వగతః స్థాణు రచలోఽయం సనాతనః"

"ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు; అగ్ని కాల్చజాలదు; నీరు తడపజాలదు; గాలి ఆర్పివేయజాలదు. ఈ ఆత్మ నిర్వికారమైనది. అంతటను వ్యాపియుండునది. కదలనిది, చలనము లేనిది, శాశ్వతమైనది" అని అర్థము.

భగవద్గీత ననుసరించియు, వేదాంత శాస్త్రము ననుస రించియు ఈ జీవాత్మ విభువు కూడనని మనము గ్రహించు చున్నాము. కపిలుని సిద్ధాంతము ననుసరించి ఇది సర్వవ్యాపి. ఈ ఆత్మ అణు స్వరూపి అనగా అత్యంత సూక్ష్మపరిమాణము గలది అని వాదించు సంప్రదాయములును భారతదేశము నందు కలవు నిజమే. అయినను వ్యక్తమగుటలో అది అణువుగా గోచరించుననియే వారి అభిప్రాయము. దాని యథార్థ స్వరూపము విభువు. అనగా సర్వత్ర వ్యాపించి యుండునది అని అర్థము.

ఇక్కడ ఇంకొక సిద్ధాంతము బయలుదేరుచున్నది. అది మిక్కిలి అబ్బురముగ తోచవచ్చును. అది భారతీయుల ప్రత్యేక సిద్ధాంతము. ఇది అన్ని సంప్రదాయములవారును సమానముగా అంగీకరించు సిద్ధాంతము. కాబట్టి ఈ ఒక్క భావమును గురించి మిక్కిలి శ్రద్ధగా విని జ్ఞప్తి నుంచుకొన వలయునని మిమ్ము కోరుచున్నాను. భారతదేశమున ఈ భావము సర్వమునకును పునాదిగా ఉన్నది. పాశ్చాత్య ప్రపంచమున జర్మనుతత్త్వవేత్తలును, ఆంగ్ల తత్త్వజ్ఞులును స్థూల పరిణామ సిద్ధాంతమును బోధించుట మీరు వినియే యుందురు. అన్ని జంతువుల శరీరములును ఒక్కటియే అని ఆ సిద్ధాంతము. ఒకే వర్గమునకు చెందిన శరీరములును భిన్న భిన్నములుగ ఆకృతిపొంది వ్యక్తమగుచున్నందున విభేదములేర్పడుచున్నవి. కాని అత్యల్ప క్రిమి మొదలు అత్యుత్తమ జీవియగు మానవోత్తముని వఱకు శరీర మొక్క టియే. ఒక్కటియే ఇంకొకటిగా ఇంకొకటిగా మారుచు పై

పైకిపోవుచు శ్రేష్ఠతరరూపమును తాల్చును. తుట్టతుదకు పరిపూర్ణతను పడయును. మనలోకూడ ఆ సిద్ధాంతము కలదు. "జాత్యంతర పరిణామః ప్రకృత్యా పూరాత్" అని పతంజలియోగి తెల్పియే యున్నాడు. అన్నియు ఒక్కటే శ్రేణికి చెంది యున్నవి. జాతి యనగా శ్రేణియే. ఒకటి ఇంకొకరకముగా మారుచుండును. ఇదియే పరిణామము. ఒక రకము ఇంకొకరకముగా ఏర్పడుట వలె ఒకవస్తువు వేఱొక వస్తువుగా మారుటకే పరిణామమని అర్థము. యూరపి యనులకును మనకును భేదము ఎక్కడనున్నది? "ప్రకృత్యా పూరాత్" అనగా "ప్రకృతి పూర్ణతను పొందుట వలన" అని పతంజలి తెలిపియున్నాడు. స్పర్ధవలనను అనగా పోటీ పడుట వలనను, స్వాభావికమగు స్త్రీ పురుష జాతి ఆకర్షణ వలనను శరీరము రూపాంతరము పొందు చున్నదని యూర పియనులు చెప్పుచున్నారు. పతంజలి సూక్తియందు యూర పియన్ సిద్ధాంతముకంటె సూక్ష్మతర పృథక్కరణమును గాఢతర పరిశీలనమును కనబడుచున్నది. ప్రకృతి పూర్ణత పొందుట అనగా నేమియో ఇప్పుడు విచారింతము. అత్యల్ప సూక్ష్మ జీవి క్రమక్రమముగా శ్రేష్ఠతర జీవియగుచు ఒక బుద్ధుడుగా నేర్పడు పర్యంతము మారుచు పోవునని మన మును ఒప్పుకొనుచున్నాము. ఒక యంత్రములో క్రియను ఏదో యొక రూపమున, అంతకుముందు మనము ప్రవేశపెట్టి యుండనిచో ఆయంత్రము ఏ 'క్రియ'ను చేయజాలదు. శక్తి ఎన్నిరూపములతో వ్యక్తమైనను దాని పరిమాణ మొక్కటే. దానిలో మార్పురాదు. ఒకరూపమున కొంత శక్తిని మనము

పొందగోరినచో అంత శక్తిని వేరొక రూపమున వ్యయించి తీరవలయును. కాబట్టి ఉన్న శక్తియొక్క పరిమాణ మొక్కటే. ఒక సూక్ష్మజీవి పరిణామము పొంది బుద్ధు డయ్యె ననుకొనుడు. ఆ సూక్ష్మజీవియు నిజమునకు బుద్ధుడే. సూక్ష్మజీవియే బుద్ధునిగా పరిణమించెనేని ఆసూక్ష్మజీవి సంకోచము పొందిన బుద్ధుడే అయి యుండవలయును. ఈ విశ్వము అనంతశక్తిరాశియొక్క వికాసమే యైనయెడల, ఈ జగత్తు ప్రళయ దశయందున్నప్పుడు సంకోచము పొందిన ఆ అనంత శక్తిరాశియే అయి యుండవలయును. వేఱువిధ మగుటకు వీలులేదు. అందువలన ప్రతి జీవాత్మయు అఖండ మనియే తేలుచున్నది. మన కాలిక్రింద మిలమిలలాడు చిన్నపురుగు మొదలు మహోన్నతులగు మహాఋషుల వఱకునుగల అందఱి యందును ఈ అఖండ శక్తియు, అఖండ నైర్మల్యమును, అఖండ సర్వమును ఉన్నవి. భేదమంతయు వికాసమునందలి తారతమ్యమే. చిన్నపురుగు ఆ శక్తి యొక్క అతి స్వల్పాంశమును మాత్రమే ప్రకటించుచున్నది. నీవు దానినే ఎక్కువగా ప్రకటించుచున్నావు. ఒక మహా ఋషి దానిని ఇంకను ఎక్కువగా ప్రకటించుచున్నాడు. ఇంతియే భేదము. కాని ఆ అఖండశక్తి ఏకరీతిగనే నిలిచి యున్నది. "తతః క్షేత్రక వత్—కృషికుడు తన పొల మునకు నీరు పెట్టుట వంటిది." అని పతంజలి వచించి యున్నాడు. కర్షకుడు ఎక్కడనో ఉన్న చెఱువునుండి ఒక మూల చిన్నగండి ద్వారమున తన పొలమునకు నీరు పెట్టు కొనును. ఆ నీరు ఒక్కసారిగా తనపొలము లోనికి వేగ

ముగా వచ్చి పడకుండ ఆపునిమిత్తము దానికొక తలుపును కూడ అమర్చి యుండవచ్చును. అతనికి నీరు కావలసి వచ్చునపుడు ఊరక ఆ తలుపును తెఱచిన చాలును. ఆ నీరు తన స్వశక్తి వలననే వచ్చి పడును. ఆ శక్తికి ఇతరేమియు క్రొత్తగా చేర్చవలసినది లేదు. అది ఆ చెఱువులో ఇదివఱకే యున్నది. ఈ విధముగా మనలోని ప్రతివానికిని, ప్రతిజీవికినికూడ మూలాధారముగా అనంత శక్తియు అనంత పావనత్వమును, అనంతానందమును అనంత సత్త్వమును గలిగిన ప్రబలమగు ఒక చెఱువు ఉన్నదన్న మాటే; కాని తలుపులవంటి ఈ శరీరములు ఆ స్వస్వరూపమును సంపూర్ణముగా ప్రకటింపకుండ ఆపుచున్నవి.

తమోగుణము రజోగుణముగను రజోగుణము సత్త్వగుణముగను మారుచుండగా, ఈ శరీరములు అధికాధికముగా సూక్ష్మనిర్మాణము కలవి అగుచుండగా, ఈ శక్తియు ఈ నిర్మలత్వమును అధికాధికముగ ప్రకాశమునకు వచ్చుచుండును. ఈ కారణముచేతనే ఆహారపానీయముల విషయమునను భోజనాదిక విషయమునను మన పూర్వులు అత్యంత శ్రద్ధతీసికొనిరి. వివాహ విషయమునందు వలెనే ఈ విషయమునందును పూర్వపుటాచారము, అభిప్రాయములు నేడు అదృశ్యమై పోయి ఉండవచ్చును. ఇప్పుడు అది ప్రసక్తము కాకున్నను భారతీయ వివాహమునుగూర్చి ఒక్క విషయము మాత్రము ముచ్చటింతును. ఇంకొక అవకాశమున్నయెడల ఈ విషయమును గుఱించి విపులముగా ప్రసంగించెదను. వివాహవ్యవస్థనుగూర్చి మనకు గల అభిప్రాయ

ములు ఉత్తమనాగరకతకు ప్రాతిపదికలు కాదగిన సిద్ధాంతము లనిమాత్రము వక్కాణించు చున్నాను. అన్యసిద్ధాంతములు ఏవియు నాగరకములు కావు. ఒక పురుషునకుగాని, స్త్రీగాని, తనకు నచ్చిన స్త్రీని భార్యగాను తనకు నచ్చిన పురుషుని భర్తగాను నిర్ణయించుకొను స్వాతంత్ర్యమును అంగీకరించిన యెడల, వ్యక్తి సౌఖ్యమును పశువాంఛాతృప్తియు విచ్చల విడిగా విజృంభించుటకు సంఘమున అవకాశము కల్పించిన యెడల, తత్ఫలముగా అనర్థము వాటిల్లితీరును. దుష్ట సంతానము పెరుగును. సంఘము దుష్టమై రాక్షస మయ మగును. చూడుడు, ప్రతి దేశమందును నరుడు ఒకవైపున ఇటువంటి ఘోర సంతానమును వృద్ధిచేయుచున్నాడు; రెండవ వైపున, ఈ పశువులను అణచి పట్టుటకై పోలీసు బలమును పెంచుచున్నాడు. ఆ రీతిగా అనర్థమును ఎటుల నాశము చేయుటయా యనునది ఒక సమస్యగా నుండ రాదు. ఈ యనర్థము యొక్క యుత్పత్తిని ఎటుల ఆపుటయా యనునది మన సమస్యగా నుండవలయును. నీవు సంఘములో నుండు నంతకాలము నీ వివాహముయొక్క ఫలమును సంఘము నందలి ప్రతివ్యక్తియు తప్పక అనుభ వింపవలసి వచ్చును. కాబట్టి నీవు ఎవరిని వివాహముచేసి కొనవచ్చునో ఎవరిని వివాహము చేసికొనతగదో నిర్ణయిం చుటకు సంఘమునకు అధికారము కలదు. ఈదేశమున ఇటు వంటి ఉత్తమ భావములు వివాహ సిద్ధాంతమునకు మూలా ధారముగ నున్నవి. దీనినే వధూవరుల జాతకచక్ర మందురు. మనువు అభిప్రాయములో కామతృప్తివలన

పుట్టినబిడ్డ ఆర్యుడు కాడనియే. ఏ బిడ్డయొక్క పిండో త్పత్తియు మరణమును వేదశాస్త్రానుగుణమగునో అతడే ఆర్యుడు. ప్రతి దేశమునను ఇట్టి ఆర్యసంతానము తగ్గి పోవుచున్నది. తత్ఫలముగ అధర్మవృద్ధి యగుచున్నది. దానినే మనము కలియుగ మనుచున్నాము. మనమీ ఆదర్శముల నన్నింటిని పోగొట్టుకొనినాము. ఈ సిద్ధాంత ముల నన్నిటిని ఈ నాడు పూర్తిగా ఆచరణలో పెట్టజాల మనుటయు సత్యమే. ఈ సద్భావములను అపహాస్యరూప మునకు తెచ్చితి మనుటయు తథ్యమే. నేటి తల్లులు తండ్రులు, పూర్వకాలమునాటి తలిదండ్రులవంటివారు కాకుండుట శోచనీయము. మఱియు సంఘమునకు వ్యక్తులయెడ పూర్వ ముండి యున్నట్టి ప్రేమయు ఇప్పుడు లేదు. కాని ఆచర ణలో దోషములున్నను ధర్మ సిద్ధాంతము మాత్రము నిర్దు ష్టముగనే యున్నది. అనుష్ఠానమున లోపము గలిగి ఒక ఆచారము నిరుపయోగమైన యెడల ధర్మసిద్ధాంతమును చేపట్టి ఆచరణను సవరింపుడు. ధర్మ సిద్ధాంతమునే ఏల నాశము చేసెదరు? ఆహార విషయమునను ఇదే స్థితి వాటిల్లినది. అనుష్ఠానాచార వివరములును, చాల చెడి పోయినవి. బొత్తుగ చెడిపోయిన వనుటయు నిజము. అంత మాత్రముచేత ధర్మసూత్రమునకు హాని లేదు. ధర్మము సనాతనమై నిలిచి యుండవలసినదే. దానిని సవ్యమార్గమున పెట్టి అనుష్ఠానమును సంస్కరింపుడు.

భారత దేశమున, ప్రతి సంప్రదాయము వారును ఆత్మ విషయమున విశ్వసించు ఒక గొప్ప సిద్ధాంత మిది. ద్వైతులు

మాత్రము దుష్కర్మలచే ఆత్మ సంకుచితమైనది అని చెప్పుదురు. అనగా దాని శక్తులన్నియును దుస్స్వభావమువలన ముకుళించుకొనును; మరల సత్కర్మలవలన వికసించును. అద్వైతసిద్ధాంతప్రకారము ఆత్మ ఎన్నడును ముకుళించుకొనదు, వికసించుటయు లేదు; కాని అటుల జరుగుచున్నట్లు మాత్రము కాన్పించును. అది ముకుళించుకొన్నట్లు అనగా సంకుచితమైనట్లు కాన్పించును; అంతే భేదము. కాని సర్వశక్తులును ఆత్మయందు ఇదివఱకే యున్నవి. బయటనుండి ఏమియు దాని లోనికి వచ్చుటలేదు ఆకాశమునుండి దాని లోనికి ఏమియు ఊడి పడదు. ఈ భావమును అందఱును ఒప్పుకొందురు. మన వేదములు వెలుపలనుంచి లోపలికి వచ్చునవి కావనియు, లోనుండి వెలుపలికి వికసించి వచ్చునవనియు, అవి ఎక్కడనుండియో వచ్చునవి కాక ప్రతి ఆత్మయందును శాశ్వతముగా నుండు ధర్మములే యనియు గుర్తించుకొనుడు. వేదములు చీమయొక్క ఆత్మలోనున్నవి. దేవతయొక్క ఆత్మలోను ఉన్నవి. చీమ పరిణామముపొంది ఋషియొక్క శరీరమును పొందవలయును. వేదములు వాని యంతట అవియే వెలువడి వచ్చును. ఆ శాశ్వత ధర్మములు వానియంతట అవియే ప్రకాశించును. మన శక్తియంతయు ఇదివఱకే మనదై యున్నది. మన మోక్షము ఇదివఱకే మనలో ఉన్నది. ఈ మహా సిద్ధాంతమును మనము గ్రహింపవలయును. మన ఆత్మ సంకుచితమైనదే అనుకొనుము; మాయ యొక్క ముసుగుతో కప్పబడినదే అనుకొనుము. అది అంతగా పాటింప దగిన విషయము కాదు. అధమా

ధమ్మ నరుని యందు సైతము బుద్ధుని యందుగల ప్రతిభయే కలదనెడు సిద్ధాంతము ఇదివఱకే యున్నది. మీరు దానిని విశ్వసింప వలయును. ప్రతివాని యోగ్యతను విశ్వసింప వలయును. ఆత్మను గుఱించిన పరమ సిద్ధాంత మిదియే.

ఇప్పుడు గొప్ప పోరాటమొకటి సంభవించుచున్నది. మనవలెనే బౌద్ధులును శరీరమును పరిశోధించి అది ఒక విధమగు జడ ప్రవాహమనియు, మనస్సును పరిశోధించి అది మఱొక జడ ప్రవాహమనియు కనుగొనిరి. ఇక ఆత్మ విషయమును పరిశోధించుట అనవసరమని వారిమతము. కాబట్టి ఆత్మ అను నొకటి కలదని ఊహించుటే అనావశ్యకము. "జడ పదార్థముతోడను ఆ పదార్థమునకు అంటియుండు గుణములతోడను మన కేమి పని? అవి గుణములు మాత్రమే అని చెప్పుదుము. ఒక్క కారణమే సర్వమును వివరించుచుండగా రెండు కారణములు కలవని యూహించుట అవివేకము" అని వారందురు. ఇక పోరాటములు సాగినవి. ద్రవ్యమునకు సంబంధించిన సిద్ధాంతము లన్నిటిని బౌద్ధులు నేలకూల్చిరి. "నీకొక ఆత్మకలదు. నాకొక ఆత్మకలదు. ప్రతివానికిని మనస్సునకును శరీరమునకును భిన్నమగు ఒక ఆత్మకలదు. ఇట్లు ప్రతివానికిని ఒక వ్యక్తిత్వము ఉన్నది" అనెడు ద్రవ్యగుణ సిద్ధాంతమును నమ్మువారెల్లరు చెల్లాచెదరైరి. మనము చూచినంతవఱకు ద్వైతుల సిద్ధాంతము సరిగనే యున్నది. శరీర మొకటి యున్నది. మనస్సు, లేక సూక్ష్మ శరీరము ఉన్నది. ఈ ఆత్మ ఉన్నది. అన్ని ఆత్మ లలోను నిండి అంతర్యామియై పరమాత్మ యున్నాడు.

సరే ఇక్కడ ఒక చిక్కు తటస్థించుచున్నది. ఆత్మ పరమాత్మలు రెండును ద్రవ్యములు. వానికి మనస్సు శరీరము ఇంకను ఇతర ద్రవ్యములు వేర్వేఱు గుణముల వలె అంటుకొని యుండునని అందురు. ఎవరును ఎన్నడుగాని ద్రవ్యమును చూచినవారు లేరు. దానిని ఊహ చేయగలవారును లేరు. ఇట్టి ద్రవ్యమును గుఱించి ఆలోచించిన ప్రయోజన మేమున్నది? క్షణిక వాదియై 'ఉన్నది మానసికప్రవాహముల పరంపర మాత్రమే, మఱేమియు లేదు' అని ఏల అనకూడదు? ఈప్రవాహములు ఒకదానికొకటి అంటుకొనిపోవు; అవి ఒకటిగా కలిసిపోవు. సముద్రము నందలి తరంగముల వలె ఒకదాని వెంట నొకటి వచ్చుచుండును. అవి ఎన్నడును పూర్తి కావు. ఎన్నడును ఒక్కటిగా కలిసిపోవు. నరుడనగా ఇట్టి తరంగముల పరంపర. ఒక తరంగము పోవునప్పుడు ఇంకొక దానిని కల్పన చేయుచుండును. ఈ తరంగ రూపములు ఆగి పోవుటయే నిర్వాణ మనబడును. ఈ వాదము ఎదుట ద్వైతవాదము, వేదసిద్ధాంతము మౌనము వహింపవలసినదేగదా! ఏమని వాదము చేయుటకును సాధ్యము కాదు. ద్వైతుల దేవుడు సైతము ఇక్కడ నిలువజాలడు. సర్వవ్యాపి యయ్యును దేవుడు ఒక పురుషుడై చేతులు లేకుండ సృష్టిచేయుననుట కాళ్ళు లేకుండ నడచుననుట మొదలైన భావములును, కుమ్మరి కుండలు చేయు విధమున ఆ దేవుడు ఈ జగత్తును సృష్టి చేయుచున్నాడను సిద్ధాంతమును అర్థములేని బాల ప్రలాపములని బౌద్ధులు పల్కుచున్నారు. అట్టి దేవుడు ఎవ్వడైన ఉండినయెడల ఆ

దేవునితో నేను పోరాడుదును గాని పూజింపను, అని బౌద్ధ మతస్థుడు నిగ్రహించి పల్కెను. ఈ జగత్తు దుఃఖముతో నిండియున్నది. ఇది భగవంతుని పనియైనయెడల అట్టి భగవంతునితో మేము యుద్ధము చేసెదము. రెండవది, ఇట్టి భగవంతుడు ఉండుట సహేతుకము కాదు. అసంభవ మని మీరందఱును ఎఱుంగుదురు. సృష్టి రచనా సిద్ధాంత ములోని లోపముల గుఱించి మనము ప్రస్తావింప నక్కఱ లేదు. మన క్షణికవాదులు వారి బండారము పూర్తిగ బయటపెట్టిరి. ఈ విధముగా సగుణబ్రహ్మము విచ్ఛిన్నమై పోవుచున్నాడు.

సత్యము, అనన్యమగు సత్యమే, అద్వైతియొక్క ధర్మసూత్రము. "సత్యమేవ జయతే నానృతం; సత్యేనైవ పంథా వితతో దేవయానః" (సత్యమే జయించును, అసత్యము జయింపదు; దేవయానమార్గము సత్యము ద్వార మున పోవుచున్నది). ప్రతివాడును ఈ సత్యమును నమ్మియే నడచుచున్నాడు. కాని నీకంటె దుర్బలుని వాదమును నీ వాదబలముచేత నలిపివేయుకొఱకే ద్వైతసిద్ధాంతము నుపయోగించుకొనుచున్నావు. పాపము ఏదో ఒక విగ్రహ మును పూజచేసికొనువానితో ఊరక తగవు పెట్టుకొను చున్నావు. నీది ఒక అద్భుత తర్కవాదమనియు ఎదుటి వానిని సులభముగా కలవరపెట్టగలననియు తలంతువు. కాని అతడు ఎదురుతిరిగి నీ సగుణబ్రహ్మమును తుత్తునియలు చేసి అది కేవల ఊహాజన్యమగు ఆదర్శమేయని పల్కెనెడల నీకు గతి ఏమున్నది? నీవు ఏదో ఒక నమ్మకమును ఆధారము

చేసికొని ఇతరులు నాస్తికులని మొఱలిడుదువు ; అది తొలినాటి దుర్బలుని మొఱయే యగును. అతడు తన్ను ఓడించినవానినెల్ల నాస్తికుడని పల్కును. నీవు తర్కము నాశ్రయించిన యెడల పూర్తిగ తర్కము ననుసరించియే నడువుము; లేదా నీయెడల ఇతరులు అంగీకరింపవలయునని నీవు కోరుకొను నీతులనే ఇతరులయెడలను నీవు అంగీకరింపుము. దేవుడు కలడని నీ వెట్లు రుజువుచేయగలవు? నిజమునకు దేవుని ఉనికికి రుజువే లేదు. పైగా వాని ఉనికికి విరుద్ధముగా ప్రబలములగు వాదములు కలవు. నీ దేవుడు, వాని గుణములు, ద్రవ్యమయములగు అనేక ఆత్మలు, ప్రతి ఆత్మ, ఒక ప్రత్యేక వ్యక్తి — వీనినన్నిటిని సమర్థించుకొనుచు, నీ దైవమును గుఱించి నీ వెట్లు రుజువుచేయుదువు? నీవొక ప్రత్యేక వ్యక్తివా? ఎట్లు? నీవు ఒకశరీరమవు కాదుగదా! ఆ సూర్యునిలో ఒకప్పుడు నిండియున్న ద్రవ్యము ఇప్పుడు నీలోనున్న ద్రవ్యముగా మారియుండవచ్చును. ఇప్పుడు నీలోనున్న ద్రవ్యము వెలువడిపోయి ఆ చెట్టులోని ద్రవ్యముగా ఏర్పడవచ్చును. అట్టి సందర్భములలో నీ వ్యక్తిత్వము ఎక్కడ? నేను పుల్లయ్యననియో వెంకయ్యననియో చెప్పుకొనునది దేనిని? మనస్సు విషయమునను ఇట్లే యున్నది. నీ వ్యక్తిత్వము ఎక్కడ? ఈ రాత్రి నీభావము ఒకతీరుగా నున్నది. రేపు మఱొక తీరుగా నుండును. నీవు పసివాడవుగా నున్నప్పటివలె ఇప్పుడు భావన చేయుటలేదు. ముసలివారు పడుచువారివలె ఆలోచింపరు. ఇక నీ వ్యక్తిత్వము ఎచ్చటనున్నది? అది ఈ యహంకారమందు కలదనకుము.

ఏలయన అది నీ ఉనికియందు ఒక అల్పభాగమే అగును. నేను ఇప్పుడు మీతో మాటాడుచుండగా నా యింద్రియము లన్నియు పనిచేయుచున్నవి. నాకు ఆ గుర్తులేదు. గుర్తు తెలియుటయే అవి యున్నవనుటకు రుజువగునెడల అవి నా గుర్తునకు వచ్చుటలేదు కావున అవి లేవనియే చెప్పవలసి వచ్చును. ఇక మీరును మీ సగుణదైవత సిద్ధాంతములును ఎక్కడ నిలువగలవు? అటువంటి దేవుడున్నాడని మీరెట్లు రుజువుచేయగలరు? బౌద్ధులు మరల ఎదురువచ్చి అట్టిభావము సహేతుకము కాదనియు అవి నరుని పిఱికివానినిగా చేసి వెలుపలనుండి వచ్చు సాహాయ్యముకొఱకు దేవులింప చేయుననియు, అట్టిసాహాయ్యమును ఒసగువాడు ఎవ్వడు లేడనియు, కాబట్టి అట్టిబోధ నీతిబాహ్యమనియు పలుకుదురు. "ఇదిగో జగత్తు కాన్పించుచున్నది. నరుడు దానిని నిర్మించినాడు. ఇంక ఎవడును ఎన్నడును చూడనట్టి, ఎన్నడును గుర్తించనట్టి, ఎన్నడు మనకు సాహాయ్యము చేయనట్టి, ఒక వ్యక్తి మనకు బాహ్యమున ఎక్కడనో కలడను ఊహలమీద ఆధారపడియుండుట ఎందులకు? మీరు వ్యర్థముగ పిఱికివారై పోనేల? మీ బిడ్డలకు, కుక్కల వలె పూర్ణవిశ్వాసముతో నుండుటయే నరునకు ఉత్తమోత్తమ దశయని చెప్పనేల? కేవలము ఊహచేత ఒక భూతమును కల్పించుకొని వాని యెదుట దీనముగ నిలిచి 'మేము దుర్బలులము. అపవిత్రులము. ఈ జగత్తులో దుష్టత్వమెల్ల మాలోనే మూర్తీభవించినది' అని చెప్పకొనుడని వారల నేల వేడ్పెదరు? మీరు అబద్ధములాడుచున్నారు. మీ

బిడ్డల నెత్తిమీద మహాదోషమును తెచ్చిపెట్టుచున్నారు'' అని బౌద్ధులు నిందింతురు. ఏమందురా? ''ఈ ప్రపంచము భ్రాంతిచే కలుగుచున్నది. మీరు ఎటుల భావనచేసిన అటులే అయిపోవుదురు. ఎటుల సంకల్పించుచున్నారో అటులే యున్నారు. ఎటుల సంకల్పింపబోవుదురో అటులే యుందురు'' అనుపలుకులే మొట్టమొదట బుద్ధభగవానుని ముఖమునుండి వెలువడినవి. కావున మేమెందుకును కొఱగామనియు, ఎక్కడనో మబ్బులకావల కూర్చుండు నెవ్వడో సాహాయ్యము చేసినగాని ఏమియు చేయజాలమనియు చెప్పకొనకుడు. అటులగునేని దినదినము మీరు అధికాధికముగా దుర్బలులై పోవుటయే తటస్థించును. ''స్వామీ! మేము అపవిత్రులము; మమ్ములను పవిత్రులనుగా చేయుము'' అని పలుమారు ప్రార్థన సల్పుటవలన మీరు భ్రాంతులై పోయి నానావిధములగు దోషకార్యములు చేయుదురు. ఇట్టి సగుణ దైవతము ఒకడు కలడను భావమువలననే, ఇప్పుడు ప్రతి సంఘమునను గోచరించు దోషములలో నూటికి తొంబది వంతులు కలుగుచున్నవని బౌద్ధులు చెప్పుచున్నారు. ఈ జీవిత పరిణామముయొక్క ముఖ్య గమ్యార్థము, ఈ అద్భుత జీవన పరిణామము, నీవొక కుక్కవై పోవుటే యగునెడల అది మానవజన్మ ఎత్తినవానికి తగని మహా ఘోర సంకల్పమగును. ''వైకుంఠము అనెడు తావునకుపోయి అక్కడ నివసించు దేవునియెదుట సర్వకాలము చేతులు జోడించుకొని దీనముగా నిలువబడి యుండుటయే నీ జీవిత గమ్యార్థమగునెడల ఆత్మహత్య చేసికొని చచ్చుట మేలు'' అని

బౌద్ధులు వైష్ణవునితో వాదింతురు. అందువలననే తాము ఈ స్థితినుండి తప్పించుకొను కొఱకే నిర్వాణమనెడు శూన్య స్థితిని సృష్టిచేయుచుంటిమని వారు చెప్పెదురు. అద్వైత భావములన్నియు ప్రజలను నీతి బాహ్యులనుగా చేసివేయుచున్నవని ఈ కాలమున వాదనలు బయలుదేరుట వలన, నేను మాటల వరుసను బౌద్ధునివలె ఈ భావముల నన్నిటిని ఊరక మీ యెదుట పెట్టుచున్నాను. ఆ రెండవపక్షము ఎట్టుల నుండునో చూపుటకు ప్రయత్నించుచున్నాను. రెండు పక్షములను ధైర్యసాహసములతో మనము విమర్శించి చూతముగాక.

ఒకానొక సగుణ దైవతము జగమును సృష్టి చేయుచున్నాడు అనెడు సిద్ధాంతమును ఋజువుచేయుటకు వీలులేదని మొదటనే మనము తెలిసికొంటిమి. ఈనాడు అట్టిమాటను పసివాడైనను విశ్వసించునా? కుమ్మరి కుండలు చేయుచున్నాడు. అటులే బ్రహ్మదేవుడు ప్రపంచమును సృష్టి చేయుచున్నాడు అని చెప్పుటయా? అటులైన యెడల మీయూరి కుమ్మరియు ఒక దేవుడే అగును. అతడు తలగాని చేతులుగాని లేకుండ పనిచేయునని ఎవడైన చెప్పునెడల వానిని పిచ్చివారి చికిత్సాలయమునకు పంపవచ్చును. ఈ జగత్తునకు సృష్టికర్త యనెడు నీ సగుణబ్రహ్మ నీ మొఱలను నీవు బ్రతికియుండగా ఎన్నడైనను ఆలకించి సాహాయ్యము చేసియున్నాడా? ఇది ఆధునిక శాస్త్రము చేయు మఱియొక ఆక్షేపణ. నీకు లభించు సాహాయ్యమంతయు నీ స్వంత ప్రయత్నమువలననే లభింపగలదనియు,

ఇట్టుల మొఱలిడుటవలన నీవు వ్యర్థము చేసికొను శక్తిని అట్టుల దేవురించుచు మొఱలిడుటకంటె శ్రేష్ఠతరముగా వినియోగించుకొన గలవనియు వారు రుజువుచేయుదురు. మఱియు సగుణ దైవతము కలదను నమ్మకముతో పాటు అధికార పీడనమును అర్చకుల వ్యాపారమును బయలుదేరు నని మనకు తెలియును. అధికార పీడనమును, పూజారుల ప్రభయు, ఈ విశ్వాసము కలిగిన చోటులనెల్ల ప్రబలుచునే యున్నవి. ఈ భ్రాంతిని నెత్తిమీద మొట్టి అణచివేసిన గాని ఈ పీడ తొలగదని బౌద్ధులు గట్టిగ వాదించుచున్నారు. ఒక అలౌకిక పురుషుని యెదుట నరుడు వణకుచు నిలుచుండ వలసినదే అని తలంచునంత కాలము, పాపము ఈ నరులు ఎవరో ఒక పురోహితుని బ్రతిమాలుకొని, భగవంతుని యెదుట తమకు అండగా నిలిచి అనుగ్రహము సంపాదించి పెట్టుమని కోరుకొనుచునే యుండవలెను. అంతకాలమును నరులు తమ యెదుట గజగజలాడుచుండవలసినదే యనియు తమకు గొప్ప అధికారములు అర్హతలు కలవనియు ఈ పూజారులు చెప్పుకొనుచునే యుందురు. మీరు బ్రాహ్మణుని దూరముగ నెట్టివేయవచ్చును. కాని నామాటను నమ్ముడు. అట్టుల చేయించువారు తామే ఆ బ్రాహ్మణ స్థానము నాక్రమించి ఇంకను ఎక్కువ పీడాకరులగుదురు. ఏల యందురా? బ్రాహ్మణుని యందు కొంత ఉదార స్వభావము కలదు. కాని హఠాత్తుగా గణ్యతలోనికి వచ్చిన ఈ పురుషులు అత్యధిక పీడాకరులుగా నుందురనుట సత్యము. ఒక దరిద్రునకు హఠాత్తుగా ధనము చేజిక్కినయెడల

ప్రపంచమునంతను గడ్డిపఱక వలె చూడసాగును. కాబట్టి సగుణ దైవతమునందు మనకు విశ్వాస మున్నంతకాలము ఈ పూజారులును ఉండియే తీరుదురు. ఇక సంఘమునందు ఉదాత్తమగు నీతి ఉండుట అసంభవము. పూజారి వృత్తియు పీడనమును ఒకదానినంటి ఒకటి ఉండియే తీరును. అటులైన ఈ వృత్తి ఎందుకేర్పడినది? ఎందుకనగా పూర్వము కొందఱు బలాఢ్యులు ప్రజలను తమ చేతిక్రిందికి తీసికొని మేము చెప్పినటుల మీరు వినుడు, లేదా మిమ్ముల నాశము చేసెదము; అని భయపెట్టిరి. ఇదియే జరిగిన కథ. "సభయం వజ్ర ముద్యతమ్"—ఈ భావము తనకు లోబడని ప్రతివానిని చావకొట్టు పిడుగును పై బడవేయుటవలె నున్నది.

బౌద్ధమతస్థుడు "'సర్వమును కర్మసూత్రము ననుసరించి ఫలించును' అనునంతవఱకు నీ భావము ఎంతయు సహేతుక ముగనే యున్నది" అనును. అనంతమగు జీవాత్మలు కల వనియు ఆ జీవాత్మలకు జనన మరణములు లేవనియు మీరు నమ్ముదురు. అసంఖ్యాకములగు జీవాత్మలు కలవనుటయు, కర్మసూత్రవిశ్వాసమును, తర్కసమన్వితములనుటకు సందియము లేదు. ఫలము నీయని కారణమే యుండజాలదు. ప్రస్తుత దశకు కారణము పూర్వదశయం దుండితీరును. ఈ ప్రస్తుత దశకు ఫలముగా భావికాలపుదశ యేర్పడును. కర్మ జడ మనియు, చైతన్యము కాదనియు, కాబట్టి ఈ జడకర్మను ఫలప్రదము చేయుటకు చైతన్యము అవసరమనియు హిందువు చెప్పుచున్నాడు. అటులనా! చెట్టును ఫలింపజేయుటకు

చైతన్యము అవసరమగుచున్నదా? నేను ఒక బీజమును భూమిలో నాటి కొంచెము నీరు పోసినయెడల చాలును. చైతన్యము అవసరమగుటలేదే! అచ్చట అధిష్ఠాన చైతన్యము కలదని మీరు చెప్పవచ్చును. కాని ఈ జీవాత్మలు ఆ అధిష్ఠాన చైతన్యమే గదా! ఇక ఏమియు అవసరముండదు. మానవుల జీవాత్మలకు సైతము ఆ అధిష్ఠాన చైతన్యము కలదుగదా! ఇంకను దేవుడొకడు అవసరమనుట ఎందుకు అని జైనులు వాదించుచున్నారు. వారు బౌద్ధులవలె గాక జీవాత్మలు కలవని ఒప్పుకొందురు కాని భగవంతుడు కలడని విశ్వసింపరు. మీ తర్కమెక్కడ? మీ నీతిధర్మమెక్కడ? సరే, మీరు అద్వైతమతమును పరిశీలించి అది అవినీతికి మార్గము చూపునని భయపడినయెడల భారతదేశములోని ద్వైత సాంప్రదాయులు ఏమిచేయుచున్నారో కొంచెము చూడుడు. అద్వైతులలో ఇరువదివేలమంది తుంటరులు ఉన్నయెడల ద్వైతులలోకూడ ఇరువదివేలమంది తుంటరులు ఉన్నారు. సామాన్యముగ ద్వైతులలోనే తుంటరులు ఎక్కువమంది యుందురు. ఎందుకనగా అద్వైతమును గ్రహించుటకు కొంచెము ఎక్కువ బుద్ధిమంతులు అవసరము. అద్వైతులు సామాన్యముగా భయపడి దేనికిని లోబడరు. ఇక హిందువులగు మీకు మిగులునదేమున్నది? బౌద్ధుల పిడికిటిలో చిక్కకుండ మీకు రక్షణ లేదు. మీరు వేదములను క్రోడీకరింపవచ్చును. కాని బౌద్ధులకు వేదములందు విశ్వాసము లేదు. అందువలన బౌద్ధులు "త్రిపీటకములు వేరువిధముగ చెప్పుచున్నవి. అవి ఆద్యంతములు లేనివి; అవి బుద్ధునిచేత

వ్రాయబడినవియు కావు; బుద్ధుడే తాను వానిని క్రోడీకరించు చుంటినని చెప్పినాడు. ఈ త్రిపీఠకములు సనాతనములు. మా త్రిపీఠకములే సత్యములగు వేదాంతములు; మీ వేదములు సరియైనవి కావు; అవి బ్రాహ్మణ పురోహితుల చేత కల్పింపబడినవి; కాబట్టి వానిని దూరముగ పారవేయుడు" అని విజృంభించి పలుకుదురు. మీరు తప్పించుకొను త్రోవ ఏది?

ఆ చిక్కునుండి తప్పించుకొను త్రోవ ఇది. అధ్యాత్మ వాదరూపమగు మొదటి ఆక్షేపణను తీసికొనుడు. ద్రవ్యమును గుణములును వేఱని గదా వాదింతురు. అవి అటుల భిన్నములు కావని అద్వైతి వచించును. ద్రవ్యమునకును గుణములకును మధ్య విభేదమేమియు లేదు. పురాతనసాదృశ్యమును మీరు ఎఱుగుదుర గదా! త్రాడు కాన్పించి పామను భ్రాంతి కలిగినది. పాము నీకు కనబడునంతవఱకు ఆ త్రాడు నీకు కనబడుటలేదు. ఆ త్రాడే అదృశ్యమై పోయినది. ఒక వస్తువును ద్రవ్యముగను గుణములుగను విభాగించుట తత్త్వవేత్తల మెదడులలోని ఒకానొక ఆధ్యాత్మిక విషయమని చెప్పవచ్చును. ఏలయన అవి యథార్థముగ వెలుపల నుండునవి కావు. నీవు సాధారణ మానవుడవేని గుణములనే చూడగల్గుదువు. నీవు మహాయోగివైన యెడల ద్రవ్యమును చూడగల్గుదువు. అంతియేగాని, ద్రవ్యమును గుణములను రెంటిని ఒకేకాలమందు నీ వెన్నడును చూడజాలవు. కావున బౌద్ధులారా! ద్రవ్యములని గుణములని మీరు సాగించు పోరాటమంతయు గొప్ప పొరపాటు. యథార్థ విచారణకు

అది నిలువజాలదు. ద్రవ్యము నిర్గుణమందువేని అది ఒక్కటిగ మాత్రమే యుండగలదు. నీవు ఆత్మనుండి గుణములను వేఱు చేసి, ఈ గుణములు నిజముగా మనస్సునందు ఉండునవి అనియు, అవి ఆత్మమీద ఆరోపణ చేయబడినవనియు చెప్పుదువేని, ఇక రెండు ఆత్మలుండజాలవు. గుణములు మాత్రమే ఒకఆత్మను ఇంకొకఆత్మనుండి వేఱుచేయగల్గును. లేనిచో ఒకఆత్మ ఇంకొక ఆత్మకంటె వేఱు అని నీవు భేద మును గుర్తించుటె ట్లు పొసగును? ఏవో కొన్ని భిన్నలక్ష ణములను కొన్ని గుణములను బట్టియే గదా భిన్నత్వమును గుర్తింప జాలుట? అటులగాక గుణములే లేనియెడల భిన్న త్వము ఎక్కడనుండి వచ్చును? కాబట్టి రెండు ఆత్మలుండ జాలవు. ఉండునది ఒక్కటియే. ఇక మీ పరమాత్మ అనవసరము. ఈ ఆత్మయే అది. ఆ ఒక్క ఆత్మయే పర మాత్మ అనబడుచున్నది. ఆ ఒక్కటియే జీవాత్మ యనియు పిలువబడుచున్నది. ఇక సాంఖ్యులు మొదలగు ద్వైతు లారా, మీరు ఆత్మ 'విభు' అనగా సర్వవ్యాపి అనెదరుగదా! ఇక రెండు అఖండవస్తువులు మీకెక్కడనుండి వచ్చును? అఖండమై యుండగలది ఒక్కటియేగదా? ఇంక ఇతరమే మున్నది? ఈ ఒక్కటియే అఖండాత్మయై యుండ తక్కిన సర్వమును దాని వ్యక్తరూపములే కావలయును. అంతటితో బౌద్ధమతస్థుడు ఆగిపోవుచున్నాడు. కాని వాదన ఇక్కడ ఆగిపోవుట లేదు. అద్వైతసిద్ధాంతము పరిశోధనకు నిలువని కేవలదుర్బలవాదము కాదు. అద్వైతి ఇతరులను ఆక్షేపణ చేసి నెట్టివేసి తనవాదమును దిట్టపఱచుకొనును. కాని

ఆక్షేపణలను చేయుచు ఆ ఆక్షేపణల తోడను గ్రంథ సాక్ష్యములతోడను ఆతడు ఆగిపోడు. ఇదిగో ఇక్కడ నీవున్నావు. ఈజగత్తును నిరంతర చలనముగల వస్తువుగా నీవు చెప్పుచున్నావు. సృష్టియందు అనగా ఖండదశయందలి ప్రతిదియు చలించుచునే యున్నది. నీవు చలించుచున్నావు. ఈ బల్ల చలించుచున్నది. సర్వత్ర చలనము గలదు. ఇది సంసారము; అనగా నిరంతర చలనమే. అందువలననే దీనిని జగత్తు అనుట. కాబట్టి ఈ జగత్తునందు వ్యక్తిగా నుండ గలది ఏదియును లేదు. వ్యక్తిత్వము అనగా మార్పు లేకుండుట. సవికారమగు వ్యక్తిత్వము ఉండజాలదు. ఆ మాటయే అర్థరహితమైనది. వికారము, వ్యక్తి, అనుపదములు ఒకదానికొకటి విరుద్ధమైనవి. ఈ మన చిన్న ప్రపంచములో ఈజగత్తులో వ్యక్తి యనదగిన వస్తువేదియు లేదు. సంకల్పము, అనుభవము, మనస్సు, శరీరము, నరులు, పశువులు, చెట్లు అన్నియు నిరంతర చలనదశయందే ఉన్నవి. ఈ జగత్తంతయు ఒకే వస్తువుగా నీవు భావనచేయుదు వనుకొనుము. అప్పుడు అది మారగలదా? లేక చలింపగలదా? అట్లగుట ఏమాత్రమును పొసగదు. తక్కువ చలనము గల వేరొకదానితో గాని లేక చలనమే లేని వేరొకదానితో గాని పోల్చిచూచినప్పుడేగదా చలనము అనుదానిని గ్రహించుట సాధ్యము కాగలదు! కాబట్టి విశ్వమంతయు కలిసి ఒకటే అయినప్పుడు; అది నిశ్చలముగనే నిర్వికారముగనే యుండును. అందువలన విశ్వమంతయు నీవై "నేను [illegible]నే" అను సాక్షాత్కారము నీకు గలిగినప్పుడే,

నీవు 'వ్యక్తివి' కాగలుగుదువు. అందువలననే 'ద్వైత మున్నంతవఱకు, అనగా రెండవది యున్నంతవఱకు భయము నశింపదు' అని వేదాంతులు చెప్పుచున్నారు. ఒకడు వేఱొకడు కలడని తలచుట మానినప్పుడే, ఇంకొకని యునికి వాని అనుభవమునకు రానప్పుడే, అనగా సర్వమును ఒక్కటియైనప్పుడే వాని భయము నశించును. అప్పుడే మరణము తొలగిపోవును. అప్పుడు మాత్రమే సంసార మంతరించును. కాబట్టి నరుడు విశ్వమయుడు అగునప్పుడే 'వ్యక్తి' కాగలుగును గాని ప్రత్యేకతతో నిలిచియున్నట్లు భావించుట మూలమున వ్యక్తి కాజాలడు అని అద్వైత సిద్ధాంతము తెలుపుచున్నది. నీవు సర్వమునైనప్పుడే అమృతుడ వగుదువు. నీవు విశ్వము అయినప్పుడే జనన మరణముల భయము లేకుండపోవును. అప్పుడుమాత్రమే, నీచే విశ్వమని పిలువబడునది నీవు భగవంతుడని పిలుచునదిగను, "సత్"—(ఉనికి) అని పేర్కొనునదిగను, మఱినీవు సర్వము అని చెప్పునదిగను కాగలుగును! నీవును నీవంటి మనఃస్థితి గలవారందఱును, బహుళ తత్త్వముతో కూడిన ప్రపంచముగా చూచునది ఆ ఏకైక సద్వస్తువునే! కొంచెము పుణ్యకర్మచేసి ఉత్తమమగు మనఃస్థితిని సంపాదించుకొనిన జనులు, వారు మరణించునప్పుడు, ఆ ఏకైక సద్వస్తువునే స్వర్గముగ భావించి, అందు ఇంద్రుడు మొదలగువారిని చూతురు. ఇంకను శ్రేష్ఠతర కర్మచేసి శ్రేష్ఠతరస్థితికి వచ్చినవారు ఆదే సద్వస్తువును బ్రహ్మలోకముగా చూతురు. మఱియు పూర్ణత్వమును పడసినవారు భూలోకమును చూడరు; దేవతా

లోకమును చూడరు; ఏ లోకమును వారు చూడనే చూడరు. వారికి ఈ విశ్వమంతయు అదృశ్యమై పోవును. దానితావున బ్రహ్మము ఒక్కటియే నిలుచును.

ఈ బ్రహ్మమును మనము తెలిసికొనగలుగుదుమా? సంహితలోగల అఖండవస్తువు యొక్క వర్ణననుగుఱించి ఇదివఱకే చెప్పియుంటిని. ఇప్పుడు అంతర్యమునందు గల అఖండతత్త్వముయొక్క అనగా రెండవపక్షముయొక్క దర్శనమును చేయుదము. అది కాయిక రూపమగు అఖండత్వము. ఇదియు సంకల్పరూపమగు అఖండత్వమే. అక్కడ ఆ అఖండతత్త్వమును భావరూపమగు భాషలో వర్ణించు ప్రయత్నము జరిగినది. ఇదిగో ఈ ప్రపంచము కాన్పించుచున్నది. దీనిని బ్రహ్మమే యని ఒప్పుకొనినను దీనిని మనము గ్రహింపగలుగుదుమా? "నేతి! నేతి!" (లేదు, లేదు). ఈ విషయమును మీరు విస్పష్టముగా అర్థము చేసికొనవలయును. లేనిచో మరల మరల సందేహము మిమ్ము బాధించుచుండును. ఇది బ్రహ్మము అయినయెడల దీనిని మనము గ్రహించుట యెట్లు? "విజ్ఞాతారమరే కేన విజానీయాత్" (దేనివలన జ్ఞాత తెలిసికొనబడగలడు?). తెలిసికొనువాడు తెలిసికొనబడుట ఎట్లు? కన్ను సమస్తమును చూడగలుగును. అది తన్ను తాను చూచుకొనగలదా? మీరీవిషయమును బాగుగ జ్ఞప్తినుంచుకొనవలయును. ఇంకొక పెద్ద చరిత్ర యున్నది. మీపైని వచ్చిపడుచున్న పాశ్చాత్యవ్యామోహములన్నియు, 'ఇంద్రియజ్ఞానమును మించినది ఏదియు లేదు' అనెడు ఏకైకసూత్రముమీద తమ

అధ్యాత్మభావములను నిర్మించుచున్నవి. ప్రాచ్యఖండము నందు మన వేదములయందు ఈ జ్ఞానము వస్తువుకంటె తక్కువదే. ఏలయన, అది సర్వదా పరిమితినే సూచించు చున్నది. మీరొక విషయమును తెలిసికొనకోరిన తత్క్షణమే దానికి మీ మనస్సు హద్దుపెట్టుచున్నది. ముత్యపుచిప్ప ముత్యమునుచేయు సాదృశ్యము జ్ఞప్తికి తెచ్చుకొని జ్ఞాన మనగా పరిమితి యనియు, ఒకవస్తువును ప్రోగుచేయుట యనియు, దానిని మీ ఎఱుకలోనికి తెచ్చుకొనుటయనియు, అంతేగాని దానినంతను ఏకముగా తెలిసికొనుట కాదనియు, గ్రహింపుడని వేదములు చెప్పుచున్నవి. సమస్తజ్ఞానవిషయ మునను ఈ మాటయే సత్యము. అఖండతత్త్వము విషయ మున మాత్రము దీని సత్యత్వము కొఱవడునా? సమస్త జ్ఞానమునకును లక్ష్యమగు బ్రహ్మమునకు నీవు పరిమితి పెట్ట గలుగుదువా? సాక్షియగువానికి, ఎవరు లేనిది జ్ఞానము కలుగజాలదో అటువంటి ద్రష్టకు, ఎవనికి గుణములు లేవో అటునంటి పరమాత్మకు, ఈ విశ్వమునంతకును సాక్షియగు వానికి, మన ఆత్మలలోని సాక్షికి, ఎటుల హద్దుల పెట్ట గలుగుదువు? నీవు వానిని తెలిసికొనుట ఎట్లు? నీవు వానిని ఎట్లు బంధింపగలుగుదువు? ఈ సమస్తమును, ఈ బ్రహ్మాండ మంతయు అటువంటి వెఱ్ఱిప్రయత్నముగ నున్నది. ఈ అఖండాత్మ తన ముఖమును చూచుకొన ప్రయత్నించు చున్నటుల ఉన్నది. అత్యల్పజీవులు మొదలు అత్యుత్తమ దేవతలవఱకు ఆ పరమాత్మను ప్రతిబింబింపచేయు అద్దములవలె నున్నవి. ఆ పరమాత్మ ఇవి చాలక మానవ

దేహములో చేరి, అదియు ఖండములో ఖండమనియు, సమస్తమును ఖండమే యనియు, ఇట్టి ఖండవస్తువులలో అఖండతత్త్వముయొక్క స్వరూపము వ్యక్తము కాజాలదనియు తెలిసికొనుచున్నాము. అంతట తిరుగు ప్రయాణము ప్రారంభమగుచున్నది. దీనినే త్యాగము, వైరాగ్యము అనుచున్నాము. "ఇంద్రియములనుండి వెనుకకు మరలుము; వెనుకకు తిరిగి పొందుము; ఇంద్రియములవైపునకు పోవలదు" అనుటయే వైరాగ్యముయొక్క హెచ్చరిక. సర్వనీతిధర్మముల హెచ్చరిక ఇదియే!' సర్వక్షేమమును కూర్చు హెచ్చరిక ఇదియే. ఏలయన, మన మతము ప్రకారము ఈ జగత్తు తపశ్చర్యయందు అనగా వైరాగ్యమునందు ప్రారంభమగుచున్నది. మీరు క్రమముగా మరలిపోయిన కొలది ఆయా స్వరూపములు మీ ఎదుట ప్రత్యక్షమగుచుండును. వాని నన్నిటిని ఒకదాని తర్వాత నొకటిగా నెట్టివేసికొనుచు నీవు నీవై, నీ స్వరూపమున నిలుచువఱకు సాగిపోవుదువు. ఇదియే మోక్షము; లేక ముక్తి.

ఇందలి భావమును మనము అర్థముచేసికొనవలసి యున్నది. "విజ్ఞాతారమరే కేనవిజానీయాత్" (అనగా తెలిసికొనెడువానిని తెలిసికొనుట ఎట్లు?) తెలిసికొనెడువాడు తెలియబడజాలడు. ఏలయందురా? తెలిసికొనెడువాడు తెలిసికొనబడునెడల అతడు తెలిసికొనెడువాడు కాజాలడు. నీవు ఒక అద్దమునందు నీ కన్నులను నీవు చూచుకొనునెడల ఆ ప్రతిబింబము నీ కన్నులు కాజాలవు. అది వేఱొకటిగా కేవలము ప్రతిబింబముగనే యుండును. అట్లైన

ఈ ఆత్మ ఈ అఖండ విశ్వాత్మ నీ స్వస్వరూపము, కేవలము సాక్షిగ నున్నయెడల దానివలన లాభమేమి? మనవలె అది జీవింపజాలదు. ఇటు అటు తిరుగజాలదు. ప్రపంచమును అనుభవింప జాలదు. ప్రజలు ఈ సాక్షి ఎటుల అనుభూతి చేయగలదో అర్థము చేసికొన జాలకున్నారు. ఓహో! హిందువులగు మీరు ఈ సిద్ధాంతమును బట్టి సాక్షులుగ నుంటి మందు రేని స్థాణువులై పోదురు. ఎందుకును కొఱగాని వారౌదురని ఆక్షేపణ వచ్చుచున్నది. మొట్టమొదట సాక్షియే అనుభవింపగలవాడని తెలిసికొనుడు. ముష్టి యుద్ధము జరుగుచున్నపుడు దానిలో పాల్గొనువారా లేక వెలుపలనుండి చూచుచుండువారా ఆ యుద్ధమువలని ఆనందమును పొందునది? జీవితములో దేనియెడలనైనను నీవు సాక్షిగ నున్నకొలదిని అంత అధికాధికముగ దాని ఆనందమును పొందగలుగుదువు. ఇదియే ఆనందము. కాబట్టి నీ వీ జగత్తునకు సాక్షివైనప్పుడే అఖండానందము నీది కాగలదు. అప్పుడే నీవు ముక్తపురుషుడ వగుదువు. సాక్షిగా నుండునతడు మాత్రమే ఏకోరికయు లేక స్వర్గమునకు పోవలయునను సంకల్పము సైతము లేక, కీర్తిని గుఱించిన అపేక్షయు లేక అపకీర్తిని గుఱించిన భయమును లేక పని చేయగలడు. సాక్షి యొక్కడే ఆనందము ననుభవింపగలడు. వేఱొకడు అటుల అనుభవింపలేడు.

నైతిక పక్షముయొక్క విచారణకు దిగినప్పుడు, అద్వైతము నందలి అధ్యాత్మపక్షమునకును నైతిక పక్షమునకును మధ్య ఒక విచిత్రవిషయము తలచూపుచున్నది.

అదియే మాయాసిద్ధాంతము. అద్వైత సిద్ధాంతమునందలి ఈ ఒక్కొక్క అంశమును అర్థము చేసికొనుటకు సంవత్సరములు పట్టును. వివరించి తెలుపుటకు నెలలు పట్టును. కాబట్టి నేను వానిని కొలదిగ ప్రస్తావించి సాగిపోవు నెడల మీరు క్షమింతురుగాక. అన్ని యుగములందును ఈ మాయా సిద్ధాంతమును అర్థము చేసికొనుట అత్యంతము కష్టముగా నుండినది. అది నిజముగా సిద్ధాంతమే కాదని నేను మీకు కొలది మాటలలో తెలిపెదను. అది దేశకాల నిమిత్తములు, అనగా స్థలము, సమయము, కారణము, అనెడు మూడు భావములయొక్క సమ్మేళనమై యున్నది. ఈ స్థలము, కాలము, కారణము, అనువానినే నామరూపములుగ మార్చి వ్యవహరింతురు. సముద్రమున ఒక తరంగము కలిగినదనుకొనుడు. ఆ తరంగము దాని ఆకారమునందును, పేరునందును మాత్రమే ఆ సముద్రమునుండి భిన్నముగా నుండును. ఆ తరంగము లేనిది ఆ ఆకారముగాని, ఆ నామముగాని, కలుగజాలవు. అవి తరంగముతో కలిసి మాత్రమే నిలువగలవు. ఆ తరంగము అణగిపోవచ్చును. అప్పుడు ఆ తరంగమునందు ఆరోపింపబడిన నామరూపములును నాశమైపోవును. కాని అందలి నీరు మాత్రము నిలిచియే యుండును. అదేతీరున నీకును నాకును మధ్య, సర్వజంతువులకును నరునికిని మధ్య, దేవతలకును మానవులకును మధ్య, భేదమును కల్పించునది ఈ మాయయే. నిజమాలోచించిన యెడల ఈ ఆత్మను లక్షలకొలది జీవులలో [illegible] చేయునది ఈ మాయయే. ఈ జీవులను నామ

రూపముల ద్వారమున మాత్రమే గుర్తించుటకు వీలగును. ఈ మాయను వదలివేసి ఈ నామరూపములను జార విడిచితివేని ఈ భేదమంతయు తుదముట్ట నశించిపోవును. అప్పుడు నివ్వు నీ స్వస్వరూపముతో నుందువు. ఇదిగో మాయ. ఇది ఒక సిద్ధాంతము కాదు అని మరల చెప్పుచున్నాను. ఇది యథార్థమే. ఈ బల్ల "ఉన్నది" అని ప్రత్యక్షవాది అన్నప్పుడు ఈ బల్లకు స్వతంత్రమగు సొంతఉనికి కలదనియు దానిఉనికి ప్రపంచమున ఇంక దేని ఉనికిమీదను ఆధారపడి యుండదనియు, ఈ విశ్వమంతయు నాశమై శూన్యమున కలిసిపోయినను ఈ బల్ల ఇప్పుడు ఉన్నటులే నిలిచి యుండగలదనియు వాని అభిప్రాయము. కొంచెము యోచనచేసి చూచితివేని అది అటులుండుట సాధ్యముకాదని నీకు తెలిసిపోవును. ఈ విషయప్రపంచమున ప్రతిదియు సాధారమై పరస్పరాధారము కలిగి సానుబంధమై పరస్పరానుబంధము కలిగియుండును. ప్రతిదాని ఉనికి మఱొకదాని ఉనికిమీద ఆధారపడుచుండును. విషయములను గురించి మనకు గలుగు జ్ఞానమునందు మూడు మెట్లు లేక అంశములు కలవు. ప్రతివస్తువును ప్రత్యేకమై తక్కిన అన్నిటినుండి వేఱైయుండు ననుకొనుట మొదటిది. అన్ని అంశములకును మధ్య సంబంధబాంధవ్యములు కలవని గ్రహించుట రెండవది. మనము అనేకముగా చూచునట్టి ఒకే వస్తువు కలదని గ్రహించుట మూడవది. భగవంతునిగురించి పామరులకు గలుగు మొట్టమొదటి భావము ఆ భగవంతుడు ఈ జగత్తునకు వెలుపల ఎక్కడనో ఉన్నాడని. అనగా

భగవంతునిగుఱించిన భావన కేవలము మానవునిగూర్చిన భావనవలె నున్నది. మానవుడు చేయుదానినే అతడును చేయును. కాని అతిశయముగను శ్రేష్ఠతరముగను చేయును, అంతే. ఈ భగవద్భావన అసమంజసమనియు, అసంపూర్ణమనియు, నెటుల క్లుప్తముగ ఋజువుచేయబడెనో చూచి యుంటిమి. ఒక శక్తి సర్వత్ర వ్యక్తమగుచుండు ననెడు భావము మఱియొకటి కలదు. ఇది మనము "చండి" యందు కనుగొనునట్టి సగుణబ్రహ్మము. ఈ సగుణబ్రహ్మము సమస్త సద్గుణములకు ఆధారుడని మీరు భావించు భగవంతుడు కాడు. దైవము, దయ్యము, అనెడు ఇద్దరు భగవంతులను మీరు పెట్టుకొనరాదు; ఒక్కనిని మాత్రమే పెట్టుకొని వానినే మంచివాడనియు చెడ్డవాడనియు కూడ చెప్పవలసి యుండును. ఒక్కని మాత్రమే పెట్టుకొని అందువలన కలిగెడు కష్టసుఖములను అనుభవింపవలసినదే, తప్పదు. "ప్రతి జీవియందును శాంతిరూపమున పరగుచుండెడు ఓ దివ్యజననీ! నీకు నమస్కారము. ఓ మహాజననీ! అన్ని జీవులయందును నిర్మలరూపమున వెలయు నీకు వందనములు" అని "చండి"ని ప్రార్థింతుము. భగవంతుని సర్వాకారుడని భావనచేయుటవలన కలుగు ఫలముల నన్నిటిని మనము అంగీకరించియే తీరవలయును. "ఇది అంతయు ఆనందమయమై యున్నది. ఓ గార్గీ! ఎచ్చటెచ్చట ఆనందము గలదో అచ్చట నెల్ల పరమాత్మ యుండును". ఈ పరమాత్మను మీ ఇచ్చవచ్చిన చొప్పున వినియోగించుకొన వచ్చును. ఇదిగో ఇచ్చట దీపమున్నది గదా, దీని సాయ

మున నీవు ఒక బీదవానికి నూఱు రూపాయలు ఎంచి ఈవచ్చును. వేఱొకడు దొంగ సంతకమును సృష్టిచేయ వచ్చును. ఈ రెండు పనులు జరుగునప్పుడు దీప మొకరీతిగ నుండును. ఇది రెండవ దశ. భగవంతుడు సృష్టికి వెలుపల గాని దాని లోపలగాని ఉండువాడు కాడు అనుట మూడవ దశ. భగవంతుడు, ప్రకృతి, ఆత్మ, జగత్తు అనునవి పర్యాయపదములే. ఒకే భావము కలవియే. నీ వెన్నడును రెండు వస్తువులను చూచుటయే లేదు. నీ తత్త్వశాస్త్ర సంబంధమగు శబ్దములు నీకు భ్రాంతి కొలుపుచున్నవి. నీవు ఒక శరీరమనియు, నీకొక ఆత్మ కలదనియు, మీరు ఇరువురును కలిసియుందురనియును, నీవు మొదటనే భావించు కొనుచున్నావు. అది ఎట్లు సాధ్యమగును? నీ మనస్సులో వివరముగ ఊహచేసి చూడుము. తాను చైతన్యమని యోగి ఎఱుంగును. వాని శరీరము అదృశ్యమైపోవును. సామాన్యనరుడు తాను శరీరమనని భావించును. వానికి ఆత్మయను భావము స్ఫురింపదు. ఏలయన తత్త్వసిద్ధాంతము నందు నరునకు ఒక శరీరము, ఒక ఆత్మ, ఈ అనేకవిషయములు కలవనెడు భావము కలదు. అందువలన అవి అన్నియు ఏక కాలమందు గోచరించునవియే అని నీవు తలంతువు. ఒక్కొక సమయమునందు ఒక్కొకటి మాత్రమే గోచరింప గలదు. నీకు స్థూలపదార్థము గోచరించునపుడు భగవంతుని గుఱించి మాటాడకుము. నీవు కార్యమును చూచునప్పుడు ఆ కార్యము మాత్రమే నీకు గోచరించును. దాని కారణము నీకు గోచరించుట లేదు. నీవు కారణమును చూచుట

తోడనే కార్యము అదృశ్యమై పోవును. అయినచో ఈ జగత్తు ఎచ్చట నున్నది? ఎవడు దీనిని తొలగించి వేయుదురు?

"సర్వకాలము చైతన్యమై, ఆనందమయమై, సర్వాతీతమై, అసమానమై, సర్వగుణాతీతమై, సత్యముక్తమై, ఆకాశమునుబోలి అపరిమితమై, నిరవయవమై, అవ్యయమై, పరిపూర్ణమై వెలుంగు బ్రహ్మము, ఓ ఋషి! ఓ విద్వాంసుడా! సమాధిగతుడగు జ్ఞానియొక్క హృదయమునందు ప్రకాశించుచుండును".

"ఎచ్చట ప్రకృతివికారములన్నియు అంతరించిపోయెనో, ఎవనిని భావాతీతదశయందు భావింతురో, అన్నిటితో ఎవడు సమానుడయ్యు తనకు సమమగునది లేనివాడో, ఎవడు పరిమితులకు అందనివాడో, ఎవడు మనయందలి సత్తని చెప్పబడుదానికి సారభూతమైనవాడో, అట్టి పరిపూర్ణుడు, అట్టి బ్రహ్మము, ఓ ఋషి! ఓ విద్వాంసుడా! సమాధిగతుడగు జ్ఞానియొక్క హృదయమునందు ప్రకాశించుచుండును".

"జననమరణములకు అతీతుడై ఏ యఖండుడు, అతులితుడు, మహాప్రళయమునందు పైని నీరు, క్రిందను నీరు, అన్నివైపులను నీరు నిండియుండ ఆ నీటిమీద ఒక్క తరంగమేనియు, ఒక్క చిన్న అలయు కాన్పింపని స్థితిలో మెల్లమెల్లగా మునిగిపోవు జగత్తువలె నిశ్శబ్దముగా, నిశ్చలముగా నుండగా, సర్వదృశ్యములును నాశమై దుష్టుల

యొక్కయు సాధువులయొక్కయు వాగ్వాదములు, పోరాటములు, యుద్ధములు, తుదముట్టి అణగిపోవునో, అట్టి బ్రహ్మము ఓ ఋషి! ఓ విద్వాంసుడా! సమాధిగతుడగు జ్ఞానియొక్క హృదయమునందు ప్రకాశించుచుండును'' అని వేదములు ప్రకటించుచున్నవి.

దీని నెఱుంగు దశ మీకు రాగలదు. అది వచ్చునపుడు ఈ ప్రపంచము అదృశ్యమగును.

ఈ బ్రహ్మము, ఈ సద్వస్తువు, తెలియబడనిదనియు, తెలియబడజాల దనియు, గ్రహించితిమి. అట్లనుట అజ్ఞేయవాదము ననుసరించికాదు. కాని నీవా బ్రహ్మమవే అయియుండుటచేత వానిని వేఱగువానిగ నెఱుంగుట మహాదోషమగునుగదా! బ్రహ్మమనగా ఈ బల్లకాదనియు, బల్లయుననియు తెలిసికొని యుంటిమి. ఆ నామమును, రూపమును తీసివేయుము. ఇక మిగులు సద్వస్తువు ఆ బ్రహ్మమే. సమస్తమునందు గల సత్యపదార్థము ఆ బ్రహ్మమే.

''నీవే స్త్రీవి. నీవే పురుషుడవు; నీవే బాలుడవు. నీవే బాలికవు. నీవే ఊతకఱ్ఱపై ఊగులాడుచు పోవు వృద్ధుడవు. నీవే ఈ జగము సర్వమును'' అనునిట్టిదియే అద్వైతభావన. మఱికొంత వినుడు. వస్తువుల మూలతత్త్వమును గుఱించిన వివరణము ఇందే యున్నటుల తోచుచున్నది. ఈ విషయమునందే తర్కవాదముల, శాస్త్రజ్ఞానముల ధాటిని ఎదిర్చి స్థిరముగ నిలువ గలుగుదుమని గ్రహించితిమి. ఇక్కడనే హేతువాదమునకు సుస్థిరమగు

ఆధారము తుదకు దొరకుచున్నది. అయినను భారతీయ వేదాంతి దీనికి పూర్వమునందు గల దశలను నిరసించువాడు కాడు. అతడు వెనుదిరిగి చూచి వానిని ఆశీర్వదించును. వానికి అవి సత్యములే యని తెలియును. కాని వానిని అపసవ్యముగా చూచి అపసవ్యముగా వర్ణించుట తటస్థించినది. మాయ అనెడు అద్దము ద్వారమున చూచుటచేత వికారమై కాన్పించినను అవి అన్నియు ఆ ఒక్క సత్పదార్థమే; అన్నియు సత్యమే; సత్యేతరము కావు. ఎవనిని పామరుడు ప్రకృతికి ఆవల చూచెనో వానినే కొంచెము విద్యగలవాడు జగత్తునందు అంతర్యామియై యున్నట్టుల చూచును. ఆ బ్రహ్మమునే ఋషి తన ఆత్మగను, జగత్స్వరూపముగను గ్రహించును. సర్వమును ఒకటియే ; ఒక్క తత్త్వమే. మాయామయములగు అద్దములద్వారమున వేర్వేఱు దృక్పథములనుండి భిన్నభిన్నములగు మనస్సులతో చూచుటవలన ఈ భేదమంతయు కలుగుచున్నది. ఇంతియే కాదు. ఒక దృష్టి మఱొకదృష్టికి దారితీయవలయును. శాస్త్రజ్ఞానమునకును, సామాన్య జ్ఞానమునకును మధ్యగల భేదమేమి? చీకటిగా నున్నప్పుడు నీవు వీథిలోనికి పోగా ఏదేని అసాధారణ విషయము సంభవించునెడల దానికి కారణమేమని ఆ త్రోవను పోవువాని నొకనిని అడుగుము. ఆ సంఘటనము ఒక దయ్యము వలన కలుగుచున్నదని పదిమందిలో ఒకడైనను తప్పక చెప్పును. కారణములను కార్యములకు భిన్నముగా వెలుపల గలవని దేవులాడుట అజ్ఞానుల స్వభావముగాన అతడు సదా దయ్యములను,

భూతములను చూచుచుండును. ఒక కొయి క్రింద పడిన యెడల పామరుడు ఏదేని దయ్యమో భూతమో దానిని పడవేసె నసును. కాని శాస్త్రజ్ఞానము గల పురుషుడో అది ప్రకృతి ధర్మము వలన భూమ్యాకర్షణ స్వభావమువలన జరిగినదని తెలుపును.

ప్రకృతిశాస్త్రమునకును, మతమునకును, సర్వత్ర కలుగు పోరాటము ఎట్టిది? మతములు బాహ్య ప్రపంచము నుండి తెచ్చిపెట్టుకొనిన అనేకసమాధానముల బరువుతో క్రుంగి పోవుచున్నవి. సూర్యుడు ఒక అధిష్ఠాన దేవతవశము నందుండును! చంద్రుడు మఱొక అధిష్ఠాన దేవతవశమునం దుండును! ఇట్లు అనంతములగు దైవతములు ఏర్పడు చున్నారు. ప్రతి వికారమును ఒక దేవతవలన కలుగు చున్నది. ఈ దేవతలందఱును, ఆయా విషయములకు వెలు పల నుండువారని అందఱును అంగీకరించుచున్నారు. ఒక విషయముయొక్క కారణముకొఱకు దాని స్వభావము నే పరిశీలింపవలయునని ప్రకృతిశాస్త్రము చెప్పుచున్నది. ఈ ప్రకృతిశాస్త్రము ఒక్కొక మెట్టె ఎక్కిపోయిన కొలదిని కారణములను దేవతలయు, భూతములయు చేతులలోనుండి లాగివేయుచున్నది. అద్వైతమతముకూడ అధ్యాత్మవిషయ ములందు అటులే చేయుచున్నది. కావున అది అత్యంతము శాస్త్రసమ్మతమగు మతమని చెప్పవచ్చును. ఈ జగము విశ్వాతీతుడగు ఏ బ్రహ్మదేవునిచేతను సృష్టింపబడుట లేదు. ఇది బయట ఎక్కడనోయుండు ఏ పెనుభూతముయొక్క సృష్టియు కాదు. ఇది స్వయముగనే సృష్టియై స్వయ

ముగనే ప్రకాశించి స్వయముగనే లయమునందెడు ఒకే అఖండ సత్పదార్థము. అదియే బ్రహ్మము. "తత్త్వమసి శ్వేతకేతో" (ఓ శ్వేతకేతూ అది నీవే సుమీ!) అని బోధించు ఈ అద్వైతమతము మాత్రమే శాస్త్రానుగుణమగు మతమని మనము గ్రహింపగలము. ఈ కాలమున ఈ నవ్య భారతదేశములోని మిడిమిడి చదువులు చదివినవారు హేతువాదమనియు, తర్కమనియు, ఏమేమో ప్రగల్భములు కొట్టుట అనుదినము నేను వినుచున్నాను. ప్రకృతి శాస్త్రమునుగుఱించి వారి ప్రగల్భములు ఎట్లున్నను మీలో అన్ని సంప్రదాయములవారును వచ్చి అద్వైతులై పోవ సాహసింతురనియు, బుద్ధభగవానునివలె "బహుజనహితాయ బహుజన సుఖాయ" (అనేకుల క్షేమముకొఱకును, అనేకుల సుఖముకొఱకును) అనుచు ఈ మతమును ప్రపంచము నందెల్లెడల ప్రచారము చేయుదురనియు నేను ఆశించుచున్నాను. మీరటుల చేయరేని మిమ్ము పిఱికివారినిగా భావించెదను. మీరు మీ పిఱికితనమును పోగొట్టుకొన జాలనియెడల, మీరు మీ భయమునే సాకుగా చెప్పుకొనునెడల, అటువంటి సాకునే ఇతరులయెడను అంగీకరింపుడు. పాపము, విగ్రహారాధకులపైని పడబోకుడు. వారివి వెఱ్ఱి దైవములని దూషింపబోకుడు. మీతో పూర్తిగ ఏకీభవింపని ప్రతివానికిని బుద్ధులుచెప్పుటకు పూనుకొనకుడు. మీమట్టుకు మీరే పిరికివారై ఉన్నట్లు మొట్టమొదట తెలిసికొనుడు. సంఘమును చూచి మీరు భయపడునెడల, మీపూర్వ్యమూఢాచారముల తలచి మీరే అంతగ భయపడునెడల, పామరజనులు ఈ

మూఢవిశ్వాసములనుగుఱించి ఎంతగా భయపడుదురో, అవి వారిని ఎంతగా బంధించి పడవేయుచున్నవో విచారింపుడు. అద్వైతియొక్క అభిప్రాయము ఇట్లుండును. అందఱిని ఆదరణతో చూడుడు. ప్రపంచమంతయు కేవల సిద్ధాంతములోనేగాక అనుభవమునందును అద్వైతభావమయమగుగాక యని నేను భగవంతుని వేడుకొందును. అంతవఱకు మనము పోజాలనియెడల దానిక్రిందిమెట్టువఱకైనను పోవుదుముగాక. పామరులను ఆదరణతో చేయిపట్టుకొని, వారు ఒక్కొక్క మెట్టే ఎక్కిపోవునట్లు సాహాయ్యము చేయుదుముగాక. భారతదేశములో మతయాత్ర సర్వమును పురోగమనమే యని బాగుగా గ్రహింపుడు. అధర్మమునుండి ధర్మమునకు పోవుచుంటిమని తలంపకుడు. మనము ఒకధర్మమునుండి దానిపైధర్మమునకు చేరుచున్నామని తెలిసికొనుడు.

నీతిధర్మమునుగుఱించి మఱికొంత చెప్పవలసియున్నది. మనపిల్లలు ఎవరివలననో — అది భగవంతునకే ఎఱుక — అద్వైతమతము ప్రజలను అవినీతిపరులను చేయుచున్నదని విని చెలరేగి మాటాడుచున్నారు. మనమందఱమును బ్రహ్మమే అగునెడల నీతితో అసలు పనియేమున్నది! బడితెకఱ్ఱతో తప్ప క్రమమార్గమున నడవని పశువు చేయవలసిన వాద మిది. మీరట్టి పశువు లగుటకన్న ఎందులోనైన పడి మరణించుట మేలు. ఎప్పుడును బడితెకఱ్ఱకు లోబడి నడవగోరు మానవజీవులుగా జీవించుటకంటె అటుల మరణించుటయే ఉచితము. దుడ్డుకఱ్ఱ తొలగినంతనే మీరు రాక్షసులై పోదురా? అటులగునెడల మిమ్ములను హతము

చేయవలసినదే. మీకు గత్యంతరము లేదు. మీరు నిరంతరము బడితెపోటులతోను, మొట్టికాయలతోను, బ్రతుకవలసినవారగుదురేని మీకు మార్గాంతరము లేదు. మీకెన్నటికి మోక్షము లేదు. ఇక రెండవ విషయము: అద్వైతము మాత్రమే నీతికి వివరణమును బోధింపగలదు. ప్రతి మతమును పరోపకారము చేయుట నీతికంతకు సారమని బోధించుచున్నది. "స్వార్థరహితముగా వర్తింపుడు" అని ప్రతి మతము అనును. "ఎందులకు? నేను ఎందుకు స్వార్థమును విడువవలయును?" అని ప్రశ్నించిన యెడల ఏదో దేవత అటుల చెప్పె నందురు. "ఆ దేవతను నేను సరకు చేయను" అందువు. అప్పుడు ఏవో కొన్ని శాస్త్రములు అటుల విధించుచున్న వందురు. అప్పుడు "శాస్త్రములలో నుండుగాక; అవి అటులనే చెప్పుగాక; నేను లెక్క చేయను. అవి ఏమి చెప్పిన నాకేమి?" అందువు. అంతటితో సరి. ఎవని మార్గము వానిదే. వెనక చిక్కినవాడు ఇడుముల పాలగును. ప్రపంచములో నీతి అటులున్నది. కనీసము చాలమంది అటులున్నారు అనవచ్చును. నేనెందులకు నీతిపరుడనుగా నుండవలెను? కారణమేమి? అని ప్రశ్న వచ్చునెడల గీతలో చెప్పబడినటుల నీవు సత్యమును గ్రహించిన గాని దానికి వివరణము చెప్పజాలవు.

"సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్।
న హినస్త్యాత్మనాత్మానం తతోయాతి పరాంగతిమ్॥"

(ఆత్మను సర్వత్ర సమముగా చూచు యోగి ఆత్మను ఆత్మచేత హింసింపజాలడు. అతడు పరమగతినే పొంద

గల్గును). నీవు ఎవరిని హింసించినను, నిన్ను నీవే హింసించు కొనినవాడవగుచున్నాడవనియు, వారందఱు నీవేయనియు, అద్వైతబోధవలన తెలిసికొనుము. నీవు ఎఱిగియున్నను, ఎఱుగకున్నను అన్ని చేతులతోడను నీవు పనుల చేయుచునే యున్నావు; అన్ని పాదములతోడను నీవు నడచుచున్నావు. రాజప్రాసాదములలో భోగించు రాజువు నీవే. దీనుడవై వీథులలోని దుమ్ములో పడి దుఃఖించువాడవును నీవే. నీవు పండితులలోను, పామరులలోనుకూడ ఉన్నావు. బలవంతులలోను, బలహీనులలోనుకూడ కలవు. దీనిని గ్రహించి సానుభూతిపరుడవు కమ్ము. మనము ఇతరులకు ఏల అపకారము చేయగూడదో ఆ కారణ మిదియే. అందువలననే నేను ఆకలిచే బాధపడుచున్నప్పటికిని 'వేలకొలది నోరులతో తినువారు కలరు; ఆ నోరులన్నియు నావే యని భావించి నేను నిర్విచారముగ నుండగలను. కాబట్టి నా గతి ఏమగునో యనిగాని నాకుగలది ఏమైపోవునో యనిగాని నేను ఆతురపడను. ఏలయన, ఈ జగమంతయు నాదియే. నేను అనంతానందమును అనుభవించుచున్నాను. నన్నుగాని, ఈ జగత్తునుగాని, ఎవరు చంపగలరు? నీతి అంతయు ఇందున్నది. ఈ అద్వైతసిద్ధాంతము మాత్రమే నీతికి కారణమును ఇట్లు విశదము చేయుచున్నది. ఇతర మతములును నీతిని బోధించును గాని కారణమును వివరింపజాలవు. ఇంతవఱకు వివరణ మేమో తెలిసికొంటిమి.

సరే ఇందువలన కలుగు లాభ మేమి? ఇది బలవర్ధకము. నీవు ప్రపంచముమీద పఱచిన అధ్యాస యనెడు

ముసుగు తొలగింపుము. దుర్బలతను కలుగజేయు సంకల్పములనుగాని, మాటలనుగాని, మానవకోటియందు ప్రవేశపెట్టకుము. పాపములన్నియు, అనర్థములన్నియు, 'దుర్బలత' అనెడు ఒక్కమాటలో ఇమిడియున్నవి. అన్ని దోషకార్యములందును ప్రేరణశక్తిగా నుండునది దుర్బలతయే. స్వార్థపరత కంతకును మూలము దుర్బలతయే. ఇతరులకు అపకారముచేయ నరులను ప్రేరేపించునది దుర్బలతయే. సత్యమును కప్పిపెట్టి కపటవేషముల తాల్చునట్లు చేయునది దుర్బలతయే. తమ స్వస్వరూపమును ఎల్లరను గ్రహింతురుగాక. ఎల్లరను "సోహం" అనుచు దివారాత్రములు తమ స్వస్వరూపమును ధ్యానింతురు గాక. "అహం బ్రహ్మాస్మి, అహం బ్రహ్మాస్మి" అనుచు ఈ బలవర్ధకమగు భావమును తల్లిపాలతో ప్రతివారను త్రాగుదురు గాక. "శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" (మొట్టమొదట దీనిని గుఱించి వినవలయును; పిమ్మట దీనిని గుఱించి మననము చేయవలయును). ఆ విచారణనుండి, అట్టి హృదయమునుండి, ప్రపంచ మెన్నడును విని, కని యుండని మహాకార్యములు బయలుదేరగలవు. ఓహో! ఈ అద్వైతమతమును కొందఱు ఆచరణయోగ్యము కాదనుచున్నారు. అనగా స్థూలదృష్టికి అది ఇంకను వ్యక్తము కాలేదని అర్థము. కొంతవఱకు ఆ మాట సత్యమే.

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ ఓమిత్యేకాక్షరం పరం।
ఓమిత్యేకాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్॥"

(ఓం అను ఏకాక్షరము బ్రహ్మమై యున్నది. ఓం పరమ సత్యపదార్థము. ఈ ఓం యొక్క తత్త్వమును తెలిసినవానికి కోరినదెల్ల లభించును). ఓహో! అందువలననే ఈ ఓం యొక్క రహస్యమును అనగా ఆ ఓంకారము నీవే అనుటను మొదటనే తెలిసికొనుము. ఈ 'తత్త్వమసి' అను మహా వాక్యముయొక్క భావమును గ్రహింపుము. అప్పుడు నీవేమి కోరిన అది తప్పక నీకడకు వచ్చును. నీవు లౌకికసంపదను మిక్కిలిగా కోరుకొందువేని నీవు అట్టివాడవని విశ్వసింపుము. నేను ఒక చిన్ని నీటిబుడగగా నుండవచ్చును. నీవు పర్వత మంత ఎత్తగు తరంగమవు కావచ్చును. అయినను మన కిరువురకును ఆధారక్షేత్రముగా ఆ అనంతమహాసముద్రమే కలదని గ్రహింపుము. అఖండబ్రహ్మమే మన శక్తికిని, మన బలమునకును ప్రధానమగు అవ్యయఖని. అందుండి చిన్ని బుడగనగు నేనును, ఉత్తుంగ పర్వతసమతరంగమవగు నీవును మన ఇష్టమువచ్చినంత శక్తిని తీసికొని వినియోగించుకొన వచ్చును. కాబట్టి ఆత్మవిశ్వాసమును పూనుము. మొట్ట మొదటగా నీలో నీవు విశ్వాసమును కుదుర్చుకొనుట అద్వైతమతములోని రహస్యము! ఆ పిమ్మట నీవు ఎట్టి నమ్మకమునైనను పెట్టుకొందువు గాక. ప్రపంచ చరిత్ర యందు అచంచలమగు ఆత్మవిశ్వాసముగల జాతులు మాత్రమే శక్తిమంతములగు మహాజాతులుగా వృద్ధిపొందినవి. ప్రతి జాతి చరిత్రయందును ఆత్మవిశ్వాసము పూనిన వ్యక్తులు మాత్రమే గొప్పవారును, బలాఢ్యులును కాగలిగిరని తెలిసికొనుడు. ఇక్కడ భారతదేశమునకు ఒక

ఆంగ్లేయుడు గుమాస్తాగా వచ్చినాడు. డబ్బు లేకపోవుట చేతను, ఇంక ఇతర కారణములచేతను అతడు తన తలకు గుఱివెట్టి రెండుసార్లు తుపాకితో కాల్చుకొన యత్నించెను. రెండు సార్లు వాని ప్రయత్నము విఫలము కాగా వానికి ఆత్మవిశ్వాసము కుదిరినది. అతడు తాను మహాకార్యములు చేయుటకొఱకు జన్మించితినని విశ్వసించెను. ఆ పురుషుడే ఈ సామ్రాజ్యనిర్మాతయగు క్లైవు. ఆతడే పాదరీలబోధలు నమ్మి యావజ్జీవము దీనుడై "ఓ ప్రభువా! నేను దుర్బలుడను, నేను హీనుడను" అనుచు దేవురింపసాగినయెడల ఎక్కడుండెడివాడు? బహుశః పిచ్చివాండ్ర చికిత్సాలయములో పడియుండెడివాడు! ఇట్టి పిచ్చిబోధలవలన మీరును వెడగులై పోవుచున్నారు. ఇట్టి దౌర్బల్యబోధలు చేయుట వలన మానవజాతిని నాశముచేయునట్టి ఘోరానర్థములు ప్రపంచము నందంతటను వాటిల్లుచుండుట నేను ఎఱిగియున్నాను. ఈ రీతిగా మన బిడ్డలను పెంచుచున్నను వారిలో సగము మంది మాత్రమే పిచ్చివారై పోవుట చూడగా నాకే ఆశ్చర్యము కలుగుచున్నది.

ఈ బోధ అనుష్ఠానపరుల పక్షమున చేయబడినది. కాబట్టి ఆత్మవిశ్వాసమును పూనుకొని మీకు లౌకికసంపద కావలయునెడల దానికొఱకై పాటుపడుడు. అది మీకు లభించును. మీరు మహామేధావంతులు కాగోరునెడల బుద్ధిక్షేత్రమునందు పనిచేయుడు. అప్పుడు మీరు మహామేధావులు కాగలరు. మీరు మోక్షమును కోరుదురేని అధ్యాత్మక్షేత్రమున సాధన సాగింపుడు. అప్పుడు మీరు ముక్తులై

నిర్వాణమున ప్రవేశించి నిత్యానందము ననుభవింతురు. కాని ఈ అద్వైతమతమున ఒక లోపము సంభవించినది. దాని సాధన అధ్యాత్మక్షేత్రమున మాత్రమే సాగింపబడి ఇతర క్షేత్రములు ఉపేక్షచేయబడినవి. ఇప్పుడు మీరు దానిని పూర్ణముగా ఆచరణయోగ్యము చేయవలసిన తరుణము వచ్చినది. అది ఇంకను రహస్యముగ నుండరాదు. అది ఇంకమీదట గుహలలోను, అడవులలోను, హిమాలయ ములలోను, సన్న్యాసులకడను మాత్రమే నిలిచిపోరాదు. అది ప్రజల అనుదిన జీవితక్షేత్రమునకు దిగిరావలయును. మహాసౌధములందు రాజులు దానిని అనుష్ఠింపవలెను. గుహలలోని సన్న్యాసులు, గుడిసెలలోని పేదలు, వీథులలోని యాచకులు, ఎల్లరు సర్వత్ర సర్వదా దానిని ఆచరణలో పెట్టవలెను. కాబట్టి నీవు స్త్రీ వైనను, శూద్రుడవైనను, భయపడవలదు. ఏలయన ఈ మతమును స్వల్పముగ ఆచరించిననుకూడ అత్యధిక మగు మేలు చేకూరగలదని శ్రీకృష్ణభగవానుడు చెప్పు చున్నాడు. కాబట్టి ఆర్యసంతానములారా! సోమరులుగ కూర్చుండకుడు! లెండు! మేల్కొనుడు! గమ్యము చేరు వఱకును ఆగకుడు! ఈ అద్వైతమతమును అనుష్ఠానములో పెట్టవలసినకాలము ఏతెంచినది. దీనిని స్వర్గమునుండి భూతలమునకు తీసికొనివత్తుము గాక. ఇదియే నూతన ధర్మ ప్రచారము. అదిగో ఆలకింపుడు. మన పూర్వులు దీనిని స్వర్గమునుండి పుడమికి తీసికొనిపొండని మనలను ఆదేశించు చున్నారు. మీ బోధలు ప్రపంచమంతటను వ్యాపించు గాక.

అవి సంఘశరీరమున ప్రతినాళములోనికిని చొరబాఱుగాక. అవి ప్రతివాని సమష్టిసంపదయై పరగుగాక. అవి మన జీవితములతో ఐక్యానుసంధానము పడయునుగాక. అవి మన రక్తనాళములలో ప్రవేశించి ప్రతి రక్తబిందువుతో కలిసి ప్రసరించును గాక.

ఓహో! అనుష్ఠానవేదాంతులుగా అమెరికనులు మనకన్న మిన్నలని విని మీరు విస్మయము చెందవచ్చును; కాని అది సత్యము. నేను న్యూయార్కు నగరమున సముద్రతీరమునందు నిలుచుండి వేర్వేఱు దేశములనుండి వలస వచ్చు ప్రజలను చూచుచుండెడివాడను. అణగ ద్రొక్కబడి, పీల్చి పిప్పిచేయబడి, నిరాశాహతులై, మోమెత్తి మనుజులవంక చూడజంకుచు, చిరిగి పేలికలైన నాలుగు గుడ్డల చిన్నమూటయే తమ సర్వస్వముగా అనేకులు ఆదేశమున ప్రవేశింతురు. పోలీసువాడు కాన్పింపగనే వారు భయపడి కాలిబాటను విడిచి రెండవ ప్రక్కకు పరుగిడ బోదురు. చూడుడు! ఆఱు మాసములలో ఈ పురుషులే సొగసుగా దుస్తులను ధరించి నిక్కి నిటారుగా నడచుచు ప్రతివాని ముఖమువంకను నిర్భయముగ చూచుచు సంచరింతురు! ఈ విచిత్రమగు పరివర్తనము ఎట్లు కలిగెను? ఆర్మేనియా దేశమునుండియో, మఱెచ్చటనుండియో ఒక అమెరికాకు వచ్చుననుకొనుడు. స్వదేశమున అతడు పోలిక లేకుండపోవునంతగా అణగద్రొక్కబడి యుండును. అత బానిసగా జన్మించెనని ప్రతివారును వానికి అచ్చట బోధిం యుందురు. యావజ్జీవమును అతడట్టి దీనదశలో ఉండుట

పుట్టినవని చెప్పియుండురు. అతడు కదలినను మెదలినను కాలరాచియుండురు. "ఓయి బానిసా! నీవు బానిసవై పుట్టితివి. నీ వట్లుండవలసినదే. నీ వాశాశూన్యుడవై జన్మించితివి. నిరాశాపాతుడవయి ఉండిపోవలసినదే" అని అచ్చటి ప్రతిదియు వానికి తెలిపియుండును. "నీకు ఆశలు లేవు. నిరాశుడవై, నీచదాసుడవై ఉండిపోవలసినదే" అని అచ్చటి గాలి సైతము దశదిశలనుండి వాని చెవులలో నూరిపోసియుండును. బలవంతులు వానిని పీడించి ప్రాణముల విసిగించి యుందురు. కాని అతడు న్యూయార్కు నగర వీథులయందు అడుగిడినతోడనే మాన్యరీతిని దుస్తుల ధరించిన ధీరపురుషు డొకడు ఎదురుగవచ్చి, ఆదరణ సూచకముగా చేతులు కలిపి గౌరవించును. అతడు సొగసుగా దుస్తులను ధరించియున్నను, ఇతడు ప్రాతపేలికలను ధరించియున్నను భేదమేమియు చూపడు. ఇత డింకొక అడుగు సాగిపోయి ఒక విందుల బసను కాంచును. గొప్ప గొప్ప వారు బల్లల ముందు కూర్చుండి ఫలాహారములు కైకొనుచుందురు. ఆదే బల్లచెంత వీనికికూడ ఒక ఆసనమును చూపి యజమాని ఆహ్వానించును. ఇతడు అటు నిటు సంచరించునప్పుడు వానికి నూతన జీవనము ప్రత్యక్షమగును. తానుకూడ మనుష్యులలో నొకడై మెలగ గల ప్రదేశము వాని కనులకు గోచరించును. అతడు వాషింగ్టన్ నగరమునకు పోయి అచ్చట అమెరికన్ ప్రెసిడెంటుతో చేతులు కలుపవచ్చును; అనేక దూర గ్రామములనుండి వచ్చిన ప్రజలను, కృషీవలులను చీకిరి గుడ్డలు కట్టినవారిని ప్రెసిడెంటు చేతులుజోడించి గౌర

వించుట చూడవచ్చును. అంతట వానిపై గల మాయా పటము జారిపోవును. అంతవఱకును సమ్మోహమున జిక్కి శానిసతనమునందును దుర్బలతయందును మ్రగ్గుచున్న అతడు ఇప్పుడు బ్రహ్మమై నిలుచును! ఒక్కసారిగా మేల్కొనును! ఇక లేచి మానవలోకమున తానును ఒక వ్యక్తినే యని గ్రహించును. కటకటా! ఈ మన దేశము నందో, ఇది వేదాంతమునకు జన్మక్షేత్రమైనను కూడ, మన జనసామాన్యము యుగయుగములనుండి సమ్మోహమున జిక్కి పడియున్నారు! వారిని తాకిననే మైల సోకును; వారితో కలిసి కూర్చుండిననే అశుచి పైనిబడును! ఇట్లు నిరాశాహతులై వారు పుట్టుచున్నారు! ఆశారహితులుగనే జీవితాంతము ఉండిపోవుచున్నారు! తత్ఫలముగా వారు ఇంకను పతితులై పోవుచున్నారు! మానవుడెంత అధోగతి పాలుకాగలుగునో అంత అధోగతినంది అధమాధమస్థితికి వచ్చియున్నాడు. మానవులై పుట్టి పశువులతో కలిసి నిదురింపవలసిన గతి ప్రపంచమున మఱే దేశమున గోచరించును? ఇట్టి దుఃస్థితినిబట్టి అన్యులను దూషింపబోకుడు. పామర జనులవలె పోరపడబోకుడు. ఫలితమా ఇక్కడ నున్నది. దానికారణమును ఇక్కడనే యున్నది. మన దేదోషమంతయు. లేచి నిలువబడుడు. ధైర్యము పూనుడు. దోషమునంతను మీ భుజములమీదనే వహింపుడు. ఇతరులను తిట్టుచు వారిమీద దుమ్మెత్తిపోయుచు కాలము గడుపకుడు. మీకు బాధలు తెచ్చిపెట్టిన దోషములన్నింటికిని మీరే కారకులమని ఒప్పుకొనుడు.

లాహోరు యువజనులారా! ఈ విషయమును బాగుగా గ్రహింపుడు. పరంపరాగతమై వచ్చుచున్న ఈ జాతీయ మహాదోషము మన భుజములమీద నున్నది. మనకు ఆశలు గోచరించుటలేదు. మీరు వేలకొలది సమాజములు పెట్టవచ్చును. ఇరువదివేల రాజకీయ సంఘములను స్థాపింపవచ్చును. ఏబదివేల సంస్థలను నెలకొల్పవచ్చును. కాని సమష్టిని అందఱిని గుఱించి సంకల్పము చేయగల ఆ సానుభూతి, ఆ ప్రేమ, ఆ విశాలహృదయము మీలో కొఱవడియున్నంతకాలము, వీనివలన ప్రయోజనముండదు. బుద్ధుని హృదయము మరల భారతదేశమున ప్రత్యక్షమగువఱకు, శ్రీకృష్ణభగవానుని వాక్కులు అనుష్ఠానములోనికి వచ్చువఱకు మనకు ఆశలేదు. మీరు యూరపీయనులను, వారి వ్యవస్థలను, వారి మహాసభలను ఎన్నని అనుకరింతురు గాక; కాని నా కన్నులార చూచిన ఒక కథను చెప్పెద వినుడు: ఇచ్చట యురేషియనులు అనబడు కొందఱు, బర్మీయులను కొందఱిని లండను నగరమునకు తీసికొనిపోయిరి. వారు లండనులో ఈ బర్మీయులను ప్రదర్శించి బాగుగా డబ్బు సంపాదించుకొనిరి. అంతట వీరిని యూరపుఖండమునకు తీసికొనిపోయి మీ గతి మీరు చూచుకొనుడని అచ్చట వదలివేసిరి. పాపము, వీరికి యూరపు భాషలలో ఒక్క మాటయేని తెలియదు. కాని ఆస్ట్రియాలోనుండు ఆంగ్లేయ ప్రతినిధి వీరిని లండను నగరమునకు పంపినాడు. అచ్చట వీరెఱిగిన వారెవరును లేక ఆ మహానగరమున నిరాధారులై యుండిరి. అంతట ఒక దొరసాని వీరిని గుఱించి తెలిసికొని

ఈ బర్మాదేశీయులను తన ఇంటికి తీసికొనిపోయినది. తన బట్టలను కట్ట నిచ్చినది. తన శయ్యలను, సర్వమును వారికి వాడుకోనిచ్చినది. ఈ విషయమునుగుఱించి వార్తాపత్రికలకు వ్రాసినది. చూడుడు! ఆ మరునాడే ఆ జాతియంతయు నిద్ర నుండి మేల్కొనినదైనది. ధనము ప్రవాహముగా వచ్చి పడినది. అంతట వీరికి సాహాయ్యము దొఱికినది. వీరు బర్మా చేరగలిగిరి. ఈ విధమగు సానుభూతిపై వారి రాజకీయ వ్యవస్థలు, ఇతర వ్యవస్థలు నిర్మితములై యున్నవి. కనీసము తమకొఱకేయగుగాక అచంచలములును, అపారములును అగు ప్రేమనిధు లచటకలవు! వారు ప్రపంచమునంతను ప్రేమింపక పోవచ్చును. బర్మీయులు వారికి శత్రువులే కావచ్చును. కాని ఇంగ్లాండులో మాత్రము స్వజాతీయుల యెడలను, సత్యమునెడలను, న్యాయమునెడలను, తమ వాకిటనున్న పరదేశీయుని ఆదరించు ధర్మమునెడను వారికి గొప్ప అభిమానము కలదు. పాశ్చాత్యఖండమున ప్రతి దేశమునందును, ఎంత అద్భుతముగా ఎట్టి ఆదరణతో నన్ను మన్నించిరో మీకు తెలుపనియెడల నేను కృతఘ్నుడనే యగుదును. మనలో ఉదారహృదయ మెక్కడ నున్నది? ఇచ్చట చిన్న సమష్టి పరపతిసంఘమును స్థాపింప బోదుము, వెంటనే ఒకరినొకరము మోసగించుకొను ప్రయత్నము! ఇంకనేమున్నది? మరుక్షణమే అంతయు నేలగాలును. ఆంగ్లదేశీయులను అనుకరించుటను గుఱించియు వారివలె ఒక మహాజాతిని నిర్మాణము కావించు టను గుఱించియు మీరా ప్రసంగించుట! మీకు పునాదులు

ఏవి? ఉన్నది వట్టి ఇసుక! కాబట్టి ఏ వ్యవస్థగాని ఒక్క నిమేషములో ముక్కలుచెక్కలై నేల కూలును!

కాబట్టి లాహోరు యువజనులారా! మరల నొక్కసారి అద్వైతమహాధ్వజమును లేవనెత్తుడు! ఏలయన, ఆ భగవంతుడు మీకు సర్వత్ర ప్రత్యక్షమగువఱకును అవసరమగు ఆ గాఢప్రేమ మఱొకసిద్ధాంతమున మీకు లభింపదు. ఆ ప్రేమ ధ్వజమును విస్ఫార నెగురవేయుడు. "లెండు, మేల్కొనుడు, గమ్యమును చేరువఱకు నిలువకుడు." లెండు, మరల నొక్కసారి మేల్కొనుడు! వైరాగ్యము లేనిది ఏమియు కొనసాగదు. మీరు ఇతరులకు సాయపడ గోరుదురేని మీ సంకుచితాత్మ తొలగిపోవలయును. క్రైస్తవులు చెప్పునట్లు మీరు దైవమును, ధనమును ఏకకాలమున కొలువలేరు. వైరాగ్యమును వహింపుడు. మీ పూర్వులు మహాకార్యములను నిర్వహించుటకొఱకు సంసారముల త్యజించియున్నారు. ఈ నాడును తమ ముక్తికొఱకు సంసారముల త్యాగముచేయు వారు కలరు. మీరు సర్వమును త్యాగముచేయుడు. మీ ముక్తిని సైతము త్యాగము చేసి ఇతరులకు సాహాయ్యము చేయుటకు సిద్ధముకండు. ఔను, మీరు మహాధీరవచనములను సదా పల్కుచుందురు. కాని ఇప్పుడు కావలసినది అనుష్ఠానవేదాంతము! లెండు, మీ అల్పజీవితములను బలి యొసగుడు. మీరు తిండిలేక చచ్చినను అది ఏపాటిది? మీరును, నేనును, మనబోటి వేయిమందియు మనజాతి సజీవమైయుండుటకొఱకు నలిగి బలియైన నేమి? ఇదిగో, జాతి అధోగతిని పడిపోవుచున్నది.

లక్షలకొలది ప్రజల లెక్కకుమీరిన శాపములు మన తలల మీద పడుచున్నవి. దప్పిచే అల్లాడుచు దాహమడుగగా దాపున వినిర్మల జీవనదీప్రవాహములు చూపట్టుచున్నను ఎవరికి మనము మురికిగుంటల నీరు నొసంగుచున్నామో, అష్టైశ్వర్యములు మనకు కనులఎదుట గోచరించుచుండగా లక్షలకొలంది ఆకొని చచ్చుచున్నను ఎవరిని ఉపేక్షించు చుంటిమో, నోటిమాటలతో అద్వైతమునుగురించి బోధలు చేయుచు ఏ అసంఖ్యాకజనులను మనశక్తికొలది ద్వేషించు చుంటిమో, కోట్లకొలదిగనున్న ఏ నరులను హింసించు కొఱకు మనము లోకాచారసూత్రములను కల్పనచేయు చుంటిమో, నిఖిలభూతములు ఏకమనియు, ఎల్లరము ఒకే భగవానుని అంశముతో జన్మించితిమనియు సిద్ధాంతవాక్కు లను పల్కుచు వీసమైనను ఆచరణలేక ఎవ్వరిని మనము మోసగించుచుంటిమో అట్టి సోదరుల శాపములు మన నెత్తిపై పిడుగులవలె పడుచున్నవి! స్నేహితులారా! సర్వమును మీా మనస్సున కలదనుచున్నను లేశమైనను ఆచరణయందు లేకుండుటయేల? ఈ మచ్చను తొలగించుకొనుడు. లెండు, మేల్కొనుడు. ఈ స్వల్ప ప్రాణము పోయినను లెక్కఏమి? ప్రతివాడును చావవలసినదే గదా! మహాఋషియు మహా పాపియు, అత్యంతధనికుడును అత్యంతదీనుడును, చివరకు మరణింపక తప్పదు గదా! ఎట్టివారికిని శరీరము శాశ్వతమై నిలువజాలదు. లెండు, మేల్కొనుడు. కపటము విడిచి నిల [illegible] మన కపటవర్తనము ఘోరముగా పెరిగి పోయినది.

లక్షలకొలది ప్రజల లెక్కకుమీరిన శాపములు మన తలల మీాద పడుచున్నవి. దప్పిచే అల్లాడుచు దాహమడుగగా దాపున వినిర్మల జీవనదీప్రవాహములు చూపట్టుచున్నను ఎవరికి మనము మురికిగుంటల నీరు నొసంగుచున్నామో, అష్టైశ్వర్యములు మనకు కనులఎదుట గోచరించుచుండగా లక్షలకొలంది ఆకొని చచ్చుచున్నను ఎవరిని ఉపేక్షించు చుంటిమో, నోటిమాటలతో అద్వైతమునుగుఱించి బోధలు చేయుచు ఏ అసంఖ్యాకజనులను మనశక్తికొలది ద్వేషించు చుంటిమో, కోట్లకొలదిగనున్న ఏ నరులను హింసించు కొఱకు మనము లోకాచారసూత్రములను కల్పనచేయు చుంటిమో, నిఖిలభూతములు ఏకమనియు, ఎల్లరము ఒకే భగవానుని అంశముతో జన్మించితిమనియు సిద్ధాంతవాక్కు లను పల్కుచు పీసమైనను ఆచరణలేక ఎవ్వరిని మనము మోసగించుచుంటిమో అట్టి సోదరుల శాపములు మన నెత్తిపై పిడుగులవలె పడుచున్నవి! స్నేహితులారా! సర్వమును మీా మనస్సున కలదనుచున్నను లేశమైనను ఆచరణయందు లేకుండుటయా? ఈ మచ్చను తొలగించుకొనుడు. లెండు, మేల్కొనుడు. ఈ స్వల్ప ప్రాణము పోయినను లెక్కఏమి? ప్రతివాడును చావవలసినదే గదా! మహాఋషియు మహా పాపియు, అత్యంతధనికుడును అత్యంతదీనుడును, చివరకు మరణింపక తప్పదు గదా! ఎట్టివారికిని శరీరము శాశ్వతమై నిలువజాలదు. లెండు, మేల్కొనుడు. కపటము విడిచి నిల బడుడు. మన కపటవర్తనము ఘోరముగా పెరిగి పోయినది.

మన కిప్పుడు కావలసినది శీలము. యమునికుండు పాశ ముతో, పూనిన కార్యమును పట్టువిడువకుండ నిర్వహించు దీక్షయు శీలమును మనకు అవసరములై యున్నవి.

"ఘనులు దూషింతురు గాక, లేక భూషింతురు గాక; ఈ దినమున లక్ష్మి వచ్చుగాక, లేక పోవుగాక; మరణము తత్క్షణమే సంభవించుగాక, లేక నూరేండ్లవఱకు అగు గాక; ధర్మమార్గమునుండి ఒక్క అడుగైనను తప్పివేయనివాడే సత్యముగా సాధుపుంగవుడగును." కాన లెండు, మేల్కొనుడు. కాలము గతించిపోవుచున్నది; మన సామర్థ్యమంతయు వ్యర్థపు ప్రసంగములతో వృథయై పోవుచున్నది. లెండు, మేల్కొనుడు. క్షుద్రవిషయములను అల్పాంశములగూర్చి వాదులాటలను, స్వల్పసిద్ధాంతములగూర్చిన పోట్లాటలను, దూరముగ నెట్టివేయుడు. మనము నిర్వహింపవలసిన మహా కార్యము కలదు. కోట్లకొలదిజనము నశించిపోవుచున్నారు. మహమ్మదీయులు మొట్టమొదట భారతదేశమునకు వచ్చి నప్పుడు, ఇక్కడి హిందువుల సంఖ్య ఎంత ఎక్కువగా నుండెనో ఈ నాడు వారి సంఖ్య ఎంత పలుచబడిపోయెనో గమనింపుడు. దినదినము హిందువులు తగ్గిపోవుచున్నారు. తుదకు పూర్తిగా అదృశ్యమై పోగలరు. వారు అదృశ్యులై పోయినను పోవుదురుగాక. కాని వారియందు ఎన్ని దోషములున్నను వారు ఎన్ని అపార్థకల్పనములు చేయు చున్నను ఏ మహాద్భుత భావరాజములకు వారింకను ప్రతి నిధులుగ నున్నారో అయ్యవి వారితోడనే నశించిపోగలవు. సమస్త ఆధ్యాత్మిక విద్యలకును, శిరోభూషణమగు అద్వైత

సిద్ధాంతము వారితోడనే వినాశమైపోగలదు. కాబట్టి ప్రపంచ పారమార్థికతను సంరక్షించుటకై ఉద్బాహువులతో లెండు, మేల్కొంచుడు. మొట్టమొదటగా మీా మాతృదేశమునకు దానిని అనుష్ఠానముచేయుడు. మన కీనాడు కావలసినది కేవలమగు ఆధ్యాత్మికత కాదు. ఈ వ్యవహార ప్రపంచములోనికి అద్వైతమును కొంచెము ప్రవేశపెట్టవలెను. ఇది ప్రధానము. మొట్టమొదటిది భుక్తి; ఆ తరువాతిది ముక్తి. దరిద్రులు తిండిలేక మాడుచుండగా వారికి మితిమీారిన మతబోధ చేయుచుందురే! ఎన్ని సిద్ధాంతములైనను ఆకలిబాధను నివారింప గల్గునా? మనకు రెండు దౌర్భాగ్యములున్నవి. మొదటిది మన దుర్బలత; రెండవది విద్వేషపూరితమగు శుష్కహృదయము. నీవు లక్షలకొలది సిద్ధాంతములను గురించి ప్రసంగములు చేయవచ్చును; కోట్లకొలది సంప్రదాయములను బయలుదేరదీయ వచ్చును. కాని నీ హృదయమునందు ఆదరభావము పుట్టువరకును అంతయు వ్యర్థమే! వేదము బోధించునటుల వారు నీలో కలిసిపోయి నీశరీరాంగములలో వారును చేరిపోవువరకు, నీవును వారును దరిద్రులును ధనికులును పండితులును పామరులును అందరును నీవు బ్రహ్మమని పేర్కొనెడు ఆ అద్వితీయాఖండ పరమాత్మయందు అంశభూతములై పరగువరకు, వారిపై నీ సానుభూతిని పెంపుచేయుము.

ఆర్యులారా! ఆ అద్వైత సిద్ధాంతముయొక్క ప్రధానములగు దివ్యాంశములను కొన్నిటిని మీాకు తెలుపు [illegible]ప్రయత్నించితిని. ఆ అద్వైతమును ఆచరణలో పెట్టు

తరుణము వచ్చినది. దానిని ఈ దేశమునందే కాక ఎల్లెడలను ఆచరణలో పెట్టవలసి యున్నది. ఆధునిక శాస్త్రము తన సమ్మెటపోటులతో ప్రతిచోటను ద్వైత మతపు గాజు పునాదులను పొడిపొడిచేసి వేయుచున్నది. ద్వైతులు శాస్త్రవాక్యములను ఇంకను సాగతీయుటకు వీలు కనుపించునంతవఱకు వానిని పట్టి లాగులాడుట ఇక్కడనే కాదు — ఈ శాస్త్రవాక్యములు కేవలము "ఇండియా రబ్బరు" మాత్రమే కాదు గదా—వారు తాము సురక్షితముగా దాగి కొనుటకు సందుగొందులను మారుమూలలను వెదుకులాడుట ఇక్కడనే కాదు; ఇంతకంటె ఎక్కువగనే యూరపునందును అమెరికాయందును గూడ కలదు. మన భారత దేశమునుండి అక్కడికి గూడ ఈ అద్వైతభావము కొంత వ్యాపింపవలసి యున్నది. అది ఇదివఱకే పోయినది. కాని అది పెరిగి వృద్ధికాంచవలసియున్నది. అది వారి నాగరికతలనుకూడ సంరక్షింపవలయును. పాశ్చాత్యదేశములయందు ప్రాత విషయములు కనపడకుండపోయి క్రొత్తక్రొత్త విషయములు తలలెత్తుచున్నవి. స్వర్ణారాధనములు ధనపూజలు హెచ్చు పెరుగుచున్నవి. స్పర్ధ, ధనార్జనము, అనెడు నవీన సిద్ధాంతము కంటె ఎంత మోటుదైనను పూర్వపు మత సిద్ధాంతమే మంచిది. ఎంత బలముగలదైనను అటువంటి పునాదులమీద నిర్మితమైన ఏజాతియు నిలువజాలదు. అట్టి పునాదులు కలవన్నియు నశించి ఊరు పేరు లేకుండ పోయె నని ప్రపంచచరిత్ర బోధించుచున్నది. అట్టి వెల్లువ ఈ భారత దేశముమీదికి వచ్చిపడకుండ మనము మొట్టమొద

టగా ఆపవలయును. కాబట్టి ఈ ఆధునిక శాస్త్రముతీయు దెబ్బలనుండి మతమును కాచుకొనుటకై ఎల్లరకును ఈ అద్వైతమును బోధింపుడు. అంతియే కాదు. మీరు ఇతరు లకు సాహాయ్యము చేయవలయును. మీ వేదాంతము అమెరికా యూరపుల చిక్కులు తీర్పగలదు. అన్నిటికంటె ముఖ్యముగా ఆచరణరూపమైన పని చేయవలసిన ఆవశ్యకత ఈ దేశమున కలదని ఇంకొకసారి మీకు జ్ఞప్తి చేయు చున్నాను. అందు మీరు పూనవలసిన మొట్టమొదటి యంశముగ, అధోగతిపాలై పోవుచున్న కోట్లకొలది దీన జనుల దరికి పోవలయును. శ్రీకృష్ణభగవానుని యీ వాక్యమును మననముచేసికొనుచు వారిని చేయి పట్టుకొని నడపవలెను :

"ఇహైవ తైర్జితః సర్గో ఏషాం సామ్యే స్థితం మనః
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాత్ బ్రహ్మణి తే స్థితాః"

అనగా బ్రహ్మము నిర్మలుడును సర్వసముడును అగుటచేత సర్వసమత్వ భావమును మనసున స్థిరమొనర్చువారు ఈ జన్మయందే సంసారమును జయించుచున్నారు. కావున అటువంటివారు బ్రహ్మమునందే జీవించుచున్నారు.

వేదాంతమతము

1897 సంవత్సరము, డిశంబరు 20 తేదీ, ఖేత్రీ నగరమునందు శ్రీవివేకానందస్వాములవారు తాను బసదిగి యున్న మహారాజావారి భవనమునందు వేదాంత మతమును గుఱించి ఉపన్యాసము చేసిరి. ఆ సభకు అధ్యక్షత వహించిన మహారాజావారు శ్రీస్వాములవారిని సభ్యులకు ఎఱుక చేసిరి. అంతట శ్రీవారు గంటన్నరకు పైగా ఉపన్యసించిరి. శ్రీస్వాములవారు మహోత్సాహముతో మాటాడిరి. కాని ఆ యుపన్యాసము నంతను ఆమూలాగ్రముగ వ్రాయుటకు సంక్షిప్తలేఖరి లేకపోవుట విచారకరము. అందువలన ఆ సమయమున గుర్తుగ వ్రాసికొనిన ఉపన్యాసాంశముల యాధారమున ఈ క్రింది సారాంశమును మాత్రమే తెలుప గలుగుచున్నాము.

ప్రాచీన జాతులలో గ్రీకుజాతి, ఆర్యజాతి, అనెడు మహాజాతులు రెండు భిన్న భిన్న వాతావరణములలో, పరిస్థితులలో, వర్ధిల్లినవి. సృష్టిలోని సుందరమును, మధుర మును, ఆకర్షవంతమును అగు సర్వమును గ్రీకుజాతిని ఆవరించి వెలసినది. అచటి శీతోష్ణస్థితి బలప్రవర్ధకముగ నుండెను. ఆర్యజాతిని ఆవరించి అన్నివైపులను గంభీర దృశ్యములు వెలసినవి. శరీర పరిశ్రమకు మిక్కిలి అనుకూలముకాని శీతోష్ణస్థితిలో ఈ జాతి పుట్టి పెరిగినది. ఇట్లీ రెండు జాతులును రెండు విశిష్టములును భిన్నములును అగు నాగర

కాదర్శములను పెంపొందించినవి. గ్రీకులు చేసిన పరిశీలనము పూర్ణముగా వెలుపలి విషయముల గుఱించినది. ఆర్యులు చేసిన పరిశీలనము పూర్ణముగా అంతరవిషయములకు సంబంధించినది. ఒకరు పిండాండమును పరిశోధించిరి; రెండవ వారు బ్రహ్మాండమును పరిశోధించిరి. ప్రపంచ నాగరకతలందు ప్రతి దానికిని విశిష్టమగు కర్తవ్య మొకటి కలదు. ఒక నాగరకత మఱియొక దానిని అనుకరింపరాదు. కాని అవి తమ తమ అనుభవములను పోల్చి చూచుకొను నెడల ఉభయమును లాభము పొందును. ఆర్యులు స్వభావము చేత పృథక్కరణ ప్రియులు. వారు గణిత శాస్త్రము నందును, వ్యాకరణ శాస్త్రమునందును, అద్భుత ఫలిత ములను సాధించిరి. మనస్సును పృథక్కరించుటతో ఈ అన్వేషణము పూర్ణ పరిణామము పొందినది. పైతాగరస్సు, సోక్రటీసు, ప్లేటో, ఈజిప్షియనులగు నవీనప్లేటో సిద్ధాంతులు రచించిన గ్రంథములందు భారతీయ సిద్ధాంతములయొక్క జాడలు కాన్పించుచున్నవి.

ఆ పిమ్మట భారతీయ విద్యలయొక్క ప్రభావము యూరపునందు ఎటుల వ్యాపించినదో వివరముగ తెలుపుచు ఆయా యుగములందు స్పెయిను, జర్మని మొదలగు యూరపు దేశములు ఎటుల మహోపకారములు పొందినవో స్వామివారు విశదీకరించిరి. భారతీయ రాజకుమారుడగు దారాషేకో ఉపనిషత్తులను పారసీక భాషలోనికి అనువ దించినాడు. ఆ గ్రంథముయొక్క లాటిను భాషానువాదము షోపెన్‌హోరుగారికి లభించి యున్నది. వారి తత్త్వ

సిద్ధాంతము వానిని అనుసరించినది. దాని తర్వాత కాంటు యొక్క తత్త్వశాస్త్రమునందు ఉపనిషద్భోధలయొక్క జాడలు గోచరించు చున్నవి. యూరపునందు ఆయా తత్త్వశాస్త్రముల తారతమ్యము కనుగొనుటయందు అచ్చటి పండితులకు గల అభిలాషవలన వారు సంస్కృత భాషాభ్యాసమునకు పూనుకొనిరి. కాని 'డ్యూసేను'వంటి వారు కొందరు తత్త్వశాస్త్రమునందు ప్రత్యేకాభిలాషతో సంస్కృతమును పఠించిరి.

భావికాలమునందు ఎల్లరును సంస్కృతభాషాభ్యాసము నందు ఎక్కువ అభిమానము చూపవలెనని శ్రీస్వాములవారు ఆశించిరి. తర్వాత "హిందూ" అను శబ్దము పూర్వకాలము నందు 'సింధునదికి ఆవల నివసించువారు' అని సూచించుచు సార్థకముగ నుండెననియు, ఇప్పుడు అది అర్థహీనమై పోయిన దనియు, దానివలన ఈ జాతిగాని వీరి మతముగాని సూచింప బడుట లేదనియు, సింధునదికి ఈవలివైపున భిన్న భిన్న మతములను అవలంబించు వివిధజాతులవారు ఎందరో నివ సించుచున్నారనియు తెలిపిరి.

శ్రీ స్వాములవారు అటుపిమ్మట వేదముల గురించి దీర్ఘముగ ఉపన్యసించుచు అవి ఏ నరునిచేతను రచింపబడినవి కావనియు, అవి క్రమేణ పరిణామము పొందుచు వచ్చి ఒక గ్రంథరూపముదాల్చిన దివ్యభావములనియు తెలిపిరి. ఇప్పు డా గ్రంథము ప్రమాణ గ్రంథమైనది. అనేక మతములు పుస్తకములలో నిరూపింపబడినవనియు, ఆ పుస్తకముల

ప్రభావము ఇంతింతయని చెప్పనలవికాదనియు తెల్పిరి. హిందువులకు వేదములు కలవు. వారా వేదములనే అనేక సహస్రాబ్దములు అనుసరింపవలసియున్నది. ఆ వేదముల గుఱించిన భావములు మారుచుండవచ్చును. కాని శిలామయ మగు పునాదులమీద ఆ భావములు పునర్నిర్మితములగు చుండవలయును, 'వేదము'లనగా పెద్ద గ్రంథరాశి. వానిలో నూటికి తొంబదితొమ్మిదిపాళ్లు కనబడుటలేదు. అవి కొన్ని కుటుంబముల వశమునందుండి ఆ కుటుంబముల నాశముతో అంతరించిపోయినవి. ఇప్పుడున్నవిసైతము తామున్న ఆ పెద్ద భవనములోకూడ పట్టుటలేదు. అవి పురాతనమగు భాషలో సరళముగా వ్రాయబడియున్నవి. వానియందలి వ్యాకరణము చాల అపరిష్కృతముగ నున్నది. కాబట్టి వేదములలో కొన్నిభాగములు అర్థమే యగుటలేదు.

ఆ తరువాత శ్రీస్వాములవారు కర్మకాండ, జ్ఞానకాండ అనెడు వేదములయొక్క రెండుభాగములగుఱించి విపులముగ చెప్పిరి. (1) కర్మకాండ, అనగా సంహితలు. (2) బ్రాహ్మణ ములు. బ్రాహ్మణములు యాగములనుగూర్చి తెలుపు చున్నవి. సంహితలు అనుష్టుప్పు, త్రిష్టుప్పు, జగతి మొదలగు ఛందస్సులలో వ్రాయబడిన గీతములు. ఇవి సాధారణముగ వరుణుడు, ఇంద్రుడు మొదలగు దేవతలను గూర్చిన స్తోత్ర ములుగా నున్నవి. ఈ దేవతలు ఎవరు అను ప్రశ్న బయలు దేఱినది. వానిని గుఱించి ఏవేని సిద్ధాంతములు బయలు వెడలగనే వానిని ఖండించివైచు వేఱు సిద్ధాంతములును బయలుదేఱుచునే యున్నవి.

శ్రీ స్వాములవారు అంతట పూజలను గుఱించిన వేర్వేఱుభావములను వివరించి తెలుపసాగిరి. ప్రాచీన బాబిలోనియనులు జీవుడు శరీరమునందు ఆ రూపమే తాల్చి నిండియుండుననియు, వానికి స్వతంత్రరూపము లేదనియు, అతడు శరీరమును విడిచి వేఱై యుండలేదనియు భావించెడివారు. ఈ జీవుడుకూడ ఆకలిదప్పులు అనుభవించుననియు పూర్వశరీరమునకు గల కామక్రోధాదులవంటివానినే పొందుచుండుననియు వారి నమ్మకము. పూర్వశరీరమునకు హాని కలిగెనేని ఈ జీవునకును హాని కలుగును. మొదటిది నాశమగునప్పుడు ఇదియు నాశమగును. కాబట్టి వారు మృతశరీరములను భద్రముగా కాపాడుటకు మిక్కిలి ప్రయత్నించెడివారు. ఈ రీతిగా మమ్మీలు, మసీదులు, సమాధులు వెలసినవి. ఈజిప్షియనులు, బాబిలోనియనులు, యూదులు, ఈ దేహాత్మభావనను దాటి దూరముగ పోజాలరైరి. వారికి గలిగిన ఆత్మభావన ఇంతే.

ఋగ్వేదమునందు పితృదేవతారాధన సూచనగనైనను కనబడదని ఆచార్య మాక్సుముల్లరుగారు అభిప్రాయపడిరి. దిగంబరములై మనవంక శూన్యభావముతో చూచు 'మమ్మీ'ల బీభత్సదృశ్యము అందు గోచరింపదు. అందలి దేవతలు నరునితో మైత్రిగలిగి యుండిరి. పూజితుని యొక్కయు, పూజకునియొక్కయు సంబంధము నిర్మలముగానుండెను. అందు వెగటుతనము లేదు. సంతోషమునకు కొఱంత లేదు. మందహాసమునకుగాని, నేత్రముల తేజమునకుగాని లోపము లేదు. ఈ వేదముల గుఱించి ప్రసంగించు

తఱిని దేవతల నగవులు తమకు వినవచ్చునటుల తోచునని స్వాములవారు సెలవిచ్చిరి. వేదఋషులు భాషాసౌకుమార్యము తెలియనివారు కావచ్చును. కాని వారియందు సభ్యత సౌహార్ద్రము కలవు. వారితో పోల్చినపుడు మనము పశువులమో యనునటుల దోచును. స్వాములవారు తాము చెప్పుదానికి ఉదాహరణములుగా చాల మంత్రములను చదివిరి. "వీనిని పితృదేవతలు నివసించు తావునకు, శోక దుఃఖములు లేని ఆ తావునకు తోడ్కొని పొమ్ము". ఈ విధముగా మృతశరీరము ఎంత త్వరగా దహనమైన అంత మంచిదనుభావము ఏర్పడినది. క్రమేణ ఒక సూక్ష్మశరీరము కలదనియు, అది దుఃఖము అనునది లేక కేవలానందముగల ఒకానొక తావునకు పోవుననియు వారు తెలిసికొనగల్గిరి. సెమిటిక్ జాతీయుల మతమునందు భయము, దుర్భరబాధ కాన్పించును. భగవంతుని చూచునెడల నరుడు మరణించునని వారు తలంచెడివారు. కాని ఋగ్వేదమతానుసారము నరుడు భగవంతుని ప్రత్యక్షముగ చూచునప్పుడు వాని సత్యజీవనము ప్రారంభమగును.

ఇక ఈ దేవతలు చేయుపని ఏమి? అనెడు సమస్య వచ్చినది. ఒక్కొకప్పుడు ఇంద్రుడు వచ్చి నరునకు సాయపడుచుండెడివాడు. ఒక్కొకప్పుడు ఇంద్రుడు మితిమీరి సోమపానము చేసెడివాడు. అప్పుడప్పుడు సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి మొదలగు లక్షణములు పూజారులు వానికి ఆరోపించెడివారు. వరుణుని సందర్భమునను ఇట్లే జరిగినది. ఇదేవిధముగ ఆ గ్రంథభాగము నడచినది. ఈ మంత్రము

లలో కొన్ని ఈ దేవతలను అభివర్ణించినరీతి మహాద్భుతము. ఆ భావ అత్యంతగంభీరము. ఈ సందర్భమున ప్రళయవర్ణన చేయు నాసదీయసూక్తమును (శ్రీ) స్వాములవారు చదివి "చీకటి చీకటిని కప్పివుచ్చెను" అనెడు భావము అందుండు టను తెలిపి ఇటువంటి కవనధోరణిని ఇట్టి గంభీరభావములను అభివర్ణించిన పురుషులు అనాగరికులును, అజ్ఞానులును అగు నెడల మన మేమని పిలుచుకొనవలయును? అని ప్రశ్నించిరి. ఆ మహాఋషులను, ఇంద్ర, వరుణ, ఇత్యాది వారి దేవతలను విమర్శించుటగాని, ఖండనముచేయుటగాని తమపని కాదనిరి. ఇది అంతయు ఒక విశ్వరూపదర్శనమువలె రంగము పిమ్మట రంగముగ గోచరమునకు వచ్చుచుండెను. వీనికన్నింటికిని వెనుక ఆధారముగ "ఏకం సద్విప్రా బహుధావదన్తి" (కల బ్రహ్మము ఒకటియే. దానిని ఋషులు అనేక నామములతో పిలిచిరి) అను దివ్యభావన స్థిరముగ నిలుచుచున్నది. ఈ సర్వమును అలౌకికమై, అద్భుతమై, అత్యంతసుందరమై ఒప్పుచున్నది. అది ఇప్పటికిని అసామాన్యమై, అందరానిదై తోచుచున్నది. ఆ తెర అత్యంతము సూక్ష్మమై, తాకిన మాత్రాన విచ్ఛిన్నమై, మెండమావులవలె శూన్యమున కలిసిపోవుదానివలె తోచుచున్నది.

ఇటుల చెప్పుచు ఒక విషయము స్పష్టముగా జరిగి యుండ నోపునని తెలిపిరి. అది ఏమన: ఆర్యులుకూడ గ్రీకుల వలెనే తమ సమస్యా పరిష్కారముకొఱకు బాహ్య సృష్టిని ఆశ్రయించిరి. ఆ ప్రకృతి వారిని బాహ్యమునకు ఆకర్షించి క్రమేణ సుందరమును, ప్రయోజనకరమును, అగు బాహ్య

ప్రపంచములోనికి నడపినది. కాని ఈ భారతదేశమున గంభీరతలేని దేనికిని గణ్యతలేదు. మరణరహస్యములను కనుగొనవలెననెడు అభిలాష గ్రీకులకు పొడమినది కాదు. కాని ఇక్కడనన్నో ప్రప్రథమమునుండియు "నే నెవడను ? మరణానంతరము నే నేమైపోదును ?" అను ప్రశ్న పదేపదే స్ఫురించుచున్నది. అక్కడ గ్రీకులు నరుడు మృతినొంది స్వర్గమునకు పోవునని భావించిరి. ఈ స్వర్గమునకు పోవుట అనగా నేమి ? ప్రతి దానిని విడిచి వెలువడి పోవుట అని వారి భావన. ఆంతర్యమున ఏమియు లేదు. సర్వమును వెలుపలనే యున్నది. ఇటుల తలంచి గ్రీకు దేశీయుడు బాహ్యమునకు తన అన్వేషణమును త్రిప్పినాడు. ఇంతేల ? తాను సైతము తనకు వెలుపలనే యున్నటుల భావించె ననవచ్చును. అతడు ఈ లోకమువంటిదే అయి దుఃఖము మాత్రము లేని స్థలమునకు పోయిన యెడల తన ఈప్సితము లన్నియు నెఱవేరి తృప్తికలుగునని విశ్వసించినాడు. అంతటితో మతమును గుఱించిన వాని భావములన్నియు ఆగిపోయినవి. కాని ఇది హిందువుయొక్క మనస్సునకు తృప్తికరముగ తోచలేదు. వాని పరిశోధనయందు ఈ స్వర్గములన్నియు భౌతిక జగత్తులోపలనే ఇమిడియున్నవి. "ఏయ్యది ద్రవ్యసమ్మేళనముచేత నేర్పడునో అది విచ్ఛిన్నమై మరణించు"నని హిందువులు భావించిరి. నీవు ఆత్మను ఎఱుంగుదువా ? అని బాహ్యప్రకృతిని వారడిగిరి. నాకు తెలియదు అని ఆ ప్రకృతి బదులు చెప్పినది. దేవుడు కలడా? [illegible] అడుగగా నే నెఱుంగనని ప్రకృతి ప్రత్యుత్తరమిచ్చినది.

అంతట వారు ప్రకృతినుండి మరలిపోయిరి. ఈ బాహ్య ప్రకృతి యెంత గొప్పదైనను అది దేశకాలములలో బంధింపబడినదే యని వారు గ్రహించిరి. అంతట ఇంకొక వాణి వినవచ్చినది. నవీనములగు దివ్యభావములు వారి మనస్సులందు ఉదయించినవి. "నేతి, నేతి" (ఇది కాదు, ఇది కాదు) అని ఆ వాణి పలికినది. ఆ యా దేవతలందఱును ఒక్కటిగా మాఱిపోయిరి. సూర్యులు చంద్రులు నక్షత్రములు ఇంతేల, బ్రహ్మాండమంతయు ఒక్కటై పోయెను. శ్రోత్రియ ఈ ఆధ్యాత్మికాదర్శముపై మతమును నిర్మించిరి.

"న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం।
నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః॥
తమేవ భాన్తమనుభాతి సర్వం।
తస్య భాసా సర్వమిదం విభాతి॥"

(అచ్చట సూర్యుడు ప్రకాశింపడు; చంద్రుడు ప్రకాశింపడు; నక్షత్రములును ప్రకాశింపవు, మెఱుపు సైతము ప్రకాశింపదు. ఇక ఈ అగ్నిని గుఱించి చెప్పవలసినదేమి? అతడు ప్రకాశింపగా సర్వమును ప్రకాశించుచున్నది. వానిద్వారమున సమస్తమును ప్రకాశించును). ఇక ఆ పరిమేయమును మూఢమునగు సగుణభావన అక్కడ నిలువలేదయ్యె. పుణ్యపాపముల విచారణ చేయుచు కూర్చుండు దేవతలయొక్క అల్పభావన ఇంక అక్కడ కానరాదు. వెలుపల సాగిన అన్వేషణము ఇక కట్టుపడినది. అంతటినుండి ఆ అన్వేషణము అభ్యంతరమునకు తిరిగినది. ఈ విధముగా ఉపనిషత్తులు

మన దేశమునకు బైబిలుగా నేర్పడినవి. ఈ ఉపనిషత్తులు బహువిశాలమగు వాఙ్మయము. భారత దేశములోని వివిధ సిద్ధాంతములుగల సంప్రదాయము లన్నియు ఉపనిషత్తు లనెడు పునాదులమీదనే నిర్మితములైనవి.

అంతట శ్రీస్వాములవారు ద్వైత అద్వైత విశిష్టా ద్వైతములను తీసికొని వీనిలో ప్రతిదియు వేఱొకదానిని చేరుటకు గడవవలసిన సోపానమువలె నుండెనని చెప్పి వానికి సమన్వయము కూర్చిరి. తుదిని అద్వైతముగా పరిణమించుట సహజమగు ఫలితమనియు 'తత్త్వమసి' అనునది కట్టకడపటి మెట్టు అనియు తెలిపిరి. శంకరాచార్యులు రామానుజా చార్యులు మధ్వాచార్యులు మొదలగు భాష్యకారులుసైతము పొరపాటులను చేసిరి. ప్రతివారును ఏకైక ప్రమాణ ముగా భగవద్గీతలను విశ్వసించిరి. కాని అవి ఒకే విషయమును, ఒకేమార్గమును బోధించుననుకొనిరి. అటుల శంకరాచార్యులవారు అద్వైత సిద్ధాంతమనెడు ఒకేవిషయ మును ఉపనిషత్తులన్నియు బోధించుననియు, ఇతరము నేమాత్రమును బోధించుట లేదనియు ఊహించుటలో పొర పడిరి. కాబట్టి ఎక్కడెక్కడ స్పష్టముగా ద్వైతపరమగు వాక్యము కాన్పించినను, ఆయన తన సిద్ధాంతమును బల పఱచునట్టి అర్థము వచ్చునటుల దానిని తికమకలు చేసినాడు. స్పష్టముగా అద్వైతపరములగు వాక్యములు వచ్చినప్పుడు రామానుజాచార్యులవారును మధ్వాచార్యులవారును అటులే చేసిరి. ఉపనిషత్తులు ఒకే విషయమును బోధించుననుట సత్యమే! కాని ఒక మెట్టునుండి మఱొక మెట్టునకు ఎక్కి

పోయినట్లు విషయమును క్రమపరిణతముగా అవి నిరూపించు చున్నవి. ఆధునిక భారతదేశమున అధ్యాత్మభావము అంతరించిపోయి బాహ్యకర్మలుమాత్రము నిలిచియుండుటను గుఱించి స్వామివారు విచారమును దెలిపిరి. ప్రజలు హిందువులు కారు; వేదాంతులును కారు; వారు "నన్ను తాకకు" అను సంప్రదాయమువారై పోయిరి. వారికి వంటయిల్లే దేవాలయము; కూటి కుండలే దేవతలు. ఇట్టి దుర్దశ అంతరింపవలయును. దానిని మనము ఎంత త్వరలో త్యజించిన మన మతమునకు అంత మేలు! ఉపనిషత్తులను వాని స్వకీయ తేజస్సుతో ప్రకాశింపనిండు. వేర్వేఱు సంప్రదాయములమధ్య పోట్లాటలను అంతరింప చేయుడు.

శ్రీవారు జబ్బుగానుండుటచేత ఇంతవఱకు మాటాడు సరికి అలసిపోయిరి. కాబట్టి (శ్రీ)వారు ఒక అరగంటసేపు విశ్రాంతి తీసికొనిరి. అంతసేపును సభ్యులు ఉపన్యాసము యొక్క మిగతభాగము వినుటకొఱకై చాల ఓపికతో వేచి యుండిరి. పిమ్మట (శ్రీ)వారు వెలుపలికి వచ్చి ఒక అరగంట సేపు మరల మాటాడిరి. జ్ఞానమనగా భిన్నత్వమున ఏకత్వ మును కనుగొనుటయే యనిరి. ప్రతి శాస్త్రముయొక్క పరమావధియు సర్వవిధభిన్నత్వమునకును వెనుకనుండు ఏకత్వమును కనుగొనుటే. ఈ యంశము భౌతికశాస్త్రమం దెటులో ఆధ్యాత్మికశాస్త్రమునందును అటులే పరమ సత్యము అని తెలిపిరి.

ఇంగ్లండులో భారతీయాధ్యాత్మిక భావనా ప్రాబల్యము

1898–వ సంవత్సరము మార్చి 11–వ తేది కలకత్తాయందలి స్టార్ థియేటర్‌లో సోదరిని వేదిత (మిస్. ఎం. ఇ. నోబెల్) పై విషయమునుగూర్చి ఉపన్యసించిరి. ఆ సభకు అధ్యక్షతవహించిన శ్రీమద్వివేకానందస్వాములవారు మిస్ నోబెల్‌ను సభ్యులకు పరిచయము చేయుచు ఇట్లుప్రసంగించిరి.

నేను ఆసియాఖండపు ప్రాచ్యదేశములలో పర్యటించుచున్నప్పుడు ముఖ్యముగా ఒక్క విషయమునుగాంచి చకితుడనైతిని. ఆ దేశములలో నెల్ల భారతీయాధ్యాత్మికభావములు నేటికిని మిక్కిలి ప్రచారమునం దున్నవి. చైనా, జపాను దేశములలో దేవాలయకుడ్యములపై సుప్రసిద్ధములగు కొన్ని సంస్కృతమంత్రములు లిఖింపబడియుండుట చూచినపుడు నేనెంత ఆశ్చర్యపడియుందునో మీరూహించుకొనవచ్చును. ఆ మంత్రములన్నియు ప్రాచీన వంగభాషాలిపియం దున్నవి. ఈ విషయము మీకు మఱింత ప్రీతిని కల్గింపగలదు. మన తాత ముత్తాతల మహాశక్త్యుత్సాహములకు స్మృతిచిహ్నములుగా అవి నేటికిని అట్లే నిలిచియున్నవి.

ఆసియా దేశములందే కాక భారతీయాధ్యాత్మికభావములు సర్వత్రవ్యాపించియుండె ననుటలో సంశయము లేదు. [illegible] పాశ్చాత్యదేశములందు సైతము నేటికిని వాని

ప్రభావపుజాడలు, కొంచెము తఱచిచూడ, నాకు కాన్పిం చినవి. భారతీయుల ఆధ్యాత్మిక భావములు పూర్వకాలమున ప్రాక్పశ్చిమములకు వ్యాపించెననుట చారిత్రక సత్యము. ప్రపంచము భారతీయాధ్యాత్మికత కెంత ఋణపడియున్నదో, భూత, వర్తమాన కాలములందు ఆ ఆధ్యాత్మిక శక్తులకు విశ్వమానవ సమాజముపై ఎంతటి ప్రభావముకలదో ఎల్లరకు తెలియును. ఇవియెల్ల గతించిపోయిన విషయములు. నేను మఱియొక విశిష్టవిషయమునుగూడ గ్రహించితిని. అది నాగరికతా మహాశక్తుల విజృంభణమునకు, మానవతా వికాసమునకు, సాంఘికాభ్యుదయమునకు ఆ ఆంగ్లోసాక్సన్ జాతి—ఆ అద్భుతజాతి—చేసిన మహాకృషి! ఆ ఆంగ్లోసాక్సన్ జాతి అట్టి కృషి సల్పకుండియేయున్నచో మన మీనాడు ఇచ్చటచేరి యీ విషయమునుగూర్చి యీ విధముగా చర్చిం చుటయే సంభవించియుండెడిది కాదని నేను మీకు స్పష్ట ముగ చెప్పుచున్నాను. మనదేశమునందు సైతము ఈ ఆంగ్లోసాక్సన్ శక్తుల ప్రభావము కానవచ్చుచున్నది. ఆ శక్తు లలో కొన్ని లోపములున్నను తమ సహజ విశిష్టలక్షణముల నట్లే నిలుపుకొని సత్ఫలితములనే సాధించినవి. ఆంగ్లేయుల 'వ్యాప్తి', 'అభ్యుదయము' అనెడు భావములు నేడు మనపై నెక్కువగ పనిచేయుచున్నవి. ఈ సందర్భమున మన మొక్క విషయమును జ్ఞప్తియందుంచుకొనవలయును. పాశ్చాత్యుల నాగరకతయంతటికిని గ్రీకు నాగరకతయే ఆధారము. ఆ గ్రీకుల మహానాగరకత యందలి ప్రముఖలక్షణము 'వ్యక్తీకరణము'. ఇక్కడ, భారతదేశమున, మనము ఆలోచింతుము. దుర

దృష్టవశమున ఒక్కొక్కప్పుడు మన ఆలోచన మఱింత తీవ్రమై వ్యక్తీకరించు శక్తి శూన్యమైపోవును. ఇందుచే క్రమముగా లోకమునెదుట మన వ్యక్తీకరణశక్తి అదృశ్యమైపోయినది. తత్ఫలితమేమో తెలియునా? మనకున్న ప్రతిదానిని దాచుకొనుటకే మనము ప్రయత్నించుచు వచ్చితిమి. వ్యక్తులతో ప్రారంభమైన ఈ దాపరికము చివరకు జాతీయ లక్షణముగా పరిణమించినది. తత్ఫలితముగా నేడు మన మొక మృతజాతిగా పరిగణింపబడుచున్నాము. వ్యక్తీకరణశక్తి లేక ఏ జాతిగాని జీవించుటెట్లు ? వ్యాప్తి, వ్యక్తీకరణము అనునవి పాశ్చాత్యనాగరకతకు వెన్నెముకవంటివి. ఇప్పుడు ఆంగ్లోసాక్సను జాతి మన దేశములో భారతజాతి స్వయంవ్యక్తమగునట్లు చేయుచున్నది. భారతదేశమునం దింతకాలముగ గుప్తమైయున్న అపారనిధులను ప్రపంచమునెదుటకు తెచ్చుటకై ప్రయత్నించుచున్నది. ఇందుల కవసరమైన సాధనసంపత్తినికూడ ఆ జాతియే సమకూర్చుచున్నది. ఆ జాతియే మన హిందూదేశమున కొక భవిష్యత్తును సృష్టించినది. మన ప్రాచీనుల భావరాశి ఇప్పుడెచ్చటెచ్చట వ్యాపించియున్నదో సులభముగనే దృగ్గోచరమగుచున్నది. నిజమునకు మనపూర్వులు సత్య, నిర్వాణములగూర్చిన తమ సందేశములను దిగంతవ్యాప్త మొనర్చినపుడు వారికే సౌకర్యము లుండినవి? బుద్ధభగవానుడు ఉదాత్తమగు తన విశ్వమానవ సౌభ్రాత్ర సిద్ధాంతమును ఎట్లు బోధింపగలిగెను? ఆనాడుకూడ మన దేశమున సత్యమగు ఆనందమును పొందుటకు వెత్తు మార్గములుండెను. మనము మన భావములను

వ్యాప్తిగావించుటకు అనేక సౌకర్యములుకూడ నుండెను. ఇప్పుడు మనకు ఆంగ్లోసాగ్జన్ జాతితోకూడ సంబంధ మేర్పడినది. నేడు మనసందేశములను లోకమెల్ల వినుచున్నది. వినుటయేకాదు, విని స్పందించుచున్నది. ఇంగ్లండుదేశము తన మహామేధావులను కొందఱను మనకు కర్తవ్య నిర్వహణమున సాయపడుటకై అప్పుడే పంపినది. ఇప్పుడు ఈ వేదికపై ఆసీనురాలై యున్న నా మిత్రురాలు మిస్ ముల్లర్‌నుగూర్చి మీరెల్లరు వినియేయుందురు. మీలో కొంతమందికి ఆమె పరిచితురాలుకూడనేమొ. ఆంగ్లదేశమున ఒక సత్కుటుంబమున జన్మించి విద్యావతియైన ఈమె మన జాతిపైగల అభిమానముచే మనదేశమును తన స్వగృహముగ, సంసారముగ చేసికొని తన జీవితసర్వస్వమును మనకొఱకు ధారవోయుచున్నది. ఈ విధముగనే భారతదేశ శ్రేయస్సునకును, భారతజాతి పునరుజ్జీవనమునకును తన యావజ్జీవితమును అంకితముచేసిన మఱొక ఉత్తమాంగ్ల వనితనుగూర్చి నేను మీకు చెప్పనక్కరలేదనుకొందును. ఆమెయే మిసెస్ బెసెన్ట్. ఈ కర్తవ్యనిర్వహణమునకే కంకణము కట్టుకొన్న మఱి యిద్దఱు అమెరికన్ మహిళామణులుకూడ ఈ సభా వేదికపై కూర్చుండియున్నారు. మన నిర్భాగ్యదేశమునకు ఏ కొలదిపాటి మంచినైనను చేయుటకై తమ జీవితమెల్ల కృషిసల్పుటకు వారు సంసిద్ధముగనున్నారు. ఈ సందర్భమున ఇంగ్లండు, అమెరికా దేశములందు పర్యటించిన మన దేశీయు నొకనిగూర్చి మీకు జ్ఞప్తి చేయవలసియున్నది. అతనియెడ నాకు అపారమగు ప్రేమ, భక్తి,

విశ్వాసములు కలవు. అతడీ సభకు వచ్చియుండెడివాడే. కార్యాంతరముండుటచే రాలేకపోయినాడు. ఉన్నత ఆధ్యాత్మికపరుడగు ఆ వ్యక్తి మన దేశ పురోభివృద్ధికై నిరాడంబరముగా, నిరంతరము కృషిసల్పుచున్నాడు. ఆయనపేరు మోహినీమోహనచటర్జీ. ఆంగ్లదేశము మిస్ మార్గరెట్ నోబెల్ రూపమున ఒక క్రొత్త బహుమతిని పంపినది. ఈమెయెడ నాకెక్కువ గౌరవముకలదు. ఇంక నేనేమియు ఎక్కువ ప్రసంగింపక మిస్ నోబెల్‌ను ఉపన్యసింప వలసినదిగా కోరుచు నా పరిచయవాక్యములను ముగించుచున్నాను.

సోదరి నివేదిత తన గంభీరోపన్యాసమును గావించిన పిమ్మట స్వాములవారు లేచి యిట్లు చెప్పిరి :

నేను చెప్పవలసినది కొంతమాత్రమే ఉన్నది. భారతీయులమగు మనము ఏదోకొంత సాధింపగలమను భావము మనకున్నది. ఈ భావము వంగదేశీయులకు హాస్యాస్పదముగా నుండవచ్చును. కాని నాకుమాత్రము హాస్యాస్పదముగ గన్పట్టుటలేదు. మీలో ఒకసంచలనము కలిగించుటయే నా జీవితలక్ష్యము. నీవు ద్వైతివైనను విశిష్టాద్వైతివైనను అద్వైతివైనను లెక్కలోనిది కాదు. కాని ఎల్లప్పుడు విస్మరింపబడుచున్న ఒక్కవిషయమువైపు మీ దృష్టిని మరల్పుడు. — "మానవుడా! ఆత్మవిశ్వాసము కలిగి యుండుము!" ఆత్మవిశ్వాస మున్నప్పుడే భగవంతునిపై మనకు విశ్వాస మేర్పడును. నీవు ద్వైతివి కావచ్చును; అద్వైతివి కావచ్చును. యోగసాధనముపై నీకు నమ్మక

ముండవచ్చును; లేదా శంకరాచార్యుల పద్ధతియందు నమ్మిక ముండవచ్చును. వ్యాసవిశ్వామిత్రులలో ఎవరినైనను అనుసరింపవచ్చును. అదియెల్ల అప్రస్తుతవిషయము. ఈ విషయమున భారతీయ దృక్పథము ప్రపంచములోనికెల్ల విభిన్నమైనదని మనము గమనింపవలయును. ప్రపంచములోని ప్రతిదేశమందును, మతమునందును ఆత్మశక్తి నిర్లక్ష్యము చేయబడినది; ఆత్మ శక్తి లేనిదిగను, బలహీనమైనదిగను, అచేతనమైనదిగను భావింపబడినది. భారతీయులమగు మనము ఆత్మను శాశ్వతమైనదానినిగా భావింతుము. శాశ్వతమేగాక దోషరహితమనియు తలంతుము. ఉపనిషద్వాక్యములనే మన మెల్లప్పుడు ప్రమాణముగ గ్రహింపవలయును.

జీవితమున మీ కర్తవ్యమును విస్మరింపకుడు. భారతీయులు—విశేషించి వంగదేశీయులు — విదేశభావములకు దాసులై మనమతపుటాయువుపట్లనే పెకలించివైచుచున్నారు. ప్రస్తుతము మన మెందుకింత వెనుకబడియున్నాము! మనలో నూటికి తొంబదితొమ్మిదిమంది విదేశభావప్రభావములకు ఎందుకు లోనైయున్నారు? మన మితరజాతుల ప్రమాణమును అందుకొనవలెనన్న ఈ దోషమును తొలగింపవలయును. మనము పురోభివృద్ధి చెందవలయునన్న పాశ్చాత్యులనుండి నేర్చుకొనవలసిన విషయములుకూడ అనేకములున్నవి. వారినుండి మనము వారి కళలను, శాస్త్రములను నేర్చుకొనవలయును. భౌతికప్రపంచ సంబంధములగు శాస్త్రములను మనము వారినుండి నేర్చుకొన్నట్లే పాశ్చాత్యులు మతమును, ఆధ్యాత్మికజ్ఞానమును నేర్చుకొని

జీర్ణము చేసికొనవలెనన్న మనదగ్గఱకు రావలసినదే. హిందూమతస్థులమగు మనము ప్రపంచమునకు ఉపదేశకులమని విశ్వసింపవలయును. రాజకీయపుహక్కులు మొదలగు వానిని పొందుటకు మనము ఆందోళన చేయుచున్నాము, మంచిదే. హక్కులు, అధికారములు మున్నగువానిని స్నేహభావముచేత మాత్రమే పొందగలము. స్నేహభావమెప్పుడును సమానులమధ్యనే యుండగలదు. ఇరువురిలో ఒకడు యాచకుడైనపుడు వారిమధ్య ఎట్టి స్నేహముండునో యూహింపుడు. పరస్పరసహకారము లేనిచో మనము గొప్పవారము కాజాలము. కావున యాచకులుగాగాక మతప్రవక్తలుగా అమెరికా, ఇంగ్లండు దేశములకు పొండు. ఒకరినుండి ఒకటి గ్రహించునపుడు సాధ్యమైనంతవఱకు దానికిబదులుగా మీకున్నదేదో యిండు. ఐహికజీవితమును సుఖవంతముచేయు మార్గములను, పద్ధతులను మనము వారినుండి నేర్చుకొనుచున్నప్పుడు శాశ్వతముక్తిపొందు మార్గములను మనము వారికేల బోధింపరాదు? అన్నిటికంటె మానవజాతి పురోభివృద్ధికై ఎల్లప్పుడు పాటుపడుడు. సంకుచితమైన మీ సనాతనాచారమునుగూర్చి గర్వింపకుడు. ప్రతివాడు మృత్యుముఖము చొచ్చుట నిజము. ఈ చారిత్రక మహోత్తరసత్యమును గుర్తుంచుకొనుడు. భారతీయవాఙ్మయమున మూర్తీభవించియున్న శాశ్వతసత్యములను గ్రహించుటకు ప్రపంచములోని అన్నిదేశములును భారతమాతృపాదములు సమాశ్రయింపవలసినదే. భారతదేశమునకు మృతిలేదు. చైనాకు మృతిలేదు. అట్లే జపానుదేశమునకును

స్మృతిలేదు. కావున ఆధ్యాత్మికతయే మన వెన్నెముకయని ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనవలయును. ఇప్పుడు నేను చెప్పుచుండిన మార్గమున పురోగమించుటకు ఒక మార్గదర్శకుడు కావలయును. ఈ విషయమును మీలోనెవరైన నమ్మనిచో, ఆధ్యాత్మికతయే తన మతమని నమ్మని హిందూబాలు డెవడైన మనలోనున్నచో వానిని నేను 'హిందువు' అని అనజాలను. కాశ్మీరదేశమున ఒక పల్లెటూరిలో నేనొక ముదుసలి మహమ్మదీయ స్త్రీతో మాటాడునపుడు నీ దేమతమని అడుగ ఆమె ముసల్మాను మతమని చెప్పెను. అట్లే ఒక హిందువును ప్రశ్నించినప్పుడు తాను హిందువునని చెప్పెను. ఈ సందర్భమున కఠోపనిషత్తులోని 'శ్రద్ధ' అను పదము నాకు జ్ఞప్తికివచ్చుచున్నది. శ్రద్ధకు నచికేతుని జీవితమొక గొప్ప ఉదాహరణము. శ్రద్ధ – సంపూర్ణవిశ్వాసము – కల్గించుటయే నా జీవితలక్ష్యము. మానవజాతికిని, అన్ని మతములకును, శ్రద్ధయే మూలకందమని నేను నొక్కి చెప్పుచున్నాను. మొదట ఆత్మవిశ్వాసము కలిగియుండుడు. ఒకటి చిన్న బుద్బుదము కావచ్చును, ఇంకొకటి పెద్ద తరంగము కావచ్చును. కాని ఈ రెంటికి వెనుక అనంతసాగరమున్నదని గ్రహింపుడు. కాబట్టి ఎవరుగాని నిరాశ చెందవలసినపని లేదు. అందఱికి ముక్తియున్నది. ప్రతివ్యక్తియు మొదట మాయనుండి విముక్తి చెందవలయును. స్థిరమైననమ్మకము అకుంఠితప్రయత్నమునకు దారితీయును. ఆ నమ్మకము మనలోనుండెనా? మానవజాతియొక్క పరమాదర్శములెల్ల

బోధింపబడిన వ్యాసార్జునులకాలమునాటి మన జాతీయజీవనమును మనము మరల పొందగలము. ఆధ్యాత్మికదృష్టిలోగాని, భావములోగాని మనము ప్రస్తుతము చాల వెనుకబడి యున్నాము. పూర్వము భారతదేశమున ఆధ్యాత్మికతకు కొఱతలేదు. అందుచేతనే నాటిజాతులలో భారతజాతి గొప్పదిగా పరిగణింపబడినది. సంప్రదాయములు, ఆశలు నమ్మదగినవే ఐనచో ఆ దినములు మరల తప్పక వచ్చును. అది మీపై ఆధారపడి యున్నది. (తరువాత వంగదేశపు యువకుల నుద్దేశించి స్వాములవారిట్లు చెప్పిరి.) మీరు ధనవంతుల, గొప్పవాండ్ర, సాయము నపేక్షింపకుడు. ప్రపంచములో అద్భుతకృత్యములన్నియు బీదలే చేసిరి. బీదవారు ముందుకు వచ్చినచో ఏ కార్యమునైనను చేయ వచ్చును. తప్పక చేయవలయును. మీరు దారిచూపితిరా, తరువాత మిమ్మనేకులు అనుసరింతురు. నిశ్చలమును, నిష్కల్మషమును, నిష్కపటమును అగు కార్యదీక్షను గలిగి యుండుడు. ఫలితమునుగూర్చి సంపూర్ణ విశ్వాసముంచుడు. వంగయువకులే భారతదేశముక్తికై పాటుపడవలసియున్నది. మీరు నమ్మినను, నమ్మకపోయినను దీనినే మీ లక్ష్యముగ నుంచుకొనుడు. ఈ పని త్వరలో, నేడో, రేపో, పూర్తియగునని తలంపకుడు. నా శరీరముపైన, ఆత్మపైన నాకు నమ్మకమున్నట్లే ఇందులోను నాకు నమ్మకమున్నది. కావున నాహృదయము ఎల్లప్పుడు మీకార్యసఫలతనే కోరుచున్నది. అంతయు ధనములేని మీపై నాధారపడి యున్నది. బీదవారు కాబట్టి మీరు పనిచేయుదురు; నిష్కప

టముగా నుందురు; ఉన్నదానిని త్యాగము చేయుటకు వెను దీయరు. అదియే యిదివఱకు మీకు చెప్పుచుండిన విషయము. దానినే మరలచెప్పి మిమ్ము హెచ్చరించు చున్నాను. ఇది మన జీవితలక్ష్యము. మీ రే మతశాఖకు చెందినను నాకు లెక్కలేదు. మానవులందఱు తుదకు సిద్ధి పొంది తీరగలరను హృదయపూర్వక అచంచలవిశ్వాసము భారతీయులందఱియందును ఉన్నదని నేను చెప్పగలను. ఈ విశ్వాసమే సర్వమానవహృదయములందును నెలకొనుగాక!

సన్న్యాసము - దానిలక్ష్యము, సాధనము

శ్రీమద్వివేకానందస్వాములవారు రెండవపర్యాయము (19 వ తేది జూన్ 1899) పాశ్చాత్యదేశములకు వెళ్లు సందర్భమున బేలూరు మఠసన్న్యాసులు వారికి వీడ్కోలు పత్రము సమర్పించిరి. ' ఆ పత్రమునకు శ్రీవారిచ్చిన సమా ధానమున కీ క్రిందిది సంగ్రహరూపము :

దీర్ఘోపన్యాసమున కిది అదనుకాదు. కాని కొన్ని విషయములనుగూర్చి మీకు క్లుప్తముగా చెప్పెదను. వానిని మీ రాచరణలో నుంచవలయునని నా కోరిక. మొదట లక్ష్యమును మనము అర్థముచేసికొనవలయును. తరువాత దానిని ఆచరణలోనుంచు మార్గముల నన్వేషింపవలయును.

సన్న్యాసులై నమీరు ఇతరులకు సదా మేలుచేయ ప్రయత్నింపవలయును. సన్న్యాస మనగా అదియే అర్థము. సన్న్యాసమునుగూర్చి దీర్ఘోపన్యాసము నిచ్చుటకు వ్యవధిలేదు. కాని మృత్యుప్రేమయే సన్న్యాసముయొక్క ప్రధానలక్షణమని క్లుప్తముగా చెప్పగలను. లౌకికులు జీవితమును అభిలషింతురు. సన్న్యాసి మృత్యువు నభిలషింపవలయును. అయినచో మనము ఆత్మహత్య చేసికొనవలయునా? కాదు కాదు. ఆత్మహత్య గావించుకొనువారందఱు మృత్యువును ప్రేమించువారు కారు. ఏలన ఆత్మహత్యాప్రయత్న మొకసారి విఫలమాయెనా, తిరిగి వారు తత్ప్రయత్నమును చేయరు. లౌకికానుభవమువలన మన కీ విషయము విదితమగుచున్నది. అయిన మృత్యువును ప్రేమించుట అన నేమి? మన మెప్పుడో ఒకప్పుడు చావవలయును. ఇది తప్పదు. అట్టిచో మనము సత్కార్యమునకై ప్రాణము లర్పింతము. మనము చేయు ప్రతి కార్యమును — తినుట, త్రాగుట మొదలగునవన్నియు — ఆత్మత్యాగమునకు దారితీయుగాక. తినుటచే శరీరము పెరుగును. ఇతరుల మేలుకొఱకై తచ్ఛరీరమును త్యాగము గావింపనిచో దానివలన ఫలమేమి? పుస్తకములను చదివి జ్ఞానమును పెంపొందించుకొందురు. లోకమునకు వినియోగింపకున్నచో ఆ జ్ఞానమువలనకూడ ప్రయోజనములేదు. స్వార్థమునకై పాటుపడుటకంటె కోట్లకొలది సోదరప్రజానీకమునకు సేవచేయుట మంచిది. ఇట్లు మీరు క్రమముగా మృత్యుముఖమును సమీపింపవలయును. అట్టి చావులోనే స్వర్గమున్నది. అందే

మంచి అంతయు మూర్తీభవించియున్నది. తద్వ్యతిరిక్తమైన దంతయు దుష్టమే, పైశాచమే!

ఇక లక్ష్యముల నాచరణలోనుంచు మార్గములగూర్చి ఆలోచింతము. ఆచరణసాధ్యముగాని ఆదర్శమును మనము గ్రహింపరాదు. అసాధ్యమగు అత్యున్నతాదర్శము జాతిని బలహీనమును, పతితమును నొనర్చును. బౌద్ధ జైన మతములు వచ్చిన తరువాత ఈ గతియే పట్టినది. అట్లని సులభసాధ్యమగు ఆదర్శమును గ్రహించుటకూడ దోషమే. మీరు కొంచెమైనను ఆలోచనాశక్తి లేకున్నచో, మార్గదర్శకమగు ఆదర్శము లేకున్నచో, మీరు కేవలము పశుతుల్యులే. కావున మీ ఆదర్శమును తగ్గించుకొనరాదు. అట్లని అసాధ్యమునకై ప్రయత్నింపరాదు. ఈ రెండును విసర్జనీయములే. మన దేశమున పూర్వమునుండియు ఏదో ఒక గుహలో కూర్చుండి ధ్యానము చేయుచు జీవముల త్యజింపవలయునను భావము కలదు. ఇతరుల విముక్తికై పాటుపడక ఒక్కడుమాత్రమే విముక్తి నొందుట మంచిదికాదు. సోదరమానవుల ముక్తికై పాటుపడనిదే తనకు ముక్తి లేదని మానవుడు గ్రహించు దినములు ఎప్పుడో ఒకప్పుడు వచ్చును. ఉన్నతాదర్శముతో ఉత్తమాచరణమును మీ జీవితములో సమన్వయపరచుటకు ప్రయత్నింపుడు. ఈ క్షణమున మీరు నిశ్చలసమాధిగతు లగుటకు సిద్ధముగ నుండవలయును; మరుక్షణమువనే ఇదిగో, ఈ పొలములకుపోయి అందు పనిచేయుటకుకూడ సిద్ధపడవలయును; (అచ్చటి పొలములను చూపుచు స్వామివారీ మాటలు చెప్పిరి.) ఈ క్షణమున మీరు శాస్త్రములలోని

గూఢార్థములను విప్పి చెప్పుటకు సిద్ధముగ నుండవలయును; ఆ మరుక్షణముననే పండించిన ఈ ధాన్యమును సంతకు తీసికొనిపోయి అమ్ముటకును సిద్ధపడవలయును. ఇచ్చటనే కాదు, ఎచ్చటనైనను మీరు ప్రతి చిన్న కార్యమునకు సంసిద్ధులై యుండవలయును.

జ్ఞాపకముంచుకొనవలసిన విషయము మఱొకటి యున్నది. నిజమైన మానవులను తయారుచేయుటయే ఈ మతముయొక్క ఉద్దేశము. మీరు కేవలము ఋషులు చెప్పినదానిని నేర్చుకొనుటతో తృప్తిపడరాదు. ఆ ఋషులు గతించిరి. వారితో వారి అభిప్రాయములును పోయినవి. ఇప్పుడు మీరే ఋషులు కావలయును. మీరుకూడ ఇదివఱకు జన్మించిన మహాపురుషులవంటివారే. అంతేకాదు. మీరు అవతారపురుషులవంటివారుకూడ. కేవల పుస్తకజ్ఞానమేమి చేయగలదు? తపస్సుమాత్ర మేమి సాధింపగలదు? మంత్ర తంత్రము లేమి చేయగలవు? మీ పాదములపై మీరు నిలువవలయును. నిజమైన మానవులు తయారగు ఈ శ్రోత్తమార్గమును మీ రనుసరింపవలయును. మూర్తిగొన్న బలమును, స్త్రీసహజమగు కోమలహృదయమును గలవాడే నిజమైన మానవుడు. నీ చుట్టుపట్లగల ప్రజలయెడ సానుభూతి గలిగియుండవలయును. దానితోబాటు పరిసరములకు లొంగని ధైర్యమును, బలమును ఉండవలయును. విధేయతకూడ ఉండవలయును. ఇది అసంబద్ధముగా కన్పట్టుచున్నప్పటికి పరస్పరవిరుద్ధములగు ఈ సుగుణములెల్ల [illegible] నదిలోదుమికి మొసలిని పట్టుకొనిరమ్మని

యజమాని ఆజ్ఞాపించినాడనుకొనుడు. అప్పుడు మీ రేమి చేయవలయును? మొదట అతని యాజ్ఞను శిరసావహింప వలయును. తరువాతనే అతనితో వాదించుట. ఆ ఆజ్ఞ చెడ్డదే కావచ్చును. మొదట శిరసావహింపుడు. తరువాత వాదించి పూర్వపక్షము చేయవచ్చును. సంఘములలో నొక పెద్దదోషమున్నది. ఎవనికైన నొకనికి భేదాభిప్రాయము గలిగినచో తగిన అదనునకై వేచియుండక వెన్వెంటనే ఒక క్రొత్తశాఖను లేవదీయును. ఇది వంగదేశమున నెక్కువగనున్నది. కావున మీకు సంఘమునెడ గాఢమగు భక్తిగౌరవములు ఉండవలయును. అవిధేయత కిందు చోటు లేదు. నిర్దయతో దానిని నిర్మూలింపుడు. అవిధేయులగు సభ్యులిందుండరాదు. ఉన్నచో వారిని వెంటనే వెడల గొట్టుడు. సంఘవిద్రోహు లిందుండరాదు. మీరు గాలివలె స్వేచ్ఛగను, ఈ మొక్కవలె వినమ్రముగను, శునకమువలె విశ్వాసముతోడను ఉండవలయును.

నే నేమి నేర్చితిని?

(ఢక్కా, మార్చి 1901)

ఢక్కాలో శ్రీస్వాములవారు ఆంగ్లమున రెండుప న్యాసముల గావించిరి. అందు మొదటిది 'నే నేమి నేర్చితిని' అను విషయమునుగూర్చి. రెండవది 'మనము పుట్టిపెరిగిన

మతము' అనుదానినిగూర్చి. ఈ విషయములను స్వాముల వారి శిష్యులొకరు సంగ్రహముగా వంగభాషలో వ్రాసిరి. ఈ క్రిందిది ఆ శిష్యుని సంగ్రహరచనమునకు అనువాదము:

నేను నాగరకములగు అనేక పాశ్చాత్య దేశములను చూచితినిగాని ఈ తూర్పువంగదేశమును చూచు భాగ్యము నా కింతవఱకు కలుగలేదు. ఇప్పు డిచ్చటికివచ్చి ఈ ప్రదేశముతో సన్నిహితపరిచయజ్ఞానము పొందు అవకాశము గలిగినందులకు నాకుగలిగిన సంతోషమును మొదట వ్యక్తపఱుపవలసి యున్నది. అంతేకాదు; నా మాతృభూమియైన వంగదేశములోని ఈ మహానదులు, సారవంతములు విశాలములునగు మైదానములు, అందమైన గ్రామములు మొదలగు వానిని చూచుటచే నాకుగలిగిన సంతృప్తినిగూడ తెలియజేయవలసియున్నది. ఇవన్నియు నే నిదివఱకు చూచినవి కావు. వంగదేశములోని భూజలప్రదేశములందలి ప్రత్యణువునను ఇంత అందము, ఆహ్లాదకరత్వము ఉన్నవని నా కింతవఱకు తెలియదు. ప్రపంచములోని వివిధదేశములు సంచరించుటచే నాకు మేలే కలిగినది. ఏలన ఆ దేశములన్నియు సందర్శించినపిమ్మట నా మాతృదేశసౌందర్యము నెక్కువగ గ్రహించి ఆనందింపగలుగుచున్నాను. మతవిషయమునగూడ ఇంతే. మన జాతీయమతమున ఇంత అందము, గొప్పతనము ఉన్నవని తెలియక నేను ఇతరజాతుల అభిప్రాయములను తమవిగా గ్రహించిన అల్పజాతిప్రజల నాశ్రయించితిని. అట్లు కొన్నిసంవత్సరములు వ్యర్థము చేసినపిమ్మటనే నేను ప్రపంచములోనెల్ల హిందూమతము

వంటి సంతృప్తికరమైన మతమింకొకటి లేదని గ్రహించితిని. అందుచేత మతమునెడ అచంచలవిశ్వాసముగల మన దేశీయులలోనే కొందఱు దానియందు నిర్లక్ష్యభావము చూపి నపుడెల్ల నాకు విచారము కలుగుచుండును. ఇందులకు కారణముకూడ నాకు తెలియును. ఐరోపీయభావవిధానము మన మాతృభూమిని ప్రవేశించుటచే నేర్పడిన కేవల భౌతికవాద వాతావరణములో వారు జీవితము గడపుటచేత ఈ యనర్థము కలుగుచున్నది.

ప్రస్తుతము మనలో కొందఱు సంస్కర్త లున్నారు. వారు హిందూజాతి పునరుజ్జీవనమునకై మనమతమును సంస్కరించుటకు, వీలైనచో తలక్రిందులు గావించుటకు ప్రయత్నించుచున్నారు. ఆసంస్కర్తలలో ఆలోచనాపరులు కూడ కొందఱున్నారు. కాని తమలక్ష్యమేమో తెలియక ఇతరులను గ్రుడ్డిగ అనుసరించుచు అజ్ఞానముతో ప్రవర్తించువా రనేకులు అందుగలరు. ఈ తెగకు చెందిన సంస్కర్తలు ఇతర మతభావములను మన మతమున చొప్పించుటకు మిక్కిలి కుతూహలపడుచున్నారు. వారు 'విగ్రహారాధనము' అను పదమును పట్టుకొని విగ్రహారాధనమును ప్రోత్సహించునది కావున హిందూమతము సత్యమైనది కాదని వాదింతురు. విగ్రహారాధనమనగానేమో, దానివలన మంచిగలుగుచున్నదా, చెడుగుగలుగుచున్నదా అని ఆలోచించుటకు ప్రయత్నింపరు. ఇతరులు చెప్పుమాటలనే ప్రమాణముగాగొని హిందూమతము సత్యమైనది కాదని వాకొందురు. ఇంకొక తెగవారు కొందఱున్నారు. వారు

ప్రతి హిందూ ఆచారమునకును, ప్రతి హైందవ కర్మకును నిరాధారములగు ఆధునిక శాస్త్రీయవ్యాఖ్యానములు గావింతురు. వీ రెవరో తెలియునా? ఎల్లప్పుడు విద్యుచ్ఛక్తి. అయస్కాంతము, వాయుతరంగములు మొదలగువానిని గూర్చి మాటలాడువారు. వీరెప్పుడో ఒకప్పుడు దేవుడు విద్యుత్తరంగములు మూర్తిగొన్న ఒక ముద్ద తప్ప వేఱు గాదని నిరూపింపగలరేమో ఎవరు చెప్పగలరు! వివిధ మార్గముల, వివిధరూపముల తనకార్యమును సాగించుకొను చున్న మాతృదేవి వారి నాశీర్వదించుగాక!

పై చెప్పినవారికి విభిన్నముగా సనాతనులు ఉన్నారు. వారిలో కొందఱు "కాకదంత పరీక్షచేయునట్టి మీ వాదములు మాకు తెలియవు. తెలిసికొనుటకు, అర్థముచేసికొనుటకు ప్రయత్నముచేయవలసిన అవసరముకూడ లేదు. మాకు కావలసినది దేవుడు; ఆత్మ. ఏది ప్రకృతికతీతమో, ఎచ్చట సుఖదుఃఖాది ద్వంద్వము లుండవో, నిత్యానంద మెచ్చట ఉండునో అట్టి పరమాత్మయే మా గమ్యము" అనియు, కొందఱు "పూర్ణవిశ్వాసముతో గంగలో మునుగుటచే ముక్తి పొందవచ్చునను నమ్మకము మాకున్నది" అనియు, కొందఱు "శివ, రామ, విష్ణ్వాది రూపములలో ఎవరినైనను అతడే సర్వాంతర్యామియగు దేవుడని నమ్మి అచంచలభక్తి విశ్వాసములతో పూజించిన నీకు తప్పక ముక్తి కలుగును" అనియు చెప్పుదురు. వీరి తెగకు చెందినవాడనని చెప్పుటకు నేను గర్వించుచున్నాను. ఇంకొక తెగవారు కూడ ఉన్నారు. ప్రపంచము, భగవంతుడు—ఈ రెంటిని దృష్టిలో

నుంచుకొని ప్రవర్తింపవలెనని వారు చెప్పెదురు. ప్రాచీన ఋషులు గొంతెత్తి మనకిట్లు చెప్పుచున్నారు: "భగవత్సాన్నిధ్యమును పొందవలెనన్న కామ కాంచనముల త్యజింపవలయును. ఈ సంసార మనిత్యమైనది, నిస్సారమైనది. దీనిని పరిత్యజింపక ఎంత ప్రయత్నించినను భగవంతుని పొందలేవు. అది చేయలేనిచో బలహీనుడనని ఒప్పుకొనుము. అంతేకాని ఆదర్శమును మాత్రము కించపఱుపకుము. హీనమై, నశ్వరమగుదానిని ఉదాత్తము శాశ్వతము నగు దానివలె ప్రదర్శించుటకు ప్రయత్నింపకు". కావున వారిదృష్టిలో ఆధ్యాత్మికతను సాధింపవలయునన్నను, భగవంతుని పొందవలయునన్నను మొదట మీ అభిప్రాయముల లోని యీ దాగుడుమూతలను, అసత్యమును, భావచౌర్యమును పరిత్యజింపవలయును.

నేను నేర్చినదేమి? ఈ సనాతనులనుండి నే నేమి నేర్చితిని? నేను నేర్చినదిది:

దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహ హేతుకమ్।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః॥

"మానవజన్మము, మోక్షేచ్ఛ, మహాపురుషులతోడి సాహచర్యము — ఈ మూడును దుర్లభములు. ఇవి దైవానుగ్రహమువలననే కలుగును". మనకు కావలసిన వానిలో మొదటిది మనుష్యత్వము, మానవజన్మము. ఏలన మానవజన్మమే మోక్షసాధన కనువైనది. రెండవది ముముక్షుత్వము. శాఖా, వ్యక్తి భేదములను బట్టి భగవ

త్సాక్షాత్కారమునుపొందు మార్గములు భిన్నములు కావచ్చును. అధికారభేదమునుబట్టి వివిధవ్యక్తులు దానిని పొందుటకు తమకుగల ప్రత్యేకమార్గములను, సాధనములను గూర్చి చెప్పవచ్చును. కాని ముముక్షుత్వము లేనిదే భగవత్సాక్షాత్కారము అసాధ్యమని సాధారణముగ, పూర్వపక్షమగునను భీతి లేకుండ, నొక్కి వక్కాణింపవచ్చును. ముముక్షుత్వమనగా నేమి? మోక్షమునుపొందవలయునను అకుంఠితమగునిచ్ఛయే; సుఖదుఃఖాదులకు అతీతముగ నుండవలయునను కోరికయే; ప్రపంచమునెడ ఏహ్యాభావమే. భగవంతుని చూడవలయునను కోరిక నీలో ఎప్పుడు కలుగునో అప్పుడు భగవత్సాక్షాత్కారమునకు అర్హుడవగుదువు.

ఇక మహాపురుషులతోడి సన్నిహితసాహచర్యము కూడ అత్యవసరమే. దానిచే తమగమ్యమును పొందిన మహాపురుషులజీవితములనుబట్టి మనజీవితములను చక్కదిద్దుకొనవచ్చును. ప్రపంచముపై వైరాగ్యము, మోక్షేచ్ఛ ఉన్నంతమాత్రాన చాలదు. గురూపదేశము కూడ అవసరము. ఎందుచేత? దానిచే తరతరములుగా ఒక గురువునుండి మఱియొక గురువునకు ఎడతెగక సంక్రమించుచు వచ్చిన ఒక గొప్ప శక్తితో నీకు సంబంధమేర్పడును. భక్తుడగువాడు అన్వేషించి అధ్యాత్మబోధకుడగు గురువును తనకు ఉపదేశకుడుగా, మార్గదర్శిగా, స్నేహితుడుగా స్వీకరింపవలెను. అధ్యాత్మపథపురోగమనమునకు గురువు అత్యంత ముఖ్యమని చెప్పవచ్చును. అయినచో ఎట్టివానిని గురువుగా స్వీకరింపవలెను? "శ్రోత్రియోఽవృజినో

ఽకామహతో యో బ్రహ్మవిత్తమః" వేదపారంగతుడు, దోష రహితుడు, నిష్కాముడు, బ్రహ్మజ్ఞానశ్రేష్ఠుడు గురువుగా నుండదగినవాడు. శాస్త్రపాండిత్యము గలిగినవాడు మాత్రమే కాక వాని సూక్ష్మాతిసూక్ష్మరహస్యములను విప్పి చెప్ప గలవాడును, వాని ప్రాముఖ్యమును అనుభవము చే గుర్తించినవాడును అగువాడే శ్రోత్రియుడు. "ఊరక శాస్త్రాదులను చదువుటచే చెప్పినమాటలెల్ల వల్లించు చిలుకవలె తయారగును కాని పండితుడు కాజాలడు. శాస్త్రములలో ఏ ఒక్క పదమును చదువుటచేనైనను దివ్య మగు ప్రేమను ఎవడు పొందునో వాడే పండితుడు". కేవలము పుస్తకజ్ఞానముగల పండితులవలన ప్రయోజనము లేదు. భిక్షుకుడు లక్షరూపాయలు దానము చేయదలచినట్లు ప్రస్తుతము ప్రతి ఒక్కడు గురువు కాదలచుచున్నాడు. గురువగువాడు దోషరహితుడుగా నుండవలెను. నిష్కాముడై యుండవలయును. ఇతరులకు మేలుచేయవలయుననుట తప్ప వేఱు ఉద్దేశము అతనికుండరాదు. అకారణప్రేమకు పెన్నిధియై యుండవలయును. పేరుప్రఖ్యాతులకుగాని, స్వార్థదృష్టితోగాని అతడు అధ్యాత్మబోధ చేయరాదు. బ్రహ్మజ్ఞానము, బ్రహ్మసాక్షాత్కారము కరతలామలకముగా నుండవలయును. ఇట్టివాడే గురువని శ్రుతులు చెప్పుచున్నవి. అట్టి గురువుతో అధ్యాత్మసంబంధ మేర్పడినపుడు భగవ త్సాక్షాత్కారము—దివ్యజ్ఞానము—సులభసాధ్యమగును.

గురూపదేశము పొందిన తరువాత సత్యాన్వేషకుడు తనలక్ష్యముపై ధ్యానముంచి, నిర్ణీతమార్గమున సత్యమును

అనుభవమునకు దెచ్చుకొనుటకు అభ్యాసము గావింప వలయును. భగవంతుని సాన్నిధ్యమును పొందవలయునను కోరిక ఉన్నను, గురువు ఉన్నను, అభ్యాసము లేనిదే, నేర్చుకొన్నదానిని ఆచరణలో నుంచుటకు ప్రయత్నింపనిదే దైవసాక్షాత్కారము కలుగదు. ఇవన్నియు మీలో గాఢముగ నున్నపుడే గమ్యమును చేరగలుగుదురు.

కావున ఆర్యసంతతివారును, హిందువులును అగు మీకు చెప్పునదేమన—మన మతముయొక్క, హిందువుల యొక్క ఉన్నతలక్ష్యమును మఱవకుడు. ఆ లక్ష్య మేదో తెలియునా? సంసారబంధమునకు దూరముగ నుండుట, ఐహికాముష్మికములయెడ వైరాగ్యముగలిగియుండుట, గుణదోషముల కతీతముగనుండుట. ఇట్లుండుటచే అన్నిటి కతీతులరై తుదకు సచ్చిదానందబ్రహ్మమును పొందగలరు.

మనము పుట్టి పెరిగిన మతము

1901 సంవత్సరము మార్చి 31-వ తేది ఢక్కాలో ఏర్పాటుచేయబడిన బహిరంగసభలో పై విషయమును గూర్చి శ్రీ స్వాములవారు రెండుగంటలకాలము ఆంగ్లమున ఉపన్యసించిరి. వంగభాషలో నొక శిష్యునిచే వ్రాయబడిన ఆ ఉపన్యాససారాంశమున కీ క్రిందిది అనువాదము :

చాలకాలముక్రిందట మనదేశము ఆధ్యాత్మికముగ [illegible]వ పురోభివృద్ధి చెందినది. ఇప్పుడు మన మా ప్రాచీన

చరిత్ర నొక్కసారి మనస్సునకు తెచ్చుకొందము. పూర్వపు ఔన్నత్యమునందు దృష్టినిలుపుటవలన నొక అపాయము గూడ నున్నది. మనము క్రొత్తవిషయములనుగూర్చి ఆలోచింపక పూర్వుల ఔన్నత్యమును నెమరుకు తెచ్చుకొనుటచే తృప్తిని గర్వమును మాత్రము పొందుచుందుము. ఈ అపాయమునకు మనము దూరముగ నుండవలయును. పూర్వకాలమున సత్యమును అనుభవమునకు తెచ్చుకొనిన ఋషులు, మహర్షులు ఉండిరి, నిజమే. కాని వారిని జ్ఞప్తికి తెచ్చుకొనుట నిజముగా ప్రయోజనకారియేయైన మనము కూడ వారివలె ఋషులుగా తయారుకావలయును. అంతే కాదు — చరిత్రవలన మనకు తెలియుచున్న ఋషుల కంటెను గొప్పవారము కాగలమను దృఢవిశ్వాసము నాకున్నది. పూర్వము మనము సాధించిన కార్యములు పేర్కొనదగినవే. వానినిగూర్చి ఆలోచించుట నాకు గర్వకారణముగనే యున్నది. కాని ప్రస్తుతపతనావస్థనుచూచి నేను నిరుత్సాహపడుటలేదు. భవిష్యత్తును నా మనోనేత్రము ముందు చిత్రించుకొని ఉత్సాహపడుచున్నాను. ఎందుచేత? విత్తనము చెట్టగుటకు ముందు రూపాంతరమును పొందునని, అంతేకాక పూర్తిగా నశించినట్లగపడునని నాకు తెలియును. ఇదేవిధముగా తాత్కాలికమైన ఈ పతనావస్థలో మనమతముయొక్క భావిభాగ్యోదయశక్తు లున్నవి. ఇవి సమయము వచ్చినపుడు విజృంభించి మన మతమును ఇదివరకున్న దానికంటెగూడ ఉన్నతదశకు తీసికొనిపోగలవు.

ఇప్పుడు మనము మనమతములో ఏ విషయములయెడ ఏకవాక్యత గలదో పరిశీలింతము. స్థూలముగ చూచినపుడు మనమతములోని వివిధశాఖల మధ్య భేదమున్నదనుట నిస్సందేహమే. మనమతములో కొందఱు అద్వైతులు, కొందఱు విశిష్టాద్వైతులు, మఱికొందఱు ద్వైతులు ఉన్నారు. కొందఱకు అవతారములయెడ నమ్మకముగలదు. కొందఱు విగ్రహారాధనమును నమ్ముదురు. మఱికొందఱు నిరాకారవాదమును గావింతురు. ఆచారములలోగూడ భిన్నత్వమున్నట్లు తెలియుచున్నది. మహమ్మదీయుల తోడను, క్రైస్తవులతోడను వివాహసంబంధములు గావించినను హిందువులలోని చతుర్వర్ణములవారికి కులబహిష్కారముండదు. నిరాటంకముగా వారు హిందూదేవాలయముల ప్రవేశింపవచ్చును. పంజాబులోని కొన్నిగ్రామములలో పందిమాంసమును తిననివానిని హిందువుగనే పరిగణింపరు. నేపాలుదేశములో బ్రాహ్మణుడు చతుర్వర్ణములలో వివాహము గావించుకోవచ్చును. కాని వంగదేశములో బ్రాహ్మణుడు శాఖాంతరవివాహమైనను చేసికోరాదు. ఇట్లు ఒక్కొకచోట ఒక్కొక ఆచారమున్నది. ఈ భిన్నత్వములో హిందువులందఱకును ఏకాభిప్రాయముగల విషయ మొకటి యున్నది. హిందువు అగు వాడెవ్వడును పశుమాంసమును తినడనుటయే ఆ విషయము. ఇట్లే మనమతములోని వివిధ శాఖలలో ఏకవాక్యతగల విషయములు పెక్కులున్నవి.

మతగ్రంథములగూర్చి చర్చించునపుడు మనకొక్క విషయము మొదట స్ఫురించును. కొన్ని ప్రమాణ

గ్రంథములపై నాధారపడిన మతములు శీఘ్రముగ నభివృద్ధి చెందుచువచ్చి ఎన్ని అఘాతములు కలిగినను నేటికిని నిలువగలిగినవి. సర్వాంగసుందరమైనను గ్రీకుమతము ప్రమాణమతగ్రంథము లేమిచే నశించినది. కాని యూదుల మతము 'ఓల్డ్ టెస్టమెంటు'ను ప్రమాణముగాగొని నేటికిని శక్తిని గోల్పోక నిలిచియున్నది. ప్రపంచములో అతిప్రాచీనము లగు వేదముల నాధారముగా గల హిందూమతముకూడ ఇట్లే నిలువగలిగినది. వేదములు కర్మకాండమని, జ్ఞానకాండమని రెండుగా విభజింపబడినవి. మేమయజ్ఞములను దక్షిణములోని కొందఱు బ్రాహ్మణులు అప్పుడప్పుడు చేయుచున్నప్పటికి కర్మకాండము మన దేశమున ఆచరణమున ప్రస్తుతము లేనట్లే. ఇది మన మంచికి కావచ్చు, లేదా చెడ్డకే కావచ్చు. వివాహ శ్రాద్ధాదుల సందర్భమున చెప్పబడు మంత్రములలో వైదిక క్రియాకాండచిహ్నములు మనకు కొంచెము కానవచ్చు చున్నవి. కాని పూర్వపుస్థితిని పొందగల అవకాశ మేమియు లేదు. కుమారిలభట్టు ఒకప్పుడు ప్రయత్నించెను కాని ప్రయత్నము ఫలప్రదము కాలేదు.

వేదములలోని జ్ఞానకాండము వేదాంతమని చెప్పబడు ఉపనిషత్తులరూపమున నున్నది. ఆచార్యులు ప్రమాణముగా ఎచ్చటనైన ఒక వాక్యము చెప్పిన అది ఉపనిషత్తులలోనిదే అయి ఉండును. వేదాంతమే ప్రస్తుతము హిందువులమతము. హిందూదేశములో ఏ తెగ కాని తమభావములను ప్రజలలో ప్రచారము చేయవలయునన్న వేదాంతమును ప్రమాణముగా గైకొనవలయును. ద్వైతులైనను, అద్వైతులైనను, ఎవ

రైనను సరియే — అట్లు చేయవలసినదే. వైష్ణవులుకూడ తమ సిద్ధాంతములను నిరూపించుకొనుటకై గోపాలతాపని ఉపనిషత్తు నాశ్రయింతురు. ఏ తెగవారుగాని తమ భావముల బలపఱచు ఉపనిషత్తు లేదనిగ్రహించినచో వెంటనే ఒకదానిని కల్పించి అది ప్రాచీనగ్రంథమే అని చెప్పుటకైనను వెనుదీయరు. పూర్వమిట్టి సంఘటనలు అనేకములుండెను.

ఇక వేదములనుగూర్చి. వేదము లెప్పుడో పూర్వము మానవమాత్రులచే వ్రాయబడినవిగా హిందువులు తలంపరు. చిరకాలసముపార్జితములగు అగాధ దివ్యజ్ఞాననిధులుగా వానిని భావింతురు. ఈ వేదములు ఒక్కొక్కప్పుడు అభివ్యక్తములగుచుండును; ఇంకొకప్పుడు అభివ్యక్తములు కాకుండును. సాయణాచార్యులవారు తమగ్రంథములలో నొకచో ఇట్లు చెప్పెను: "యో వేదేభ్యోఽఖిలం జగత్ నిర్మమే" (వైదికజ్ఞానముచే నెవడు అఖిల జగత్తును నిర్మించెనో). వేదములను వ్రాసిన వానిని ఎవరును చూడలేదు. అట్టివాడు ఒకడు ఉన్నాడని ఊహించుటకూడ కష్టమే. ఋషులు మంత్రములను కనుగొన్నవారు మాత్రమే. అవి ఆదికాలమునుండి ఉన్నవి. అనంతజ్ఞాననిధులగు ఆ వేదములను వారు ముఖాముఖి దర్శింపగలిగిరి.

ఆ ఋషులెవరు? వాత్స్యాయను డిట్లు చెప్పెను :— "మ్లేచ్ఛుడైననుసరే ఎవడు సత్ప్రవర్తనముచే బ్రహ్మసాక్షాత్కారమును పొందునో వాడే ఋషి". ఈవిధముగనే జారపుత్త్రుడగు వసిష్ఠుడు, మత్స్యగంధి పుత్త్రుడగు వ్యాసుడు,

దాసీపుత్రుడగు నారదుడు ఇంకను ఇట్టివా రనేకులు ఋషి త్వమును పొందిరి. ఇందుచే నిత్యమగు బ్రహ్మమును కను గొన్నవారిమధ్య జాతిభేదమును పాటించుట తగదని తెలు చున్నది. పై చెప్పినవారందఱు ఋషులైనప్పుడు నేటి కాలపు కులీన బ్రాహ్మణులు అంతకంటె గొప్ప ఋషులు కావచ్చును. కావున ఆ ఋషిత్వమును పొందుటకు ప్రయత్నింపుడు. గమ్య మందుకొనువఱకు వెనుదీయకుడు. అప్పుడే సర్వప్రపంచము మీకు తలయొగ్గును. ఋషులుగా మాఱిపొండు. అదియే శక్తి రహస్యము.

వేదములు మాత్రమే మనకు ప్రమాణములు. వానిని గ్రహించుటకు ప్రతివానికి హక్కున్నది.

"యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః। బ్రహ్మ రాజన్యభ్యాం శూద్రాచార్యాయచ స్వాయ చారణాయ॥"

అని శుక్లయజుర్వేదము చెప్పుచున్నది. ప్రతి వానికి వేదము లనుచదువు హక్కులేదని వేదములనుండి ప్రమాణము నీవు చూపగలవా? పురాణములుమాత్రము కొన్ని కులములు వేదములు చదువరాదని, కొన్ని కులములు మాత్రమే చదువ వలయునని, వేదములలోని కొంతభాగము సత్యయుగమునకు వర్తించునని, మఱికొంతభాగము కలియుగమునకని చెప్పుమాట నిజమే. కాని వేదములుమాత్ర మట్లు చెప్పుటలేదని గుర్తుంచు కొనుడు. చెప్పునది పురాణములే. సేవకుడు యజమానిని ఆజ్ఞాపింపగలడా? స్మృతులు, పురాణములు, తంత్రములు మొదలగునవి వేదానుసారములైనంతవఱకే గ్రాహ్యాము

వేదవిరుద్ధములగువానిని అప్రమాణములుగా త్రోసిపుచ్చవచ్చును. కాని నేడు మనము వేదములకంటె పురాణముల కెక్కుడు ప్రాధాన్యమిచ్చియున్నాము! వేదపఠనము వంగదేశమున మటుమాయమైనది. ఇలువేల్పగు సాలగ్రామముతోబాటు వేదములనుగూడ పూజావేదికపై నుంచి చిన్న, పెద్ద, ఆడ, మగ అను భేదములేకుండ అందఱు వేదపారాయణము చేయగల దినములకై నేనెంతో ఆశతో ఎదురుచూచుచున్నాను.

వేదములగూర్చి పాశ్చాత్యపండితులు చేసిన సిద్ధాంతములపై నాకు నమ్మకములేదు. వారు నేడు వేదములు ఏదో ఫలానాకాలమునకు చెందినవని నిర్ణయించి రేపు ఇంకొక వేయిసంవత్సరములు ముందుకు తెత్తురు. పురాణముల గుఱించి వేదమార్గానుసారములైనంత వఱకే అవి ప్రమాణములని, కానిచో కావని నేనిదివఱకే చెప్పితిని. పురాణములలో వేదవిరుద్ధములగు విషయములు పెక్కున్నవి. ఉదాహరణమునకు పురాణములలో ఎవరో పదివేలసంవత్సరములు జీవించెనని, మఱియొకరు ఇరువదివేలసంవత్సరములు జీవించెనని చెప్పబడియున్నది. కాని వేదములిట్లు చెప్పుచున్నవి— శతాయుర్వై పురుషః — "మానవుడు వందసంవత్సరములు జీవించును". ఈ విషయములో మనము దేనిని ప్రమాణముగా గ్రహింపవలయును? వేదములనే. ఇట్టి కొన్నివిషయములందు తప్ప నేను పురాణములను తెగడుటలేదు. పురాణములలో మహోపదేశములు, భక్తి, జ్ఞాన, కర్మ, యోగములనుగూర్చి అమూల్యములగు

పలుకులు ఉన్నవి. వీనిని మనము తప్పక గ్రహింపవలసిన దే. ఇక తంత్రములనుగూర్చి ఆలోచింతము. తంత్రమను పదమునకు సరియైన అర్థము శాస్త్రము. ఉ. కాపిలతంత్రము. కాని తంత్రమను పదము సంకుచితార్థమున ఉపయోగింపబడుచున్నది. బౌద్ధమతమును స్వీకరించి అహింసాసిద్ధాంతమును ప్రచారముగావించిన రాజులపాలనలో వైదిక యజ్ఞయాగాదులు అంతరించినవి. రాజభీతిచే ఎవరును జంతుబలి చేయ సాహసింపలేక పోయెను. కాని తరువాత బౌద్ధులలోనే మొదట హిందూమత మనుసరించుచుండిన కొందఱు యజ్ఞయాగాదులకు సంబంధించిన కొన్ని ముఖ్యకర్మలను స్వీకరించి రహస్యముగా చేయమొదలిడిరి. వీనినుండియే తంత్రములు బయలుదేఱినవి. వామాచారాది కొన్ని దోషములమాట యటుంచి తంత్రములు ప్రజలుఅనుకొన్నంత చెడ్డవికావు. ఉదాత్తములగు కొన్ని వైదికభావములు అందున్నవి. తుదకు వేదములలోని బ్రాహ్మణములనుకూడ సంస్కరించి తంత్రముల తెగలో చేర్చియున్నారు. కర్మకాండమునకు సంబంధించిన నేటి పూజ, ఆచారము, ఇత్యాది విధానములు తంత్రానుసారములుగనే యున్నవి.

ఇప్పుడు మన మతసూత్రములను గూర్చి కొంత చర్చింతము. భిన్నాభిప్రాయములకు గుఱియైన విషయములు వివిధశాఖలలోనున్నను, అందఱు అంగీకరించు కొన్ని సామాన్యవిషయములును అందున్నవి.

ఈశ్వరుడు, ఆత్మ, జగత్తు—ఈ మూడువిషయములను అందఱు నంగీకరింతురు. సృష్టిస్థితిలయ కారకుడగు

వాడు ఈశ్వరుడు. సాంఖ్యులుమాత్రము ఈ విషయము నంగీకరింపరు. రెండవది ఆత్మను. ఆత్మయొక్క పునర్జన్మమును గూర్చినది. అసంఖ్యాకములగు ఆత్మలు ఒక శరీరము తరువాత మఱొకశరీరమును గ్రహించుచు వానివాని పురాకృత కర్మమునుబట్టి జీవన్మరణచక్రమున పరిభ్రమించుచుందురని ఈ వాదము చెప్పుచున్నది. దీనిని సంసారవాదమనియు, పునర్జన్మవాదమనియు అందురు. ఇక జగత్తు ఆద్యంతరహితమైనది. ఈ మూడును ఒక వస్తువుయొక్క రూపాంతరములని కొందఱు, పరస్పరసంబంధ రహితములగు విభిన్నరూపములని కొందఱు, ఇట్లు పలువురు పలువిధములుగా చెప్పుచున్నను పై మూడును ఉన్నవని అందఱు అంగీకరించుచునే యున్నారు.

ఇచ్చట ఒక్కవిషయమును జ్ఞప్తియందుంచుకొనవలయునని మిమ్ము కోరుచున్నాను. హిందువులు అతి ప్రాచీనకాలముననే ఆత్మ, మనస్సుకంటె వేఱని గుర్తించిరి. కాని పాశ్చాత్యులు మనస్సుకంటె దూరముగ ఆలోచింపలేకపోయిరి. పాశ్చాత్యులు విశ్వమంతయు సుఖమయమని తలచిరి. కావున వారికి లోకము సుఖమనుభవింపగల స్థలముమాత్రమే. కాని ప్రాచ్యులు ఈ సంసారము — క్షణక్షణమగు ఈలోకము — దుఃఖమయమని యెంచిరి. అందుచే లోక మశాశ్వతమైనదని, అందుగల అనిత్యములగు సుఖములను సంపదలను, ఆత్మ నమ్ముకొనుట తగదని వారి యుద్దేశము. ఈ కారణముచేతనే అటు పాశ్చాత్యులు కట్టుదిట్టముగ కార్యమును చేయుటలో నేర్పరులై యుండ

ఇటు ప్రాచ్యులు ఆంతరలోక సత్యాన్వేషణపరులై యున్నారు.

ఇక హిందూమత దృక్పథమును తెలిసికొనుటకై ఒకటిరెండు విషయములనుగూర్చి ఆలోచింతము. ఈ మతమున భగవదవతారములనుగూర్చిన వాదమున్నది. వేదములలో మత్స్యావతారమునుగూర్చి మాత్రము ప్రస్తావింపబడినది. అందును ఈ అవతారవాదమును అంగీకరింతురా లేదా అనుట ప్రస్తుత విషయముకాదు. అవతారవాదములోని అంతరార్థము మానవసేవయే. మానవునిలో భగవంతుని దర్శించుటయే నిజమైన భగవద్దర్శనము. హిందువులు ప్రకృతిరూపమున భగవంతుని దర్శింపరు. మానవరూపమున దర్శింతురు.

తరువాత విగ్రహారాధనముగూర్చి. శుభకార్యావసరములందు పూజింపబడవలయునని శాస్త్రములు నిర్దేశించిన ఐదుగురు దేవతలు తప్ప మిగతవారందఱు వారి దశాంతరములే. ఈ ఐదుగురు దేవతలుకూడ ఒక్క దేవుని వివిధనామములు తప్ప వేఱుకావు. విగ్రహారాధనము పూజావిధానములలోనెల్ల అధమమైనదిగా శాస్త్రములలో చెప్పబడినది. అంతమాత్రాన అది చేయుట తప్పుకాదు. విగ్రహారాధనములో నేడు పెక్కుదోషము లున్నను నేను దానిని నిరసింపను. సనాతనాచారపరుడు, విగ్రహారాధకుడు అగు బ్రాహ్మణుని పాదధూళియే నాకు సోకకుండిన నే నేమైయుందునో!

విగ్రహారాధనమును దూషించు సంస్కర్తలకు నేను చెప్పున దేమన—"సోదరులారా! మీరెట్టి బాహిరసాధన సంపత్తి లేక దేవుని సూటిగా పూజింపగలిగినచో అట్లే చేయుడు. కాని అట్లుచేయలేనివానిని మీరెందుకు దూషింతురు? అతి ప్రాచీనకాలమునకు స్మారకచిహ్నమైన సుందర భవన మొకటి అజాగ్రత్తవల్లనేమి, ఉపయోగమున లేకపోవుటచేనేమి, ధూళిధూసరితమై శిథిలావస్థలో నున్న దనుకొనుడు. అందలి కొన్ని భాగములు నేలలో కూడ కలిసిపోయిన వనుకొనుడు. దానిని మీరేమి చేయుదురు? తగిన మరమ్మతులు చేసి పూర్వపుస్థితికి తెచ్చుటకు ప్రయత్నింతురా లేక పూర్తిగా పడగొట్టి ఆ స్థలమున అస్థిరమగు నూతన విధానమున వేఱొకభవనమును నిర్మింప దలతురా? పూర్తిగా పడగొట్టు ప్రయత్నముచేయక శుభ్రముగావించి అవసరమగు మరమ్మతు చేయు ప్రయత్నమునకే పూనుకొనవలయును. అంతటితో దాని సంస్కారము పూర్తియగును. పునరుద్ధరించిన తరువాత దానికింకేమి అవసరమున్నది? మీరు చేయగలిగినచో ఆ పని చేయుడు. లేకున్న ఊరకుండుడు!" మనదేశమున కొందఱు సంస్కర్తలు ఒక క్రొత్తమతమును స్థాపింపదలచుచున్నారు. ఎట్లైనను వారు మంచిపనియే చేసిరి. భగవంతుడు వారి వాశీర్వదించుగాక! కాని హిందువులైన మీరు సర్వసామాన్యమగు మతమునకు దూరముగా ఏల పోదలచుచున్నారు? మీరు సర్వస్వమగు హిందూమతమునకు చెందినవారమని చెప్పుకొనుటకు మీరేల సిగ్గుపడియెదరు? ... ఓ. వా

దేశీయులారా! ఈ మన భారతనౌక (మనమతము) యుగయుగములుగా మన నాగరకతను మోసికొనిపోవుచు అందలి ధనముచే ప్రపంచమునెల్ల సంపన్నముచేయుచున్నది. పెక్కుశతాబ్దములనుండి ఈ నౌక అనేకాత్మలను మోసికొని జీవనసముద్రమున ఈదుచుపోయి దుఃఖమునకు దూరముగా ఆవలియొడ్డును చేర్చినది. మీ అపరాధములచే నేమి, ఇతర కారణములచేనేమి ఆ నౌక భంగము చెందినది. అందున్న మీరు ఇప్పుడేమిచేయుదురు? దానిని నిందించుచు మీలోమీరు కలహింతురా? మీరందఱు ఏకమై దానిని ఆపదనుండి రక్షింపరా? అందులకై మీరు మీరక్తమును ధారవోయుడు. ఈ ప్రయత్నమున విఫలులమైతిమా అందఱము ఒక్కటిగా మునిగి మరణింతము.

బ్రాహ్మణులకు నేను చెప్పున దేమన—"మీ వంశమునుగూర్చి, మీ పూర్వులనుగూర్చి మీరు గర్వించుచున్నారు. గర్వమును పరిత్యజింపుడు. మ్లేచ్ఛ రాజులక్రింద మీరు చాలకాలము జీవించుటచే శాస్త్రోక్తమగు బ్రాహ్మణత్వము మీకు లేదు. మీ పూర్వులవచనములందు మీకు నమ్మకమున్నచో,—బౌద్ధుల నోడించుటకై మొదట ఆమతమును స్వీకరించి, వారిని వాదమున ఓడించి పెక్కుర మరణమునకు కారకుడై, తరువాత పాపపరిహారార్థము తుషానలమున ప్రవేశించి దేహత్యాగముగావించిన కుమారిల భట్టువలె — తత్క్షణమే మీరును తుషాగ్ని ప్రవేశించి దేహములను వదలుడు. అట్లుచేయుటకు ధైర్యములేనిచో మీ బలహీనతను ఒప్పుకొని విజ్ఞాన

కవాటముల నందఱకు తెఱచియుంచి, పతితులై యున్న వారికి చేయూతనొసగి వారికి న్యాయ్యముగా రావలసిన హక్కులను, అవకాశములను ఇందు''.